# మరో జంఘాలశాస్త్రి



అయలసోమయాజుల నాగేశ్వరరావు

99945

# మరో జంఘాలశాస్త్రి

(ఉపన్యాస వ్యాస సంకలనం)

అయలసోమయాజుల నాగేశ్వరరావు

ప్రచురణ

రిజిష్టర్డ్ నం. : 1/64

యువభారతి

ఆంధ్రసారస్వత పరిషత్ భవనములు

తిలక్ రోడ్, హైదరాబాద్- 500 001

# MARO JANGHALA SHASTRY

An Anthology of essays by

**Ayalasomayaajula Nageswara Rao**

© AUTHOR

First Print (Revised and Enlarged) : 2009

Publication No : 175

Price : Rs, 140/- $ 15

*For Copies :*

Flat No 205,
Parameswari Apartments
Plot No. 95, Mothi Nagar
Hyderabad - 500 018.
e.mail:anrao1947@yahoo com
Ph: 040-2383 3148, M: 92473 28440

&

**Yuva Bharathi**
Andhra Saraswatha Parishat Buildings
Tilak Road, Hyderabad - 500 001

**Vishalandhra Book House**
**Navodaya Book House**
**Prajashakthi Book House**
Hyderabad

*Cover design*
**Sudhama**

*Typeset :*
**Literacy House**
AMS Academi Campus
O.U. Road, Hyderabad - 500 007.

*Book Production :*
**T. Muralidhar Gowd**

*Printed at :*
**Vipla Computer Services**
*(Designers & Multicolour Offset Printers)*
Nallakunta, Hyderabad - 500 044
Ph : 040-27676910, 27654003

808.856
ACC No. 99945

# అంకితం



మా పెద్దన్నయ్య

శ్రీ సూర్య కామేశ్వరరావు గారికి

అభివాదాలతో...

- నాగేశ్వరరావు

# మలిముద్రణకు
# మా మాట

**మ**నిషిలో అంతర్లీనంగా నిక్షిప్తంగా ఉన్న ప్రతిభా పరిమళాలు పరివ్యాప్తం కాగలిగినప్పుడే సమాజంలో సౌందర్యం, సౌజన్యం పెంపొందడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది పరస్పరావగాహన జరుగుతుంది. నిర్మాణాత్మక దృక్పథాలకు ప్రాచుర్యం లభిస్తుంది. సమైక్యభావాలు కుదురుకుంటాయి. అటువంటి వాతావరణం ఏర్పడడానికి యువభారతి సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను సాధనంగా భావించుకుని 1963లో విజయదశమినాడు ప్రాణంపోసుకుంది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో పక్షసమావేశాలు నిర్వహించింది. యువకులలో వక్తృత్వ పటిమను, రచనా పాటవాన్ని పెంపొందించడానికి కృషిచేసింది. తమ రచనలను వినిపించడమే కాకుండా పుస్తక రూపంలో ప్రచురించే అవకాశం కల్పించింది. అనేక గోష్ఠులు, పండితుల ఉపన్యాస కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు 174 పుస్తకాలను ప్రచురించింది.

తెలుగు సాహిత్యంలో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి 'సాక్షి' వ్యాసాలు విలక్షణమైన రచనావిన్యాసంతో వర్ధిల్లుతున్నాయి. సమకాలీన స్థితిగతులను సమ దృష్టితో స్పష్టంగా శ్రద్ధగా అధ్యయనం చేసి సమీక్షించడం ద్వారా, సాక్షివ్యాసాలకు విశిష్ట ప్రాధాన్యం ఏర్పడింది. ఆ వ్యాసాలలో ఆయన వాడిన పదజాలం, భావవ్యక్తీకరణ విధానం అనితర సాధ్యం. వారు సృష్టించిన జంఘాలశాస్త్రి పాత్రకు ప్రత్యేక ప్రతిపత్తి ఏర్పడింది. ఆ వ్యాసాలలోని నిష్పాక్షిక వైఖరి, నిశితదృక్పథం, పాఠకులను ఆకట్టుకుని స్వభాష పై అభిమానాన్ని కలిగిస్తుంది. అందులోని సునిశితహాస్యం పఠితృలోకానికి గిలిగింతలు పెట్టడమే కాకుండా సదాలోచనతో ప్రతిస్పందింప చేస్తుంది.

మిత్రులు శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావుగారు స్నేహశీలి, సహృదయులు, హాస్యప్రియులు, మంచి కార్యకర్త, తనలోని భావాలను నిర్మొహమాటంగా వెలువరించే తత్త్వంగలవారు యువభారతికి చాలా కాలం కార్యదర్శిగా పనిచేసి మంచి కార్యక్రమాలను రూపొందించి కర్తవ్యనిష్ఠతో అమలు పరచారు. యువభారతి సాహితీ వైభవంలో పాలుపంచుకుంటున్నారు. వారు యువభారతి నిర్వహించిన పక్షసమావేశాల్లో పాల్గొని, తమ గళానికి, కలానికి పదునుపెట్టి అందరినీ ఆకట్టుకున్నారు. యువభారతికి తలలో నాల్కలాగా మెలిగారు. యువభారతీయుల హృదయాలలో చెరగని స్థానం ఏర్పరచు కున్నారు. వారు తమ పెద్దన్నగారైన ఏ.యస్. కామేశ్వరరావుగారి ప్రభావంతో పానుగంటి

వారి సాక్షివ్యాసాలపై విశేషాభిమానాన్ని పెంపొందించుకొన్నారు. ఆ రచనా శైలిని పుణికి పుచ్చుకొని తన రచనా విన్యాసానికి శ్రీకారం చుట్టారు. 1980-1982లలో 'మరో జంఘాలశాస్త్రి' పేరుతో రెండు వ్యాస సంపుటాలను యువభారతికి ప్రచురించే అవకాశాన్ని కల్పించారు. అవి సాక్షివ్యాసాల ఒరవడితో అమితాదరణపొంది అనతి కాలంలోనే ప్రతులన్నీ అమ్ముడుపోయాయి. పాఠకుల, యువభారతి మిత్రుల, యువభారతీయుల అభిలాషపై వాటికి మరికొన్ని వ్యాసాలను చేర్చి యువభారతి 175వ ప్రచురణగా తీసుకు వస్తున్నందుకు వారికి అభినందిస్తున్నాను. వీరి ఈ రచనను అశేష పాఠకలోకం ఆదరాభిమానాలతో సంభావిస్తుందని భావిస్తూ...

మాడభూషి అనంతాచార్య

*అధ్యక్షుడు,*

**యువభారతి**

# మా మాట

(మొదటి భాగం)

ఇటీవలి తెలుగు సాహిత్యంలో కొన్ని పాత్రలు ప్రవేశించినవి. ఒక రకమైన వ్యక్తిత్వాన్ని, ఒక మనస్తత్వాన్ని, ఒక వచో వైఖరిని, ఒక నడవడిని, ఒక ఆలోచనా ధోరణిని దృష్టిలో ఉంచుకొని కొందరు రచయితలు కొన్ని పాత్రలను సృష్టించినారు. ఇవి కల్పితపాత్రలే అయినా అక్షరాస్యుల్లో ఒక విలక్షణ వ్యక్తిత్వానికి ప్రతీకలుగా నిలిచిపోయినవి. పేరిగాడు, గిరీశం, పార్వతీశం, కాంతం, యెంకి, జంఘాల శాస్త్రి ఇంకా ఎందరో. రచయిత శక్తిని బట్టి ఈ పాత్రలు ప్రజల్లోకి చొచ్చుకొనిపోతాయి. పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి 'సాక్షి' తెలుగు వచన సాహిత్యంలో వింతల్లో వింత. అలాంటి వ్యాసాలను వ్రాయడానికి చాలా మంది రచయితలు ప్రయత్నించి నారు. సమకాలిక సామాజిక సమస్యలను అధిక్షేప గర్భితంగా, వ్యంగ్యంగా చిత్రించడం, సంఘాన్ని కలవరపరుస్తున్న అంశాలను వ్యంగ్యంగా స్ఫురింపజేయడం, ఈ వ్యాసాల్లోని విశేషం. సాక్షి చదువనివాడు తెలుగు చదువరి కాదు.

'సాక్షి' ఉపన్యాసాలను బాగా చదివి, ప్రభావితుడై అదే మూసలో కొన్ని వ్యాసాలను వ్రాయడానికి మా మిత్రులు, యువభారతి కార్యదర్శి శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావుగారు సాహసించినారు. తెలుగు పరిత్కలోకం ప్రోత్సాహాన్ని ఆశిస్తున్నారు. ఆయన నిర్మలమనస్కులు; కార్యదక్షులు, పేరు ప్రతిష్ఠల మీద నమ్మకం లేని కర్మఠులు. మా యువభారతీయుల కందరికి ఆత్మీయులు. ప్రాచీనార్వాచీనాంధ్ర సాహిత్యాలపట్ల ఆసక్తిని పెంచుకున్నవారు. కవితలు కూడా అల్లినారు. ఈ ప్రచురణ సందర్భంగా ఆయనను యువభారతి అభినందిస్తున్నది. పరాత్పరుడు ఆయనకు సాహితీసేవ చేయడానికి ఇతోధికమైన అవకాశాలు కల్గించాలని ఆకాంక్షిస్తున్నది.

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షులు
**యువభారతి**

14-12-1980
హైదరాబాదు

# మా మాట

(రెండవ భాగం)

మహాకవి, మహానాటక కర్త, అశేష శేముషీ సంపన్నుడు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు తెలుగు సాహిత్య ప్రపంచానికి అందించిన వింత కానుక "సాక్షి" వ్యాస కదంబం. ఆంధ్ర వచన వాఙ్మయ విహాయసంలో శక్రచాపాన్ని చూడనివాడు, పానుగంటి "సాక్షి" వ్యాసాలను చదవని వాడు. పానుగంటి వారిని అనుకరించడం తెలుగు రచయితల్లో ఒక సరదా. పానుగంటి వంటివారు కావాలని కాదు. ఆ ధోరణిలో, ఆ ఊపులో, వ్రాస్తే ఒక తృప్తి. పానుగంటి వారు కల్పించిన 'జంఘాలశాస్త్రి' ఒక వైఖరికి ప్రతీక. ఒక ఆలోచనా సరళికి సూచిక. పరిహాస భావ పేటిక.

మా మిత్రులు అయలసోమయాజుల నాగేశ్వరరావు గారు రెండేళ్ళ క్రితం "మరో జంఘాలశాస్త్రి" అని పానుగంటి వారి అడుగు జాడల్లో కొన్ని వ్యాసాలు వ్రాసి యువభారతి ద్వారా ప్రచురించినారు.

మా నాగేశ్వరరావు "మరో జంఘాలశాస్త్రి"ని పత్రికలు మెచ్చుకొన్నవి. పండితులు బాగుందన్నారు. అశేష పాఠకులు ఎంతో సంబరంతో ప్రతులన్నీ సొంతం చేసుకున్నారు. పాఠకులిచ్చిన ఈ ప్రోత్సాహం నాగేశ్వరరావు కలంలో మళ్ళీ దూరింది. అదే ధోరణిలో మరికొన్ని వ్యాసాలు వ్రాసి "మరో జంఘాలశాస్త్రి" రెండవ భాగాన్ని అందిస్తున్నారు.

శ్రీ నాగేశ్వరరావు మా యువభారతికి కార్యదర్శి, కర్తవ్య పరాయణుడు రచనలో వలెనే మాటల్లో కూడా హాస్యాన్ని చొప్పించి పనులను తేలికగా చేసి, చేయించే కుశల కార్యకర్త, బి.యస్సీ., బి. ఇడి, పట్టభద్రుడు. వృత్తి గణకునిది, ప్రవృత్తి కవిది.

స్నేహశీలి అయిన మా నాగేశ్వరరావు రచనను చదివి పాఠకలోకం ప్రోత్సహిస్తుందని ఆశిస్తున్నాను.

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షుడు,
**యువభారతి**

05-12-1982
హైదరాబాదు

# జంఘాల శాస్త్రియం

నవ్యాంధ్ర సాహిత్య నిర్మాతలలో శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు మహోదయులకున్న స్థానం అగ్రగణ్యం. నాటకకర్తగా, వచన వాఙ్మయనిర్మాతగా, హాస్యస్రష్టగా, సంఘవిమర్శకుడుగా ఆయన ప్రతిభ బహుముఖీనం. వారు పీఠికాపురాధీశులు శ్రీ సూర్యరావు ఆస్థాన కవులుగా పనిచేశారు. ముప్పైకి పైగా నాటకాలు రచించారు. ఆంధ్రదేశానికి వారిచ్చిన కానుక సాక్షి వ్యాసావళి. 'ఆంధ్ర ఎడిసన్'గా 'ఆంధ్రకాళిదాసు'గా వారు ప్రశంసలందుకున్నారు. తెలుగుజాతికి ఒక నూతన వికాసాన్నీ, నవీనోత్సాహాన్నీ, మాతృభాషాభిమాన సంపదనూ అందించిన మహానుభావుడు ఆయన.

పానుగంటి వారి 'సాక్షి' వ్యాసాలు తెలుగు భాషాయోషకు వినూత్నాభరణాలు; సువర్ణాలంకారాలు. 1913 నుంచి 1934 దాకా వారి వ్యాసాలు 'సువర్ణ లేఖ' అనే పత్రికలోనూ, ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలోనూ ప్రచురితాలై పాఠకులనెంతో ప్రభావితులను చేశాయి. సాక్షివ్యాసాలు సమాజ సముద్ధరణం కోసం రచింపబడ్డాయి. సాక్షివ్యాసాలు సృష్టికి మూలబీజం 17, 18 శతాబ్దాలలో ఆంగ్లసాహిత్యంలో ఎడిసన్, రిచర్డ్ స్టీల్ అనే ఇద్దరు ప్రముఖ రచయితలు రూపొందించిన 'స్పెక్టేటర్' అనే పత్రికా వ్యాసావళి. వీరు కల్పించిన 'స్పెక్టేటర్ క్లబ్' లా పానుంగంటివారు ఒక 'సాక్షి సంఘము'ను కల్పించారు. అలా కల్పితమైన సాక్షి సంఘంలో ఐదుగురు సభ్యులున్నారు. వారు – సాక్షి, జంఘాలశాస్త్రి, కాలాచార్యుడు, వాణీదాసుడు, బొఱ్ఱయ్య సెట్టి. ఈ ఐదుగురిలో సాక్షి, జంఘాలశాస్త్రి ముఖ్యులు. ఈ పాత్రల ద్వారా అభివ్యక్తమైన అభిప్రాయాలన్నీ పానుగంటి వారివే. 'జంఘాలుడు' అంటే 'మిక్కిలి వడిగా నడిచేవాడు' అని అర్థం.

జంఘాల శాస్త్రి పాత్రను సృష్టించడంలో పానుగంటి వారు ప్రదర్శించిన కల్పనాచాతురి ప్రశంసాపాత్రం. జంఘాలశాస్త్రి వాచాలుడు. లోకానుభవం విరివిగా ఉన్నవాడు. అన్ని అంశాలు అంతో ఇంతో తెలిసినవాడు. ఆతడు ఉద్వేగి. ఏ అంశం గూర్చి అయినా పట్టుదలతో ఆలోచించి సత్యమైన ఆగ్రహంతో ప్రసంగించేవాడు. చతురవక్తగా ప్రజలను వశీకరించుకున్నవాడు. సాక్షి వ్యాసాలలో చర్చింపబడని అంశం లేదని విజ్ఞుల అభిప్రాయం. స్త్రీలు, మతం, నాగరికత, వేదాంతం, విద్యావిధానం, రాజకీయాలు మొదలగు విషయాలను గూర్చి ఎక్కువగా చర్చించారు పానుగంటి వారు. ఈ వ్యాసాలలో ఆనాటి సంఘజీవితం, సంఘసంస్కరణ కృషి ప్రతిబింబిస్తుంది. సత్యేతర, శివేతర, సుందరేతర విషయాలను వెలికి తెచ్చి, చూపి, గర్హించారు పానుగంటివారు. సాక్షివ్యాసాలలో కొన్ని జంఘాల శాస్త్రి ఉపన్యాసాలు; మరికొన్ని – ఆ సంఘవేదికనుండి

ఇతరులిచ్చిన ఉపన్యాసాలు; మరికొన్ని - అన్యస్థలాలలో జరిగిన వృత్తాంతాలు, ఉపన్యాసాలు – శాస్త్రిగానీ, సంఘాభిమానులు గానీ వ్రాసి పంపినవి. వ్యంగ్యం, అధిక్షేపం, హాస్యం – ఈ సాక్షి వ్యాసాల్లో పరచుకొని ఉన్నాయి. ప్రక్రియలో, భాషలో, భావాల్లో సాక్షివ్యాసాలు నిత్యనూతనమైనవి.

పానుగంటి వారు సృష్టించిన 'సాక్షి'లోని జంఘాలశాస్త్రి ఉపన్యాస వ్యాసాలను చదివి ప్రభావితులై 'మరో జంఘాలశాస్త్రి' అనే పేరుతో, రెండు భాగాలుగా, వ్యాసాలను వ్రాసినవారు మా మిత్రులు, యువభారతి పూర్వకార్యదర్శి శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావు గారు. ఈ రెండు భాగాలూ యువభారతి ప్రచురణలుగా ఆవిష్కృత మైనాయి.

మిత్రులు శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావు గారు విమల హృదయులు; విద్యాధికులు; విజ్ఞానశాస్త్ర పట్టభద్రులు; సంఘసంస్కరణాభిలాషులు. పానుగంటి సాక్షి వ్యాసాలను చిన్ననాటి నుండి పఠించి, ఆ మహానుభావుని పట్ల ఒక గాఢమైన అభిమానాన్ని పెంచుకున్నవారు. ఆ అభిమానంతోనే అదే వైఖరితో, అదే ధోరణిలో, అదే విచిత్ర పదవిన్యాసంతో, వింతవింతలైన పలుపోకడలతో, సమాజోద్ధరణ దృక్పథంతో, 1980-82 సంవత్సరాలలో ఈ వ్యాసాలను వ్రాశారు. ఇప్పటికి ఇరవై ఐదు వత్సరాలు కడచినా, ఈ వ్యాసాలు, ఆనాటి పానుగంటి వ్యాసాలవలెనే నిత్యనూతనంగా ఉన్నాయి. నాగేశ్వరరావుగారు గ్రహించిన అంశాలన్నీ సమకాలిక సామాజిక సమస్యలే. వ్యాసాలన్నీ ఆ సమస్యల పరిష్కారాల సూచికలే. భారతీయ భాషా సాహిత్య సంస్కృతి కళావిజ్ఞాన విషయాత్మకాలే. అంతేకాదు – స్వాతంత్ర్య దినోత్సవం, ఆధునిక కవిత్వం, ఎన్నికలు, క్రికెట్ కామెంటరీ వంటి ఆధునిక విషయాలు కూడా ఈ వ్యాసాల్లో ఉన్నాయి.

పానుగంటి వారి జంఘాలశాస్త్రి పాత్రనే శ్రీ నాగేశ్వరరావు గ్రహించి, ఆ పాత్రకు అన్నివిధాలా న్యాయం చేశారు. ప్రక్రియాదృష్టితో పరిశీలించినా, వచనవైఖరిని అనుశీలించినా, భావసంపదను సమీక్షించినా, నాటి జంఘాలశాస్త్రి తీరు తెన్నులే ఆతని మనోవ్యాపార విశేషాలే, ఈ జంఘాలశాస్త్రి వ్యక్తిత్వ చిత్రణలోనూ స్ఫురిస్తాయి. అధిక్షేపం, వ్యంగ్యం, హాస్యం ఈ 'మరో జంఘాల శాస్త్రి'లోనూ ప్రత్యక్షమై మనలను కదిలిస్తాయి. అలా ఆనాటి జంఘాలశాస్త్రి విలక్షణవ్యక్తిత్వాన్ని ఆధునికంగా పోషించడంలో శ్రీ నాగేశ్వరరావుగారు చాలా వరకు కృతకృత్యులయ్యారనే చెప్పాలి. అందుకే సహృదయ పాఠకులు సముచితంగా స్పందించి, సమాదరించి, పరోక్షంగా ఈ ద్వితీయముద్రణకు ప్రేరణ కలిగించారు. విజ్ఞానాన్నీ వినోదాన్నీ రెంటినీ అందించే వ్యాససంపుటి ఈ 'మరో జంఘాల శాస్త్రి'.

ఆత్మీయులైన అయలసోమయాజులు గారు ఇంత మంచి పుస్తకాన్ని మళ్ళీ ద్వితీయముద్రణగా అందిస్తున్నందుకు వారిని హార్దికంగా అభినందిస్తున్నాను. ఇలాంటి మంచి రచనలు ముందు ముందు ఇంకా అందిస్తారని ఆశిస్తున్నాను.

*– డా॥ తిరుమల శ్రీనివాసాచార్య*

# అభినందనలు

జంఘాలశాస్త్రి ఉపన్యాసాలకు, సాక్షివ్యాసాలకు, పానుగంటివారి వాక్య వైభవాలకు ముందుగా అభిమానపూర్వక నమస్సులు.

ముందు మాటలు ముందుగా చదివేవారు కొందరైనా వుంటారు. అలా చదివితే ముందుగానే తమకు మరొకరి అభిప్రాయ ప్రాభవం తెలుస్తుందని, అందువల్ల లాభాలుంటాయని వారి అభిప్రాయం. కొందరు ముందుమాటలు ముందుగా చదవరు. మరొకరి మాటలు తమకెందుకులే అని వారి అభిప్రాయం. తాము స్వయంగా చదివి, తమకంటూ ఏదో ఒక అభిప్రాయానికి వచ్చిన తరువాత, మరొకరి అభిప్రాయం ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు చదువుతారు.

కొందరుంటారు-వారు అసలు ముందుమాటలు చదవనే చదవరు. మరికొంద రుంటారు-వారు పుస్తకాలను చదవడం మానేసినవారు. మరిమీరు-చదివేవారా? లేక చదవనివారా? ఏమోమరి? మీకు తెలుసు! అక్షరాస్యులు చదవడం మానేస్తే చదువురాని వారితో పోటీపడినట్లు అవుతుంది గదండి! ప్రతిరోజూ కొంతసేపయినా చదవడం మంచి అలవాటు అంటూ మీకు మనవి చేద్దామని ఈ విన్నపాలు.

ఈ కబుర్లెందుకంటే, అసలు ముందు మాటలంటూ ఎందుకుండాలని? చదవనున్న పుస్తకంలోని విషయం గురించి, పుస్తకం వ్రాసిన రచయితను గురించి, విషయానికి ఎంతగా న్యాయం జరిగిందనే విషయం ప్రస్తావించదానికి, రచయితకు, ముందు మాటలు రాస్తున్న వ్యక్తికి వున్న అనుబంధాల గురించి... ఇలా ఎన్నెన్నో అంశాల గురించి కొన్ని ముచ్చటలు ప్రస్తావించేందుకు ముచ్చటైన చక్కటి అవకాశం.

జంఘాలశాస్త్రి ఉపన్యాసాలు చదవనివారు, వానజల్లులో తడవనివారు ఎంతో పోగొట్టుకున్నవారుగా పరిగణించే రోజుల్లో పుట్టి పెరిగిన తరానికి చెందినవారము. భాషా గాంభీర్యం, విషయవైవిధ్యం, ఎత్తుగడ, వాగ్ధాటి, ఊహించలేనంతటి ప్రతిభ, ఊహకందని లోతులు, ఏమంతగా ఉండదనుకొన్న విషయంలో సైతం ఇంత ఉందా? అంటూ ఎవరినైనా సంభ్రమాశ్చర్యాలకు లోను చెయ్యగలిగే సామర్థ్యం పానుగంటివారి సొత్తు నిజంగానే న భూతో న భవిష్యతి - అని అందరూ అనుకునేవారు. కాని... కాని... మా నాగేశ్వరరావు వ్యాసాలు చదివిన వారు, వర్తమానంలో 'మరో జంఘాలశాస్త్రి' అవతరించిన వాస్తవాన్ని నిజంగానే గుర్తిస్తారు. వ్యాసాలకు ఎన్నుకొన్న విషయాలు ఆధునికం. విషయపరిజ్ఞానం ఆధునికం, వ్యూహరచన - పానుగంటివారికి చక్కని అనుకరణ. ఆ తరంవారికందరికీ మరోసారి తమ జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకునే సదవకాశం మీరు మరోలా అనుకోనంటే-మరొక్కసారి ఆ జంఘాలశాస్త్రి సాక్షి

ఉపన్యాసాలు తిరిగి చదువుదామనే కోర్కె తలెత్తుతుంది. మీరు నాతో ఏకీభవిస్తారన్న నమ్మకం నాకు పుష్కలంగా ఉంది.

అసలు ఆ రోజుల్లో సెలవులు వచ్చాయంటే (ఆటల తరువాత), గ్రంథాలయాలకు పరిగెత్తుకు వెళ్ళేవాళ్ళం (ఆ రోజుల్లో మరి టి.వి. లేదుగదండి). సెలవులయిపోయిన తరువాత కలుసుకున్న వెంటనే, కుశల ప్రశ్నల తదుపరి, ఏ పుస్తకాలు చదివావు? అంటూ కుశలోపరిలో ముఖ్యమైన అంశంగా భావించినవాళ్ళం. ఈతరంవారికి, చదువుమీద కన్న టి.వి.ల పైన, 'ఇంటర్నెట్'పైనా, అబ్బో, అబ్బో, చెప్పుకుంటూ పోతే, ఎన్నెన్నో కొత్త కొత్త ఆకర్షణలు. కాలప్రభావం మరి. కొత్తవాటికి స్వాగతం తప్పకుండా పలుకవలసిందే! కాని పాతవాటిలోని అపాత మాధుర్యాలను మరచిపోకూడదని నా అభిప్రాయం, మీరేమంటారు?

వ్యక్తి ఎలా ఉండాలి? వ్యక్తిత్వం ఎలా తీర్చి దిద్దుకోవాలి? సమాజపరంగా వ్యక్తులు తమ బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి? సాహిత్యం నిర్వహించవలసిన పాత్ర ఏమిటి? సాహిత్య, సాంస్కృతిక సంఘాలు ఏ రకమయిన పాత్ర నిర్వహించాలి? సంస్థలలో కార్యకర్తలెలా ఉండాలి? సంఘాలను నిర్వహించడం ఎలా? నాయకత్వ లక్షణాలు అలవరచుకోవడం ఎలా? ఆచరించి చూపడం ఎలా? ఇలాంటి ఎన్నెన్నో ఉపయోగకరమైన అంశాలు – మా నాగేశ్వరరావు జీవితంలోని ప్రముఖమైన అంశాలు – మా యువభారతితో విడదీయలేని అనుబంధాలు.

ముక్కుసూటిగా ఆలోచించడమే కాదు, అలాగే మాట్లాడడం, అలాగే ఆచరించడం మా నాగేశ్వరరావు విలక్షణ వ్యక్తిత్వం. అప్పగించిన పనిని మనస్ఫూర్తిగా ఆచరించడం ఆయన విశిష్టత. యువభారతి సంస్థ సాధించగలిగిన కృషిలో, చిరకాలం పాటు కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు-ఎన్నటికీ గుర్తుండిపోయేవి. కార్యక్రమాల నిర్వహణతోపాటుగ రచనా వ్యాసంగంలో కృషి-మా నాగేశ్వరరావుతో అనుబంధం ఏర్పరచుకున్నవారికి మధురానుభూతి.

ఈ వ్యాసాలు అనేకమైన ఆధునిక సామాజిక అంశాలపైన సంధించిన నాగాస్త్రాలు – ఈ నాగేశ్వరాస్త్రాలు. ఆలోచించడానికి ప్రేరణలు. కర్తవ్యాలను చేపట్టడానికి చక్కని అవకాశాలు. పట్టుదలతో సాధించడానికి పూనికలు. భవిష్యత్తు చక్కదిద్దుకోడానికి అవసరమైన భూమికలు. వ్యక్తులే కాదు, సమాజం యావత్తూ చైతన్యవంతం కావడానికి మేలు కొలుపులు, జీవితంలో ఆహ్వానించదగిన మేలు మలుపులు. ఇంకా ఆలస్యం ఎందుకు చెప్పండి? మనసు తెరవండి. చదవండి. ముందుకురకండి. పదండి ముందుకు, పదండి తోసుకు, పోదాం, పోదాం, పైపైకి. మా నాగేశ్వరరావుకు మనసారా అభినందనలతో...

శ్రావణ పూర్ణిమ

16-08-2008

వంగపల్లి విశ్వనాథం
సమావేశకర్త
**యువభారతి**

# జంఘాలశాస్త్రి పునరుత్థానం

తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలచిపోగల పాత్రలు కొన్ని- కథకులు, నవలాకారులు, నాటకకర్తలు సృష్టించారు గానీ, తన వ్యాసాలద్వారా అటువంటి పాత్రనొకదానిని అందించిన ఘనత పానుగంటి లక్ష్మీనరసింహారావుగారికే దక్కుతుంది. నిజానికి గురజాడ 'గిరీశం' పాత్ర- లెక్చర్లకు పెట్టింది పేరుగా - ముళ్లపూడి వెంకటరమణ, వడ్లమన్నాటి కుటుంబరావ్ వంటి వారు అందిపుచ్చుకుని, ఆ పాత్రను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చారు. సమాజంలో 'గిరీశం సంస్కృతి' అనేది కూడా ఒకటి స్థిరీకరింపబడింది. 'హరి' దాని గురించి అద్భుతమైన విశ్లేషణ కూడా చేశారు. పానుగంటివారు తన 'సాక్షి' వ్యాసాల ద్వారా సృజించిన పాత్ర జంఘాలశాస్త్రి. నిజానికి గిరీశం కన్నా విలక్షణమైనది, సమాదరణీయమైనది ఈ పాత్ర.

జాతీయోద్యమ సమయంలో, సంఘసంస్కరణోద్యమ కాలంలో, సాహితీ సముద్ధరణ కూడా ముమ్మరంగా సాగుతున్న రోజులలో - భారతీయభాషలపై పాశ్చాత్య నాగరికతా ప్రభావం, పలుకుబడి విశేషంగా ప్రసరించి నాటుకోవడం మొదలైంది. వివేకానందుడు, అనిబిసెంటు మొదలైన వారు భారతీయ సంస్కృతీవైభవాన్ని, తాత్త్విక భావాలనూ పునరుద్ధరించి పాశ్చాత్య వ్యామోహంలో కొట్టుకుపోతున్న యువకులను మరల్చి, ఆర్షవిద్యలపట్ల అనురక్తులను కావించిన సంఘటనలు తటస్థించాయి. అటువంటి వివిధోద్యమ ఝంఝూమారుతంలో నూతన చైతన్యం సంతరించుకుంటున్న తరుణంలోనే - 'ఆంధ్రపత్రిక', 'సువర్ణలేఖ'ల్లో పానుగంటివారి 'సాక్షి' రచనలు వెలువడ్డాయి. మనసులకు రెప్పపాటైనా శాంతిలేక మహాసంక్షోభం చెందుతున్న ప్రజలకు ఆ 20వ శతాబ్ది ప్రారంభంలో 'సాక్షి' సంఘం-హాస్య, సాహిత్య సుధామధు రామృతాన్ని త్రావించి, ఆనందంలో ఓలలాడించిందని చెప్పాలి. 'ఆంధ్రపత్రిక'లో సాక్షి వ్యాసాలకోసం పాఠకులు ఆత్రంగా ఎదురుచూచే వారట! పిఠాపురం రాజావారు 'సాక్షి' వ్యాస వాఙ్మయానికి ధనసహాయం చేసి, ఆరు సంపుటాలుగా ప్రచురింపచేసారు. సుమారు ఆరువందల నలభైనాలుగు వ్యాసాలవి. పానుగంటివారు వాటిల్లో భారతీయ పురాతన పద్ధతులు, విద్య, వేషం, కట్టు, బొట్టు, ఆనాటి సాంఘిక దురాచారాలు, మతము, నాగరికత, వేదాంతము, రాజకీయాలు, విద్యావిధానం మొదలైనవాటిపై గొప్ప పరిశీలనతో, గాఢతతో సమకాలీన పరిస్థితులపై విమర్శనాత్మకంగా రాసిన వ్యాసాలవి. కోడిపందేలునుండి గోవింద నామస్మరణ వరకూ, తోలుబొమ్మలనుండి తత్త్వోపన్యాసాల వరకూ, తడమని అంశం లేదనవచ్చు.

ఎడిసన్ 'స్పెక్టేటర్' ఈ 'సాక్షి' రచనలకు ప్రేరణ అని చెబుతారు. కానీ పానుగంటి వారు లోకవ్యవహార పరిశీలకునిగా- ఒక పరిశోధకుని దృష్టితో, ఒక వైజ్ఞానికుని దీక్షతో అందించిన గొప్ప వ్యాసాలివి. 'సాక్షి' అనేది ఒక సంఘం. పానుగంటి వారు అయిదుగురు సభ్యులుగల సంఘంగా దాన్ని పేర్కొన్నారు. పరీధావినామ సంవత్సర మాఘ బహుళ చతుర్దశి శివరాత్రి గురువారం నాడు లింగోద్భవకాలంలో ఉద్భవించిదట. సాక్షి సంఘంలో అయిదుగురు సభ్యులు. ఒకడు కాలాచార్యులు, ద్వితీయుడు జంఘాలశాస్త్రి, మూడోవాడు వాణీదాసుడు, నాలుగోవాడు బొర్రయశెట్టి, అయిదవది స్వయంగా సాక్షి. అయితే ఈ పాత్రలలో సాక్షివ్యాసాలకు పేరుతెచ్చింది - జంఘాలశాస్త్రి పాత్రే ప్రధానంగా. జంఘాలశాస్త్రి గురించి చెబుతూ - 'ఈతడు కాలినడకనే ఆసేతు హిమాచల పర్యంతం తిరిగినవాడు. అనేక సంస్థానములను చూచినవాడు. ఆయా సంస్థానముల పూర్వచరిత్ర, ఆయా సంస్థానాధీశ్వరుల లోపములను సమగ్రముగా నెరిగిన జ్ఞానసంపన్నుడు. వాచాలుడు. వాదముల యందు కర్ర జారిపోయిననూ కలయబడగల ధీరుడు. అన్ని అంశములను గూర్చి అంతయో, ఇంతయో, కొంతయో, కూసింతయో తెలిసిన ప్రజ్ఞుడు' అని చెబుతాడు. బ్రహ్మచారి, శ్రీవైష్ణవుడు, యధార్థవాది అయిన కాలాచార్యులుగానీ, కవి అయిన వాణీదాసుగానీ, వాణిజ్య ప్రముఖుడైన బొర్రయశెట్టి గానీ, లోకవృత్తానికంతకూ స్వయంగా సాక్షీభూతమైన సాక్షిగానీ ఈ వ్యాసాలలో పలుమార్లు వచ్చినా - ఒక ఉపన్యాసకునిగా నిలిపిన 'జంఘాలశాస్త్రి' పాత్రే విశేషంగా ప్రాచుర్యం చెందింది. దానికి జంఘాలుని వాగ్ధోరణీ వాగ్వాహినీ మోహినీ కరణ దక్షతయే కారణం!

హాస్యం, వ్యంగ్యం, నిశితపరిశీలన, విషయవిశ్లేషణం, గాఢత, సభారంజనం చేయడం మాత్రమే కాక, ఆలోచననుద్దీపింప చేయగల ప్రసంగనైపుణి - జంఘాలశాస్త్రి పాత్రను అద్భుతంగా రూపొందింపచేశాయి.

ముఖ్యంగా 'స్వభాష' గురించి పానుగంటివారు జంఘాలశాస్త్రిచే చేయించిన ప్రసంగం- ఎప్పుడో ఎనభైఏళ్ళ క్రితంనాటిదైనా, నేటి సమాజానికీ నవనవోన్మేషంగా, ప్రత్యక్షర సత్యంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచేదే! తెలుగుకు ప్రాచీన హోదా దక్కిందని సంబరపడుతున్న వారంతా కూడా, తెలుగు భాషా ప్రేమికులంతా ఆ వ్యాసాన్ని ఇవాళ మరొక్కమారు విధిగా చదివి తీరాలి! అందరిచేతా చదివించి తీరాలి!

జంఘాలశాస్త్రిలోని ప్రభావోపేతమైన ఆ ప్రసంగధోరణి నేటి సమాజానికి చాలా అవసరం. సంస్థాగత లోపాలనేవయినా తూర్పారబట్టి, దిశానిర్దేశనం చేయగల, జ్ఞానసంపన్నతగల ప్రాసంగికుల అవసరం నేడు ఎంతయినావుంది. హాస్యం వ్యంగ్యాలతో బాటు - ఆలోచనాత్మకమైన అలాంటి వాదనా పటిమ, ప్రసంగపాటవం 'జ్వాలాముఖి' అందిపుచ్చుకోవడానికి జంఘాలశాస్త్రి పాత్ర ఒక ప్రేరణ అనిపిస్తుంది. గిరీశం లెక్చర్లు

వేరు. జంఘాలశాస్త్రి ఉపన్యాసాలువేరు. పాశ్చాత్యవ్యామోహానికీ, సత్యంపేరిటి ఆర్థిక ప్రయోజనాల వంచనా కాపట్యాలకూ గిరీశం ప్రతీక కావచ్చునేమోగానీ, సంఘసంస్కరణాభిలాష గల భారతీయ సంస్కారవైభవ ప్రతీక పాత్ర – 'జంఘాలశాస్త్రి'.

నేటి సమాజంలో 'జంఘాలశాస్త్రి' ఆవశ్యకతను గుర్తించినందువల్లనే, ఆ పాత్రను అందిపుచ్చుకుని వర్తమాన లోకరీతులను తదనుగుణంగా వ్యాఖ్యానింపచేసే ఈ రచనలకు శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావు పూనుకున్నారు. 'సాక్షి' వ్యాసాలను క్షుణ్ణంగా చదవడం మాత్రమే కాదు, జంఘాలశాస్త్రి పాత్రను సమగ్రంగా ఆకళింపు చేసుకున్నారు. 1973 ప్రారంభంలో 'చుక్కాని' పక్షపత్రికలో జంఘాలశాస్త్రి ఉపన్యాసాలు నాలుగైదు నవీనంగా రాసి 'యువభారతి' సాహిత్య సమావేశాల్లో నేను వినిపించాను. అయితే నాగేశ్వరరావుగారు ఈ వ్యాసరచనను ఒక అసిధారా వ్రతంలా సాగించారు. 'మరోజంఘాలశాస్త్రి' అంటూ పానుగంటివారి సాక్షిపాత్రనే – సమకాలీన సమాజంలో సజీవం చేశారు. నిజానికి 'మరో' అనవసరం లేనంతగా, ఆ పాత్రను ఆధునిక కాలానికి అనుగుణంగా మలచి, తన రచనతో – 'అయలసోమయాజుల జంఘాలశాస్త్రి' అనేటంతగా నాగేశ్వరరావుగారు రూపుదిద్దారు.

యువభారతి పక్షాన 'మరో జంఘాలశాస్త్రి' రెండు సంపుటాలుగా గతంలో (1982) అయలసోమయాజుల నాగేశ్వరరావు గారు వెలువరించి పాఠకుల ఆదరణ, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.

ఒక చిత్రకారునిగా జంఘాలశాస్త్రికి రూపకల్పన చేసే అవకాశం నాగేశ్వరరావు గారి పుస్తకాలకు ముఖచిత్రం వేయడంవల్ల నాకు దక్కింది. "పానుగంటి వారు జంఘాలశాస్త్రి భౌతికాకృతిని మనకు అందచేయలేదు. కాని రచననుబట్టి శాస్త్రి ఊహాచిత్రాన్ని చిత్రించి మనకు అందచేసిన చిత్రకారుడు 'సుధామ' అభినంద నీయులు. ఆ చిత్రంతో కూడా అందంగా దీనిని ముద్రించి, ప్రకటించి 'సాక్షి'ని మన తలపునకు తెప్పిస్తున్న యువభారతినీ రచయిత నాగేశ్వరరావుగారినీ మనం అభినందించ వలసింది" అని 'భారతి' పత్రిక (ఏప్రిల్, 1982) సమీక్షించడం నాకు ఆనందదాయకం.

నాగేశ్వరరావుగారు జంఘాలశాస్త్రి ద్వారా అత్యాధునిక అంశాలననేకం తన వ్యాసాలలో సునిశితంగా విశ్లేషించారు. ఈనాటి పాఠకులను దృష్టిలో వుంచుకుని – సమాసభూయిష్టమైన ప్రవాహసదృశ వాగ్ధోరణి కొంత జంఘాలశాస్త్రిలో నియంత్రించారు. అలాగని ఉపన్యాసధారకు ఏ కొరతా రానివ్వలేదు. జంఘాలశాస్త్రి మాటతీరును ముమ్మూర్తులా పుణికిపుచ్చుకున్నారు. వ్యంగ్యం, మాటలపదును, ఆలోచనాధోరణి, అభివ్యక్తి తీవ్రత పానుగంటి ఒరవడిలోనే ఆధునిక సొబగులద్దుకున్నాయి. నాగేశ్వరరావు గారి రచనలో, సిటీబస్సులు, సినిమాలు, తుఫానుకవితల పోటీలు, కవిసమ్మేళనాలు,

స్త్రీలఫ్యాషన్లు, రామాయణవిమర్శ, నూతన పరీక్ష విధానము, క్రికెట్ కామెంటరీ, సమ్మెలు, పర్యావరణ పరిరక్షణం, వీధి దేవతలు, శాసనసభాసమావేశములు, ప్రభుత్వ రంగ సంస్థలు, తెలుగు టివీ కార్యక్రమములు, జాతీయసమైక్యత ఇలా ఏ విషయాన్ని తీసుకున్నా తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా, కుండబద్దలు కొట్టినట్లు ఈ వ్యాసాలలో నాగేశ్వరరావుగారు వెలువరించారు. మంచి వాచకవైభవం గల నటుడెవరిచేతనైనా వీటిని కంఠస్థం చేయించి ప్రతి పాఠశాలలో, కళాశాలలో ఉపన్యసింప చేసినట్లయితే, అదేవిధంగా సాహిత్యసభల కార్యక్రమ అంశంగా మలచి అందించ గలిగినట్లయితే, ఆశించిన ప్రయోజనం కొంతమేరకైనా సిద్ధిస్తుందేమో! ఆ పని ఎవరయినా చేస్తే ఎంత బాగుణ్ణు!

'మరోజంఘాలశాస్త్రి' ద్వారా అయలసోమయాజుల నాగేశ్వరరావుగారు వెల్లడించిన వ్యంగ్యవైభవం, అభిప్రాయనైశిత్యం గ్రహించడానికి వాచవిగాకొన్ని మ(మె)చ్చుతునకలివి :

"సామాజిక స్పృహయా? ఏదీ! అసలు ఒడలిపైన స్పృహయే లేనప్పుడిక సామాజిక స్పృహ ఎక్కడిది? ఎప్పుడునూ ఏదియో ఒక మత్తు – రాజకీయ సిద్ధాంతపు మత్తో, సినీకాంతల కౌగిలింతల మత్తో, పూర్వసంస్కృతీ విరోధపు మత్తో, కవి కావలయు నను మోహపుమత్తో, మద్యపానపుమత్తో – ఏదో ఒకటి. మత్తులేకుండ కవిత్వము వ్రాసినదేది? స్పృహవుండి కవిత్వము వ్రాసినదెప్పుడు? ఏది వ్రాసినను మత్తులోనే! ఏది చేసినను మత్తులోనే! స్పృహయే లేనప్పుడిక సామాజిక స్పృహ ఎక్కడిది?"

*(కవులు–సామాజిక స్పృహ)*

"కూడు, గుడ్డలను ఏ ప్రభుత్వమయిన అందచేయును కాని కమ్మని మద్యము నందచేయు ప్రభుత్వమేది? అట్టి ప్రభుత్వము మరెచ్చటనైనను కలదా? లేదు నాయనలారా, లేదు, ఆ కీర్తి మనకే దక్కినది. భారతమాత ధన్య యయినది వహ్వా! ముందుల కేగుచున్నామని చీకటిలో వెనుకకు పయనించుచున్నామే! పురోగతికై ఉద్యమించి తిరోగమించుచున్నామే! తినుటకు తిండి, కట్టుటకు బట్ట ఉండుటకు గూడులేని మన దేశములో మద్యపానమా!"

*(మద్యపాన నిషేధము)*

"నాయనలారా! దేశమందెల్లవేళలందు, ఎల్లకాలమందు ఒకేరకమైన సిద్ధాంతము మనజాలదు. అటులే అయిన అది దేశము కాదు. వారిది సిద్ధాంతము కాదు. వారు ప్రజలు కారు. దేశకాల పాత్రములనుబట్టి ఆనాటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులనుబట్టి ఇది మంచి, ఇది చెడు అని మనము నిర్ణయించు చున్నాము. ఈనాటి మంచి రేపటికి చెడుగగుచున్నది. నిన్నటి చెడుగు నేటికి మంచి యగుచున్నది... నిన్నటిదాక

బహుసంతానవతి అయిన స్త్రీ పుణ్యవతి. నేడు సంతాన విహీన యోగ్యతాపత్రమున కర్పూరాలు. ఇంతలోనే ఇన్ని మార్పులు జరుగుచుండ కొన్నివేల ఏండ్ల క్రిందట వ్రాయబడిన రామాయణమంత తుక్కనియు వాల్మీకివట్టి ఫూలనియు, ఈనాడు మనకున్న మిడిమిడి జ్ఞానముతో వచించుట తప్పుకాదా!"

*(రామాయణ విమర్శ)*

"ఈ దీపములార్పుటయేమి? ఈ రొట్టెముక్కల కత్తిరింపులేమి? ఈ సామాజిక బృందగానములేమి? నాయనలారా! మనకు సంప్రదాయములు లేవా? ఆచార వ్యవహారములు లేవా? మనజాతి అంత గొడ్డువోయినదా? అంతనిస్తేజమైనదా? అంతనిర్వీర్యమైనదా? మీ సూటు బూటులనే కాక ఆచారవ్యవహారములను కూడా దిగుమతి చేసుకొనుచున్నారా!"

*(పుట్టినదినము పండుగ)*

"నాయనలారా! విద్యావిధానమును రాజకీయములతో ముడివేయకుడు. దానిని విద్యావేత్తల కప్పగింపుడు. జాతీయ విద్యావిధానమును రూపొందించి కాశ్మీరము నుండి కన్యాకుమారి వరకుగల యావద్భారత దేశమందును అమలు చేయుడు. దేశ ఆర్థిక, సాంఘిక అవసరముల కనువగు విద్యావిధానము మలచుడు. విద్యను మార్పు సాధించుటలో నాయుధముగ తీర్చిదిద్దుడు"

*(నూతన పరీక్షా విధానము)*

"నాయనలారా! మీ కార్యాలయమునందు నాటకకర్తలు, నటులు, కథకులు, కవులు, నవలాకారులు, సాహిత్యాభిలాషులు, క్రీడాకారులు, కార్యకర్తలు సంఘసేవా పరాయణులు, రాజకీయ విశ్లేషకులు, వ్యాపారస్థులు వీరు వారు అననేల? అన్ని రంగములలో ప్రావీణ్యము కలవారున్నారు. కాని లేనిది ఒక్కరే! చిత్తశుద్ధితో పనిచేయు వారు, పనిని నేర్చుకుందుమను యుబలాటము కలవారు - మహాగణకుల వారి కార్యాలయములో పింఛను ఇచ్చువారే కాదు - పింఛను తీసుకొనుచున్నవారు కూడా చాలామంది యున్నారని నాకీనాడే తెలిసినది"

*(ఏ.జి. ఆఫీసు ప్రసంగము)*

"ఈ రోజులలో ధర్మము, సత్యము, నీతి, న్యాయము, అహింస, పితృవాక్పరి పాలనము వంటి పదములు అసభ్యపదజాలములైనవి. వాటిని గూర్చి మాట్లాడువారు పిచ్చివారైనారు. మనసులో నొకటుంచుకొని మాటలలో వేరొకటి మాట్లాడుట మనవశమా? అట్లు మాట్లాడగలిగిన మనమిచ్చటికి వచ్చియుండెడి వారమా?"

*(పిచ్చాసుపత్రి - వింతస్వప్నము)*

ఇలా ఉటంకించుకుంటూ పోయే లౌల్యాన్ని వీడకపోతే ప్రమాదమే. ఇందులోని 'వీధి దేవతలు' చదవండి. అధునాతన నగర వ్యవహారం, కబ్జాసురుల వైనం కళ్ళకు కడుతుంది. 'పర్యావరణ పరిరక్షణము', 'మనుధర్మశాస్త్రము' - సంభాషణా ప్రసంగ సరళి కన్నా వ్యాసవివరణ వైఖరిలోనే సాగినా, అందులోని విషయ గాంభీర్యం గణుతించి గుర్తించదగినది. అలాగే 'మాతృ(మృత)భాష' నేటి భాషా స్థితిని గూర్చిన ఆర్తిని చూపుతోంది. ముందుముందున్న వ్యాసాలకన్నా ఇటీవలి రచనల్లోనే కొంత దీర్ఘత వుండి జంఘాలశాస్త్రి ఉపన్యాసఫణితిలో విషయంపట్ల సమగ్ర అధ్యయనం కనబడుతోంది. తెలుగు టీ.వి. కార్యక్రమాల గురించీ, జాతీయ విద్యావిధానం, జాతీయ సమైక్యత గురించీ రాసిన వ్యాసాలు ఉపన్యాస వైఖరికన్నా పరిశోధక వైఖరిని సంతరించుకున్న అధ్యయనపత్ర ప్రసంగాలుగా మారాయని నాగేశ్వరరావు గారు గుర్తించారో లేదో! విషయం దృష్ట్యా అవి విలువైన వ్యాసాలేగానీ, జంఘాలశాస్త్రి పాత్రగతంగా చూస్తే- కొంత భిన్నమార్గం తొక్కినట్లుగా తోచవచ్చు. పాత్ర సహజగతమైన అభివ్యక్తివైఖరి, ప్రసంగధోరణి, వ్యంగ్యఫణితి చివరివ్యాసాల్లో కనుమరుగు కాకుండా మరింత జాగ్రత్త వహించివుంటే బాగుండేది. "మరోజంఘాలశాస్త్రి చిన్నవ్యాసాలైతేనే రాణించి, దీర్ఘ రచన అయితే తేలిపోతాడు" అనిపించుకోకుండా - పాత్రగతవైఖరి మందగించకుండానే, విపుల రచనా సంవిధానాన్ని మునుముందు మరింతగా నిలుపు తారని ఆకాంక్ష.

ఏమయినా 'జంఘాలశాస్త్రి' పాత్రను పునఃప్రతిష్ఠ చేసి, వర్తమాన కాలానికి అనుగుణంగా మలచి, పానుగంటిని నేటికీ 'పొడగంటి'నని పాఠకులు ఆనంద సంధాయకంగా, అనుభూతి రమ్యంగా పరివతృప్తులయ్యేలా-ఆలోచనాత్మక వ్యాసపరంపరను అందించిన అయలసోమయాజులుగారు బహుధా అభినందనీయులు. తెలుగు సాహిత్యంలోని ఒక విశిష్టపాత్రను సమాదరణీయ వ్యాసమూర్తిగా సమకాలీనం చేసిన ఘనత నాగేశ్వరరావుగారిదే. దీనిని మక్కువతో అక్కున చేర్చుకునే పాఠకతరం ఏర్పడాలని ఆకాంక్షిస్తూ, ఏర్పడగలదని విశ్వసిస్తూ... స్వస్తి!!

సదా మీ
సుధామ
-సర్వధారి సంక్రాంతి

# నా మాట

నా అభిమాన రచయితల్లో పానుగంటి లక్ష్మీనరసింహారావు గారిది ప్రథమ స్థానం. నా చిన్నతనం నుంచీ ఆయన సాక్షి సంపుటాలలోని వ్యాసాలను విని ఆనందించే వాడిని. మా పెద్దన్న గారయిన శ్రీ ఎ.ఎస్. కామేశ్వరరావు గారు తన వేసవి సెలవులలో మా గ్రామం వచ్చినప్పుడల్లా 'సాక్షి' సంపుటాలను తీసుకొని వస్తుండే వారు. మధ్యాహ్నం వేళలో 10, 15 మంది మిత్రులం చేరి ఆయన 'సాక్షి' వ్యాసాలను చదవగా విని ఆనందిస్తుండే వాళ్ళం. అలా పరిచయమయింది నాకు పానుగంటి వారి సాహిత్యంతో.

తరువాత నేను విద్యార్థిగా ఉంటున్నప్పుడు గ్రంథాలయంలో ఉన్న 'సాక్షి' సంపుటాలన్నింటినీ స్వయంగా చదవడం జరిగింది. అప్పటి నుంచి పానుగంటి వారిపైన ఎనలేని గౌరవం ఏర్పడింది. వారిలా వ్యాసాలు వ్రాయాలనే ఉత్సుకత ఏర్పడింది. అయినా అప్పుడు మెదడు పనిచేసేది కాని కలం కదిలేది కాదు. నా కోరిక కోరికగానే మిగిలిపోయింది.

నేను 1972లో ఉద్యోగరీత్యా 'హైదరాబాదు' రావడం జరిగింది. అదృష్టవశాత్తు 'యువభారతి' సంస్థతో పరిచయం కలిగింది. 'యువభారతి' ప్రతినెలా మొదటి, మూడు ఆదివారాలలో జరిపే 'సాహిత్య సమావేశాలు' నన్నెంతగానో ఆకర్షించాయి. ఆ సమావేశాలలో మిత్రులు 'స్వీయ రచనావరనం'లో తమ స్వీయ రచనలను చదువుతున్నప్పుడు, 'రచన' చెయ్యాలన్న నాకోరిక మళ్ళీ తలెత్తింది. సమాజంలోని సమస్యలని తీసుకొని పానుగంటి వారి 'సాక్షి' ఉపన్యాసాల పద్ధతిలో వ్యాసాలను వ్రాసి స్వీయ రచనాపరనం కార్యక్రమంలో చదివి వినిపించాను. బాగున్నాయని మిత్రులు ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో ఇప్పటివరకు వివిధ విషయాలపై దాదాపు 50 వ్యాసాలు వ్రాశాను. అందులో నుండి 12 వ్యాసాలను ఎంపికచేసి, ఉపన్యాస సంకలనాన్ని 'యువభారతి' 'మరో జంఘాల శాస్త్రి' పేర డిశంబరు 1980లో అచ్చువేసింది.

అచ్చయిన పుస్తకాలు అనతి కాలంలోనే అమ్ముడు పోయాయి. 'మరో జంఘాల శాస్త్రి'ని పత్రికలు మెచ్చుకున్నాయి. పాఠకులు ఆదరించారు. ఆ ఉత్సాహాన్ని ఊపిరిగా 'యువభారతి' నా వ్యాసాల్లో మరో పదిహేనింటిని ఎంపిక చేసి 'మరో జంఘాల శాస్త్రి'

రెండవ భాగాన్ని డిసెంబరు '1982లో అచ్చువేసింది. అది కూడా పాఠకుల ఆదరణకు, పత్రికలవారి ప్రశంసలకు పాత్రమయింది. 1984 నుంచి ఉద్యోగరీత్యా రాష్ట్రాంతరం వెళ్ళవలసి రావడం, ఉద్యోగంలో పెరిగిన బాధ్యతలు నా రచనా వ్యాసంగానికి, నా సాహితీ వ్యవసాయానికి ప్రతిబంధకాలయినాయి

అల్లసాని పెద్దన గారిని శ్రీకృష్ణదేవరాయలంతటి వారు కవిత్వం వ్రాయమంటే "నిరుపహతిస్థలంబు, రమణీయ ప్రియదూతిక తెచ్చి ఇచ్చు కప్పురవిడెము, ఊయల, మంచము....." ఇలా ఏవేవో కావాలని, అవిలేకుండా కవిత్వం ఎలా వ్రాయగలుగు తానని అన్నారట. ఈ రోజుల్లో 'కవిత్వం' వ్రాయటానికి అలాంటివేవీ అవసరం లేకపోయినా, పాఠకుల ప్రోత్సాహం మట్టుకు తప్పక కావాలి. అదున్న రోజున, కవి ఎన్ని కష్టనష్టాల కయినా ఓర్చి, తన కవితావ్యవసాయాన్ని సాగించగలుగుతాడు.

సెప్టెంబర్ 2005లో నేను ఉద్యోగవిరమణ చేసి తిరిగి హైదరాబాద్ నగరం చేరాను. మళ్ళీ 'యువభారతి'ని పునరుజ్జీవింప చేయాలనే సంకల్పంతో పాత యువభారతి మిత్రులను, శ్రేయోభిలాషులను కలియడం జరిగింది. అందులో చాలా మంది నా రచనా వ్యాసంగాన్ని కొనసాగించమనీ, నేనింతవరకు వ్రాసిన ఉపన్యాసా లన్నింటినీ ఒక పుస్తకంగా అచ్చువేయమని సలహా ఇచ్చారు. ప్రోత్సహించారు. వారందరి ఆకాంక్షల, ఆశీస్సుల ఫలమే ఇప్పుడు మీ చేతిలో నున్న 'మరో జంఘాల శాస్త్రి'.

చెప్పదలచుకొన్న విషయాన్ని సూటిగా ఘాటుగా, వ్యంగ్యంగా, హాస్యంగా చెప్పటానికి 'జంఘాలశాస్త్రి' లాంటి వ్యక్తి యొక్క అవసరం ఎంతయినా ఉందని పించింది. ఏదయినా ఒక సంఘటనను చూచినప్పుడు, ఒక వార్త చదివినప్పుడు, ఈ విషయాలపై 'జంఘాలశాస్త్రి' ఎలా ప్రతిస్పందిస్తాడు? అన్న ఆలోచన మెదడులో మెదిలేది. ఆ ప్రతిస్పందనల ఊహా చిత్రాలే ఈ జంఘాల శాస్త్రి ఉపన్యాసాలు.

కొందరు సమీక్షకులు తమ 'గ్రంధ సమీక్ష'లలో నా ఉపన్యాసాలలో 'గ్రాంధిక భాష'కు బదులుగ 'వ్యావహారిక భాష'ను వాడాలని సూచించారు. అలాగే కొందరు మిత్రులు కూడా 'వ్యవహార భాష'ను వాడమని సలహా యిచ్చారు. అయితే 'జంఘాల శాస్త్రి' యొక్క యు.ఎస్.పి. (యునిక్ సెల్లింగ్ ప్రపోజిషన్) ఆయన భాష, పద విన్యాసం, అర్థగాంభీర్యం, భావచాతుర్యం. అవిలేకపోతే 'జంఘాలశాస్త్రి' కి జీవం లేదు. పానుగంటి వారి భాషా పటిమ అద్భుతం. వారి 'సాక్షి' ఉపన్యాసాలు చదివితే ఎలాంటి వారికయినా భాష అలవోకగా వస్తుంది ఆయన భాష తీవ్రశరాఘాతాల్లాంటి వాక్యనిర్మాణంతో, సుదీర్ఘ సంస్కృత సమాసాలతో, సున్నితమయిన తెలుగు పదబంధాలతో, అంత్య ప్రాసలతో, సమపద పునరావృత్తుల అలరింపుతో కూడుకొని ఉంటుంది. నా కంతటి

భాషా పటిమ, పరిజ్ఞానము లేవు. కాని పాత్రోచితమయిన భాష ఉండాలన్న తలంపుతో, 'జంఘాలశాస్త్రి' చేత వ్యావహారిక భాషను మాట్లాడిం చడంలో గల అనౌచిత్యాన్ని గుర్తెరిగి 'సరళగ్రాంధిక భాష'ను ఎన్నుకున్నాను. పాఠకులు నన్నర్థం చేసుకొని, ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఇదివరలో ప్రచురితమయిన వ్యాసాలన్నింటినీ పూర్తిగావిని, చక్కటి సూచనలందించి, నా భాషకు మెరుగులుదిద్ది, నన్ను ప్రోత్సహించిన పెద్దలు కీర్తిశేషులు డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారికీ, కీర్తిశేషులు డా॥ జి.వి.సుబ్రహ్మణ్యం గారికి నా నమస్సుమాంజలులు.

ఈ ఉపన్యాస వ్యాస సంకలనాన్ని అచ్చొత్తించాలని నిర్ణయించి నన్ను ప్రోత్సహించిన యువభారతీయులకు, ముఖ్యంగా సంస్థ అధ్యక్షులు శ్రీ మాడభూషి అనంతాచార్యులుగారికి, కార్యదర్శి శ్రీ రెడ్డి రాఘవయ్యగారికి, సమావేశ కర్త డా॥ వంగపల్లి విశ్వనాథంగారికి నా హార్దికాభివాదములు.

నేను కోరినదే తడవుగా పుస్తకానికి 'ముందుమాట'ను అందించి ఆశీర్వదించిన పెద్దలు డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు గారికి, అభినందనలందజేసిన ఆచార్య వంగపల్లి విశ్వనాథంగారికి కృతజ్ఞతలు.

'జంఘాలశాస్త్రి' కి రూప కల్పన చేసి ముచ్చటయిన ముఖచిత్రాన్ని అందంగా తీర్చి దిద్దడమేకాక మలిముద్రణకు తమ విశ్లేషణ కూడా అందజేసిన మిత్రులు శ్రీ సుధామగారికి నా ధన్యవాదాలు.

ఈ పుస్తకానికి అక్షరాలంకరణ చేసిన అక్షర శిల్పులు 'లిటరసీ హౌస్' యాజమాన్యానికి, ముఖ్యంగా 'పుస్తక రూపశిల్పి' శ్రీ తాళ్ళపల్లి మురలీధర్ గౌడు గారికి నా ధన్యవాదాలు.

పుస్తకాన్ని అతి స్వల్పవ్యవధిలో అందంగా ముద్రించి, సకాలంలో అందచేసిన విప్లా కంప్యూటర్ సర్వీసెస్, నల్లకుంటవారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తక ప్రచురణకై నన్ను ప్రోత్సహించి, చక్కని సలహాలు, సూచనలు అందచేసిన మిత్రులు డా నాగినేని భాస్కరరావు, శ్రీ కవిరాజు, శ్రీ మలపాక పూర్ణచంద్ర రావు, శ్రీ విశ్వనాథ సూర్యానారాయణ, శ్రీ పి.వి. భుజంగరావు ప్రభృతులకు నా హార్దిక ధన్యవాదాలు.

నా రచనా వ్యాసంగాన్ని మౌనంగా ప్రోత్సహించి, నావెంట నిలిచి, ఈ ప్రచురణ తేవటానికి సహకరించిన నా సతీమణి జయలక్ష్మి, కుటుంబ సభ్యులు చి ల॥ సౌ॥ కవిత, చి॥ విష్ణుమూర్తి, చి కిరణ్ కుమార్‌లకు నా ఆశీస్సులు.

ఏవో రెండు ముక్కలు ముక్త సరిగా వ్రాసి, కృతజ్ఞతలందించి, ఋణం తీరిందని బరువు దించుకోవడం నా కిష్టం లేదు. ఆ కృతజ్ఞతాభారాన్ని ఎల్లప్పుడూ మోస్తూ 'యువభారతి' ఋణం తీర్చుకుంటానని సవినయంగా మనవి చేస్తున్నాను.

తెలుగు పాఠకలోకం నాపై చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞతల నందచేస్తూ, ఈ వ్యాసమాలను వినమ్రంగా అందచేస్తున్నాను. ఆదరించి, ఆఘ్రాణించి, ఆనందించి, ఆశీర్వదిస్తారని ఆశిస్తూ...!

నమస్సులతో

హైదరాబాదు,
విరోధి శ్రీకృష్ణ జన్మాష్టమి,
14.09.2009

భవదీయుడు
అయలసోమయాజుల నాగేశ్వరరావు


## ACKNOWLEDGEMENT

I, on my behalf and on behalf of YUVABHARATHI convey our sincere thanks to the management of **Hindustan paper corporation Limited,** and especially the Chairman and Managing director Sri Raji Philip, Director (finance) Sri M.V. Narasimha Rao, General Manager (H.R.& E.S.), Sri Cherian Thomas and Deputy General Manager (H.R. & E.S.), Sri T.K. Chakrabarthy for extending their whole hearted co-operation in bringing out of this publication. I also convey my regards to Sri D. Dasgupta, General manager (Marketing) and my wellwishers, friends and stockists of Kolkata sales depot for extending their helping hand in the publication of this book.

With warm regards
**A. Nageswara Rao**
for YUVA BHARATHI

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | జంటనగరాల సిటీ బస్సులు | 25 |
| 2. | తెలుగు చలనచిత్రములు | 28 |
| 3. | తుఫాను కవితల పోటీలు | 33 |
| 4. | కళాశాల వార్షికోపన్యాసము | 38 |
| 5 | మహిళా మహాసభ | 42 |
| 6. | కవులు - సామాజిక స్పృహ | 47 |
| 7. | గుర్రపు పందెములు | 50 |
| 8. | మద్యపాన నిషేధము | 53 |
| 9. | సినీ కవులు - విమర్శ | 56 |
| 10. | అభిమాన సంఘములు | 59 |
| 11. | కవి సమ్మేళనము | 62 |
| 12. | జంతుప్రదర్శనశాల - వింత స్వప్నము | 66 |
| 13. | రామాయణ విమర్శ | 70 |
| 14. | గాంధీ జయంతి | 73 |
| 15. | షష్టిపూర్తి సన్మానసభలు | 77 |
| 16. | స్త్రీల ఫ్యాషన్లు | 80 |
| 17. | పుట్టిన దినము పండుగ | 83 |
| 18 | స్వాతంత్ర్య దినోత్సవము | 85 |
| 19. | ఆధునిక కవిత్వము | 88 |
| 20. | తెలుగు రాజధానిలో తెలుగుతనం | 91 |

| | | |
|---|---|---|
| 21. నూతన పరీక్షా విధానము | .................... | 94 |
| 22. సంతాప సభలు | ..... ............. | 96 |
| 23. ఎన్నికలు | .................... | 99 |
| 24. విచిత్ర స్వప్నము | .................... | 102 |
| 25. చలన చిత్రములలో ముద్దులు | .................... | 106 |
| 26. సాహిత్య జీవిత రజతోత్సవ సన్మాన కార్యక్రమము.................... | | 109 |
| 27. క్రికెట్ ప్రత్యక్ష ప్రసారములు కామెంటరీలు | .... ............... | 113 |
| 28. విద్యాలయములు - డొనేషన్లు | ....... ........... | 117 |
| 29. సమ్మెలు | .................... | 119 |
| 30. ఏ.జి. ఆఫీసు ప్రసంగము | . ............ ..... | 122 |
| 31. పిచ్చాసుపత్రి - వింత స్వప్నము | .. ................ | 126 |
| 32. పర్యావరణ పరిరక్షణము | .................... | 131 |
| 33. వీధి దేవతలు | .................... | 137 |
| 34. శాసనసభ సమావేశములు | ...... ........... | 142 |
| 35. మను ధర్మశాస్త్రము | ........... ........ | 147 |
| 36. మాతృ (మృత) భాష | .................... | 152 |
| 37. ప్రభుత్వరంగ సంస్థలు | .................... | 157 |
| 38. తెలుగు టి.వి. కార్యక్రమములు | .................... | 165 |
| 39. జాతీయ విద్యా విధానము | ......... .. ....... | 172 |
| 40. జాతీయ సమైక్యత | .................... | 178 |
| 41. మరో జంఘాల శాస్త్రి'ని గురించి... | ................ .. | 185 |


❖



# జంట నగరాల సిటీ బస్సులు

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! సమావేశమునకాలస్యముగ వచ్చినందులకు క్షమింపుడు. సమావేశ సమయమునకు గంట ముందుగనే బయలు దేరినను, అరగంట ఆలస్యముగ చేరుటకు కారణము వేరేదియును లేదు– నాయనలారా! సమావేశమునకు కాలినడకన వచ్చుటకు బదులు సిటీ బస్సులో వచ్చితిని. అంతియే! ఆసేతుశీతాచలము కాలినడకనే పర్యటించిన జంఘాలునకు 'సిటీ' బస్సులలో పయనించవలసిన అవసరమేమని ఆశ్చర్యపోవుచున్నారా? విషయ సంగ్రహణార్థినై పయనించితిని. ప్రజాసేవయే కర్తవ్యముగా గల మన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారి ప్రజాసేవను కన్నులార తిలకింపగోరి పయనించితిని.

నేను బస్సు నిలువ వలసిన స్థలము వద్ద బస్సుకై వేచియుండగనే, దాదాపు ఒక అరడజను బస్సులు, ఒక దానితో నొకటి పోటీపడుచు, మా 'స్టాపు'నకు వందగజములు ముందుగనో, వెనుకగనో ఆగి, సాగిపోయినవి. ప్రక్కనున్న ఒక ఆసామీని చూచి 'బస్సు స్టాపు' అచ్చుటి కెప్పుడు మారినదని ప్రశ్నించితిని అతడు నా తెలివి తక్కువతనమునకు కాబోలు, నవ్వుకుని, ఆర్.టి.సి వారికి 'స్టేజి ఫియరు' ఎక్కువనియు, బస్సులు ఎప్పుడును 'స్టేజి'కి వంద గజములు ముందుగనో, వెనుకగనో ఆగుననియు, మనము పరిగెత్తి వానినందు కోవలయుననియు గీతోపదేశము చేసెను.

ఇంతలో మరియొక బస్సు వచ్చి 'స్టేజి'కి వందగజముల దూరముగ నిలువబడినది. నేను పిక్క బలము కొలది పరుగుతీసి, కిటికీ ఊచనొకదాని నందుకొని వ్రేలాడితిని. బస్సులోపల ఖాళీగయున్నను, 'పాదపీఠము' మాత్రము నిండుగనున్నది. 'పాదపీఠము' పై నిలువబడియున్న గిరజాల యువకుని "నాయనా! ఖాళీగానున్నది కదా! లోనికి పోరాదా?" అని అడిగితిని. అతడు తన మోచేతి పోటునొకదానిని నాకు ప్రసాదించి 'నీవే లోనికి పొమ్మని' ఉర్దూలో బదులు చెప్పెను. ఇంతే నాయనలారా! వీరు నిజజీవితమున కూడ నింతే! తమకంటె వెనుకచేరిన వారు కళాశాలలను వీడి, విశ్వవిద్యాలయముల కెగబ్రాకినను, వీరు మట్టుకు తాము చదువుచున్న కళాశాలకు మహారాజ పోషకులుగా మిగిలిపోవుదురు. తమ కంటె వెనుక ఉద్యోగములలో చేరినవారు, చకచక మెట్లెక్కి తమపై అధికారులయినను, వీరు తమ

పాత సింహాసనముల నంటిపెట్టుకొనియే ఉందురు. "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అను నానుడి వీరి కొరకు పుట్టినదే!

అంతలో వాహన నిర్వాహకుడు టిక్కెట్టు కొరకై వచ్చెను. నేనతని చేతిలో ఏబది పైసల నాణెము నొకదానినిడి, నా గమ్యస్థానమును చెప్పితిని. అతడు తిరుగ నా చేతిలో ఇరువది ఐదుపైసల నాణెమునిడి, చిరునవ్వొక దానిని చిలుకరించి పోబోయెను. అంతలో నేనతనిని 'టిక్కెట్టు' అడిగితిని. అతడు వెంటనే కోపోద్రిక్తుడై, ఎర్ర బారిన కన్నులతో నా వైపు తీక్షణముగ చూచి, తనలో ఏదియో గొణుగుకొనుచు, నా చేతిలోని ఇరువదియైదు పైసల నాణెమును తిరుగతీసుకొని, మరియొక పది పైసలిమ్మని యడిగి టిక్కెట్టును చేతిలో పెట్టి, రుసరుసలాడుచు వెడలిపోయెను క్షణము క్రితము ఇరువది ఐదు పైసలున్న టిక్కెట్టు క్షణములో అరువది పైసల కెట్లు పెరిగినదో, ఎందులకు పెరిగినదో, నా కింకను అవగతము కాలేదు.

ఆహా! ఏమి ప్రజాసేవ! ఏమి ప్రజాభిమానము! ఏమి వినయవిధేయతలు! ప్రజల ఆరోగ్యసౌభాగ్యముల యెడ ఎంత భక్తిశ్రద్ధలు! ఏమి సమయపాలనము! ఎంత నియమపాలనము!

కార్యాలయములలోనూ, ఇండ్లలోనూ మనము కూరుచుండి, కూరుచుండి, కాళ్ళు గుంట్లు పట్టుననియు, అట్టివారు పరుగెత్తుట ఆరోగ్యకరమనియు ఎరిగిన మన రాష్ట్ర రవాణా సంస్థ వారు, ప్రజారోగ్యమే తమ భాగ్యముగా తలచి, బస్సులను నిలుపవలసిన స్థలమునకు ముందుగనో, వెనుకగనో నిలువ బెట్టి, ప్రజలను పరుగెత్తించి వారి కాయురారోగ్యములు చేకూర్చుచున్నారు.

మన చిన్నతనములో మన మెప్పుడయిన బస్కెములు, దండెములు తీసితిమో, లేదోయని, బస్సుగజములను పట్టుకు వ్రేలాడచేసి, మన చేత దండెములు తీయించుచున్నారు.

ప్రజలను తొందరగ తమ గమ్యస్థానము చేర్చునుద్దేశ్యముతో "కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన" అన్న భగవద్గీత శ్లోకము నాదర్శముగ చేసికొని, ఎవరెక్కినను, మానినను గమ్యస్థానము చేరుట తమ కర్తవ్యమని తలచి, జంటనగరములలోని నగరవాహనములనన్నింటిని, బయలు దేరినది మొదలు, గమ్యస్థానము చేరువరకు ఆగకుండపోవు ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లుగ మార్చినారు. ఆహా! ఏమి ఔదార్యము! ప్రజలను గమ్యస్థానమునకు తొందరగ చేర్చవలెనని ఏమి దీక్ష! ఈ దీక్షలో ఒకటి, రెండు ప్రాణములు పోవుట వారికి లెక్కలోనిది కాదు. ఒకటి రెండు ప్రమాదములు సంభవించుట వారు గణుతింపదగినది కాదు. మార్గ మధ్యమున ఎక్కవలసిన ప్రయాణీకుల ఇబ్బందులు వారు తలంపదగినవికావు.

ప్రజాస్వామ్య దేశములో ప్రజలందరును తమ, తమ కాళ్ళపై నిలువబడవలెనని వారి ఆశయము. తదాశయసిద్ధి కనుగుణముగా వారు బస్సులలో కూర్చొనువారి సంఖ్యను తగ్గించి, నిలువబడు వారిసంఖ్యను పెంచి, వారిని గంటల కొలది నిలువ బెట్టి, వారిలో సహనమును పెంచి "భారత జాతి" అత్యంత సహనమయిన జాతియని మరొకమారు ఋజువుచేయ యత్నించుచున్నది.

వారిది మర్కట కిశోర న్యాయము. 'బస్సు' పోవుచునే యుండును. దిగవలసిన వారు దిగవలసినదే! ఎక్కవలసిన వారు ఎక్కవలసినదే! అంతియేగాని దిగవలసిన వారిని దింపుట, ఎక్కవలసినవారి నెక్కించుకొనుట వారికలవాటులేని పని. ఎక్కించు వాడును, దించువాడును అంతయూ ఆ పరమాత్ముదేననియు, తాము కేవలము నిమిత్తమాత్రుల మనియు వారి దృఢ విశ్వాసము.

అందుకదియే కాబోలు నా మిత్రుడొకడు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.కి క్రొత్త భాష్యము చెప్పినాడు. అది ఏమనగా.

ఎ – అనగా – ఆగితే

పి – అనగా – పోడు

ఎస్ – అనగా – సమయానికి

ఆర్ – అనగా – రాడు

టి – అనగా – టైముకి

సి – అనగా – చేరడు

ఇది అంతయు చూచిన నాకు అతని భాష్యము నిజమేననిపించినది.

నాయనలారా! ఇట్టి సంస్థ మరే దేశమందయిన గలదా! ఇన్ని చక్కని ఆశయములతో, ఇన్ని చక్కని ఆలోచనలతో, ఇంత అభిమానముతో ప్రజాసేవచేయు సంస్థ మరేదయిన కలదా! లేదు. ముమ్మాటికీ లేదు. ఈ కీర్తి తెలుగు జాతిది. ఈ యదృష్టము తెలుగు మాతది. ఇట్టి ప్రజాసేవాపరాయణులను గన్నభారతమాత ధన్యచరిత.

నాయనలారా! ఆలస్యముగ వచ్చినందులకు సంజాయిషీ నిచ్చుటతోనే పుణ్యకాలమంతయు గడచిపోయినది. పై వారము కాలినడకన బయలు దేరి, సకాలమునకు వచ్చి ఉపన్యాసమీయగలను. ఈసారికి క్షమింపుడు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# తెలుగు చలన చిత్రములు

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! అది నగర నడిబొడ్డు ప్రాంతము. నేల ఈనినట్లు ఆ ప్రాంతమంతయు జన సముద్రముతో నిండిపోయినది. అది ఒక సినిమాహాలు నాయనలారా! ఎండ కన్నెరుగని అసూర్యంపశ్యలు సహితము ఎండలో టిక్కెట్టు కొరకై క్యూలో నిలువబడి యున్నారు. అనేక మంది స్త్రీలు ఎడపిల్లలతో, కడుపు పిల్లలతో, చేతి పిల్లలతో ఆ ప్రాంతమంతయు నిండియున్నారు. అంతేకాక మూడు కాళ్ళ ముదుసలులు, కళాశాల నెగవేసిన విద్యార్థులు, కార్యాలయముల నెగవేసిన ఉద్యోగస్థులు బిడ్డలను వదలిన తల్లులు, తల్లి దండ్రులకు తెలియకుండ బిడ్డలు ఇట్లు ఆ చిత్ర ప్రదర్శనశాల ఆవరణమంతయు స్త్రీ, బాల, వృద్ధ, యువకులతో నిండి క్రిక్కిరిసి పోయినది. ఎన్నడు పంచదార కయిన, కిరసనాయిలు కయిన, సిటీ బస్సునకయిన క్యూలో నిలువబడని వీరు సినిమా టిక్కెట్టుకు మాత్రము క్యూలో నిలువబడి యున్నారు.

నాయనలారా! అదేదో తెలుగు సినిమాయట. అందునా – 'ఎ' సర్టిఫికేటున్న సినిమాయట. వహవ్వా! ఇక చెప్పవలసిన దేమున్నది? సువర్ణమునకు సుగంధమబ్బినట్లు, ధనికునికి వదాన్యత అబ్బినట్లు, పెసరట్టునకు ఉప్మా జతపడినట్లు, ఆవడలపై కొత్తిమీరెపుగారము దొరికినట్లు – తెలుగు సినిమాకు 'ఎ' సర్టిఫికేటు జత అయిన ఇక చెప్పవలసి దేమున్నది? క్యూలోనే కురుక్షేత్రము, కౌంటరువద్ద బొబ్బిలి యుద్ధము.

నేనును విషయ సంగ్రహణార్థమై 'క్యూలో' చేరి బాహా బాహి, కచాకచి ముష్టాముష్టి యుద్ధమొనర్చి, టిక్కెట్టు సంపాదించితిని – అంత కష్టపడి ఆ సినిమా కేల పోవలయునని అడుగుదురేమో! ముందుగనే వివరించితినికదా! విషయ సంగ్రహణార్థినై పోయితిని – తెరపై బొమ్మలను గాక, తెరముందు బొమ్మలను చూడపోయితిని.

మెల్లగ లోనికేగి ఒక స్థలమునందు నెమ్మదిగ కూర్చుంటిని. ఇంతలో చిత్ర మారంభమయింది. పేర్లు చూపుట ఆగిపోగనే ఒక పదునారేండ్ల పడుచుపిల్ల, కళాశాల కేగుచు ఒక పార్కులోనికి తన మిత్ర బృందముతో చొరబడి పాట పాడుచు పరుగులు తీసినది. స్నేహితురాండ్రు సహితము ఆమెతో గొంతు కలుపుచు పార్కంతయు పరుగెత్తిరి. కళాశాల కేగుచున్నవారు ఇట్లు 'పబ్లిక్ గార్డెన్' లో జొరబడి 'పబ్లిక్ న్యూసెన్సు'

ఒనర్చుటకు గల కారణమింతవరకును నా కవగతము కాలేదు. ఇంతలో ఓ చింపాంజి, (ఎక్కడినుండి వచ్చినదో తెలియదు) వారి రూపురేఖా విలాసములకు జడిసి కాబోలు, వారిని వెంబడించినది. చెలికత్తె లందరును పారిపోయిరి. ఆ పడుచుపిల్ల మాత్రము పారిపోక అదే సమయమునకు అచ్చటికి వచ్చిన ఓ అరువదేండ్ల పడుచువానిని గట్టిగ కౌగిలించుకొన్నది. అతడామెను గట్టిగ ఒడిసిపట్టి ఆ కోతిని తరిమివేసెను. అంతటితో ఆగిన ఎంత బాగుండును? లేదు నాయనలారా! అంతలోనే వారిరువురిమధ్య 'ప్రేమ' అంకురించినది. అది తృటి కాలములోనే మహమ్మారివలె, అంటువ్యాధివలె వ్యాపించినది. ఆ ప్రేమ పారవశ్యములో ఆ నాయికా నాయకులు వేసిన గంతులు, తీసిన పరుగులు, చేసిన చేష్టలు, చూసిన చూపులు వహవ్వా! ఏమని చెప్పను? నాయనలారా! పబ్లికు గార్డెనులో మరల ఆరు సంవత్సరముల వరకు గడ్డి పరకయిన మొలవకుండ దొర్లినారు. తన మనుమరాలి వయస్సు కల కథానాయిక వెనుక పరుగెత్తలేక, కాళ్ళ పీకుతోవచ్చిన దుఃఖమును దిగమ్రింగుకొనుచు, గుడ్ల నీరు గుక్కుకొనుచు చిరునవ్వులు చిందించిన ఆ కథా నాయకుని పాట్లు పగవానికయిన వద్దనిపించినది. ఇంతలో ఎక్కడి నుండి, ఎప్పుడు, ఎందులకు, ఎటుల వచ్చిరో తెలియదు గాని, ఓ వందమందికి పైబడి నర్తకులు, నర్తకీమణులు వన్నెవన్నెల దుస్తులతో విచ్చేసి, నాయికా నాయకుల గొంతులో గొంతు కలిపి, వారితో కలిసి నాట్యమాడి పాటముగిసినంతనే కనుమరుగైరి.

అయ్యయ్యో! నాయనలారా! మనమును ప్రేమించుకొనుచున్నామే! పెండ్లిండ్లు చేసికొనుచున్నామే! పిల్లలను కనుచున్నామే! మన మెన్నడయిన ఇట్లు ప్రవర్తించితిమా? ఇట్లు పార్కులంటబడి దొర్లితిమా! ఇట్లు కాళ్ళు పీకునట్లు పరుగులు తీసితిమా! మనకెవ్వరికి లేని పోయేకాలము ఈ కథా నాయకునకెందుకు? అయ్యయ్యో! బురదలో పందియైన ఇట్లు పొర్లదే? బూడిదలో గాడిదయైన ఇట్లు దొర్లదే? మరి మన నాయికా నాయకుల ఈ ప్రణయ జ్వరమునకు,ఈ పైశాచిక ప్రేమకు గల కారణమేమయి యండునా యని నాలో నేననుకొనుచుండగనే రంగము మారినది.

అది కథానాయిక ఇల్లు. కథానాయిక తల్లి కుమార్తెతో ఈ పెళ్ళి జరుగుటకు వీలులేదనియు, తానీ వివాహమున కెంతమాత్రము అంగీకరించుననియు కోపముతో గదిమి, కథానాయిక నొకగదిలో పెట్టి గడియవేసెను. అప్పటి వరకు బాగుగనేయున్న కథానాయిక ఒక్కసారిగ విరహిణి అయిపోయినది. ఆ విరహములో ఆమె చేసిన చేష్టలు చూడవలసినదే కాని వర్ణింపనలవి కాదు. అట్లు విరహోత్కంఠిత అయి, వర్షాకాల మేఘమువలె ముంచుకొచ్చిన గ్లిసరినోద్భూత అశ్రువుల్ని రాలుస్తూ, అంత ఏడుపులోనూ

లయ తప్పకుండా విరహగీతాన్ని పాడినదా ప్రణయ వల్లరి. ఇటు ఈమె పట్టు పానుపుమీద, అటు అతడు పచ్చిక పానుపుమీద కార్చిన కన్నీరు ప్రేక్షకులను ఆనంద సాగరములో ముంచెత్తినది.

తరువాత 'కథ'తో సంబంధములేని ఒక హాస్య జంట హాస్యము పేర కొన్ని పెడర్థములు వచ్చు మాటలను వాగి రంగమునుండి నిష్క్రమించినది. వారు ఎందుకు ప్రవేశించిరో వారికే తెలియనపుడు మనకెట్లు తెలియును?

తరువాత రంగము ప్రతినాయకుడు నైట్ క్లబ్బులో-

అంతవరకూ ఆ సీసుకోసమే ఎదురుచూచుచున్న వారివలె ప్రేక్షకు లంతట ఒకమారు వొళ్ళు విరుచుకొని తమ తమ కుర్చీలలో సర్దుకుని కూర్చొనిరి. ఇంతలో రంగము మీదికి ఓ నాట్యకత్తె ప్రవేశించినది. శివశివా! ఏమని చెప్పను నాయనలారా! ఆమె మొలకు జానెడు గుడ్డ మాత్రమే యున్నది. పైన చనుకట్టున్నది. అంతే! మిగిలిన శరీరము మీద చంద్రుని కిచ్చుటకయిన ఒక నూలు పోగులేదు - ఆమె "పుట్టినప్పుడు బట్ట కట్టలేదు- పోయేటప్పుడు మరి వెంటరాదు - నడుమ బట్ట ఎందు" కంటూ, ఒళ్ళంతా విరచుకొని, జుట్టు విరబోసుకొని, కల్లు తాగిన కోతివలె, చెరకు తిన్న ఎలుగు బంటివలె, మహంకాళి జాతరలో పోలేరమ్మవలె, తోకతీసిన పేక జువ్వవలె, ఎగిరి, గెంతి గెంతి, నాట్యము చేసినది. హాలులోని జనము సంగతి వర్ణింప నా తరమా! సిగరెట్టు నోటిలో పెట్టి వెలిగించుకోవలెనని మరిచిపోయి కొందరట్లే చూచుచున్నారు. చేతిలో సగము త్రాగిన శీతల పానీయమును అట్లే ఉంచి కొందరు నోరుతెరచి చూచుచున్నారు. వృద్ధులు కండ్లజోడు సవరించుకొని మరీ చూచుచున్నారు. వితంతువులు ముసుగులు సవరించుకొనుచు చూచుచున్నారు. కొందరు యువకులు వెర్రి చూపులు చూచుచున్నారు. కొందరు తల్లులు తమ పిల్లలకు పాలు కుడుపుట ఆపి మరీ చూచుచున్నారు. "దీని మొగము మండ - చూచునదేమున్నదని" కొందరు క్రీగంట చూచుచున్నారు. నా ప్రక్కన ఉన్న ఓ బట్ట తలాయన ఇంకను ముందుకు వంగినచో బాగుగ కనుపడునని ఎంచి కాబోలు తలను ముందుకు వంచగా ఎదురుగా నున్న కుర్చీ అతని తలకు తగిలి తల చిట్లినది. అతడు అంత మంచి తరుణములో హాలు విడచుటకిష్టములేకున్నను చిందుచున్న రక్తము నాపుటకై, కార్యము గదివీడి వెళ్ళిన గర్భాదానపు పెండ్లి కొడుకువలె బాధపడుచు బయటకు పోయెను.

తరువాతి రంగమున కథా నాయిక రహస్య సంకేత స్థలమునకు చేరినది. కాని అంతకు ముందే ఆమె పై కన్నువేసిన ప్రతి నాయకుడు, "తాతగారు పోయినారను"

దొంగ టెలిగ్రాము సృష్టించి, కథానాయకుని తాతగారింటికి పంపివైచి, రహస్య సంకేతస్థలమునకు తాను చేరెను – కథానాయకి ఇతని తృణీకరించుటయు, ఇతడామెను బలాత్కరించు టయు కూడా త్రుటిలో జరిగిపోయినది.

''రేపు సీనన్న ఇట్లుండవలె''నని ఒక బలాత్కార రంగ ప్రవీణుడు ప్రశంసించినాడు.

"వీని మొగము మండ – 'ఏ' సర్టిఫికేటని ఎద్వర్టయిజుచేసి కనీసము రెండు నిముషములయిన 'రేపు సీను' చూపలే"దని ఒక ప్రేక్షక మహాశయుడు అసంతృప్తిని వెలిబుచ్చినాడు.

"వహవ్వ! వారిరువురు ఆ సీనులో నటించలేదు, నిజముగ జీవించిరి" అని మరో సినీరంగ ప్రఖ్యాత వ్యాఖ్యాత, వ్యాఖ్యానించెను.

అయ్యయ్యో! మానభంగమును చూచి ప్రేక్షకుడు కుమిలి పోవలయునే! జాలిపడవలయునే! అవమానముతో, సిగ్గుతో తలదించుకొనవలయునే! అంతియే కాని, మరల మరల చూడాలనిపించునట్లు చిత్రీకరించుటలా? అంగాంగ ప్రదర్శనములా? 'ఎ' సర్టిఫికేటులా! ఉత్తమమయిన రేపు సీను చిత్రీకరించి నందులకు అవార్డులా! వహవ్వా! తెలుగు సినీ చిత్ర దర్శకా! నీకివే నా జోహార్లు!

తరువాతిది కోర్టుసీను. ప్రాసిక్యూషన్ తరపు న్యాయవ్యాది తనవాదనను బలపరచుటకు గాను "ఫ్లాష్ బ్యాక్"లో ఓ "రేపు సీను" ను చూపించినాడు. డిఫెన్సు న్యాయవాది కూడ తక్కువ తినలేదు. అతనుకూడ జనరంజకముగా 'ఫ్లాష్‌బ్యాక్'లో మరొక 'రేప్‌సీన్'ను చూపించినాడు.

ఇట్లు వాది ప్రతివాదులిద్దరు కూడ రెండు "రేప్‌సీన్లు"ను కోర్టు వారికి వినిపించి, ప్రేక్షకులకు "ఫ్లాష్ బ్యాక్"లో చూపించి, వాద ప్రతివాదములను ముగించి కూర్చుండిరి. అంతట న్యాయమూర్తి లేచి నిలువబడెను. ఇతడు కూడా తన తీర్పును ఫ్లాష్ బ్యాక్‌లో మరో "రేప్‌సీను"తో చెప్పును గాబోలునని భయపడితిని కాని, అతడు మాత్రమట్లు చేయక, ప్రతినాయకునికి శిక్ష విధించి నాకు కొంత ఊరట కలిగించెను. తరువాత నాయకీ నాయకులు వివాహము జరిగినది. సినిమా మధ్యలో పరమపదించిన కథానాయిక తల్లి కూడ వివాహమునకు హాజరయి ప్రేక్షకుల కానందము చేకూర్చినది. ఇంతటితో సినిమా ముగిసినది.

నాయనలారా! చలనచిత్రములను తీయుటలో ఇంతటి అనుభవము, ఇంతటి నైపుణ్యము, ఇంత మంది కళాకారులు, ఇంత మంది నటీనటులు, సాంకేతిక

నిపుణులు, ఇన్ని రకముల పరికరములు, ఇంతటి సాంకేతిక పరిజ్ఞానము, ఇంతటి సాధన సంపత్తి, ఇంత ప్రోత్సాహము లేని రోజులలో తీసిన పాత చిత్రముల నెన్నడయిన చూచితిరా? నాయనలారా! అది ఒక్కొక్కటి ఒక్కొక్క కళాఖండము. చక్కని సన్నివేశములతో, వీనుల విందగు సంగీతముతో ఆనాటి చిత్రములు ప్రేక్షకలోకము నీ నాడు కూడ అలరించుచున్నవి కదా!

మరిప్పుడు పెరిగిన సాంకేతిక విజ్ఞానముతో, అనుభవముతో, నైపుణ్యముతో మనము తీయుచున్న చిత్రములెట్లున్నవి? "సెక్సు", "క్రైమ్"ల వలలో చేపలవలె గిలగిలాడుచున్నవి. గుడుగుడు గుంజములాడుచున్నవి. వహ్వా! కారులా! షికారులా! ప్రేమలా! పెండ్లిండ్లా! కేబరేలా! క్లబ్బుడాన్సులా! విరహములా! వేదనములా! మధుపానములా! అధర పానములా! పార్కులా! పర్వత శిఖరములా! ముద్దులాటలా! గుద్దులాటలా! 'ఎ' సర్టిఫికేట్లా! అంగాంగ ప్రదర్శనములా! మీ కింత కంటె మంచి కథా వస్తువేదియు దొరకలేదా! అయ్యయ్యో! మనస్సున్న మార్గముండదా నాయనలారా! మన దేశములో కథలకు కరువా? ఏ వ్యక్తి జీవితము తీసుకున్ననూ కథేకదా!

ఎండనక, వాననక, రేయనక, పగలనక, రెక్కలు ముక్కలు చేసికొని తాము పస్తుండి దేశమున కన్నము పెట్టుచున్న రైతుబిడ్డలెందరు లేరు?

రోజంతయూ శ్రమించిననూ అర్ధాకలితో అలమటించు కూలీ లెందరు లేరు?

అంగ వైకల్యముతో బాధపడుచూ జీవన పోరాటమును సాగించు బిచ్చగాళ్ళెందరు లేరు?

పొట్టకోసము మానాన్ని అమ్ముకుని, రాత్రివేళకి మోముమీదికి ముసి ముసి నవ్వులు తెచ్చి పెట్టుకుని అర్ధాకలితో జీవిస్తున్న అభాగిను లెందరులేరు?

సమాజపు కట్టుబాట్లకు బలయి, మనసొకనిమీద మనువు మరొకరితో గడిపే అభాగ్యులెంతమంది లేరు!

ఇవన్నియు కథా వస్తువులు కావా!

నాయనలారా! ఇప్పటికయినను ఈ "ఫార్ములా" చిత్రాలను తీసి, దేశాన్ని, దేశానికి వెన్నెముకవంటి యువతరాన్ని పాడుచేయకుడు – వారి బలహీనతను రెచ్చగొట్టి డబ్బు గుంజకుడు. వారిని పెడత్రోవ బట్టించకుడు. దేశ భక్తి, ప్రజాసేవ, నిస్వార్థత, సత్ప్రవర్తనము వంటి వాటిని ప్రభోధించు ఉత్తమ చిత్రాలను తీయుడు. మీకు మీరు పేరు తెచ్చికొనుడు, దేశానికి తెలుగు జాతికి పేరు తెండు –సెలవ్.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

*మరో జంఘాలశాస్త్రి*

*అయలసోమయాజుల నాగేశ్వరరావు*



# తుఫాను కవితల పోటీలు

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! నగరములో ఏదో ఒక సాహిత్య సంస్థ, సభ నేర్పాటు చేసినదని తెలిసి అక్కడికి పోయితిని. సమావేశ మారుగంటల కారంభమగునని వార్తా పత్రికలలో చదివి ఐదు నిమిషములు ముందుగనే సభాభవనమును చేరితిని. కాని ఆశ్చర్యము, నాయనలారా! సభాస్థలి అంతయు నిర్జనముగా నున్నది. ఎత్తుగానున్న వేదికపయి మాత్రము ఇద్దరు వ్యక్తులు కూర్చొని ఏదియో చర్చించుకొనుచున్నారు. కార్యక్రమము రద్దయినదేమో నని యోచించుకొనుచు నెమ్మదిగ వారిని సమీపించి సమావేశము గూర్చి విచారించితిని.

వారు వెంటనే దిగ్గునలేచి పసిపిల్లవాడు తల్లిని కనినంత ఆత్రముతో, జవరాలు ప్రియునికన్న అభిమానముతో, సమావేశమున్నదనియు, ముఖ్యమయిన వక్తలింకనూ రానందున వేచియున్నారమనియు తెల్పి, ప్రధమ శ్రోతనయిన నన్ను ఎట్లు గౌరవించవలెనో తెలియక తబ్బిబ్బుపడిరి.

ఇంతలో మరికొంతమంది యువకార్యకర్తలు రంగములో ప్రవేశించి సమావేశ స్థలమంతటను పరవబడిన కుర్చీలు బడబడలాడించుచు పేర్చుట ఆరంభించిరి.

"పూల దండల నార్డరిచ్చిన రాస్కెలు ఎవడురా? శవముపై వేయుట కర్హముగా నున్నవి" అని ఓ కార్యకర్త గావుకేక వేసినాడు.

"ప్రార్ధన" నాకీయని యెడల నా సహకార్యదర్శి పదవికి రాజీనామా నిత్తునని మరొకడు బెదిరించుచున్నాడు.

సమావేశ సమయము మించినను, కార్యదర్శి యేల రాలేదని మరొకడు ప్రక్కవానితో గొణుగుచున్నాడు.

సభాధ్యక్షుని మెడలో పూలదండను నేనలంకరింతునన్న, నేనలంకరింతునని ఇరువురు సభ్యులు కోడిపుంజులవలె దెబ్బలాడుటకు సిద్ధమగుచుండిరి. వేరొకడు వారిని విడిపించి దూరముగ తీసుకొనిపోయెను.

"నేను దండ వేయునపుడు ఫోటో తీయించవలె"నని ఒకడు మరో కార్యకర్తను నిర్దేశించుచున్నాడు.

ఈసారి "సావనీరు"లో నా ఫోటో లేకున్న, మీకార్యవర్గముపై అవిశ్వాస తీర్మానము తప్పదని మరొకడు అదిరించుచున్నాడు.

స్త్రీల ద్వారము వద్ద నేనుండెదనంటే నేనుండెదనని ఇరువురు స్త్రీ సేవా పరాయణులు దెబ్బలాడుకొనిరి. ఒకని చొక్కా చిరిగినది. ఒకని చొక్కా బొత్తములూడి క్రింద పడినవి. ఇంతలో ఆ సంస్థ కార్యదర్శి కాబోలు అచ్చుటికి వచ్చి, వారిరువురిని కాదని వేరొకరిని అచ్చట ఉంచి వారిరువురిని లోనికి పొమ్మని పంపివేసెను.

అప్పటివరకు మైకు సెట్టును సర్దిన విద్యుద్విద్వాంసుడు "మాయదారిచిన్నోడు" అను రికార్డును పెట్టి సంగీత పారవశ్యములో మునిగితేలుచున్నాడు.

వడ్రంగి కాబోలు - వేదికపై కవసరమగు కుర్చీ కాలి నొకదానిని అతుకుచు డక్కుడక్కు మనిపించుచున్నాడు.

ఆ ముద్రాపకుడు ఆవిష్కరణ సమయమునకు పుస్తకమిచ్చునట్లు లేదని ఒక కార్యకర్త వేరొకనితో పలుకుచున్నాడు.

ఇట్లు సమావేశ ఆరంభ సమయమునకు సాహిత్య సభారంగమంతయు కురుక్షేత్ర రణరంగము వలె శోభిల్లుచున్నది.

దాదాపు ఒక గంట ఆలస్యముగా సభ ఆరంభమయినది, అపుడా సంస్థ అధ్యక్షుడు లేచి నిలువబడి, గొంతును, కళ్ళజోడును, ఎదురుగా నున్న మైకును, తన భుజముపైనున్న ఉత్తరీయమును, అలవాటులేక ధరించిన పంచను, సవరించుకొనుచు ఇట్లు ప్రసంగించెను-

"సోదర సోదరీమణులారా! ఈ నాడెంతో సుదినము. మా సంస్థ వార్షికోత్సవ సందర్భముగా గత నవంబరులో ఆంధ్ర ప్రాంతమునందు వచ్చిన 'తుఫాను' గూర్చి కవితల పోటీలని నిర్వహించినామని తెలియజేయుటకు చాలా సంతోషించుచున్నాము. దేశములో వివిధ ప్రాంతములనుండి అనేక మంది యువకవులు ఈ పోటీలో పాల్గొన్నారు. అయితే అందులో నుండి ఉత్తమముగా ఎన్నికయిన కొన్ని కవితలను మాత్రమే మేము పుస్తక రూపముగా వెలువరించగలిగినాము- ఉత్తమముగా ఎన్నికయిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి గ్రహీతలకు నగదు బహుమానములనుకూడ అందజేయుట జరిగినది. ఇపుడు ఇందులో ప్రచురితమయిన తమ తమ రచనలను ఆయా యువకవులు చదివి వినిపించెదరు. విని ఆనందించండి. వారిని ప్రోత్సహించండి..." అని కూర్చొనెను.

అటు తరువాత ఒకరి తరువాత ఒకరు ఆ యువకవులు తమ చేతికందించిన పుష్పగుచ్ఛముల నాఘ్రాణించుచు విలాసముగా తుఫాను గురించి తామూహించిన దానిని అంత్యప్రాసలు తప్పకుండ విరిచి చదివి, చదివినదే మరో మారు చదివి చప్పట్లు కొట్టించుకొనిరి. సెబాష్ అనిపించుకొనిరి. ఆ సభలో శ్రోతలకంటే కవులే ఎక్కువగా ఉన్నారని వేరే చెప్పనవసరము లేదుకదా!

అటు తర్వాత పై అట్టతో, మధ్య తెల్లకాగితములతో, ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పుంగవుడు ఆ కవితా సంకలనము నావిష్కరించి ఇట్లు ప్రసంగించెను.

"సోదర సోదరీమణులారా! నాకు సాహిత్యరంగములో ఎక్కువ ప్రవేశము లేకున్నను, ఈ గ్రంధావిష్కరణమునకు కార్యకర్తలు నన్నే ఎన్నుకొన్నందులకు వారికి నా కృతజ్ఞతలు. ఈ సాహిత్య సంస్థ చాల మంచిపని చేయుచున్నది. యువ కవులకు ప్రోత్సాహ మిచ్చుచున్నది. ఇటువంటి కవితా సంకలనాలు వెలువడుట నిజముగా దేశానికి అదృష్టం.ఇటువంటి సంస్థలను, రచయితలను, రచయితల సహకార సంఘములను ప్రోత్సహించుటకు మా ప్రభుత్వము ఎల్లప్పుడును ముందంజలో నున్నది. ఇట్టి సంఘములకు, సంస్థలకు మా ప్రభుత్వము కేవలము పావులా వడ్డీకే ఋణములిచ్చు సదుపాయము కలుగజేయనున్నదని ప్రకటించుటకు నేనెంతయు ఆనందించు చున్నాను. అంతియే కాక, రాష్ట్రములో గల వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థలు, జిల్లా రచయితల సంఘములు, సహకార రచయితల సంఘములు మున్నగు వాటి కార్యక్రమములను సమన్వయ పరచి, దిశా నిర్దేశముచేసి, ఆర్థిక సహాయము నందచేయుటకు, అభివృద్ధి పరచుటకు, రాష్ట్రస్థాయిలో ఒక 'కార్పొరేషను'ను నెలకొల్ప వలెనను యోచనలో కూడా నున్నది. ఇది మీకెంతయిన మేలు కలుగ చేయును. ఇటువంటి కవితా సంకలనాలను ఇకపై కూడా ఇతోధికంగా ప్రచురించి ఈ సంస్థ మరింతమంది యువకవులను ప్రోత్సహించాలని ఆశిస్తూ ముగిస్తున్నాము. సెలవ్" అని కూర్చుండెను.

అంత నేను లేచి, అధ్యక్షులవారనుమతించిన నాలుగు ముక్కలు మనవి చేసికొందునని పలికితిని - సభాధ్యక్షుడు అనుమతించవలెనా వద్దా అని తటపటాయించు చుండగనే వెనుకనుండి కొందరు శ్రోతలు "జంఘాలశాస్త్రి ప్రసంగించవలె" నని కేకలువేసిరి. సభాధ్యక్షుని అనుమతితో నేనిట్లు ప్రసంగించితిని:

హరహర! మహాదేవ! శంభోశంకర! - శాంతం - పాపం- శాంతం - పాపం - నాయనలారా! ఇదేమి విపరీతము! తుఫానుపై కవితల పోటీలా? అందులో ఉత్తమ

కవితలకు బహుమానములా! అయ్యయ్యో ! నాయనలారా! వివాహము వంటి శుభకార్యములలో పంచరత్నములు చదువుట వింటిని. ఉగాది, దీపావళి, దసరా వంటి పండుగలకు కవి సమ్మేళనము నిర్వహించుట, కవితా పోటీలనో, కథలపోటీలనో నిర్వహించుట ఎరుగుదును. కాని ఇదేమి? ఉప్పెనపై కవితల పోటీలా! వహవ్వ! తద్దినమునాడు తేటగీతాలాపములా! అంతిమ ఘడియలలో ఆటవెలదులా! నాయనలారా! ఇంతకంటె మీకు నిర్వహించుటకు వేరే కార్యక్రమముదొరకలేదా? లేనిచో పోనిండు. కార్యక్రమములు చేయలేదని ఎవడేడ్చుచున్నాడు! అయ్యయ్యో! అశ్రుతర్పణము చేయవలసిన సమయమే! ఆదుకోవలసిన సమయమే! కాని ఆశు కవిత్వమునకు సమయమా నాయనలారా? అర్ధరాత్రి జరిగిన బీభత్సములో దిక్కుతోచక, దారి తెన్ను తెలియక, తల్లనక, పిల్లనక, అన్నయనక, తమ్ముడనక, భర్తయనక, భార్యయనక, ఎవరికి వారు భయవిహ్వలులై, చెదరిపోయి, భీకరము, అనూహ్యము, అద్వితీయము అయిన ఉప్పెనలో చిక్కుకొని, ప్రాణములు వదలిన వేలాది సోదర సోదరీమణులకు ఇదా మనము ఘటించవలసిన శ్రద్ధాంజలి?

వారి ఆత్మశాంతికి ఒక్క కన్నీటి బొట్టు విడువరాదా! వారి ఆత్మలకు శాంతి చేకూరునే! అంతియేకాని, ఈ కవితా సంకలన మెందులకు? అయ్యయ్యో! ఎంత దండుగమారి పని చేసితిరి? ఈ పుస్తకము అచ్చువేయుటకగు ఖర్చు, బహుమతుల నందజేయుటకగు ఖర్చును ఉప్పెనలో సమస్తము కోల్పోయి, బికారులవలె, జీవచ్ఛవములవలె ఇంకను బ్రతికియున్న వరదబాధితులకు సహాయముగ అందజేయుట మంచిది కదా! ఈ కవిత్వము నతడేమి చేసుకొనును? కడుపు నిండునా? కాలు నిండునా? కనీస పక్షము ఆనందమును కూడ ఈయజాలకున్నది కదా!

కనీసము పది శవములు దహనము చేయుట కవసరమగు వంట చెరకునయిన అందచేసినచో పుణ్యము మాట ఎటులున్నను, అనాథ ప్రేత సంస్కార ఫలమయిన దక్కెడిది కదా!

ఏమియు చేయకుండ నోరు మూసికొనియున్నను సంతోషమే కాని ఇట్లు కవితల పోటీలు నిర్వహించి పుస్తకముల నచ్చొత్తించినందువలన ప్రయోజనమేమి? దేశమునకు కాగితపు కరువు, పఠితలకు తలబరువు.

యువకవులారా! మీకు చెప్పవలసినది కొంత యున్నది - నాయనలారా! క్రౌంచమిథున వియోగముతో వాల్మీకి హృదయమున జాలువారిన జాలియే మహా కావ్యరూపము ధరించినది కదా! కవి సంఘటనను చూచి చలించవలెను - హృదయము

కరుగవలెను - కవిత్వము జాలు వారవలెను. అంతియే కాని, సముద్రమట్టమునకు పదిహేనువందల అడుగుల ఎత్తున కూర్చుండి, రాత్రి సుష్టుగా భోజనము చేసి, ఎటుల వ్రాసిన బహుమతి లభించునాయని ఆలోచించుచు, యతిప్రాసలకై వెదుకుకొనుచు, అంత్య ప్రాసలకై ఆరాటపడుచు, ఎన్నడు చూడని సముద్రమును గూర్చియు, వినని ఉప్పెనను గూర్చియు, కనని బీభత్సమును గూర్చియు కవితలల్లుటా? వారి ధన, మాన, ప్రాణముల కంటె మీ బహుమానము పోవునను బాధయే మీకెక్కువ కదా! అట్టి మీ కవిత్వమెటులుండును? అదియునుకాక నాయనలారా! కొంపలు కాలుచున్నప్పుడు "కాలుచున్నకొంపలను కాలుచున్నట్లే వర్ణింతు"నన్న కవిని కాలుచేతులు కట్టి ఆ మంటలలో పడవేయుదువా? లేక సమ్మానింతువా?

అయ్యయ్యో? ఈ కవిత్వము వ్రాయుటకు పడిన శ్రమలో వెయ్యవవంతయిన, దివిసీమలోని శవ దహనమునకో, కూలిన ఇళ్ళను పునర్నిర్మించుటకో, కష్టములలో ఉన్న వారి కన్నీళ్ళను తుడుచుటకో ఉపయోగించిన బాగుండెడిదికదా! దేశసేవ చేసినవారగుదురు. దేశ ప్రజలు సంతోషించెదరు. భారతమాత సంతోషించును.

నాయనలారా! ఇప్పటికయినను మించిపోయినది లేదు. ఈ కవితా సంకలనము నమ్మగా వచ్చిన సొమ్మును వరద బాధితులకు విరాళముగా నిండు. ఎవరూ కొనరని నమ్మకమున్న యెడల అనాథ శవములపై వేసి నిప్పుపెట్టుడు. బంగారమునకు కాల్పుతో వన్నె వచ్చినట్లు ఈ దహన సంస్కారముతో మీ కవిత్వమునకు, ఈ సాహిత్య సంస్థకు మెరుగువచ్చును. ఇటులంటినని బాధపడకుడు. ఇప్పటికే చాల చెప్పితిని. సెలవ్-

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**



# కళాశాల వార్షికోపన్యాసము

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! కొద్దిరోజుల క్రిందట నన్నొక కళాశాల వార్షికోత్సవమున కాహ్వానించి ఏదయిన విషయమును గూర్చి ప్రసంగించవలసినదిగా కోరిరి. అప్పుడు నేనిట్లు ప్రసంగించితిని.

నాయనలారా! మీ కళాశాల వార్షికోత్సవమునకు నన్నాహ్వానించినందులకు సంతోషము. మీరు ఏదయిన విషయమును గూర్చి ప్రసంగించుమని నన్ను కోరియున్నారు గదా! మీ గురించియే ప్రసంగించెదను. నాయనలారా! మీరేమి సామాన్యులా! భావి భారత పౌరులు. భవిష్యన్నేతలు. దేశ భవిష్యద్విధాతలు. దేశమునకు వెన్నెముక వంటివారు. ఆహా! ఏమి వినయవిధేయతలు! ఏమి ఋజువర్తనము! ఏమి దేశభక్తి! ఏమి త్యాగనిరతి! ఏమి విద్యాభిమానము! గురువుల యెడల ఏమి గౌరవము! తలిదండ్రుల యెడ ఏమి భక్తి శ్రద్ధలు! మీరు కాలిడినచోట మేము తలనిడుటకు కూడ తగము కదా!

ముందు మీ వేషధారణమును గూర్చి రవంత చెప్పెదను. నాయనలారా! అదేమి? మీ తలలపై గొర్రెబొచ్చంత జుట్టులేమి? గాలి అయిన చొరకుండ చెవులపై నుండి ఆ చెంపలేమి? ఆ 'చింపాంజీ' వేషములేమి? ఆ కొండముచ్చు రూపములేమి? నాయనలారా! మీరందరును విద్యార్థులు కదా! మీ ఉపాధ్యాయులు చెప్పు పాఠములను శ్రద్ధతో ఆలకించవలసినవారు కదా! మరి గాలి అయిన చొరకుండ చెవులపై ఆ చెంపలేమి? మీ గురువులు చెప్పినది మీ కెట్లు వినబడును? గురువులు చెప్పిన దానిని పెడచెవిని పెట్టుట ధర్మమా!

అదేమి నాయనలారా! మీలో చాలామంది చెవులకు శబ్దగ్రహణ యంత్రములను ధరించి శివమెత్తినట్లూగుచున్నారేమి? ఇంత పిన్న వయసులోనే బధిరత్వముతో పాటు మూర్ఛరోగము కూడా ప్రాప్తించినదా? (బధిరత్వము కాదు, సెల్ ఫోన్ హియరింగ్ బడ్స్ పెట్టుకుని ఎఫ్.ఎం. రేడియో వినుచున్నారని వెనక వరుస నుండి కేక.) నాయనలారా! విద్యార్థులయిన మీరు ఇట్లు గురువులు చెప్పు పాఠములను

పెడచెవిన బెట్టి, ఈ ఎఫ్.ఎం. రేడియో పాటలకు చెవి యొగ్గుచున్నారా! ఇదేమి అన్యాయము?

మీలో కొంతమంది విద్యార్థినులు కూడ నున్నట్లున్నారు. తల్లీ! ఇరుకు పంట్లములతో, పొట్టి చొక్కాలతో, బొత్తాములకోటులతో, నడుముకు నాలుగు వేళ్ళ వెడల్పు పటకాలతో, కత్తిరింపుజుట్టులతో, ఎత్తు మడమల పాదరక్షలతో, టిప్పు టాపు నడకలతో, మొండి చేతులతో, బోసిమెడలతో, తిలకము లేని అలికములతో, అచ్ఛాదనలేని ఎదలతో, మీరు ఆంధ్రజాతి వనితలేనా? అయ్యో! విదేశీ వస్త్ర వ్యామోహము మిమ్ములను తెలుగుజాతికెంత దూరముగ ఈడ్చివైచినది.

అదేమి? మీ కేశములు తైలసంస్కార విహీనములై చీకిన తాటి పండ్లవలె, ఈత రుప్పలవలె కనబడుచున్నవి. శబాష్! తలకు నూనె రాసుకొనుట అనాగరికమని మానివేసినారా! మనము చదువునప్పుడు మన మెదడు వేడెక్కును కదా! దానిని చల్లార్చుటకు ప్రతి నిత్యము శీతోదక స్నానము, తైలసంస్కారము చేయనక్కరలేదా! మీరందరును విజ్ఞాన శాస్త్రమును అంతో, ఇంతో చదువుకొన్న వారేకదా! ఇట్లు ఫ్యాషన్లకు పోయి తలను గచ్చపొదను చేసికొందురా! మెదడును పాడుచేసి కొందురా! విజ్ఞులయినవారు చేయవలసిన పనియేనా యిది.

అయ్యో! ఏమి? మీ పంట్లములు అట్లు రంగు వెలసి వెలవెలపోవుచున్నవి. మధ్యలో అక్కడక్కడ ముక్కలు అతుకులు వేసి యున్నవి. మీ తల్లిదండ్రులు మీకు కొత్త బట్టలను కొనుటలేదా? (కాదు కాదు. ఇప్పుడిదియే ఫేషన్ అని వెనుక నుండి ఒక విద్యార్థి అరుపు) ఆహా! ఏమి? వెలసిన గుడ్డలు, అతుకుల బొంతలు కట్టుకొనుట ఫ్యాషనా నాయనలారా! అటులయిన మీకంటె ఆ రోడ్డు మీది బిచ్చగాడు అందగాడు కదా!

ఇక మీ కేశసంపదను సంరక్షించుకొనుటకు మీరు పడు పాట్లు పగవానికయిన వద్దనిపించును కదా! ముళ్ళకుంచెలచే పీకించుకొనుచున్నారు. విద్యుత్ బ్లోయర్లచే ఊదించుకొనుచున్నారు. గుడ్లనీరు గ్రుక్కుకొనుచు, ఎప్పుడు లేచి పోవుదుమా అని ముళ్ళమీద కూర్చున్న వారివలె కూర్చొనుచున్నారు. ఇంత చేసినను జుట్టు సరిగా ఉంగరములు తిరుగలేదని మీ సణుగుడులు, చేతులనొప్పిచే వారి గొణుగుడులు మామూలే కదా!

అదేమి నాయనలారా! మీలో కొందరి మూతులపై మీసములు క్రిందకు దిగి, సాగర సంగమమువలె గడ్డములో కలిసిపోయినవి. ఈ దిగ బెరుగుడు మీసములు,

అరగొరుగుడు గడ్డములు కూడ ఫ్యాషనేనా? వహ్వా? కార్గో పంట్లములా! మెడలో పట్టు పలుపులా! నడుమునకు నాలుగు వ్రేళ్ళ వెడల్పు పటకాలా! ఎత్తు మడమల బూట్సులా! నెత్తిపై గొంగళి దొంతరంత జుట్టా! చేతిలో సిగరెట్టా! ఈ వేషములలో మీరు దొరల మయితిమని భ్రమించుచున్నారు గాబోలు. కాని మీ కటు విదేశీ రూపు రాక, ఇటు స్వదేశీరూపు పోయి, రెంటికి చెడ్డ రేవడులగుచున్నారు జాగ్రత్త.

ఇక మీ చదువులను గూర్చి రవంత చెప్పెదను. నాయనలారా! మేము చదువుకున్న రోజులలో ఇన్ని కళాశాల లెక్కడివి? ఇన్ని పాఠశాల లెక్కడివి? పాఠశాలకు పోయి వచ్చుటకు రోజుకు పది, పన్నెండు మైళ్ళు నడువవలసి వచ్చెడిది. విద్యుద్దీపములు లేవు. గ్రంధాలయములు లేవు. 'బుక్‌బ్యాంకులు' లేవు. 'స్కాలర్‌షిప్' లు లేవు. 'స్టయిఫండ్సు' లేవు. కళాశాలలకు సరయిన భవనములు లేవు. కూర్చుండుటకు సరియయిన బెంచీలు లేవు. చదువుకొమ్మని సలహా యిచ్చువాడు లేడు. చదువు చెప్పువాడు లేడు. కాని ఆనాడు వీధి దీపముల వద్ద చదువుకొని, పైకి వచ్చిన మేధావులనేకులున్నారు. కాని నేడో! వీధికొక కళాశాల వెలసినది. సందుకొక పాఠశాల వెలసినది. అయిననేమి లాభము? రాశియే పెరిగినదిగాని వాసి పెరుగలేదు. అక్కడ మీ తల్లిదండ్రులు పస్తులుండి, పుస్తె, పూస, పొలము, పుట్ర – అమ్మి, "మా బాబు చదువుకొని వృద్ధిలోనికి వచ్చును. మాకింత కూడు పెట్టును" అని డబ్బులు పంపుచుండ, మీరు ఇక్కడ వీధుల వెంట షికారులా! సినిమాలా! బారులా! బీరులా! అమ్మాయిల నల్లరి పెట్టుటలా! యూనియన్ ఎన్నికలకై పోటీలా! కత్తులతో పొడుచుకొనుటలా! కర్రలతో మోదుకొనుటలా! సైకిలు చైనులతో బాదుకొనుటలా! అయ్యయ్యో! వారి ఆశలను నిరాశలను చేయుచున్నారే! వారి బ్రతుకులను బ్రద్దలు చేయుచున్నారే! వారి డబ్బును బూడిదలో పోసిన పన్నీరు చేయుచున్నారే! వారి త్యాగనిరతిని అడవిని కాచిన వెన్నెల చేయుచున్నారే! మీ బ్రతుకులను 'ఎడారి' చేసికొనుచున్నారే! దేశ భవిష్యత్తు నంధకారములో ముంచుచున్నారే! జాతి ప్రగతికి ఆనకట్టలై నిలుచుచున్నారే! ఇది విజ్ఞులు చేయదగిన పనియేనా?

ఇక మీ 'దేశభక్తి'ని గూర్చి రవంత చెప్పెదను. 'భక్తి'యే లేనప్పుడు ఇక 'దేశభక్తి' ఎక్కడిది? మీ భక్తి అంతయు సినీనటులపైన. అభిమానమంతయు సినీతారలపైన. ఆవేశమంతయు ఆర్.టి.సి. బస్సులపైన. అధికారమంతయు అలగాజనముపైన. అభినివేశమంతయు కాపీలను, వలదన్న ఉపాధ్యాయులను కొట్టుటలో. ఇది స్థూలముగ మీ చరిత్ర (ఇట్టివానిని పిలిచిన ప్రిన్సిపాల్‌ను తన్నవలెనని సభలో కేక. మేమెట్లున్నను వీనికేలయని మరియొక్క కేక).

నాయనా! ఏమి నీ వనుచున్నది? మేమెట్లున్న నీకేలననియా? నేను మీరు చెడిపోవుదురని బాధపడుటలేదు. రేపు మీరు ఇంజనీర్లయి డాములు కూలద్రోయుదురని మా భయము. డాక్టర్లయి 'టాన్సిల్స్'ను కోయబోయి మా గొంతుకలను కోయుదురని మా బెంగ. ఉపాధ్యాయులయి రానున్న తరములను కూడ పాడుచేయుదురని మా బాధ. గుమాస్తాలయి, ఫైళ్ళలో నిదురపోవుదురని మా ఆరాటము, విజ్ఞానవేత్తలయి దేశము నధోగతి పాలు చేయుదురని మా ఆతురత. దేశాధినేతలయి దేశమునే కుదువపెట్టెదరని మా ఆందోళన.

అదియునుగాక, విద్య కొరకు మన ప్రభుత్వము కోట్ల రూపాయలను, వెచ్చించుచున్నది కదా. అది ఎవరి సొమ్మను కొనుచున్నావు? మాది. నా వంటి పౌరులు పన్నులను సక్రముగా చెల్లించగా వచ్చిన సొమ్ము. కూలివాడు చెమటోడ్చి సంపాదించిన సొమ్ము. కర్షకుడు ఎండనక, వాననక శ్రమపడి అందించిన సొమ్ము. దానిలోని ప్రతి పైస కూడ సక్రమముగా ఖర్చగునట్లు చూచు బాధ్యత మా పైననే కాదు, మీ పైనకూడనున్నది. విద్యార్థులనగనే మీకీ సమాజముతో సంబంధము లేనివారివలె ప్రవర్తింపకుడు. ఎక్కడ నుండియో ఊడిపడిన వారివలె వ్యవహరింపకుడు.

నాయనలారా! ఇప్పటికయినను ఈ విధ్వంసక మనస్తత్వమును మాని సక్రమముగా ప్రవర్తింపుడు. మీ వేష, భాషలెట్లున్నను నేనంతగ పట్టించుకొనువాడను గాను గాని, ఋజువర్తనులై చరింపుడు. దేశభక్తి కలిగియుండుడు. అనవసరపు రాజకీయముల జోలికి పోకుడు. శ్రద్ధగా చదువుకొనుడు. పరీక్షలలో ఉత్తీర్ణులు కండు. మంచి ఉద్యోగములు సంపాదించి మీరు సుఖింపుడు. మిమ్ములగన్న తల్లిదండ్రులను సుఖపెట్టుడు. మీ పిల్లలను చక్కని పౌరులుగా తీర్చిదిద్దుడు. మీ పైననే ఆశలు పెట్టుకొన్న 'భారతమాత' కన్నీటిని తుడువుడు. దేశమునకు నేతృత్వము వహింపుడు. దేశమునకు సమున్నత స్థానము కల్పింపుడు. 'భారతమాత' నొసటి దరిద్రరేఖను తుడిచి, సమసమాజ స్థానమును సువర్ణాక్షరములతో లిఖింపుడు. మీ జన్మధన్యము చేసికొనుడు. మిమ్ములను గన్న మా జన్మలను ధన్యము చేయుడు.

***ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః***



# మహిళా మహాసభ

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! మా సాక్షి సంఘాభిమాని యగు ఒక వనితా రత్నము ఈ మధ్య జరిగిన 'మహిళా మహాసభ'ను గూర్చిన విశేషములను లేఖ ద్వారా మా కందించినది. చదివెదను. సావధానులై వినుడు.

ఆహా! పండిన దోస తోట. పూచిన తంగేడు తోట. విరిసిన మల్లెల మూట. ఎచ్చట చూచినను పట్టుచీరల ఫెళఫెళలతో, కంటి జిలజిలలతో, ఒంటి మిలమిలలతో, మల్లెపూవుల ఘుమఘుమలతో, అత్తరు వాసనల ఘుమఘుమలతో, వింత వింత యాభరణములతో, ముచ్చట ముడులతో, వాలుపైటలతో, వేలు జడలతో సభాభవన మంతయు కిట కిటలాడి పోయినది.

ఒక ఇంత మంది వనిత లొక్కచో చేరిన, కబుర్లకు లోటుండునా! పట్టు చీరలను గూర్చియు, నగలను గూర్చియు, అత్తగారి ఆరడిని గూర్చియు, ఆడపడుచుల ఆలుకలను గూర్చియు, ఆయనగారి అనునయమును గూర్చియు, పిల్లలను గూర్చియు, పెళ్ళిళ్ళను గూర్చియు, ఎదురింటి ఎల్లమ్మను గూర్చియు, పక్కింటి పిన్నిగారిని గూర్చియు, ఇట్లు ఎవరికి తోచిన విషయములను గూర్చివారు, వీలయినంత ఎక్కువ మందికి వినబడవలెనని కాబోలు గొంతు పెంచి మాట్లాడుకొనుచున్నారు. ఆ గడబిడలో ఎవరేమి మాట్లాడుకొనుచున్నారో ఎవరికినీ తెలియుటలేదు. సభాస్థలియంతయు నయాగరా జలపాతము వలె హోరుతో నిండిపోయినది.

ఉదయ మేడుగంటలకు పతాకావిష్కరణముతో ఆరంభమయిన కార్యక్రమము మధ్యాహ్నము పన్నెండు గంటలవరకు చర్చా గోష్ఠులతో, వాద ప్రతివాదములతో, రుస రుసలతో, భుస భుసలతోనూ ముగిసింది.

మధ్యాహ్నం మూడు గంటలకు ఊరేగింపు ఆరంభమయినది. ఈ ఊరేగింపులో దాదాపు వేయిమందికి పైగా పాల్గొనిరి. "పురుషాహంకారము నశించాలి", "మహిళా మహాసభలు జయప్రదం కావాలి", "జనాభాను బట్టి స్త్రీలకు ఉద్యోగములలోను రిజర్వేషన్లు కల్పించాలి" "స్త్రీల ఐక్యత వర్ధిల్లాలి", "స్త్రీ పిల్లల్నికనే యంత్రం కాదు" అని వివిధ రకములయిన నినాదములు వ్రాయబడిన అట్టలనుచేతపట్టుకొని, నగర

ముఖ్యవీధుల గుండ సాగి, సాయంత్ర మయిదు గంటలకు సమావేశ స్థలమునకు చేరుకొనిరి.

సభకు అధ్యక్షురాలుగా డొక్కా చిక్కమాంబగారు ఏకగ్రీవముగ ఎన్నికయిరి. తదనంతరము ఆమె పై కొంగును, ముక్కుపైని కళ్ళజోడును సవరించుకొని యిట్లు ప్రసంగించెను:

"సోదరీమణులారా! ఈ నాడెంత పర్వదినము. ఇంతమంది మహిళ లొక్కచోట చేరి, తమ సమస్యలను, సాధక బాధకములను చర్చించుట ఇది చరిత్రలోనే ప్రథమము. ఇట్టి సమావేశమున కధ్యక్షురాలిగా ఎన్నుకొనబడిన నేను మీకు కృతజ్ఞురాలను. (ఉపోద్ఘాతమే కాని ఉపన్యాసము లేదా యేమి? అని ఒక వనిత వెనుకనుండి మెల్లగ గొణుగుచున్నది).

పురుషజాతి యంత నీచమయిన జాతి, నికృష్టమయిన జాతి, విశ్వాస ఘాతుకమయిన జాతి, ప్రపంచమున వేరెచ్చటనయిన కలదా! లేదు తల్లీ లేదు! భార్యను అనుమానించి అగ్నిలో దూకుమన్నవాడొకడు. నిండు చూలాలయిన భార్య నడవిపాలు చేసిన వాడొకడు. భార్యను పణముగా పెట్టి జూదమాడిన వాడొకడు. భార్యనమ్మిన వాడొకడు. భార్యను నట్టడివిలో విడిచిపోయిన వాడొకడు. భార్యాబిడ్డలను పరిత్యజించి, ముక్కుమూసికొని, సన్యాసులలో చేరినవాడింకొకడు. ఇట్లు అనాదిగా మన స్త్రీజాతి పడిన అగచాట్లు, సహించిన బాధలు, చూపిన సహనము చెప్పనలవి కానివి. ఆ పురాణముల జోలి మనకేల పోనిండు. ఇప్పుడేమయినది? స్వాతంత్ర్యము వచ్చి ఇంతకాల మయినదిగాని మనకేమి ఒరిగినది? ఇప్పుడుకూడ వీని బుద్ధి మారలేదే! వీనిమొగము మండ! వీని అహంకారము కూల! ఇంకను తనే పెత్తనము చేయయత్నించుచున్నాడు. మనల నణగద్రొక్క చూచుచున్నాడు.

అమ్మా! మనము 'వేలు' పోసి మన భర్తలను కొనుక్కొనుచున్నామే! మనలో కొందరు 'లక్షలు' పోసి కొన్నవారు కూడ నున్నారు కదా! మరి అతడు మన చెప్పుచేతలలో నుండనక్కర లేదా? మనము చెప్పినట్లు విననక్కరలేదా? మనము చెప్పిన పనులన్ని చేయనక్కర లేదా! పాతిక రూపాయలిచ్చి కొన్న 'జోడు' అరగిపోవు వరకు మన పాదముల క్రింద పడి యుండునే! పది పైసలు పెట్టి కొన్న పకోడీ మన పంటిక్రింద పరపర లాడునే! మరి ఏది? వానికా గౌరవమున్నదా? మనలో కొందరము ఉద్యోగములు కూడా వేయించుకొని మరీ వివాహమాడుచున్నాము కదా! వాని కావిశ్వాసమున్నదా! ఐదు పైసల 'బిస్కట్టు' వేసిన పెంపుడు కుక్క జీవితాంతము

విశ్వాసము చూపునే! కాని నెలకయిదు వేల రూప్యముల ఉద్యోగము వేయించినను వీని కా విశ్వాసమేది? ధూ! ఇతడు కుక్కకంటె కనిష్ఠుడు కదా! విశ్వాసఘాతుకుడు

ప్రపంచమున మనకంటే వెనుకబడిన జాతి మరేదయిన ఉన్నదా? ఏవి? మనకు రిజర్వేషను లేవి? అవి లేకపోయినను, ఎటులో కష్టపడి, పోటీకి తట్టుకొని, నిలువబడి, ఉద్యోగములు సంపాదించుకొనుచున్నామని ఏడ్పులు! పురుషులలో నిరుద్యోగసమస్య పెరిగిపోవునని వాజమ్మ జోకులా! మనలను చూచి పక పకలా! వెక వెకలా! ఇగిలింతలా! సకిలింతలా! కేరింతలా! పలుకరింతలా! ఈలలా! గేలులా! ఇంక వానికి బుద్ధి రాదు. నిశ్చయముగ రాదు.

బస్సులలో మనకు నాలుగు సీట్లు కేటాయించినందుకు ఏడ్పులా! సర్వస్వామ్య సిద్ధాంతపు సల్లాపనలా! మన సీటులో కూర్చుని మనలను చూడనట్లు నటనలా! పేవరు నడ్డు పెట్టుకొనుటలా! ఛీ! ఛీ! వీని కెగ్గు సిగ్గులున్నవా? దయా దాక్షిణ్యములున్నవా?

తల్లీ! మనలో కొందరు ఉద్యోగములు చేసి, భర్తలకంటె నధికముగ సంపాదించుచున్నారు కదా! పోనీ అట్టివారికయిన, వారి భర్తలు సాంసారిక విషయములందు తోడుపడుచున్నారా? లేదు తల్లీ! లేదు! ఇంటింటెడు చాకిరీ చేసుకొని కార్యాలయమునకు పోవలసినదే గాని ఇచ్చుటి పూచిక పుల్లనయిన అచ్చుట పెట్టరుకదా! అంతేనా! అంతే అయిన ఎంత బాగుండును? ఏ కారణము చేతనయిన మనము కార్యాలయమునుండి అరగంట ఆలస్యముగా ఇంటికి చేరిన అలుకలు, అనుమానములు, రుసరుసలు, భుసభుసలు, మూతి ముడుపులు, ముక్కు విరుపులు, ప్రాసిక్యూషనులు, క్రాసు ఎగ్జామినేషనులు.

అతడెంత ఆలస్యముగ ఇల్లు చేరినను ఫరవాలేదు. ఒకటా! రెండా! వెయ్యి వ్యాపకములు. క్లబ్బులు, చీట్లాటలు, సినిమాలు, షికార్లు, బారులు, బీరులు, త్రాగుడులు, తందనములు, గుర్రపు పందెములు, నాటకములు, నైటుక్లబ్బులు, క్యాబరేడ్యాన్సులు, వేశ్యావాటికలు - వహహ్వా! ఇటు లెన్నని చెప్పవచ్చును. అతడు వేయని గంతులున్నవా? ఆడని ఆటలున్నవా? చేయని చేష్టలున్నవా? చూడని చూపులున్నవా? దూరని బారులున్నవా? త్రాగని విదేశీ మత్తుపానీయములున్నవా? ఆడని అబద్ధములున్నవా? వేయని వేషములున్నవా? చెప్పని కట్టుకథలున్నవా? ఎప్పుడయిన అతడాలస్యముగ వచ్చినందులకు పొరపాటున కారణము నడిగినచో అతడు చెప్పు కథలు కాశీ మజిలీ కథలను తలదన్నును కదా!

పొరపాటున ఎప్పుడయిన తొందరగా ఇల్లు చేరినచో, 'అలుక కట్నము' నకుగాను ఇస్తానన్న 'స్కూటరు'ను మీ నాన్న ఇవ్వలేదనియో, పెండ్లిలో సూటు పెట్టలేదనియో, పెండ్లిలోని వంటకములు బాగులేవనియో, క్రొత్త పండుగలకు 'రంగుల టి.వి.'నిచ్చిన గాని రాననియో, చిన్నదాని 'అన్నప్రాశనము' నకు 'వెండిగిన్నె' నీయలేదనియో, వరదక్షిణగా రావలసిన ఉంగరము రాలేదనియో, పెండ్లినాడు పెట్టిన 'చేతి గడియారము' మంచిదికాదనియో వేధించి, సాధించి, ఆలస్యముగానే ఇంటికి వచ్చిన బాగుండునని మనమనుకొనునట్లు ప్రవర్తించుట లేదా!

ఇదివరలో, మనము ఋతుమతుల మయినప్పుడు ఆచారమనియో, నియమమనియో, నిష్టయనియో మనల నా మూడు రోజులు వంటపనులు, ఇంటి పనులకు దూరముగ నుంచెడివారు. కనీసమటులయిన మనకు కొంత విశ్రాంతి దక్కెడిది. కాని ఇపుడా ఆచారములు మంటగలిసినవి. దానితో మనకా నెలకు మూడు రోజుల విశ్రాంతియు కరువయినది.

పూర్వము స్త్రీలు పదిమంది సంతానమును గనెడివారు. అందువలన బాలింతయనియో, చూలింతయనియో వారికి ఇంటిపనుల నుండి, వంటపనుల నుండి కొంత విశ్రాంతి లభించెడిది. అంతియే కాక పూర్వ ముమ్మడి కుటుంబములో, ఒక ఇంటిలోనే కనీసము నలుగురయిదుగురు మహిళలుండెడివారు. వారందరు తలోపని సర్దుకొని చేసికొనెడివారు. కాని ఇప్పుడా వ్యవస్థ మారిపోయినది. కుటుంబ మనగా భర్త, భార్య, ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు మాత్రమే అయినది. ఈ మారిన వ్యవస్థ మన మహిళలపై అధికమయిన పని భారమును మోపుచున్నది. వంటపని, ఇంటిపనికి చాకి పని తోడయినది. వీటి కదనముగా బ్యాంకుపని, స్కూలుకు పిల్లలను పంపుట, తిరిగి తీసుకొని వచ్చుట, వారికవసరమయిన పుస్తకములు, యూని ఫారములు కొనుట, వారి 'హోం వర్క్' చేయుట లేదా చేయించుట- ఇటుల ఈ నాటి మధ్య తరగతి మహిళ జీవితము సాలున మున్నూట అరువదైదు దినములు విశ్రాంతి లేని జీవితమయినది.

ఇన్ని యన్నను మనము సర్దుకొనిపోయి, మన ప్రాచీన సంప్రదాయము ననుసరించి మెలగుకొనుట లేదా! మన మంచితనమునశక్తతగ నెంచుచున్నాడు. అందుకనియే ఈ సమావేశ మేర్పాటు చేయబడినది. మనమందరము ఐక్యముగ మెలగవలయును. మన కోర్కెలను సాధించుకోవలెను – అంతవరకు మనము నిద్దుర పోరాదు. వారిని నిద్దుర పోనీయరాదు ("ఇపుడే నిద్దుర వచ్చుచున్నదే! అంతకాలము నిద్దుర లేకుండ ఎటులుండగలనమ్మా!" అని ఓ తొలిచూలాలు వెనకనుండి సణుగుచున్నది).

ఉపన్యాసముల కేమున్నది? ఇటు లెంతసేపయిన చెప్పవచ్చును. కాని అంతకంటే ముఖ్యమయినవి తీర్మానములు. మన కార్యదర్శినిగారు ముఖ్యమయిన కొన్ని తీర్మానములు మీ ముందుంతురు. వాటిని మనము చర్చించి ఆమోదించవలెనని" పలికి కూర్చొనినది.

అంతవరకును కుర్చీలో కునికిపాట్లు పడుచున్న 'కార్యదర్శిని' తొట్రుపాటుతో లేచి పైటకొంగును నడుమునకు బిగించి, గొంతును, మైకును సవరించి ఇట్లు పలికినది.

మొదటి తీర్మానము: *దేశములోని అన్ని ఉద్యోగములలోను, పార్లమెంటులోను, రాష్ట్రశాసన సభలలోను, కేంద్ర రాష్ట్ర మంత్రివర్గములలోనూ స్త్రీ పురుషుల జనాభా నిష్పత్తిలో కేటాయింపులు జరుగవలెను.*

ఈ తీర్మానము నందరును ఏక గ్రీవముగ ఆమోదించిరి.

రెండవ తీర్మానము: *భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి పదవులలో ఏదో ఒక పదవికి స్త్రీ ఎన్నుకోబడవలెను.*

ఈ తీర్మానమును కూడ నందరేకగ్రీవముగ నంగీకరించిరి.

మూడవ తీర్మానము: *భార్యాభర్తలిరువురును చెరి యొక పూట వంట పనిని పంచుకోవలెను.*

ఈ తీర్మానము చర్చలో కొంత రభస జరిగినది. ఏ పూట వంట ఎవరు చేయవలెనను విషయము గూర్చి బహుదీర్ఘముగ చర్చ జరిగినది. చివరికావిషయము నొక ప్రత్యేక "సబుకమిటీ"కి నివేదించుటకు నిర్ణయింపబడినది.

ఇంతలో సభా మధ్యస్థమున కల్లోలమారంభమయినది. చేయి, చేయి కలుపుకొనుదాక వచ్చినది. స్త్రీ లందరును భయముతో పరుగులిడుచుండిరి. వేదిక పయినుండి కార్యదర్శిని, ఇంకను తీసుకో వలసిన నిర్ణయములు' మూడు నాలుగున్నవనియు, సావధానలై కూర్చుండుడనియు మనవి చేసెను. కాని ఆమె మాటల నెవ్వరును ఆలకించు స్థితిలో లేరు. ఎవరి దారిన వారు పోవుచుండిరి. ఇట్ల త్రుటి కాలములో సభాభవనమంతయు నిర్జన మయినది. జరిగిన కల్లోలమునకు కారణమేదియో తెలియునా? నాయనలారా! అప్పుడే విడుదలయిన రెండు తెలుగు చలనచిత్రాలలో నటించిన ఇరువురు కథానాయకుల నటనను గూర్చి జరిగిన వాదము.

ఇట్లు ఆ మహాసభ అర్ధాంతరముగా ముగిసినది.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

మరో జంఘాలశాస్త్రి
అయలసోమయాజుల నాగేశ్వరరావు



# కవులు - సామాజిక స్పృహ

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! నగరములో ఏదియో 'సాహిత్యసభ' జరుగుచున్నదని విని, అక్కడికి పోయితిని. అంతకుమునుపే వక్త ఏమి ప్రసంగించెనో గాని, నేనుపోవుసరికిట్లు ప్రసంగించుచుండెను.

"లేదు– వారికి 'సామాజిక స్పృహ' లేదు. వారు కవులా! 'సమాజిక స్పృహ' లేనివాడు కవి ఎట్లగును? సమాజమును మరమ్మత్తు చేయువాడు కవి. అతడు సమాజములోని ప్రజల బాగోగులకై తన కవిత్వమునుపయోగించవలెను గాని, ఇట్లు 'కాకమ్మ కధలు' చెప్పుటకు కాదు.

ఏదీ మన తెలుగు కవులలో నన్నయ నుండి, నిన్నటి వరకు గల కవులను చూడుడు. వారిది వర్ఠి 'బూర్జువా' కవిత్వము. 'బూతు' కవిత్వము. భూస్వామ్య కవిత్వము. ఆకలిని గూర్చి కాని, విప్లవమును కూర్చిగాని, వారెప్పుడయిన కవిత్వము చెప్పిరా? వారికా 'స్పృహ' ఎక్కడిది? వారందరు కూడా మన 'అభ్యుదయ కవి', 'ఆకలి కవి' అయిన 'నానాసాహెబు'గారి ముందు దిగదుడుపునకైన పనికి వత్తురా! ప్రజాసాహిత్యం వర్ధిల్లాలి, 'బూర్జువా సాహిత్యం నశించాలి" అని ప్రసంగించి కరతాళ ధ్వనుల మధ్య కూర్చుండెను.

అంతట నేను లేచి సభాధ్యక్షునితో "నేను కూడ ప్రసంగించవచ్చునా?" అని అడిగితిని. అతడందుకు సమ్మతించెను. నేనిట్లు పన్యసించితిని:

"వవ్వా! జన్మ ధన్యమయినది కదా! నాయనలారా! అవి పలుకులా! కావు. అమృతపు గుళికలు – తేనెల జల్లులు – మలయమారుతపు వీవనలు. మకరందపు డోలలు – మన ఉపన్యాసశిఖామణి ఏమి సెలవిచ్చెనో వింటిరికదా! మన పూర్వ కవులకు 'సామాజిక స్పృహ' లేదనియు, వారిది కవిత్వము కాదనియు, 'బూతుల బుంగ' లనియు వారి యభిప్రాయమైనట్లు కనబడుచున్నది. వారికి ఒడలిపై 'స్పృహ' లేక అట్లు ప్రసంగించినట్లు ఎంచవలసి వచ్చుచున్నది.

నాయనలారా! గాసట బీసటగా నున్న తెలుగు భాషను తీర్చి దిద్ది రూప రేఖలు కల్పించి, సంస్కృత భాషాదాస్యము నుండి విమోచన మొనర్చి, మనమీ నాడు మాట

లాడుకొనుచున్న తెలుగు భాషను మనకు ప్రసాదించిన 'నన్నయ భట్టారకుడు' సామాజిక స్పృహ లేనివాడా? ఆ మహనీయుడు పెట్టిన భిక్షయే లేకున్న మనమందరము కోయవారి వలె, కొండవారి వలె, భాషలేక, లిపి లేక, పరమ మూర్ఖాగ్రేసరులమయి ఉండెడి వారమనుటకేమయిన సందేహమా? ఆ అనువాద గ్రంథమే లేని యెడల మనకీ భాష ఎక్కడిది? మన మెక్కడ నుండెడి వారమో యోచించుకొన్న 'ఒడలు' జలదరించునే! 'తెలుగు జాతి'కి అట్టి మహోపకారము చేసిన నన్నయ వెర్రిముండ కొడుకా!

శైవమని, వైష్ణవమని, మత కలహములు పెంచుకొని, ఒకరి నొకరు దూషించుకొని, ఒకరి నొకరు ద్వేషించుకొని, కుక్కలవలె కొట్లాడు కొనుచున్న కాలములో, శివ, కేశవుల కభేదము కల్పించి, హరిహరాద్వైతమును స్థాపించి, ధర్మ సంరక్షణార్థమై భారతములోని మిగిలిన పదునైదు పర్వముల నాంధ్రీకరించి హరి హరనాథుని కంకితమిచ్చిన 'తిక్కన సోమయాజి' సామాజిక స్పృహ లేని వాడా? కాకతి గణపతి దేవచక్రవర్తి కంకితమిచ్చి, ఐశ్వర్య సుఖముల ననుభవింపవచ్చునే! మాన్యములు సంపాదించుకొనవచ్చునే! అటులేల చేయలేదందువు? సాంఘికాభ్యు దయమునకు, హరిహరాద్వైతమును ప్రచారము చేయుట కొరకు హరి హర నాథున కంకిత మొసగినాడు. తన జన్మధన్యము చేసికొనినాడు. తెలుగు భారతిని ధన్యను చేసినాడు. అట్టి తిక్కన సోమయాజికా ఈ నింద!

తన కంకిత మిమ్మని కోరిన మండలాధీశుని ధిక్కరించి, తను నమ్మిన రామునకే 'ఆంధ్రమహా భాగవతము' నంకితముచేసిన పోతన కవీంద్రుడు 'విప్లవ కవి' కాడా? రాచరికము - అందునను తను వసించుచున్న మండలాధీశుడు. అట్టి వారిని వ్యతిరేకించి, వేరొక్కరి కంకిత మొసగుట సామాన్యమా! "బాలరసాల నవ పల్లవ కోమల కావ్యకన్యకన్ కూళల కిచ్చి, అప్పడుపు కూడ భుజించను" అని పలికి, నిలువ బడుట ఆ రోజులలో సామాన్యమా?

ప్రజాస్వామ్యమని, ప్రాథమిక హక్కులని ఉన్న ఈ రోజులలోనే, కవులు ప్రభుత్వము మారగనే తమ 'బురఖా' లను మార్చి వైచుకొనుచున్నారే! పాత తాళపు చిప్పలను పక్కన పెట్టి, కొత్త తాళపు చిప్పలతో భజనలకై సిద్ధమగు చున్నారే! కవితలు వ్రాయుచున్నారే! ఆస్థాన కవి పదవికై 'కుక్క'ల వలె వారి పాదాల వద్ద పడిగాపులు పడుచున్నారే! 'ఎడిషను' కొక్కనికి చొప్పున అంకిత మొసగుచున్నారే! ఆపదుపు కూటితో కడుపు నిండ భోజనము చేసి, నిద్రమత్తులో 'అకలి కవిత్వము' చెప్పు చున్నారే! అట్టిది, రాచరికమున్న ఆ రోజులలో అట్లు చేయుట దుస్సాధ్యము కాదా! అట్టి మహా భాగవతకర్త మీకు 'బూర్జువా' యయ్యెనా! అట్లు పలికిన ఈ ఉన్మత్త ఉపన్యాస

శిఖామణిని 'ఎర్రగడ్డ' లో పారవేయ వద్దా!

కవి తామతల్లిని ఛందో బంధములనుండి విడిపించి, జాను తెనుగులో కవిత్వమును చెప్పి, వీరశైవ మతమును వాడ వాడలా ప్రచారము చేసిన దేశికవితా సనాథుడు పాల్కురికి సోమనాథుడు సామాజిక స్పృహ లేనివాడా?

తాను వైష్ణవ మతావలంబి అయ్యు, శైవ కవులకు తన ఆస్థానములో చోటు కల్పించి, గౌరవించిన శ్రీకృష్ణ దేవరాయలు, తేట తెలుగులో, తేట గీతులతో, ఎల్లవారలకును అర్ధమగునట్లు సమాజములోని కుళ్ళును ఎత్తి చూపిన వేమన్న సామాజిక స్పృహ లేనివారా! నాయనలారా! ఇటు లెన్నని చెప్పవచ్చును? ఇక ఈనాటి కవుల సామాజిక స్పృహను గూర్చి ఏవంత చెప్పెదను.

సామాజిక స్పృహయా! ఏదీ! అసలు ఒడలిపైన స్పృహయే లేనప్పుడిక సామాజిక స్పృహ ఎక్కడిది? ఎప్పుడునూ ఏదియో ఒక మత్తు – రాజకీయ సిద్ధాంతపు మత్తో, సినీ కాంతల కౌగిలింతలమత్తో, పూర్వ సంస్కృతీ విరోధపు మత్తో, కవికావలయుననను మోహపు మత్తో, మద్యపానపు మత్తో – ఏదో ఒకటి. మత్తు లేకుండ కవిత్వము వ్రాసినదేది? స్పృహ ఉండి కవిత్వము వ్రాసినదెప్పుడు? ఏది వ్రాసినను మత్తులోనే! ఏది చేసినను మత్తులోనే! 'స్పృహ' యే లేనప్పుడిక 'సామాజిక స్పృహ' ఎక్కడిది?

ఏ దేశమందయినను, ఏ కాలమందైనను, ఏ భాషయందయినను ఇట్టి ఉన్మత్తులున్నారా? మిల్టన్‌ను, షేక్స్‌పియర్‌ను చదువని ఆంగ్లేయుడున్నాడా?

ప్రభువుల అడుగులకు మడుగులొత్తుచు, వారిచ్చు అగ్రహారములకో, చీని చీనాంబరములకో, బహుమానములకో, పదవులకో ఆశించి తమ కవితా కన్య నమ్ముకొనువారు, ఆనాడే కాదు, ఈనాడు కూడా నున్నారు. కచ, కుచ వర్ణనలతో కాలక్షేపము చేసేడి 'కుకవులు' ఈ కాలములో మాత్రము లేరా? నాయనలారా! అట్టి వారి సంఖ్య ఈ కాలమందే అధికముగ కనబడుచున్నది కదా!

నాయనలారా! ఇటులంటినని బాధపడకుడు. ప్రాత యంతయు మంచియని గాని, క్రొత్త యంతయు చెడ్డయని గాని నేను భావించువాడను గాను. సాహిత్యమునకు ప్రాతక్రొత్తలు లేవు. అది నిత్యనూతన మయినది. సార్వజనీనమైనది – సార్వకాలికమయినది. అది ఒక సజీవ స్రవంతి. మంచిచెడ్డలు ప్రాతయందును, క్రొత్తయందును కూడా గలవు. మంచి యెచ్చట నున్నను గ్రహించుటయే మన ధర్మము. ఇప్పటికే చాలా చెప్పితిని. ఈ విషయమును గూర్చి వేరెప్పుడయిన ప్రసంగించెదను. సెలవు.



ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# గుర్రపు పందెములు

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! సభాభవనమున కాలస్యముగ వచ్చినందులకు క్షమింపుడు. సకాలముననే బయలుదేరినను మధ్యే మార్గమున జన సముద్రము నీది చేరుటలో ఆలస్యమయినది. ఆహా! ఏమా జన సందోహము! సొంత కారులలో, అద్దె కారులలో, త్రిచక్రపు మోటారు వాహనములలో, ద్విచక్రపు మోటారు వాహనములపైన, రణగొణ ధ్వనులతో, చెవులు చిల్లులుపడు హారన్ల మోతలతో, రేసు గుర్రములవలె ఒకరికంటె మరొకరు ముందుకు పోవలెనను ఆత్రుతతో, ముందు వారిని చీదరించుకొనుచు, వెనుకవారిని ఈసడించుకొనుచు ఎంత హంగామా అయిన చేయుచున్నారు. అతి తొందర పని ఉన్నవారివలె పరుగులిడుచున్నారు. వేళ్ళు లెక్కించుకొనుచున్నారు. ముసి ముసి నవ్వులు నవ్వుకొనుచున్నారు. మురిసిపోవుచున్నారు. దారిలో వాహనముల నాపి, దారి పక్కనిలువబడి పుస్తకముల నమ్ముకొనుచున్న కుర్రవాని వద్ద తమకు కావలసిన పుస్తకములను కొని, అధ్యయనము చేయుచున్నారు. అది చూచిన నేను, 'ఆహా! తెలుగు భారతి ధన్య అయినది కదా! ఎంత తొందర పనులున్నను వీరు పుస్తకములను కొనుచున్నారే! అధ్యయనము చేయుచున్నారే!' అని సంతసించి ఆ పుస్తకమేదో నేను కూడా కొనవలయునని పోయితిని. కాని – కాని – ఆ పుస్తకమేదో తెలియునా? నాయనలారా! అది 'రేస్ గైడ్' ట, వీరలెవ్వరో తెలియునా? అభినవ యుధిష్ఠిరులు. ఆధునిక నలమహారాజులు. కలియుగ సహదేవులు – గుర్రపు పందెములకై పోవుచున్న అశ్వమేధయజ్ఞ దీక్షాదక్షులు.

ఇక నగర రక్షకభటుల సంగతి చెప్పనలవి గాకున్నది. తమ సుంషిహిర నాదములతో, పాదకవచముల డక్కు డక్కులతో, లాఠీకర్రల టక్కు టక్కులతో ఇతర వాహనముల నన్నింటిని పక్క దారికి మళ్ళించి, రేసు వాహనములను రాజమార్గము గుండ పంపుచు, యథాశక్తి అశ్వమేధ యజ్ఞదీక్షాపరాయణులతో సహకరించుచున్నారు. యాగ రక్షణకై కృషిచేయుచున్నారు.

అవును నాయనలారా! ఇతరుల కాలన్యమయిన నేమి? కొంపలు మునిగిపోవునా? కాని వారి కాలస్యమయిన వ్రత భంగము కాదా?

వహ్వా! సామాన్యునికి సందుబాట ప్రయాణమా! జూదరికి రాజమార్గ ప్రయాణమా! గుడికి పోవు వాని కంటె గుర్రపు పందెములకు పోవు వానికి ప్రాముఖ్యమా! బడికి పోవు వానికంటే బజారుల వెంట తిరుగు వానికి ప్రాధాన్యమా! ఆహా! సృష్టి స్థితియే అట్లున్నది కదా! "సృష్టికర్తయగు బ్రహ్మకు లేదు – పోషణకర్తయగు విష్ణువునకు లేదు – లయకర్తయగు శివునకే కదా నాట్యమాడుటయం దుల్లాసము". సానికొంపకున్న సింగారము సంసారి గృహమున కేది? పందిరి మంచములు, పట్టు పరుపులు, మల్లెపూల ఘుమఘుమలు, సుగంధద్రవ్యముల ఘుమ ఘుమలు వేశ్యా గృహమున గాని సంసారి పడకటింట కనబడునా! కంచుకున్న శబ్దము కనకమునకేది? శరీరారోగ్యమును వృద్ధి చేసెడి చేదు మందుకంటె, పాడు చేసెడి తీపియందే మానవునికి మక్కువ కదా!

నాయనలారా! ఇక ఈ రేసులకు పోవువారి సంగతి రవంత చెప్పెదను. వీరిలో అతిరథులు, మహారథులు, అర్ధరథులు అనేకులున్నారు. అశ్వశాస్త్రమును కూలంకషముగ అధ్యయనము చేసిన అపర సహదేవులున్నారు. జీతము నందుకొనిన మరుక్షణముననే 'మలకపేట' లో సమర్పించు ధర్మరాజులున్నారు. తమ వంశవృక్ష మేదో తెలియనివారు, తెలిసికొనుటకు ప్రయత్నము చేయనివారు సహితము అశ్వముల వంశవృక్షములను అధ్యయనము చేయుచున్నారు. మననము చేసికొనుచున్నారు. జాతకములు వేయించుట చాదస్తమని, తమ పిల్లలకైన జాతకములు వేయించని అభ్యుదయ వాదులు అశ్వజాతకములను వేయించి పరీక్షించుచున్నారు. తమ జాతకములు మారునని మురిసిపోవుచున్నారు. 'భగవద్గీత' నయిన నెన్నడు కన్నుల కద్దుకొనని వారు 'రేసు గైడు'లను కన్నుల కద్దుకొనుచున్నారు. పారాయణము చేయుచున్నారు. అరువది పేజీల 'నన్నయ కవితా వైభవము'ను రెండు రూపాయల కందించినను కన్నెత్తి అయిన చూడని వారు, రెండు పేజీల 'రేస్ బులిటెన్' కు మూడు రూపాయల నర్పించుచున్నారు. తమ పిల్లలు ఏయే తరగతులు చదువు చున్నారో తెలియని వీరు ఏ గుర్రము తండ్రి ఎవరో, తల్లి ఎవరో, పుట్టినప్పుడు ఎంత బరువు కలదో, ఏయే పందెములలో నెగ్గినదో త్రుటిలో చెప్పగలరు.

ఆహా! దేశమున కెట్టి దౌర్భాగ్యస్థితి దాపురించినది. ఇది భారత దేశమేనా? మనమున్నది శ్రేయోరాజ్యమేనా? ఆహా! ప్రజాశ్రేయస్సెంత ఉన్నత స్థాయిలో కాపాడబడుచున్నది! వహ్వా! జాక్‌పాట్‌లా! క్యారీ ఫార్వర్డులా! డెర్బీలా! ఇంటర్ వెన్యూ

బెట్టింగులా! కామెంటరీలా! ఒక్క లెగ్గులోపోయినదని ఏడ్పులా! ఈసారి పోయినదికూడ పైసారి వచ్చునని ఆశలా! ఈ రేసు క్లబ్బులకు రాష్ట్రప్రభుత్వము వారి గ్రాంట్లా! ఈ గుర్రపు పందెములకు రాష్ట్రపతి బంగారు కప్పులా! పతకములా! ప్రోత్సాహములా!

నాయనలారా! ఈ గుర్రపు పందెములు సామాన్య కుటుంబీకుల కెంత అపకారము చేయుచున్నవో ఎరుగుదురా? నెల జీతములు రేసు క్లబ్బుల వారి పాలు. అయ్యగారు అప్పులపాలు. భార్యల మంగళ సూత్రములు పందెపు గుర్రములపాలు. పిల్లల భవిష్యత్తు రోడ్లు పాలు. ఇక రోజు కూలి వాని సంగతి చెప్పవలసిన దేమున్నది? ఆనాడు అయ్యగారి గుండెలో గుర్రాల పరుగు. కడుపులో ఎలుకల పరుగు. ఇంటిలో ఇల్లాలి మూలుగు.

నాయనలారా! పూర్వము రాజులు, జమీందారులు పందెములకొరకు కోళ్లను, గొఱ్ఱెపోతులను, పెంచి, పోషించి, వానితో కోడిపందెములు, గొఱ్ఱెపందెములు నిర్వహించి వినోదించుట మనము విన్నాము గదా! మరి ఆ కోడి పందెములు, గొఱ్ఱెపందెముల కంటే నీ గుర్రపు పందెము లెట్లు భిన్నములు? ప్రజా శ్రేయస్సును దృష్టిలో నిడుకొని వానిని నిషేధించిన ప్రభుత్వము మరి గుఱ్ఱపు పందెములను మాత్రమేల నిషేధించరాదు? వానికి నిషేధమా! వీనికి ఆదరమా! వానికి శిక్షయా! వీనికి రక్షయా! వానికి తిరస్కారములా! వీనికి పురస్కారములా!

నాయనలారా! ఉన్న ధనమును వెచ్చించుట ఎటులని చింతించువారలకు గాని, రెండుపూటలాపట్టెడు మెతుకులు లేని మనకీ గుర్రపు పందెము లెందులకు? కొంపలు కూల్చు గుర్రపు పందెముల వ్యామోహము నిప్పటికయినను వీడుడు. తేలికగా వచ్చు డబ్బునకై ఆశ పడకుడు. కష్టించి సంపాదింపుడు. కడుపునిండ దినుడు. మీ పిల్లలకు పెట్టుడు. దురాశకుపోయి దుష్టులు కాకుడు. ఇప్పటికయినను మించిపోయినది లేదు. వెంటనే దేశ మందంతటను ఈ గుర్రపు పందెములను నిషేధింపుడు. పందెపు గుర్రములను భారత సైన్యమున కప్పగింపుడు, వారి కుపయోగించును. రేసు గ్రౌండ్లను క్రీడా స్థలము లేని కళాశాలల కప్పగించుడు. రేసు క్లబ్బులను మూసి వేయుడు. ఆ భవనములలో వైద్యశాలలనో, విద్యాశాలలనో నెలకొల్పుడు. భారతీయులను రేసు బానిస బంధముల నుండి విముక్తులను చేయుడు. శ్రేయోరాజ్య స్థాపనములో మరో ముందడుగు వేయుడు. సెలవ్.



ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# మద్యపాన నిషేధము

జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

ఆహా, ఏమా జనసందోహము. ఇసుక వేసిన రాలకుండనున్నారు. రకరకము లయిన వాహనములు రోడ్డున కిరువైపులను నిలువబడియున్నవి. రోడ్డు సూదిమొన మోపుటకైన వీలు లేనట్లున్నది. మైకులో నుండి పెద్దగా పాట వినబడుచున్నది. దూరము నుండి చూచుచున్న నేను అదేదో దేవాలయమనియు, ఆ జన సందోహమంతయు భక్త జన సందోహమనియు, ఆ వినబడుచున్నది భక్తి గీతమనియు ఎంచి సంతసించితిని. ఆహా, భరత ఖండము ధన్యమయినది కదా, ఎందరు భక్తులు భక్తి శ్రద్ధలతో భక్తి గీతము లాలపించుచున్నారు! భగవద్దర్శనమునకై ఎదురు చూచుచున్నారు!" అని అనుకొనుచు సమీపించితిని. కాని, కాని నాయనలారా, అది దేవాలయముకాదు – అదేదో ప్రజాహితార్థము నిర్మింపబడిన భవనము – వారు భక్తులు కారు – 'అబ్కారి' కంట్రాక్టర్లు – అది భక్తి గీతము కాదు–'అబ్కారి' వేలము పాట.

ఆహా, దేశమున కెట్టి దుస్థితి దాపురించినది? రాముడేలిన రాజ్యమే! భరతుడేలిన దేశమే! మహాత్ముడు కలలు కన్న మరో ప్రపంచమే! అట్టి దేశములో స్వాతంత్ర్యమును సముపార్జించిన దశాబ్దముల తరువాత కూడా ప్రభుత్వ సారాయి దుకాణములా! వాటి కొరకు వేలము పాటలా! ప్రజలకు మంచి సరకు నందించుటకై పోటీలా? వాని కొరకై టెండర్లా? ఆహా, ఏమి ప్రజాభిమానము? కల్తీ సారాను త్రాగి ప్రజారోగ్యము పాడగునని యెంచి ప్రభుత్వమే కల్తీలేని సారా నందించుచున్నది కదా! మంచినీటి కరువున్న గ్రామమున్నదిగాని, మద్యమునకు కరువున్న గ్రామమున్నదా? 'నీరు' లేకపోయినను బ్రతుక వచ్చును గాని, 'బీరు' లేకున్న ప్రజలు బ్రతుకలేరని వారు గ్రహించినారు. అందులకనియే ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి లేని కుగ్రామములో కూడ ప్రభుత్వ సారాయి దుకాణములను తెరపించినారు. ప్రభుత్వ సారాయి వ్యాపారము మూడు బుడ్లు, ఆరు గ్లాసులుగా సజావుగా సాగుచునే యున్నది. ఇక నగరముల సంగతి చెప్పనేల? అడుగునకొక బారు, గజమునకొక్క దుకాణము. – పేటకొక క్లబ్బు.

అవును నాయనలారా! కూడు, గుడ్డలను ఏ ప్రభుత్వమయిన అందచేయును.

కాని, కమ్మని మద్యము నందచేయు ప్రభుత్వమేది? అట్టి ప్రభుత్వము మరెచ్చటనయిన కలదా? లేదు నాయనలారా, లేదు. ఆ కీర్తిమనకే దక్కినది. భారత మాత ధన్య అయినది.

వహ్వా! ముందుల కేగుచున్నామని, చీకటిలో వెనుకకు పయనించుచున్నామే! పురోగతికై ఉద్యమించి తిరోగమించుచున్నామే! తినుటకు తిండి, కట్టుటకు బట్ట, ఉండుటకు గూడు లేని మన దేశములో మద్యపానమా!" అని నింకనేమో ప్రసంగించబోయెను. ఇంతలో సభా మధ్యమున నొకడు నిలువబడి "మన పూర్వులు సురాపానము చేసినట్లు మన పురాణములు చెప్పుచున్నవి కదా, మరి మన మేల చేయరాదు?" అని ప్రశ్నించెను. అంత జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

"నాయనా, నీవు 'బృహస్పతి'కి పెద్దన్నగారివలె కనబడుచున్నావు. ఆహా, పూర్వాచారములపై ఏమి భక్తి! పురాణములపై ఎంత విశ్వాసము! నాయనా, నీవు నీ పూర్వులవలె నుంటివా? నీ తలమీద గోష్పాదమంత జుట్టునకు బదులు, గొర్రెబొచ్చంత జుత్తు లేదా? ముతక ఖద్దరు ధోవతికి బదులు కార్గో పంట్లామును నీవు ధరించుటలేదా? వారు నిత్యాగ్నిహోత్రులే, దైవభక్తి పరులే, సత్య సంధులే, మహా విద్వాంసులే, మహానిష్ఠా గరిష్ఠులే, నీ వట్లుంటివా? నిత్యాగ్ని హోత్రుడవని మట్టుకు నీ చేతిలోని సిగరెట్టు చెప్పుచున్నది.

నాయనా! మనము మన పురాణముల నుండి గ్రహించవలసినది మంచి కాదా? రామాయణము నుండి మనము నేర్చుకొనవలసినది ఏక పత్నీ వ్రతము, పితృవాక్య పరిపాలనము గాని పరకాంతాపహరణమా? భారతమునుండి గ్రహించవలసినది ధర్మవర్తనముగాని, భార్యను పణముగా పెట్టి జూదమాడుటా? హరిశ్చంద్రుని కథనుండి మనము గ్రహించవలసినది సత్యవాక్పరిపాలనము గాని భార్య నంగడిలో పెట్టి యమ్ముటా? భాగవతమునుండి గ్రహించవలసినది భగవత్‌తత్వమును గాని స్త్రీ లోలత్వమునా?

ఇంతేకాదు నాయనలారా! ఈ మద్యపాన నిషేధమును వ్యతిరేకించువారు చెప్పుకారణము మరియొకటి యున్నది. అది ఏమనగా – దేశములోని మద్యమును తయారు చేయు కర్మాగారములు మూతపడుననియు, అందు పని చేయు కార్మికులు నిరుద్యోగులగుదురనియు వీరి వాదము. ఆహా, ఏమి సామాజిక స్పృహ! ఏమి కార్మిక పక్షాభిమానము! ఏమి దూరదృష్టి! వంద కోట్ల మంది భారతీయులు చెడిపోవుచున్నారను బాధ కంటే వీరికి మద్యపానములను తయారు చేయు సంస్థలు మూతపడునను

బాధ ఎక్కువది. 'భారతీయత' కంటే వీరికీ సంస్థలు ముఖ్యమైనవి. కోట్లాది శ్రామిక జీవుల బాగుకంటే వీరికి నిరుద్యోగులగు కొద్దిమంది కార్మికుల శ్రేయస్సు ముఖ్యము. 'బీరు' ముందు భారతీయతత్త్వశాస్త్ర మంతయు దిగదుడుపునకైన పనికి రాదని వీరి నమ్మకము. వీరికి హైందవమత సిద్ధాంతము 'రమ్ము' కంటే నెక్కువది కాదు. తుపాకీ గొట్టమునుండి రాజకీయ విప్లవము, బ్రాందీబుడ్డినుండి పారిశ్రామిక విప్లవము ఉదయించునని వీరి సిద్ధాంతము. ఆహా, ఇట్టి వారిని కన్నందులకు 'భారతమాత' ఎంత విలపించుచున్నదో కదా?

ఇంతేకాక, మరొక వాదమున్నది నాయనలారా! అది ఏమనగా 'ఎక్సయిజు' ద్వారా వచ్చు ప్రభుత్వాదాయము తగ్గిపోవుననియు, ప్రజాహిత కార్యక్రమములు చేపట్టుటకు ప్రభుత్వమునకు కష్టమగుననియు వీరి వాదము. ఇట్టి ఆర్థిక శాస్త్రవేత్తలను కట్టకట్టి బంగాళాఖాతములో పారవేయనక్కరలేదా? మద్యపాన నిషేధముకంటే ఇప్పుడు ప్రజాహిత కార్య క్రమమేమున్నది? ఆ విధముగా వచ్చు నష్టము ప్రజాహిత కార్యక్రమము వలనగాదా. అట్టి నష్టమును ప్రభుత్వము భరింప నక్కరలేదా! అదియును కాక 'మద్యపాన నిషేధ' మమలులో ఉన్నప్పుడు 'ఎక్సయిజు' ద్వారా వచ్చు లోటును భర్తీ చేయుటకే కదా దేశములో మొట్టమొదటి సారిగా శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారి వాణిజ్యపు పన్నును ప్రవేశపెట్టిరి. ఇప్పుడటు వాణిజ్య పన్నులను, ఇటు ఎక్సయిజును రెంటిని విధించి, ప్రభుత్వ ఖజానాలను నింపుచున్నారా? నాయనలారా! ప్రజాహితమును మాని, ప్రభుత్వ ఖజానా నింపుటయే మన ధ్యేయమా! అటులయిన వెంటనే "ప్రభుత్వ వేశ్యా గృహములను", "ప్రభుత్వ జూద గృహములను" కూడ తెరపింపుడు. ప్రభుత్వాదాయము రెట్టింపగునే!

దేశములో జరుగుచున్న నేరములలో నూటికి ఎనుబది శాతము మద్య పానపు మత్తులోనే జరుగుచున్నవని తెలియుచున్నది కదా! స్త్రీలపై దేశములో జరుగుచున్న అత్యాచారముల సంగతి చెప్పనేల? ఈ మద్యపానము వలన మగువలకు ఇంటను, బయటను కూడ రక్షణ లేకుండ పోయినదే!

అందుచేత, ఇప్పటికైనను శ్రేయోరాజ్య స్థాపనమునకు మొదటి మెట్టుగా భారత దేశమందంతటను మద్యపాన నిషేధ మమలుచేయుడు. దేశములో జరుగుచున్న నేరములను, అత్యాచారములను ఆపుడు. దేశములో శాంతిభద్రతలను నెలకొల్పుడు. బాపూ కన్న కలలను ఫలవంతముచేయుడు. మద్యపాన దాస్యశృంఖలముల నుండి భారతీయులను విముక్తులను చేయుడు.



ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# సినీ కవులు - విమర్శ

జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! అది నగరమందొక ముఖ్యమయిన కేంద్రము. అక్కడొక హాలు కలదు. ఆ ప్రాంగణమంతయు విద్యుద్దీపములతోను, రంగురంగుల జండాలతోను, పచ్చని మామిడి తోరణములతోను, ద్వారమున కిరువైపుల నరటి చెట్లతోను అలంకరించబడినది. ప్రధాన ద్వారము వద్ద వ్రేలాడ దీయబడిన బోర్డు ప్రజలకు 'స్వాగతము' పలుకుచున్నది. లోని కార్యక్రమమేదియో తెలిసికొనగోరి నేను లోన ప్రవేశించితిని. 'వేదిక' పైన బట్టపై వ్రాయబడిన బ్యానరుపై 'సుప్రసిద్ధ సినీకవి శ్రీ లక్ష్మీదాసుగారి సన్మాన సభ' అని వున్నది. వహవ్వా! ఇక చెప్పవలసినదేమున్నది - అసలే కవి! అందునా సినీ కవి! దానికి తోడు ప్రముఖ సినీనటి తాయారమ్మ ఉరఫ్ 'తారశ్రీ' సన్మాన కార్యక్రమమును నిర్వహించుచున్నది. సమావేశ ఆరంభమునకు, పూర్వమే జనము తండోపతండములుగా సభాస్థలికి చేరుకుని కుర్చీలలో బారులు తీరిరి.

ఇంతలో ఒక కార్యకర్త మైకు ముందుకు వచ్చి ఇట్లు పలికెను:

"సోదర సోదరీమణులారా! కార్యక్రమ మారంభ మగుటకు ఇంకను కొంచె మాలస్యమున్నది. ప్రముఖ సినీ కవి శ్రీ లక్ష్మీదాసుగారు ఇంటి వద్ద నుండి బయలు దేరినారు. సినీనటి 'తారశ్రీ' గారు ఇంకా మేకప్ రూమ్‌లోనే లాకప్ అయివున్నారని తెలిసినది. వారు వచ్చులోపల రెండు పాటలను పాడెదను. శ్రద్ధతో ఆలకించుడు" అని పలికి పాటనందుకొన బోయెను. ఇంతలో ఆ సంస్థ కార్యదర్శి కాబోలు, పాట పాడినచో వచ్చిన ప్రేక్షకులు సహితము పారి పోవుదురని భయపడి అతడిని వారించెను. కొద్దిగా సంఘర్షణ జరిగిన శబ్దము మాత్రము మైకులో వినబడినది.

ఇంతలో సినీకవి శ్రీలక్ష్మీదాసుగారు స్వంతకారయిన పెట్రోలు ఖర్చగునని కాబోలు, కార్యకర్తలేర్పాటు చేసిన కారులో గర్భాదానపు పెండ్లికొడుకువలె అలంకరించుకుని సమావేశస్థలము చేరికొనెను. సమావేశ మరగంట ఆలస్యముగా ఆరంభమయినది. ప్రార్థనానంతరము సినీనటి 'తారశ్రీ' నూతన వధువువలె సిగ్గుపడుచు కవిగారి మెడలో

పూలమాలవేసి, అతనికి నూతన వస్త్రములిచ్చి సత్కరించినది. సభాస్థలియంతయు ఈలలతో, కేకలతో, చప్పట్లతో మారుమ్రోగినది. అటు తరువాత కవిగారు తనను గూర్చి తాను వ్రాసికొని యిచ్చిన వ్యాసమును సినిమాడైలాగులవలె గడగడ వల్లించి తన కుర్చీలో కూర్చొనినది.

అటు తరువాత నగరములోని వివిధ వ్యక్తులు, సాంస్కృతిక సంస్థలు కూడ యథాశక్తి పూలమాలలను సమర్పించి కవిగారి యెడల తమకు గల గౌరవమును ప్రకటించుకొనిరి.

తరువాత, లక్ష్మీదాసుగారు పూలదండలలో నుండి ముఖమును పైకెత్తి పెండ్లి కొడుకువలె సిగ్గుపడుచు ముసిముసి నగవులతో ఇట్లు ప్రసంగించెను :

'సోదర సోదరీ మణులారా! మరల పది సంవత్సరముల వరకు సన్మానమవసరములేనంత ఘనముగా సన్మానించినారు (అనగా మరల పది సంవత్సరముల తరువాత సన్మానము చేయుడని కవి హృదయము కాబోలు). ఇట్టి సన్మానమునకు నే నర్హుడను కానేమో అనిపించుచున్నది (ఆ మాట ముందు చెప్పిన ఎంత బాగుండును అని ఒకడు వెనుకనుండి అరచి నాడు). మీరు నా యెడల చూపుతున్న ఆదరాభిమానములకు నా కృతజ్ఞతలు, అని ఆత్మస్తుతి, పరకవినిందతో దాదాపు ఒక అరగంట ప్రసంగించి కూర్చొనెను.

తరువాత అనేక మంది లక్ష్మీదాసుగారిని సంకీర్తిస్తూ ప్రసంగించినారు. అప్పుడు నేను ఇట్లు ప్రసంగించితిని:

'నాయనలారా! సినీ కవులనగా సామాన్యులా? వారి కలమునకు రెండు వైపులా పాళీలే కదా! వారు ఘటనాఘటన సమర్థులు. పూర్వకవులు రెండేసి అర్థములువచ్చు ద్వర్థికావ్యములను రచించుటకు ఎన్ని పాట్లు పడిరి! ఎంత కృషి చేసిరి! వారందరూ మీ ముందు దిగదుడుపే కదా! అవలీలగా, అలవోకగా రెండేసి అర్థములు వచ్చు పాటలు వ్రాయుటలో మీరు చూపుతున్న నేర్పు, కూర్పు వారికేది? రాఘవపాండవీయ కర్త పింగళి సూరన మీ ముందు తల ఒగ్గవలసినదే కదా! హరిశ్చంద్ర నలోపాఖ్యానము మీ ఒక్క సినీగీతము ముందు బలాదూరే కదా!

ఆహా! ఏమి చతురత! ఏమి రచనా పాటవము! ఏమి శైలి! ఏమి శిల్పము ! అల్పార్థ పదములతో అనల్పార్థ రచన చేసితినని పాల్కురికి సోమనాథుడు గర్వమున చెప్పికొనినాడు కదా! ఏదీ? మీవలె ఆ! ఊ! వంటి అలతి, యలతి పదములతో అనంతమయిన అర్థము నిచ్చునట్లితడెప్పుడయిన ప్రయోగించినాడా? అతనికంత


పాండిత్యమెక్కడిది? అతని కంత భాషాపటిమ యెక్కడిది?

నాయనలారా! మీకంటే మదన, మన్మధలలో పడినశృంగార కథలు వ్రాయు కథారచయితలు వేయింతలు మేలు కదా! వారు చెప్పదలచుకున్న దేదో సూటిగా, పచ్చిగా చెప్పుచున్నారు. అందరికీ అర్ధమయిన భాషలో, అతి స్వల్ప పదములతో అనంత సాహిత్యము సృష్టించుచున్నారు. ఏదీ? మీకా నిజాయతీ ఏదీ? పైకి చెప్పునదొకటి- లోనచేయునదొకటా! చెప్పునవి శ్రీరంగనీతులా! దూరునవి దొమ్మరిగుడిసెలా! పలుకునవి సామాజికవాద సిద్ధాంతములా! వ్రాయునవి బూతుల బుంగలా! మీదు మిక్కిలి, గాయనీగాయకుల గొంతు విరుపులతోనూ, నాయికానాయకుల ఒంటి విరుపులతోనూ, మా పాటలకర్ధము మారిపోవుచున్నదని వాపోవుటలా! ఇది వరలో పాటలకు లేని గొంతు విరుపులు, ఒంటివిరుపుల ఇపుడెక్కడినుండి వచ్చినవి? ఇట్టి పాటలు వ్రాయుటకై మీ మధ్య పోటీలా! తగవులా!

పోనీ పొట్ట కూటికి చేయుచున్నారను కొందమన్న అదియును కాదే! మీలో చాలామంది చక్కని పదవులలో, ఉద్యోగములలో వుండి వేల రూపాయలు జీతములు సంపాదించుకొను చున్నవారే కదా! అయ్యయ్యో! పొట్టకూటికయిన ఇట్టి కవిత్వమును వ్రాసి జాతిని నాశనము చేయుటకంటె ఆకలితో మరణించుట మేలుకదా! ఆ పూట తిన తిండిలేక బిచ్చగాడు సహితము రాముని పేరునో, శివుని పేరునో స్మరించుచూ బిచ్చమెత్తుకొనుచున్నాడు గాని బూతు పాటలను పాడి పొట్టపోసుకొనుట లేదే! మరి మీకిదేమి జాడ్యము! బిచ్చగాడి విలువచేయని మీ జీవితమును మిగుల్చుకుని ఏమి చేసికొందురు! మీ జీవిత పరమార్ధమేమిటో ? కేవలము ధన సంపాదనమేనా! సమాజశ్రేయస్సుతో మీకు నిమిత్తము లేదా? వహవ్వా! ఇట్టి మీకు సన్మానములా! మీ పాటలకు ప్రచారమా! ఆ పాటలకొరకై నిరీక్షణలా! శహబాష్!

అయ్యయ్యో! దేశమునకు నేతృత్వము వహించవలసినవారే! జాతిని తీర్చి దిద్దవలసిన వారే! ముందుకు నడిపించవలసిన వారే ! విద్యావంతులే! వివేకవంతులే ! మేధావివర్గములోనివారే! మీరు చేయవలసిన పనియేనా యిది! ఇదేనా మీ కవిత్వమునకు పరమార్ధము!

నాయనలారా! ఇప్పటికయిన ఈ ద్వంద్వార్థ గీతములు వ్రాయుట అపుడు. డబ్బాశకు పోయి మీ రపకీర్తి పాలు కాకుడు. యువతను పెడత్రోవ పట్టింపకుడు. సందేశాత్మక కవిత్వముతో వారిని సన్మార్గమున నడుపుడు. జాతిని జాగృతము చేయుడు మీ జన్మను ధన్యము చేసికొనుడు. తెలుగు తల్లిని దన్యము చేయుడు- సెలవ్.



ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# అభిమాన సంఘములు

*అంతకు ముందేమి ప్రసంగించెనో గాని నేను సభాభవనము ప్రవేశించుసరికి, జంఘాలశాస్త్రి ఇట్లుపన్యసించు చుండెను:*

ఆహా! ఏమి కోలాహలము! ఏమి యార్భాటము! ఏమి వైభవము! ఎక్కడ చూచినను మంగళతోరణములే! ఎక్కడ చూచినను స్వాగత ద్వారములే! ఎక్కడ చూచినను ఆ మహానటుని చిత్రపటములే! దారి పొడుగునను పూలమాలల సమర్పణములే! కర్పూర నీరాజనములే! అక్షతల జల్లులే! అది ప్రముఖ సినీ నటులు శ్రీ నటేశ్వరరావు గారి నూరవ చిత్రము అర్ధ శతదినోత్సవ సందర్భముగా ఆ సినీ నటునికి అభిమాన పురస్సరముగా ఏర్పాటు చేయబడిన అభినందన సభ యొక్క ఆర్భాటము నాయనలారా! నగరములో ఒక ముఖ్యమయిన కూడలినుంచి ఊరేగింపు ఆరంభింపబడినది. నటశేఖరుడు తెల్లని మల్లెపూవు లాంటి పంచెతో, తెల్లని చొక్కాతో, తలపై విగ్గుతో ముఖమున కరచేతి మందము కోటింగుతో, గోల్డు ఫ్రేము కళ్ళజోడుతో, అరవైలోనే ఇరవై వయస్సు వచ్చినట్లు, కార్యము గదిలోనికేగుచున్న గర్భాదానపు పెండ్లి కొడుకు వలె ముసి ముసి నగవులు చిలుకరించుచు, ఓపెన్‌టాప్ కారులో నిలువబడి నిజ జీవితంలో కూడ నటించుచుండెను. అభిమాన సంఘాధ్యక్షుడు శ్రీ రామచరణముల సన్నిధిని వ్రాలిన హనుమంతుని వలె ముడుచుకొని, అతివినయముగ అతని కాళ్ళవద్ద కూర్చుండెను. ముందు వెనకల గల అభిమాన సంఘ సభ్యులు, వివిధ వాహనములలో ఊరేగింపులో పాల్గొనుచు 'జయ నటశేఖరా! జయ నటసార్వభౌమా! జయ నటసమ్రాట్! జయ నటరత్నా! జయ నవరస నట సార్వభౌమా! జయహో! అను నినాదములు చేయుచు ముందునకు సాగుచుండిరి. విషయ సంగ్రహణార్థినై నేనును ఊరేగింపులో చేరితిని. ఇట్లు ఊరేగింపు కొంత దూరము సాగినది ఇంతలో ఊరేగింపులో కొంత కలకలము ఆరంభమైనది.

'ఛీ! తుచ్ఛులు! ధూర్తులు! దుర్మార్గులు! మన కెదురొత్తురా! ఎటుల వచ్చెదరో చూచెదము. మర్యాదగా వైదొలిగిరా సరే! లేకున్న వారి శవముల పైనుండి ఊరేగింపు సాగిపోవలసినదే!' అను హుంకారములు వినవచ్చినవి. ఏమయినదో నన్న ఆతురతతో నేను రవంత ముందుకు పోయి చూచితిని. అచ్చటొక సినిమాహాలుకలదు. అందు

మరొక కథానాయకుడు నటించిన చిత్రము ప్రదర్శిచబడుచున్నది. ఆ కథానాయకుని అభిమాన సంఘము వారు, ఈ కథానాయకుని అభిమాన సంఘమువారి ఊరేగింపు నడ్డగించినారు.

"ఈ సందు మరలు వరకు మీ నటశూన్యులు కారుదిగి, మేళతాళములు, జయ జయ ధ్వానములు లేకుండా మెల్లగ కాలినడకన పోవలసినదే! లేకున్న యూరేగింపును సాగనీయమని" ప్రతిపక్షము వారు పలికిరి.

"మా కథానాయకుడేమి పేడివాడా? పిరికివాడా? శతాధిక చిత్రరాజములలో నిండా నటించి, అతి బలవంతులయిన ప్రతినాయకులను సహితము అవలీలగా జయించిన మా నాయకునకు మీరేమి లెక్కయా? మర్యాదగా దారి తొలగుడు- లేకున్న దారి తొలగించ వలసి వచ్చును" అని యా పక్షము వారు పలికిరి.

"మా నాయకుని నటన ముందు మీ నాయకుని నటన సూర్యుని ముందు దివిటీ వంటిది. మా నాయకుడు నటించిన చిత్రము ప్రదర్శింపబడుచున్న హాలు ముందరనుండి మీ నటుడు ఊరేగింపుతో వెళ్లుట కర్జుడు కాడు. అట్లు వెళ్లుట మేము సహింపము. ఊరేగింపు ఎట్లు సాగునో మేమును చూతుము. కారు దిగకుండా అంగుళము ముందునకు జరిగిరా 'పుచ్చెలు' నేల రాలవలసినదే!" అని పలికిరి.

"ఊరేగింపు ముందుకు సాగనిండు. ఎవడడ్డువచ్చునో చూతము" అని అభిమాన సంఘాధ్యక్షుడు పలికెను.

ఇంతలో సంకులసమర మారంభమైనది. కఱ్ఱలు విరుగుచున్నవి. కత్తులు దూకుచున్నవి. సైకిలు చైనులు ఎగురుచున్నవి. బాహాబాహి, కచాకచి, ముష్టా ముష్టి యుద్ధములో కొందరి కళ్ల జోళ్లు విరిగినవి. కొందరి చెంపలూడినవి. కొందరి చొక్కాలు చినిగినవి. కొందరి బొత్తాములూడినవి. కొందరి చెప్పులు తెగినవి. కొందరి తలలు రక్తసిక్తములయినవి.

కథానాయకుడు తక్షణమే రంగములోనికి దిగి, సినిమాలోవలె ప్రతిపక్షుల నందరను చిత్తుచేయును కాబోలు నని నేనూహించితిని. కాని, ప్రతి చిత్రములోను కథానాయికను ప్రతినాయకుని బారి నుండి రక్షించి, సురక్షిత ప్రదేశమునకు చేర్చి ప్రతినాయకునితో సంకుల సమర మొనర్చెడి కథానాయకుడు, ఈ సారిమాత్రము, తానే సురక్షిత ప్రదేశము చేరికొని, బ్రతుకు జీవుడా అని యూపిరి బీల్చుకొనెను.

.అంతవరకును సినిమాషూటింగ్ చూచుచున్న వారివలె నిలువబడిన రక్షకభటులు సభ్యులలో ఇంకను కొట్టుకొను నుత్సాహము లేమింజేసి, రంగములోనికి దిగి, ఇంకను

దెబ్బలు తినకుండ నున్నవారికి రెండేసి లాఠీపోటుల ప్రసాదించి, తాము వచ్చినపని పూర్తయినట్లు అక్కడి నుండి నిష్క్రమించిరి. ఇంకను అక్కడ ఉండినచో ధర్మనిరతులు, ప్రజాసేవా పరాయణులు అయిన ఆ రక్షక భటులు వంతుపోకుండ నాకును రెండు పోట్లు ప్రసాదించెదరని గ్రహించి అటనుండి మెల్లగ జారుకొంటిని.

అయ్యయ్యో! దేశమెంత దిగజారిపోయినది! జాతి ఎంత నిర్వీర్యమయినది! యువకులెంత ఆలోచనా రహితులై ప్రవర్తించుచున్నారు! ఎంత బాధ్యతారహితులై వర్తిల్లుచున్నారు! నాయనలారా! వారు నటించిన చిత్రములు బాగుగనున్న చూడరాదా! చూచి సంతోషింపరాదా! డబ్బు లధికముగును పదిమంది మిత్రులకు చూపించరాదా! అంతియే గాని ఇదేమి పోగాలము! వారికై అభిమాన సంఘములా! ఆ సంఘముల తరపున సన్మానములా! ఊరేగింపులా! పూలమాలా సమర్పణములా! కర్పూర నీరాజనములా! నారి కేళ నైవేద్యములా! వారు నటించిన చిత్రములు విజయవంతము కావలయునని మ్రొక్కుబడులా! ముడుపులా! పూజలా! నైవేద్యములా! ప్రతిపక్షుల సినిమా పోస్టర్లపై గోమయపు రంగవల్లికలా!


అయ్యయ్యో, ప్రొద్దుటే లేచి చంద్రశేఖరునికైన శిరమువంచి, అంజలి ఘటింపని వారు, నట శేఖరునికి నారికేళ నైవేద్యము లొసగుచున్నారు. శ్రీ రామ కల్యాణము నాడయిన ఊరేగింపునకు బయలు దేరని వారు నటశూన్యుని నూతన చిత్రము యొక్క అర్ధశతదినోత్సవమునకు ఆరుమైళ్ల యూరేగింపులను తీయుచున్నారు. అశోకుడేకాలమందు భారతదేశమును పరిపాలించెనో చెప్పలేడు గాని ఏ కథానాయకుడెన్ని చిత్రములలో నటించెనో తడుముకొనకుండ చెప్పగలడు. "శివాజీ"ని తెలియకపోవచ్చుగాని "శివాజీ గణేశన్" ఎవరన్న చిటికెలో చెప్పగలరు.

నాయనలారా! ఇప్పటికయినను ఈ వ్యక్తి పూజను మానుడు. ఈ యభిమాన సంఘములను మూసివేయుడు. కళల యెడల, కళాకారుల యెడల, అభిమాన ముండవలసినదే! అటులని ఈ విధముగ దురభిమానమును పెంచుకొనరాదు. మంచి ఎక్కడ యున్నను స్వీకరింపుడు! కళోపాసకులనిపించుకొనుడు! అంతియే గాని యిట్లు "అభిమాన సంఘము'లపేర గిరిగీసుకొని కళామతల్లికి ద్రోహము చేయకుడు. అడ్డు గోడలు నిలుపకుడు. ఈ సంఘముల నడపుటకు, అవసరమైనప్పుడు దెబ్బలాటకు వలయు ఆయుధములు కొనుట కుపయోగించెడి డబ్బుతో చక్కని నాటక ప్రదర్శనముల నేర్పాటు చేసి మీ కళాభిమానమును వ్యక్తము చేయుడు. సెలవ్.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

మరో జంఘాలశాస్త్రి

అయలసోమయాజుల నాగేశ్వరరావు



# కవి సమ్మేళనము

***జం***ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! నగరములో ఏదియో సాహితీ సంస్థ సాహిత్యసభ నేర్పాటు చేసినదని విని అచ్చటికి పోయితిని. ఎవరో కవి విదేశ పర్యటనము చేసి, స్వదేశము చేరినందులకు అభినందన సభయట. ఆహా, తెలుగు భారతి కెట్టి దుస్థితి దాపురించినది? తెలుగు సంస్కృతి యెంత దిగజారిపోయినది? తెలుగు సాహిత్య సంస్థలెంత దుర్దశలోనున్నవి? నిర్వహించుటకు సాహితీ కార్యక్రమములే కరువాయెనా? వేలాది తెలుగు కవుల కావ్యపరిమళాలను సామాన్య పాఠకున కందించరాదా? వందలాది 'కవుల' సాహిత్య వ్యక్తిత్వములపై ప్రసంగముల నేర్పాటు చేయరాదా? సమాజములో సామాన్య మానవుడు నిత్యమూ ఎదుర్కొను సమస్యలను తీసి కొని గోష్ఠులను నిర్వహించరాదా? చర్చా కార్యక్రమముల నేర్పాటు చేయరాదా? వ్యాసములు వ్రాయించరాదా? అచ్చొత్తించరాదా? మహనీయుల మహితోక్తులను, వారి జీవిత విశేషములను వెలువరించరాదా? వెలుగులోనికి తేరాదా? వారి సందేశములను ప్రజానీకమున కందించరాదా? తెలుగు సంస్కృతిని పునరుజ్జీవింప జేయరాదా? తెలుగుభాషను సముద్ధరించరాదా? ఏమియు లేకున్న నోరు మూసికొని పడియుండరాదా? ఎందులకిట్టి కార్యక్రమముల నిర్వహణము? వహవ్వా! ఆస్థానకవి ఆస్ట్రేలియా తిరిగి వచ్చినందులకు అభినందన సభయా? మహాకవి మలేషియా యాత్రకు మహాసభయా? రసిక కవి రష్యా పర్యటన ముగించుకొని వచ్చినందులకు సమావేశమా? అభ్యుదయ కవి అమెరికా యాత్ర సందర్భమున సన్మాన సభయా? విప్లవ కవి వియత్నాం పర్యటన ముగిసినందులకు సభా? అధికారి అండమాన్ నుండి ఆంధ్రదేశమునకు బదిలీ అయినందులకు సభా? కవిగారికి జ్వరము వచ్చిన, ఆయనకు ఆయురారోగ్యములు కూర్చుమని భగవంతుని ప్రార్థించుటకు సభయా? జ్వరము తగ్గిన తరువాత తన జ్వరానుభవములను గూర్చి విన్నవించుటకు వేరొక సమావేశమా?

నాయనలారా, "కుక్క" చంద్రమండలమునకు పోయి, తిరిగి వచ్చిన ఈ రోజులలో ఎవడో, ఏ దేశమో పోయి తిరిగివచ్చినందులకు అభినందన సభయా? ఆ

సందర్భముగా "కవి సమ్మేళనము" లా? కవుల వీరావేశములా? హుంకారములా? అహంకారములా? నాయనలారా, వివాహమునకు "జోడు సన్నాయి" మేళముగాని విడాకులకెందుకు? వధువునకు మల్లెపూల సింగారముగాని వితంతువనకెందుకు? గాంధీజీ 'దండి' యాత్రపై కవి సమ్మేళనముగాని, అప్పలయ్య గారి అండమాన్ యాత్రపై కవి సమ్మేళనము యెందులకు? అని నాలో నేను అనుకొనుచుండగానే, మామూలుగానే అరగంట ఆలస్యముగ సమావేశమారంభమైనది. పేరు సరిగ వినబడలేదుగాని ఎవరో "సాహితీ చైతన్యమూర్తి" సభాధ్యక్ష స్థానము నలంకరించెను.

ప్రార్థనానంతర మతడు లేచి, తన ప్రక్కన కూర్చున్న "దిగుమతి కవి"ని గూర్చి ఒక సారి కార్యక్రమ పట్టికయందు దృష్టి నిలిపి కవిగారి పేరు మననము చేసికొని – ఉన్నవి, లేనివి కలిపి అంత్య ప్రాసలు తప్పకుండా ప్రసంగించి, అట్టి సభకు తానధ్యక్షుడుగ నుండుట తన పూర్వజన్మ విశేషమని పలికెను (మీ చేతలలో పూర్వజన్మ వాసన స్పష్టముగ కనబడుచున్నదని వెనుకనుండి ఎవడో చమత్కరించెను). అంత నా కవిసత్తముడు తన విదేశ అనుభవములను చెప్పి, విసిగించి, వారు చాలించుమని చేసిన కరతాళ ధ్వనులను తన ఉపన్యాస పటిమకు నిదర్శనముగా నెంచి, శిరః కంపనము చేయుచు, చిరునవ్వు దొలుకాడ ఆశీనుడయ్యెను.

అంత వరకూ నిద్రమత్తులోనున్న కవి కిశోరములు, ఒక్కసారి తమ తమ చొక్కా జూళ్ళను, కళ్ళజోళ్ళను సవరించుకొని కవి సమ్మేళనమునకు సిద్ధమయినవి.

పేరు చెప్పగనే ప్రతి కవీ వెయ్యి వాట్ల విద్యుత్కాంతితో ముఖముల వెలిగించినాడు. చిరునవ్వులు చిలుకరించినాడు. అందరినీ పలుకరించినాడు. ఇరువది నిమిషముల ఉపోద్ఘాతముతో, రెండు నిమిషముల తన కవితను ముగించి, కరతాళ ధ్వనులు చేయుటకై వెంటతెచ్చిన మిత్రుల కార్యదీక్షా దక్షతను మెచ్చి కొనుచూ, ప్రేయసిని విడిచిన ప్రియునివలె దిగాలుపడి, మైకును విడిచి తన స్థలమునకు చేరికొనుచున్నాడు.

ఈ మధ్యనే ఏబదివేలు కట్నము తీసి కొని వివాహము చేసికొని, అలుకకట్నముగా ఇచ్చెదమన్న "స్కూటరు" నీయలేదని, అగ్నిసాక్షిగా తాళిగట్టిన భార్యను కాపురమునకు తీసికొనిరాని లక్ష్మీపతిరావు –

"వరకట్నం వధువుల పాలిట పిశాచం
దాన్ని తీసుకోవడం మహా నీచం
రక్షించండి భారత స్త్రీ జాతిని
శిక్షించండి వరకట్న పిశాచిని"

అని కవితను పఠించి చప్పట్లు చరిపించుకున్నాడు. రూపాయి పావలాకి రిక్షాను బేరమాడి, రూపాయిని రిక్షావాడి చేతిలో పెట్టి, చీదరించుకుని, వదిలించుకున్న ఓ అభ్యుదయకవి.

*"కార్మిక కర్షకుల కలిసికట్టు*
*దోపిడివర్గాల ఆటకట్టు*
*ఈ దోపిడీనిక సాగనీయం*
*ఈ దౌర్జన్యాన్నిక మననీయం*
*చివరిదాకా పోరాటం సాగిస్తాం*
*చివరకు మేమే గెలుస్తాం"*

అని విప్లవ గీతాన్ని వినిపించాడు చీటికీ మాటికీ భార్య ననుమానించి, అవమానించే సందేహాలరావు.

*"స్త్రీ జాతి మేల్కొనాలి*
*బానిసత్వాన్ని విడనాడాలి*
*సమతా మార్గంలో సాగిపోవాలి*
*జాతినే జాగృతం చేయాలి"*

అంటూ స్త్రీ జనాభ్యుదయ గీతాన్ని వినిపించాడు.

*"ఆకలితో చావడమెందుకు*
*పోరాడే చద్దాం*
*పోరాటం మన జన్మహక్కు*
*ఎవడు కాదంటాడో చూద్దాం"*

అంటూ భుక్తాయాసంతో తన ఆకలి కవితను చదవలేక కన్నీళ్ళను చిలుకరించాడు– మరోకవి.

ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసికొనే దమ్ములేక తోకముడిచిన ఓ ప్రేమకుమారుడు–

ప్రేయసీ!

*"ఈ పేదవాడు నీకేమివ్వగలడు?*
*ఉన్న ఒక్క హృదయాన్నీ ఏనాడో ఇచ్చేశాడు*
*ఇక ఇవ్వడానికి తనకంటూ ఏమీలేని*
*ఈ బికారిని కనికరించు*
*నీ హృదయాన్ని భిక్షగా పెట్టి ఆదరించు"*

అంటూ ప్రేమకవిత్వం ఒలకబోశాడు.

ఏనాడూ తన చెల్లెలినయినా ఆప్యాయంగా ఎత్తుకోని ఓ బాలకవి-

"పసిపాప బుగ్గలు
అప్పుడే విచ్చిన ఎర్రగులాబీ మొగ్గలు
ఆ లేత పెదవులు
మామిడి చిగురులు
నేటి బాలలే రేపటి నేతలు
దేశ భవిష్యద్విధాతలు"

అని చనుబాల కవిత్వాన్ని వినిపించాడు.

సభాధ్యక్షుడు మధ్యమధ్య తన చిన్ననాటి జోకులను విసరుచు సభాకార్యక్రమము ను జనరంజకముగా నిర్వహించెను.

ఆహా! వీరి కెంత యహంకారము? "కవి" యనగానే తనకీ ప్రపంచముతో సంబంధము లేనివానివలె, నిరంకుశునివలె ప్రవర్తించును. రెండు పంక్తులను అంత్య ప్రాసలు కలిపి వ్రాయుటతోనే తను ఏ "శ్రీశ్రీ"యో, "తిలక్కో" అయిపోయినంత గర్వము. మిగిలిన కవులెల్ల తన కాలి కొనగోటికయినను సాటి రారని అహంభావము. నన్నయ మొదలుకొని నానాసాహెబు వరకు గల అందరు కవులను తిట్టును. తన కృతికి తానే ప్రచురణకర్త; తానే విమర్శకుడు, తానే పారకుడు; తను వ్రాసినది తప్ప వేరొకరు వ్రాసినది చదువడు; ఇంకొకరు చేసిన విమర్శను సహింపడు; సలహాను స్వీకరింపడు; మరింక వీడు బాగుపడుటెట్లు; పరిణతి చెందుటెట్లు. గుణింతము వచ్చిన వాడెల్ల కవియే! వాక్యనిర్మాణము చేయగలవాడు మహాకవి; ఆకలినిగూర్చి వ్రాయువాడు అభ్యుదయ కవి!!

ఒక్కనికీ నిజాయితీ లేదు. తను వ్రాయు కవిత్వము లోకమునకుగాని, తనకు కాదని యాతని నమ్మకము. శరీరమునకు వెన్నెముకవలె - కవికి నిజాయితీ అత్యంత ప్రధానమైనది. నిజాయితీ లేని కవియొక్క కవిత్వము ఊరికి దారి తెలియచేయు బోర్డువలె మార్గనిర్దేశికముగనే మిగులునుగాని, జాతిని నడిపింపజాలదు; జాగృతము చేయజాలదు. అట్టి కవి "కవి"గ మిగులవచ్చునేమో గాని "యుగకర్త" కాలేదు; "వైతాళికుడు"గ రాణించలేదు - అనినాలో నేననుకొనుచు ఇల్లు చేరితిని.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# జంతుప్రదర్శనశాల - వింత స్వప్నము

జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! ఆ మధ్య ఒక మిత్రుడు కోరగా అతనితో కలసి జంతు ప్రదర్శనశాలకు పోయితిని. రకరకములయిన జంతువులతో, వింత వింత యరపులతో, సింహగర్జనలతో, వ్యాఘ్రముల గాండ్రింపులతో, కోతుల కిచకిచలతో, గజముల ఘీంకారములతో, పక్షుల కిలకిలలతో యువతీ యువకుల కలకలలతో ఆ ప్రదేశమంతయు మారుమ్రోగుచున్నది.

కొంతమంది మనుష్యులు సహితము కోతులను చూడగనే, తమ పూర్వ జన్మ జ్ఞప్తికి వచ్చి కాబోలు, హనుమంతరావులగుచున్నారు. ఇట్లు జంతు ప్రదర్శనశాలను చూచి, వచ్చి పరుండిన నాకు ఒక వింత స్వప్నము వచ్చినది.

అది ఒక పెద్ద మైదానము. ఆ మైదానములో పెద్ద పెండాలు ఏర్పాటు చేయబడినది. ఆ మైదానమునందు రకరకముల జంతువులు ఒక చోట చేరి యున్నవి. ఆహా! ఏమని చెప్పను నాయనలారా! సింహములు, పులులు, ఎలుగుబంట్లు, శరభములు, అడవిదున్నలు, జిరాఫీలు, జీబ్రాలు, ఏనుగులు, సాంబారులు, జింకలు, లేళ్లు, కోతులు, కొండముచ్చులు, ఒకటేమిటి? సృష్టిలోని సమస్త జంతుజాలమును అక్కడ చేరినవి. సభ తీర్చినవి.

అంతలో ముందు వరుసలో నున్న ఒక శార్దూలము సభా వేదిక నలంకరించి ఇట్లు పలికెను:

సోదర సోదరీ మణులారా! ఈనాడు మనమందరము ఒక్కచోట చేరి నందులకు గల కారణము మీరెరుగనిది కాదు. ఈ నరజాతి పీడనము నుండి మనము తప్పించుకోవలెను. అప్పటికి గాని మనకు మోక్షము లేదు.

వీని మొగమీద్వ! ఏమి వీని యహంకారము? ఈ సృష్టికి తానే ప్రభువట. ప్రకృతి అతనికి బానిసయట. చీమకుట్టిన కొండలదరిపోవ బొబ్బలు పెట్టునే! ఎలుక కనబడిన పరుగులు తీయునే! పిల్లి "మ్యావు" మనిన తాను బావురు మనునే! అట్టి వీడు ఈ సృష్టికి ప్రభువా? మనమతని బానిసలమా?

వానికి మన నిస్వార్థత ఏది? మన మెప్పుడయిన, ఒక్క సంవత్సరమునకు కాదు, ఒక్క నెలకయిన సరిపడు ఆహార పదార్థములను నిలువ చేసికొనుచున్నామా?

ఎప్పుడాకలయిన అప్పుడు ఆ సమయమునకేది దొరికిన అది తిని బ్రతుకుట లేదా? మరి ఈ నరునకిదేమి పోగాలము? ఇంటిలో ఆహార ధాన్యపునిలువలా? బ్యాంకులో తెల్లధనపు సంచుల నిల్వలు! గోదాములలో నల్లధనపు సంచుల నిల్వలా? ఇళ్ళా వాకిళ్ళా! కారులా! ఫ్యాక్టరీలా! ఛీ! ఛీ ఎంత దిగజారిపోయినాడు. బ్రతుకంతయు కావలి కాయుటలోనే గడచిపోవుచున్న వీని జన్మకు ధన్యత యెక్కడిది?

థూ! వానికి మృగరాజుకున్న రీవి యేది? వ్యాఘ్రమునకున్న పట్టుదల యేది? ఏనుగునకున్న గాంభీర్యమేది? గుఱ్ఱమునకున్న చుఱుకుతనమేది? గాడిదకున్న ఓర్మి యేది? కుక్కకున్న విశ్వాసమేది? నక్కకున్న తెలివి యేది? గోమాతకున్న త్యాగమేది? కోకిలకున్న స్వరమేది? నెమలికున్న నాట్యమేది? చిలుకకున్న అందమేది? మనకున్న గుణములలో సహస్రాంశమైన లేని ఈ నరునకు అధికారమా! మనకు బానిసత్వమా! లేదు నాయనలారా! లేదు! ఇట్లుండుటకు ముమ్మాటికీ వీలులేదు. మన మందరము ఒక సంఘముగ నేర్పడి, సమైక్యముగ మన హక్కులకొరకు పోరాడవలసినదే.

ముందుగా మన యీ సంఘమునకు అధ్యక్షతవహించి, కార్యకలాపములను నిర్వహింపవలసినదిగా మృగరాజు కంఠీరవరావుగారి పేరునే నేను ప్రతిపాదించు చున్నాను" అని పలికెను.

అంత ఓనక్క నిలువబడి "భారత ప్రభుత్వము వారు జాతీయజంతువుగా శార్దూలమును గుర్తించిరిగాన, మృగరాజును అధ్యక్షునిగా ఎన్నుకొనుట రాజ్యాంగ బద్ధము కాదేమో?" అని పలికెను.

అంత వ్యాఘ్రేశ్వరరావు మరల నిలువబడి ఇట్లు పలికెను. భారత ప్రభుత్వమా! దాని నిర్ణయమా? మనలను సంప్రదించకుండ చేసిన ఏకపక్ష నిర్ణయమునకు మనము కట్టుబడి యుండనవసరము లేదు. కంఠీరవ వరులే మన ప్రభువులు మన మెప్పుడయిన ఎన్నికలు జరుపుకొంటిమా? నోట్లు జల్లి ఓట్లు పండించితిమా? వాగ్దానములు చేసితిమా? ఉపన్యాసములిచ్చితిమా? ఒక్కసారి ఓటు వేసిన మరల అయిదు సంవత్సరముల వరకు మీ జోలికి రామని హామీల నిచ్చితిమా? పదవులకై పార్టీలను ఫిరాయించితిమా? అయినను మనకేమి నష్టము వాటిల్లినది? కంఠీరవరావుగారి నీడలో మనమందరము చల్లగ నుండుటలేదా?

ప్రజాస్వామ్యము ననుసరించి వీరు సాధించినదేమున్నది? ఎన్నికలు, కులమత విద్వేషములు, ముఠాతత్త్వములు, అధికారముకొరకు కుమ్ములాటలు, భాషా తత్త్వములు, కొట్లాటలు, కోట్ల రూపాయల వ్యయము, రోజునకొక రాజకీయ పక్షము, వారమునకొక

ప్రధాని – ఇంతేనా నాయనలారా? భర్త కాంగ్రెసు, భార్య ఇందిరా కాంగ్రెసు; కొడుకు జనతా పార్టీ, మనమడు మార్కిస్టు, మనుమరాలు రైటిస్టు – ఇట్లున్నది వీరి రాజకీయ చైతన్యము. అట్టి ప్రభుత్వ నిర్ణయములు మనము పాటింపనవసరము లేదు. ముందుగా కంఠీరవరావుగారిని వేదిక నలంకరింపవలసినదిగా కోరుచున్నాను" అని పలికెను.

అంత కంఠీరవరావు జూలు దులుపుకొనుచు, వేదిక నెక్కి ఇట్లు ప్రసంగించెను.

"సోదర సోదరీ మణులారా! మీరు నాయందు, నా నాయకత్వమునందు చూపిన యాదరాభిమానములకు నా కృతజ్ఞతలు.

నాయనలారా! ఈ నరుడు మనతో సమానమగుటకు ఎన్నిపాట్లు పడవలయును. మనవలె నిస్వార్థముగ నుండిన నాడు, మనవలె కలిసి మెలిసి యుండిన నాడు, మన సోదర సాధు జంతువులవలె గడ్డిమేసిననాడు, తాను బోనులో నుండి మనలను స్వేచ్ఛగా తిరుగ నిచ్చిననాడు, ఆనాడు వీని జన్మకు సార్థకత.

నాయనలారా! ఈ మధ్యనే వీనికి కొలదిగా బాగుపడు లక్షణములు కనబడుచున్నవి. మన సఫారీ పార్కులో అతడు మనలను స్వేచ్ఛగా తిరుగనిచ్చి, తాను బోనులో నుండి మనలను చూచుటకు వచ్చుచున్నాడు. ఇది నిజముగ శుభ సూచకము. ఇట్లే ఈ ప్రపంచములోని నరులెల్లరు బోనులలో దూరి, మనలను స్వేచ్ఛగా తిరగ నిచ్చినప్పుడే, అప్పుడే నిజమయిన పురోగతి – నిజమయిన స్వేచ్ఛ, నిజమయిన స్వాతంత్ర్యము. అట్టి శుభ సమయ మాసన్నమగుచున్నది. ఉపన్యాసముకేమిగాని – మనము ముఖ్యమయిన నిర్ణయములు కొన్ని తీసికొనవలసి యున్నది. మన కార్యదర్శి శ్రీ శరభేశ్వరరావుగారు తీర్మానములు ప్రవేశపెట్టుదురు. వాటిని మనమందరము చర్చించి, ఆమోదించవలె"నని పలికి కూరుచుండెను అంత శరభ మొకటి లేచి ఇట్లు పలికెను:

"మిత్రులారా! దేశములోని ప్రజలు – "కవి సింహము" "అధ్యక్షశార్దూలము", "అమాత్య వృషభుడు", "నాట్యమయూరి" "కవికోకిల"ల వంటి బిరుదుల నొసగి మన పేరు ప్రతిష్ఠల నప్రదిష్ఠలపాలు సేయుచున్నారు. మన ఆవులను, ఎద్దులను ఎన్నికల చిహ్నములుగా వాడుకొని, వాటి నప్రదిష్ఠపాలు సేయుచున్నారు. మన పేరుల నిట్లు దుర్వినియోగము కావించకుండ నిషేధించుచు మన మొక తీర్మానము నామోదింపవలసి యున్నదని పలికెను. అంత నా తీర్మానము ఏకగ్రీవముగ నామోదింప బడినది.

"మనల నీ జంతు ప్రదర్శనశాలలో నుంచి టిక్కెట్టు పెట్టి, యాజమాన్యమువారు అక్రమ లాభములను గడించుచున్నారు. ఈ లాభములలో మనకు వాటా కలదు.

అందువలన ప్రతిదినము మనకు వేయుచున్న ఆహారమునకదనముగా ఒక కిలో మాంసమునో, ఒక మోపు గడ్డినో 'బోనసు'గా వేయవలయును. లేని యెడల మనము సమ్మె చేయుటకు సంసిద్ధులమై యుండవలెను" ఈ తీర్మానము కూడ ఏకగ్రీవముగ నామోదింపబడినది.


తరువాతిది కవులను గూర్చినది. కొంత మంది కవులు తమ రచనలలో, రంగులు మార్చు వానిని "ఊసరవెల్లి" తోను, జిత్తులమారి వానిని "నక్క" తోను, దొంగ కన్నీటిని "మొసలికన్నీటి" తోను పోల్చి, జంతు జాతి నవమానించుచున్నారు. వారలట్టి ప్రయోగములు విరమింప వలసినదిగా కోరుచూ తీర్మానమామోదింపబడినది.

జంతు ప్రదర్శన శాలలలోను, సర్కసులలోను మన సోదరులనేకులు బంధింపబడి యున్నారు. ఇది అన్యాయము; ఇది మన ప్రాథమిక హక్కులకే భంగకరము. మన సోదర జంతువులన్నింటిని తక్షణమే విడుదల చేసి మన యెడగల ఈ విచక్షణా విధానమును అంతము చేయవలెను. లేని పక్షములో మనము తిరుగబడి, మన మిత్రులను విడుదల చేయుదుమని హెచ్చరించుచు మరో తీర్మానము ఆమోదింపబడినది.

అటు తరువాత "బఫే" విందు ఏర్పాటు చేయబడినది. మధ్యగల పెద్ద బల్లపై ఒక వైపున మాంసాహారులకు మాంసమును, మరియొకవైపు శాకాహారులకు పచ్చగడ్డి మోపులును ఏర్పాటు గావింపబడినవి. విందు తరువాత సాంస్కృతిక కార్యక్రమ మేర్పాటు చేయబడినది. గాడిద పాటకు ఒంటె చేసిన నృత్యము సభాసదులను ముగ్ధులను చేసినది. ఈలలలో, కేకలతో సభాస్థలి దద్దరిల్లినది.

ఇంతలో తూర్పు తెలతెలవారినది. జంతువులలో కలకలము బయలు దేరినది 'అదిగో, క్యూ రేటరు వచ్చుచున్నాడు, రండు పోదమని అరచుచు జంతువులు నిష్క్రమింప పరుగులిడుచున్నవి. అంత మధ్యలో ఒక సింగపు పిల్ల లేచి "మిత్రులారా, యిప్పుడే కదా! మనము నరజాతి నెదిరించవలెనని తీర్మానించినది. మరి అట్లేల పరుగులిడుచున్నారు. నిలుడు... నిలుడు... అయ్యయ్యో పోవుచున్నారా" అని అరచెను. కాని అన్ని జంతువులును నిష్క్రమించినవి. ఆ పోవు తొందరలో ఒక జంతువునాపై బడినది – తుళ్ళిపడి లేచితిని. నాయనలారా! నాపై బడినది బల్లి. శివశివా యనుచు స్నానార్థము బయలు దేరిపోయితిని సెలవు.

***ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః***



# రామాయణ విమర్శ

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

రామా! రాజీవలోచనా! జగద్రక్షకా! జానకీనాథా! నేను పొరపాటున చూడలేదుకదా! లేదు నాయనలారా! లేదు! మనకంత యదృష్టమా! నిజముగ చూచితిని. ఒడలు చచ్చిపోవ – కన్నులు నీరుగార – గొంతు బొంగురుపోవ – మనసు డిల్లపడ చూచితిని. – అదేదో గ్రంథము నాయనలారా! పేరు గుర్తులేదు – కాని అందున్న విషయమేమనగా, వాల్మీకి వట్టి ఫూలనియు, రాముడు పనికిమాలిన వాడనియు, యశోలిప్సలో భార్య నడవుల పాలు చేసినాడనియు–నింక నేమేమో చేసినాడనియు ఆ గ్రంథమున వ్రాసి యున్నది.

ఆహా! ఆర్యావర్తమంతటను దేవతార్చనపు బెట్టెలలో పెట్టుకోదగినదే! ప్రతిదినమును పారాయణ చేయదగినదే! మన రక్తములో రక్తమై, చర్మమున చర్మమై, ఆర్యావర్తమున "క్యారు"మనునది మొదలు "హరీ" అను వరకు అందరకును ఆదర్శ ప్రాయమయినట్టిదే! అట్టి రామాయణము పైననా ఈ విమర్శ? సర్వోత్తముడయిన రామునిపైననా ఈ చెత్తల కుమ్మరింపు. మహాకవి వాల్మీకికా ఈ విమర్శకపు బుగ్గపోటులు?

నాయనలారా! ఏదేశమందైన, ఏకాలమందయిన దేశ, కాల, పాత్రము లెరుగక రచన చేసిన కవిని చూచినారా! కవి ఎప్పుడును మంచిని బోధించును. చెడును నిరోధించును. తాను గంజి ద్రావుచు, ఇతరులకు పంచభక్ష్య పరమాన్నముల విందు సలుపునే! తాను మట్టి చిప్పలో తినుచు శ్రోతలకు బంగారు పళ్లెరములందు విందు భోజనపు లేర్పాటులు చేయునే! తాను నేలపొరలుచు శ్రోతలను హంసతూలికా తల్పములందు పరుండపెట్టునే! అట్టి కవి, అందున వాల్మీకి వంటి మహామనీషి, విద్వాంసుడు, ప్రజలను చచ్చు పెద్దమ్మలను చేయుటకు కాకమ్మ కబుర్లు చెప్పినాడనుట పాడియా! అచ్చులో పేరు చూచుకొనవలెనని తపనలేదు. తన కవిత్వమెవ్వరు చదువలేదని ఏడుపులేదు. దేశకాల పాత్రములను బట్టి, ఆనాటి ధర్మములను బట్టి ప్రజలను మంచి మార్గమున నడిపించుటకై తనకు తోచినది, తాను విన్నది, తాను కన్నది, తనకు తెలిసినది వ్రాసినాడు.

అట్టి వాల్మీకి వట్టిపూలా? అతడు జరిగినదేదియో జరిగినట్టు వ్రాసినాడు - చూచినదేదియో చూచినట్టు వ్రాసినాడు. తెలిసిన దేదియో తెలిసినట్టు వ్రాసినాడు. అంతియే కాని వంట ఇంటిలో గూర్చుని వాయు విమాన ప్రయాణమును గూర్చి వ్రాయలేదే! ఇంటిలో చమురు లేకుండ ఇంపాల కారును గూర్చి కలలుగని వ్రాయలేదే! ఏడంతస్తుల గజ దంత భవనములలో కూర్చుండి పూరి గుడిసెలను గురించి వ్రాయలేదే! కడుపునిండ తిని ఆకలిని గూర్చి వ్రాయలేదే! చెడమడ త్రాగి మద్యపాన నిషేధమును గూర్చి వ్రాయలేదే! అట్టి వాల్మీకి శుంఠయా! అతనినన్న నీవు శుంఠవా? యోచించుకొనుము.

ఇక రాముడు రాజ్యమునకై భార్య నడవిపాలు చేసెనని, నీ చేటను రాముని వైపు తిప్పితివా? అయ్యయ్యో! సర్వ జగద్రక్షకుడైన రామునికా రాజ్యకాంక్ష? అతనికి రాజ్య కాంక్షయే ఉన్న యెడల రాజ్యము వీడి పదునాలుగేండ్ల అరణ్యవాసము చేయునా! తండ్రిని, తమ్ములను చంపి నిరాటంకముగ రాజ్యపాలనచేసి యుండడా? సుగ్రీవునికి, విభీషణునికి రాజ్య పట్టాభిషేకములకు బదులు "రాజకీయ కారావాసము" సిద్ధించెడిది కాదా! నాయనలారా! విభీషణుడు తనను శరణు జొచ్చినప్పుడు రాముడాతనికి అభయమిచ్చి ఆతనిని లంకారాజ్యమునకు పట్టాభిషిక్తుని చేసెదనని వాగ్దానము చేసినాడు. అప్పుడు కొందరు వానర వీరులు శ్రీరామునితో "ప్రభూ! రేపు మనము అంగదుని రావణుని కడకు సంధి సలుపుటకై దూతగా పంపుచున్నాము కదా! ఒకవేళ రావణుడందుల కంగీకరించిన ఏమి చేయుదురని ప్రశ్నించిరి. దానికి రాముడిచ్చిన సమాధానమేమో తెలియునా నాయనలారా! "అట్టి సందర్భము వచ్చిన రావణునికి నా అయోధ్యా రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేతును" అని పలికెను.

అట్టి వానికి రాజ్య కాంక్షయా! మిఠాయి అంగడి వాడు మిఠాయి తినుట నెప్పుడయినా చూచితివా! మేఘము నీరు త్రాగుట నెక్కడయినా చూచితివా! సూర్యుడు విద్యుద్దీపముల కాంతి హరించునా? నాయనలారా! ఈనాడు సోషలిజమని కంఠ శోష వచ్చునట్లు అరచుచున్న సోషలిజానికి మూల పురుషుడు తాను కాదా! ఒక్క మనుజునకొక్కతే భార్య అని మొట్టమొదటి సామాజిక వాద సూత్రమును భాషించిన దాయన కాదా! ప్రజల నేలుటలో, రాజ్యమును పరిపాలించుటలో ఇప్పటికిని మన కాతడు ఆదర్శ పురుషుడే గదా! రామరాజ్య స్థాపన చేయుదుమనియే గదా, గత అరువది సంవత్సరముల నుండి మన నాయకులుద్ఘోషించుచున్నది; రాజ్య పాలనము సాగించుచున్నది.

ఎవడో చాకలివాడు మతిస్థిమితము లేక, కాలిదురద నాపలేక, మద్యపానపు మత్తులో ఏదో వాగిన వాగుగాక! దానిని రాముడేల పట్టించుకొనవలెనని

మీరనవచ్చును. అతడు రాజు కావున బట్టించుకొనినాడు– భార్య నడవులకు పంపినాడు – 'కాంచన సీత' ను చూచుచు తాను కుమిలినాడు–కృశించినాడు. ఆ చాకలి వానిని పల్లెత్తు మాటయిన అనినాడా! అది నిజముగా మనము చెప్పుకోవలసినది. పరుల కొరకు స్వార్థ త్యాగము చేయుట గొప్పకాని, ఇల్లాలికి, పిల్లలకు కూడు పెట్టుట గొప్పా నాయనలారా! అంతియేగాదు – మన మేదో సోషలిజమని కారులరచుచున్నాము – ప్రజాస్వామ్యమని చంకలు గుద్దుకొనుచున్నామే! ఇదే మాట ఈనాటి దేశనాయకులను గూర్చి యననిండు. 'అత్యవసర సమయము' నవైన వాని నోటికి తాళము పడెడిది – మీసా క్రింద 2 సం॥లు జైలుశిక్ష పడెడిది. వాని ఇంటిలోని గిన్నె, ముంత, వీధిన పడెడివి. వాని భార్య పిల్లలతో సహా ముష్టికై యూరిపై పడెడిది. ఇప్పుడయినచో పార్లమెంటునందు "ప్రివిలేజిమోషను" పడెడిది–పరువు నష్టమునకై హైకోర్టులో దావా పడెడిది.

కొడుకుల దొంగ లెక్కలను, బొంగబుద్ధులను, తప్పుడు పనులను కప్పి పుచ్చుటకు దేశాధినేతలు పడని పాట్లున్నవా! వేయని ఎత్తులున్నవా! చేయని పనులున్నవా! ఆడని అబద్ధములున్నవా! కోయని గొంతులున్నవా! చేసికొనని రహస్యపు టొప్పందము లున్నవా! ఏదియో ప్రాసంగికముగ చెప్పితినిగాని, ఆ రాజకీయముల జోలి మనకేల పోనిండు.

నాయనలారా! దేశమందెల్ల వేళలందు, ఎల్లకాలమందు, ఒకే రకమయిన సిద్ధాంతము మనజాలదు. అటులే అయిన అది దేశము కాదు – వారిది సిద్ధాంతము కాదు. వారు ప్రజలు కారు. దేశ, కాల, పాత్రములను బట్టి ఆనాటి ఆర్థిక, రాజకీయ సాంఘిక, పరిస్థితులనుబట్టి ఇది మంచి, ఇది చెడు అని మనము నిర్ణయించుచున్నాము. ఈనాటి మంచి రేపటికి చెడుగగుచున్నది. నిన్నటి చెడుగు నేటికి మంచి యగుచున్నది. ఈనాడు మద్యపాన నిషేధమున్నచో త్రాగుట చెడు అలవాటు. రేపు మద్యపాన నిర్బంధము చేసినచో అదే మంచిది. ఈనాడు ఒకే భార్య ఉండుట శిష్టాచారము. రేపు పది మంది కన్యలను వివాహమాడిన వానికి పదవి. నిన్నటిదాక బహుసంతానవతి అయిన స్త్రీ పుణ్యవతి. నేడు సంతాన విహీన యోగ్యతా పత్రమున కర్హురాలు. ఇంతలోనే ఇన్ని మార్పులు జరుగుచుండ కొన్ని వేల ఏండ్ల క్రిందట వ్రాయబడిన రామాయణముత్త తుక్కనియు, వాల్మీకి వట్టి పూలనియు, ఈనాడు మనకున్న మిడిమిడి జ్ఞానముతో వచించుట తప్పుకాదా!

నాయనలారా! ఇప్పటికే చాలా చెప్పితిని. ఈ అంశమును గూర్చి మరల ఎప్పుడయిన చెప్పుదును – సెలవు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# గాంధీ జయంతి

అంతకు ముందే మి ప్రసంగించెనో గాని, నేను సభాభవనము ప్రవేశించుసరికి జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించుచుండెను:

ఆహా! ఏమి కోలాహలము! ఒక గ్రామములో గాదు – ఒక నగరములో కాదు – ఆసేతు శీతాచలము ఒకటే కోలాహలము-రంగురంగుల జండాలతో, విద్యుద్దీపములతో దేశమంతయు శోభాయమానమయినది.

టెర్లిన్ పంట్లాములు మూలబడి, ముతక ఖద్దరు పంచెలు శరీరముల నలంకరించినవి – బొత్తాములకోటుల స్థానమును కల్లీ చొక్కాలు స్వీకరించినవి. నెత్తిపైని హాట్‌లు పోయి ఖద్దరు టోపీలు గారడివాని కుచ్చు టోపీవలె ధగధగలాడుచు అలంకరించినవి. చేతనున్న భామాకలాప పుస్తకములు మూలనిడి, భగవద్గీతను కన్నుల కద్దుకొనుచున్నారు. మదన, మన్మథలను పారవైచి మహాత్ముని స్వీయ చరిత్రమును మననము చేయుచున్నారు. మూలబడిన రాట్నముల బూజు దులిపించు చున్నారు. నూలువడకు ప్రయత్నములు చేయుచున్నారు. ఎక్కడ చూచిన గాంధీగారి విగ్రహ ప్రతిష్ఠలే– వారి చిత్రపటమునకు పూలమాలాలంకరణములే – వారిని గూర్చిన భజనలే – వారి జీవితాశయ సిద్ధికై కంకణధారణములే. ఇట్లు 'గాంధీ జయంతి' నాటికి గాంధీ తత్త్వము దేశమంతటికిని మహమ్మారి వలె వ్యాపించినది. పేటకొక మహాత్ముడు, వీధికొక మహనీయుడు, సందునకొక జాతిపిత వెలసి, ఎక్కడ చూచిన ఒకటే కోలాహలము, ఒకటే సందడి – ఇక రాజకీయ నాయకుల సందడికి అవధి లేదు. ఉదయము నుండి ఒకటే సందడి. ప్రారంభోత్సవములకు, రిబ్బను కత్తిరింపులకే దినము చాలకుండ పోయినది. ముతక ఖద్దరు పంచలతో, చొక్కాలతో, పై మీద కండువాలతో వాడవాడల తిరుగుచు, మహాత్ముని విగ్రహములను పూలమాలా లంకృతులను చేయుచు, గాంధీనగర్ హరిజనవాడలో అన్నదానములు చేయుచు, గాంధీ కళ్యాణ మండపములో సామూహిక కులాంతర, మతాంతర వివాహములను జరిపించుచు, నూతన వధూవరులకు నూతన వస్త్రముల నందించుచు, గాంధీ భవన్‌లో సర్వమత ప్రార్థనలు, భజనలు నిర్వహించుచు, గాంధీ హాస్పిటల్‌లో రోగులకు పండ్ల నందించుచు, గాంధీ ఆశ్రమములోని అనాథ బాలలకు మిఠాయిలు పంచుచు, అవకాశము దొరికినప్పుడెల్ల ఆ మహాత్ముని గుణగణములను కొని యాడుచు, ఆయన

దేశభక్తికి, ప్రజానురక్తికి జోహారులర్పించుచు, ఆయన నామ సంకీర్తనముతోనే పొద్దు పుచ్చిరి. అనాడెవరినోట విన్నను 'మహాత్ముని' పేరే! జీవితములో ఎన్నడు తలవని వారు సహితము నాడు మహత్ముని నామ స్మరణము చేయుచున్నారు. అనాటి వారి దినచర్యలో మధుపానము మొదలు అధరపానము వరకు సమస్తము ఆ మహనీయుని నామసంకీర్తనములోనే జరిగిపోయినవి.

వహవ్వా! త్రుటిలో ఎంతమార్పు-ఆహా! ఆపాదశిఖాపర్యంతము ఒకటే మార్పు! ఆసేతు శీతాచలము ఒకటే మార్పు -ఆహా! ఇది నిజమయిన ఎంత బాగుండును - దేశమునకంతకంటే కావలసినదేమున్నది? కాని మనకంత యదృష్టమా! నాయనలారా! ఇదంతయు శ్మశాన వైరాగ్యము, ప్రసూతి వైరాగ్యము, అభావ వైరాగ్యము - తెల్లవారు సరికి మరల మామూలే! ఖద్దరు పంచలు, కల్లీ చొక్కాలు, గాందీ టోపీలు చలువ చేయబడి రానున్న గాంధీ వర్ధంతి సభలకై సిద్ధమగుచున్నవి. రాట్నములు ఇంటి అటకలను అలంకరించినవి - మహాత్ముని ఆత్మకథ పుస్తకాల బీరువాను అలంకరించినది - భగవద్గీత దేవుడి పెట్టె ముందు సాష్టాంగపడినది. మందుతో రోగ లక్షణములు మాయమైనట్లు గాంధీజయంతి నాటి అర్ధరాత్రి 'మందు'తో గాంధీ తత్త్వ రోగలక్షణములు మాయమయినవి.

ఆనాడు నగరములో ఒక బహిరంగ సభ ఏర్పాటయినది- ఆ మహనీయునికి శ్రద్ధాంజలి ఘటించుటకై నేనచ్చటికి పోయితిని. అంతనొక అమాత్య వృషభుడిట్లు ప్రసంగించెను.

సోదర సోదరీమణులారా! (సోదరీమణులెవ్వరు లేరని సభలో కేకలు) నేను శానా చెప్పాలని వచ్చియుంటిని. కాని నాముందు వక్తలందరూ నే సెప్పదలచుకొన్నది చాలా వరకు సెప్పేసినారు. ఇక నాకు చెప్పుటకేది లేదు (మాటలాడుట కేమియు లేనప్పుడు నోరుమూసుకొని కూర్చుండక ఎందులకు లేచితివి అని సభలో కేకలు) అయితే నే చెప్పొచ్చేదేటంటే - ఈనాడు గాంధీ మహాత్ముని 109వ జయింతి. మనకందరికి గొప్ప పర్వదినము. మన దేశమునకు స్వాతంత్ర్యమును సంపాదించిన మహానీయు డాయన. ఆయన కన్న కలలు మనం ఫలవంతం చేయాల! అందుకు మనమంతా శ్రద్ధతో, దీక్షతో కృషి చేయాల! అని ప్రసంగించి కూర్చుండెను. నేను సభాధ్యక్షుని అనుమతితో ఇట్లు ప్రసంగించితిని.

నాయనలారా! గాంధీ మహాత్ముని జయంతి సందర్భముగా ఆ మహానీయుని కలలను ఫలవంతం చేయవలెనని మన ఉపన్యాస శిఖామణి పలికినాడు

వహవ్వా! ఆ మహనీయుని కలలు పలించకపోవుట యేమి? మంచినీటి కరువున్న గ్రామమున్నది గాని మద్యము కరువున్న గ్రామమున్నదా! ప్రభుత్వము వారు తామే స్వయముగా ఆ పుణ్యము కట్టుకొనుచున్నారే! అందుకని యే ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి లేని కుగ్రామములో కూడా ప్రభుత్వ సారాయి దుకాణములను తెరిపించినారు. రాష్ట్రములో అడుగడుగునా బెల్టుషాపులు వెలసినవి. ప్రభుత్వ సారా వ్యాపారము మూడు బుడ్లు ఆరు గ్లాసులుగా సజావుగా సాగుచునే యున్నది. ఇక నగరముల సంగతి చెప్పనేల? అడుగున కొక్కబారు. గజమున కొక్క దేశీయజనిత విదేశీమద్య దుకాణము. అంతియే కాదు నాయనలారా! వేసవి కాలమందు ఎండతీవ్రతను తట్టు కొనుటకు ప్రజలు అధికముగ 'బీరు'ను త్రాగుచున్నారనియు, సరఫరా తగ్గిన జనము 'బీరు'లేక ఇబ్బందిపడుదురనియు గ్రహించిన మన ప్రభుత్వము వారు, ఇటీవలే బీరు ఉత్పత్తి చేయుకంపెనీలు నిరంతరముగా, నిరాఘాటముగా బీరు నుత్పత్తి చేయు నుద్దేశ్యముతో ఆయా ఫ్యాక్టరీలను రెండు షిఫ్టులకు బదులు మూడు షిఫ్టులు పని చేయుట కనుమతించినారు ఆహా! ప్రజా సమస్యలపట్ల ఏమి అవగాహన! ప్రజాసమస్యలను తీర్చుటయందెంత శ్రద్ధ! నాయనలారా! ఈ శ్రద్ధ మిగిలిన ప్రజాసమస్యలకపట్ల చూపిన రాష్ట్రమెంత పురోగతి పథమున నుండెడిది!

ఇక హరిజనోద్ధరణమా! పరిజనోద్ధరణమునకే 'ఫండ్సు' చాలకబాధపడుచుండ ఇక హరిజనోద్ధరణమున కెక్కడ? మాల మాదిగల మధ్య వైరుధ్యమును సృష్టించి, వారిలో వారు కొట్లాడుకొనుచుండ వినోదము చూచుచున్నారు. స్వాతంత్ర్యము వచ్చి అరువదేళ్ళయినను 'కులవివక్ష' 'అస్పృశ్యత' ఇప్పటికిని రాజ్యమేలుచున్నది.

గాంధీజీ కలలుగన్న గ్రామరాజ్యము ఇటీవల జరిగిన గ్రామపంచాయితీ ఎన్నికలలో జరిగిన రక్తపాతములో కొట్టుకొనిపోయినది.


దేశములో స్త్రీల మాన, ప్రాణములకు రక్షణ లేదు. అర్ధరాత్రి ఒంటరిగ, నిర్భయముగ స్త్రీ తిరుగ గలిగిన నాడే ఈ దేశమునకు నిజమయిన స్వాతంత్ర్యము వచ్చినట్లని మహాత్ముడు చెప్పియున్నాడు కదా! మరి ఈనాటి స్త్రీ పరిస్థితి ఎటులున్నదో చూడుడు! అర్ధరాత్రి కాదు నాయనలారా! పట్టపగలు స్త్రీ ఒంటరిగ నిర్భయముగ తిరుగజాలకున్నదే! ఆడపిల్ల గడప దాటినది మొదలు, తిరిగి ఇంటికి చేరువరకు, ఏ క్షణముననేమి జరుగునో యని ఆడపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుచున్నారే! ఇక రామరాజ్యమా! అదొక మృగతృష్ణ అయినది.

నాయనలారా! ఆ మహనీయుని జన్మదినోత్సవమునకు మనము చేయవలసినవి ఉపన్యాసములు కావు. ప్రారంభించవలసినవి బారుషాపులు కావు. తెరవవలసినవి

బ్రాందీ బుడ్ల మూతలు కావు. సమర్పించవలసినవి పూలమాలలు కావు. 'రాజఘాట్'పై పూలమాలలర్పించుటతో 'గాంధీజం' సిద్ధించునా! గాంధీ విగ్రహ ప్రతిష్ఠాపనతో గాంధీ సిద్ధాంతము లమలుపరచినట్లయినదా! ఈ కులాంతర, మతాంతర వివాహములతో మన కర్తవ్యము పూర్తయినదా! లేదు నాయనలారా! లేదు! మహాత్మునికి మధ్యపాన నిషేధము, హరిజనోద్ధరణము, గ్రామరాజ్యము, స్త్రీ జనపరిరక్షణము, రామరాజ్యస్థాపనము పంచప్రాణములు కదా! తాను బ్రతికియున్నంత కాలము ఆతడా లక్ష్యసాధనకై నిరంతరము శ్రమించెను కదా! ఆయన కలలు ఫలించిన నాడే ఆయనకు నిజమయిన ఆనందము, అదియే ఆయనకు మనము సమర్పించు నిజమయిన శ్రద్ధాంజలి.

కొస వెర్రులకు పోయి రాట్నములను త్రిప్పి వాటిని పాడు చేయకుడు. దారము తీయుట చేతకాక ఏకులను పాడు చేయకుడు. వాటిని పేదలైన చేనేత పనివారి కిందు – అవి వారికి పనికి వచ్చును. ఉపన్యాసములతో గొంతు చించుకొనకుడు – కార్యరంగములో దిగి నడుము కట్టుడు – ఆ మహాత్ముని ఆశయపాలనకై ఉద్యమింపుడు – సెలవు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# షష్టిపూర్తి సన్మానసభలు

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! అది వికారి సంక్రాంతికి మూడు రోజులు ముందు. నగరమంతయు విద్యుద్దీపములచే దేదీప్యమానముగ నలంకరింపబడినది. నగరములో ఎచ్చట చూచినను స్వాగత ద్వారములే. ప్రసూనమాలికా తోరణములే! రంగు రంగుల జెండాలే! ఆహా! తెలుగు రాజధానిలో సంక్రాంతి లక్ష్మికి ఎంత ఘనస్వాగత మొసగబడుచున్నది. తెలుగు సంస్కృతికి, తెనుగు జాతికి ఇది శుభసూచకము కదా! అని నాలో నేననుకొనుచు ఒక స్వాగత ద్వారమువద్ద చేరి పరికించితిని.

కాని నాయనలారా! అవి సంక్రాంతి స్వాగత ద్వారములు కావు. ఎవరో రాజకీయ నాయకుని షష్టిపూర్తిసన్మాన సందర్భమున నేర్పాటు చేయబడిన స్వాగత ద్వారములు. ఆ ద్వారములపై ఆ నాయకుని గుణగణములు అంత్య ప్రాస తప్పకుండ ఉన్నవీ, లేనివీ కల్పించి వ్రాయబడినవి. ఏ గోడపయిన చూచిన ఆ షష్టిపూర్తి సన్మాన స్వాగత పత్రములే! ఎక్కడ చూచినను ఆ మహానుభావుని ఛాయాచిత్రములే! ఆ ప్రజానాయకుడు మూత్రశాలలనక, మరుగుదొడ్లనక, వీధి గోడలనక, మురికివాడలనక, బస్సులనక, ఇందుగలడందులేడను సందేహములేక ఎందెందు వెదికిన అందందే చిరునవ్వులు చిలకరిస్తున్నాడు. ప్రజాకోటిని పలుకరిస్తున్నాడు.

ఇంతలో నా వెనుక పెద్ద కలవరము వినబడినది. అది ఆ ప్రజానాయకుని షష్టిపూర్తి ఊరేగింపు ఉత్సవము. ముందు రక్షకభటులు రోడ్డు కిరువైపులా బారులు తీరి నడచుచు, వెనుకవచ్చు శకటములకు దారి చేయుచు, తమ ప్రజా సేవాపరాయణతను మరొకమారు ఋజువుచేసి కొనుచున్నారు. ఆ వెనుక కొందరు కారులలో, స్కూటర్లపైన మెల్లగ ముందుకు సాగుచున్నారు. ఆ వెనుక కొందరు కమ్మెచ్చులవంటి, కారెనుబోతులవంటి, నల్ల తుమ్మమొద్దులవంటి మహాకాయులు షష్టిపూర్తి చేసుకొనుచున్న ఆ మహానాయకుని కారు ముందు పరుగులెత్తుచు, జయ జయ ధ్వానములు చేయుచున్నారు. ఇక ఆ వెనుక కొంత మంది రిక్షాలపైన, సైకిళ్ళపైన, ఇంకా కొంతమంది కాలినడకన పయనించుచున్నారు. సుమారు ఒక మైలు పొడవున్న ఆ ఊరేగింపు 'యమవిదియ' నాటి దున్నపోతుల ఊరేగింపును జ్ఞప్తికి తెచ్చుచున్నది. విషయ సేకరణ కుతూహలుడనై నేనును ఆ ఊరేగింపు ననుసరించితిని.

ఆ ఊరేగింపు నగరములోని ముఖ్య వీధులగుండా సాగి చివరికి ఓ పెద్ద మైదానమును చేరెను. అచ్చట ఓ బహిరంగ సభ ఏర్పాటు చేయబడినది. ప్రజా నాయకుడు వేదిక నలంకరించెను. 'కవులు' అతని గుణగణములను కొనియాడిరి. గాయకులు దానికి వరుసలుకట్టి పాడిరి. నాట్య కత్తెలు తమ పద విన్యాసములతో అతని గుణగణముల నభినయించిరి.

అయ్యయ్యో! మేధావి వర్గములోనివారే! దేశమునకు నేతృత్వము వహించ వలసినవారే! ఇది మంచిది, ఇది చెడ్డ అని గ్రహించగలవారే! మంచిని సమాజమున కందించవలసినవారే! చెడును ఖండించవలసినవారే! భావి తరములను బాగుచేయ వలసినవారే! భవిష్యద్దర్శనము చేయవలసినవారే! క్రాంతి దర్శులే! అట్టి కవులు తమ వ్యక్తిత్వములు కోల్పోయి, ఇట్లు బానిసలవలె, భట్రాజులవలె పొగడ్తలకు దిగినారేమి? కల్లు త్రాగిన కోతులవలె కుప్పిగంతులు వేయుచున్నారేమి? అయ్యయ్యో! పొట్టకూటి కొఱకు చేయుచున్నారనుకుందమన్న అదియును నమ్మశక్యము కాకుండ నున్నది కదా! అని నాలో నేననుకొనుచుండగనే, షష్టిపూర్తి సన్మాన పత్రము, సహస్ర నామార్చనలతో, అష్టాదశ వర్ణనలతో, పంచరత్న పద్య పరంపరలతో మహాదేవతా పూజా సంకాశముగ ముగిసినది. ఇంతలో జయ జయ ధ్వానము మరల మిన్ను ముట్టినవి.

ఆ తరువాత సన్మానము, పూలమాల సమర్పణము ఆరంభమయినవి. నాయనలారా! బిచ్చగాడికయిన ఎన్నడు పైసా వెయ్యని, ఎంగిలిచేతితో నయిన కాకిని విదిలించని వదాన్యబృవులు సహితము షష్టిపూర్తి సన్మానమునకు ఘనముగ విరాళములు నొసగిరి. స్వాగతద్వారములను నిర్మించిరి. బహుమానములనిచ్చిరి. పూలమాలలను సమర్పించిరి. ముడుపులు చెల్లించిరి. మొక్కులు తీర్చుకొనిరి.

ఆహా! ఏమని చెప్పను నాయనలారా! ఆనాడు నగరములో పూజకయినా ఒక పూవు మిగులలేదు. పూలసరాల సమర్పణము సర్పయాగములె నిరంతరముగా సాగిపోవుచున్నది. అయ్యయ్యో! వర్ధంతినాడయిన జాతిపిత సమాధిపై ఇన్ని పూలమాల లుంచరే! ఒక దేశనాయకుడు పోయినప్పుడయిన ఇన్ని పూలమాలలను సమర్పించరే! ఇతడు బ్రతికుండగనే చచ్చినంత కీర్తినిగడించినాడు కదా!

నాయనలారా! ఎన్ని పూలమాలలు వచ్చినను అతడు ఓర్మితో స్వీకరించుచు నేయున్నాడు. చిరునవ్వులు చిందించుచునే యున్నాడు. ఆహా, ఏమి ఓరిమి! ఏమి శాంతము! ఓ మూట ప్రక్కన మరోమూట వేసినందులకు చాకలివాని గాడిద అయిన విదిలించుకొని పారిపోవునే! ఈ విషయమున నీతడు గాడిదను తలదన్నినాడు కదా!

అటు తరువాత ఆ నాయకునకు తులాభారమేర్పాటు చేయబడినది. ఆ (వి) నాయకుడు వేదికపై నేర్పాటు చేసిన 'తక్కెడ'లో బియ్యపు బస్తావలె కూలబడినాడు. రెండవవైపు రూపాయి నాణెముల సంచులతో నిండిపోయినది కాని ఆతడింకనూ తూగుట లేదు. ఇంతలో ఆ రాజకీయ నాయకుని ఉంపుడుకత్తె 'కుమారి విలాసిని' నిగనిగలాడు నేరేడు పండు మేనిచ్ఛాయతో వేదికపైకి వచ్చి, సభికులకు నమస్కరించి, నాయకునిపై ఓ చిరునవ్వును చిలుకరించి, తన వంతుగా కొంతధనము నా తులలో నుంచెను. అంతియే నాయనలారా! రుక్మిణీ దేవి అర్పించిన తులసి దళముతో 'శ్రీకృష్ణ తులాభారము' సంపన్నమయినట్లు, మన నాయకమ్మణ్యుని తులాభార మంతటితో సంపన్నమయినది.

ఆహా, దేశమెంత అధోగతిపాలయినది. ఇది ప్రజాస్వామ్యమా? లేక ప్రభుస్వామ్యమా? ఒకని షష్టిపూర్తికిన్ని ఏర్పాటులా! అడుగడుగున ద్వారములా! తోరణములా! పూలజల్లులా! తులాభారములా! జయజయ నినాదములా! అందుకు ప్రజలనుండి విరాళములా! బలవంతపు వసూళ్ళా! ఇవ్వనివారికి నిరాదరణలా! ఇచ్చినవారికి సమాదర సన్మానములా! ఆంధ్రదేశమున 'వ్యక్తిపూజ' ఇట్లు శ్రుతిమించి రాగాన పడినదేమి? ఇంత వెర్రితలలు వేసినదేమి? అయ్యయ్యో నూటికి అరువదిమంది రెండు పూటల పట్టెడన్నమయిన తినుటకు నోచుకొనని ఈ దేశములో, కట్టుకొనుటకు జానెడు గోచి పాతలేని ఈ దేశములో, తలదాచుకొనుటకు గూడయినలేని ఈ దేశములో, రాజకీయ నాయకుల షష్టిపూర్తి సన్మానసభలా! జన్మదినోత్సవములా! ఊరేగింపులా! ఉత్సవములా! విందులా! మద్యపాన గోష్ఠీ విజృంభణములా! దనపుసంచుల బహుమానములా! బలములమోహరింపులా! ప్రత్యర్థులకు బెదిరింపులా!

నాయనలారా! ఇప్పటికయినను ఈ వ్యక్తిపూజ మానుడు - ఇది దేశమున కరిష్టదాయకముగాని శుభసూచకము కాదు. దేశభక్తి కలిగియుండుడు. ప్రజల ఎడల అభిమానము కలిగియుండుడు. పనియే పరమార్ధమనియు, మానవసేవయే మాధవసేవ అనియు మరువకుడు. తోటి ప్రజలను గౌరవింపుడు. బాధ్యతలను విస్మరించి హక్కులకై పోరాడకుడు. సర్వ మతస్వామ్యమునకు, సమ సమాజస్థాపనకు కంకణ దీక్షాపరులై ముందడుగు వేయుడు - మన స్వాతంత్ర్యమును సార్థకము చేసికొనుడు - సెలవు.

*ఓ శాంతి శ్శాంతి శ్శాంతిః*



# స్త్రీల ఫ్యాషన్లు

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! ఈ మధ్య ఒక మహిళా సంఘమువారు తమ వార్షికోత్సవములలో నన్ను ప్రసంగించుమని కోరినారు. అవును మరి, కోరరా! రిబ్బను కత్తిరింపులకు, శంకుస్థాపనలకు, ఢిల్లీ యాత్రలకు సహితము ఉన్న సమయము చాలక అవస్థపడుచున్న అమాత్య వృషభులు, ఐదు నిమిషములు సమయము లభించిన మూడు ముక్కలను రాసి, నాలుగు రాళ్ళు సంపాదించుకొనవలెనను తహతహతో సతమతమయ్యెడి సినీ కవులు, సొంతకారున్నను అద్దెకారు ఇంటికి పంపనిదే సమావేశమునకు రాని సంఘసేవా పరాయణులు, సమావేశమునకు వచ్చినది మొదలు ముళ్ళమీద కూర్చున్నవారివలె ఇబ్బంది పడుచు, ఎప్పుడు పోవుదమా అని ఎదురు చూచుచు, ముక్కు చివర నాలుగు ముక్కలిడుకొని, వాటిని వల్లెవేసి జారుకొనెడి రాజకీయవేత్తలు, ఉపన్యాసము లిచ్చుటలో కిట్టుబాటు లేదని తప్పించుకొనెడి అభ్యుదయవాదులు, అవకాశము నీయని యెడలీయలేదని ఏడ్చుచు, వచ్చిన అవకాశములను సద్వినియోగము చేసికొనలేక నీళ్ళు నమలెడి ఉపన్యాస దీక్షాదక్షులు, సమయపాలన చేయక, తమ యిచ్చవచ్చినప్పుడు సమావేశములకు హాజరయ్యెడి కాలాతీత వ్యక్తులు ఉన్న ఈ రోజులలో, కానీ ఖర్చులేకుండా, సమావేశ సమయమున కర్ధగంట ముందుగనే కాలి నడకన సమావేశ స్థలము చేరికొని, గ్రుక్క త్రిప్పుకొనకుండ, కాల్చి కుండలో పడవేసిన సీను టపాకాయలవలె, పొదలోని గచ్చకాయలవలె, టూకీలతో, టుప్రీలతో, కట్టుకథలతో, పిట్ట కథలతో జనరంజకముగా ప్రసంగించెడి జంఘాల శాస్త్రికి జంటనగర సమావేశములో అగ్రతాంబూలమందుటలో ఆశ్చర్యమేమున్నది?

అప్పుడు నేనిట్లు ప్రసంగించితిని; అమ్మా! మీ మహిళాసంఘ వార్షికోత్సవమునకు నన్నాహ్వానించి ఏ అక్కమాంబగారికో, చిక్కమాంబగారికో, జోగమాంబగారికో అంటకట్టవలసిన ఈ గౌరవమును నా కంటగట్టి మీలో నన్నొకడిగ చేసికొనినందులకు చాలా సంతోషము. ఏదయిన ఒక విషయమును గూర్చి ప్రసంగించుమని నన్ను కోరియున్నారు కదా! సృష్టిలో మీ అంత అందమయినది, లావణ్యమయినది; మీ అంత సర్వాంగ సుందరమైనది మరేదియును లేదు కదా! ఆ సృష్టికర్త మిమ్ములను తనంత వారిగా చేసి తాను విశ్రాంతి తీసుకొను చున్నాడు కదా! అట్టి మీ గురించే ప్రసంగించెదను.

పెళపెళలాడు పట్టుచీరలతో, పసుపు కుంకుమల నలరారు ముఖములతో, కంటి కాటుకలతో, చేతులకు గాజులతో, పాదములకు పసుపు పారాణులతో, గళసీమలో మంగళసూత్రములతో, కొప్పులలో పువ్వులతో ముత్తైదువులై అలరార వలసిన మీరు, అయ్యయ్యో! అదేమి? కళావిహీనములైన ముఖములతో, కాంతులులేని కన్నులతో, బోసి మెడలతో, బోడి చేతులతో, పిండి బొమ్మలవలె, గాలి గుమ్మటములవలె ఉన్నారేమి? అయ్యయ్యో! మీలో కొంతమంది ముఖములపై తిలకములు కూడ లేవే! చేతులకు గాజులైన లేవే! మెడలో ఒంటిపేట గొలుసైన లేదే! తల్లీ! ఏమియు లేకపోవుటయే ఫ్యాషనా! అటులైన మరి మీకంటె ఆ బిచ్చుకత్తె అందకత్తెకాదా!

సోదరీమణులారా! ఆ రోడ్డు ప్రక్కనున్న ఆ ముష్టిదానిని చూడుడు. పేదరికముచే అది అర్ధనగ్న అయినది. ఫ్యాషను కొరకు మీరు అర్ధనగ్నలగుచున్నారు. నూనెరాసికొను స్తోమత లేకపోవుటచే దాని జుట్టు పీచు రేగినది. ఫ్యాషను కొరకై తలనూనె రాసికొనక మీ జుట్టు పీచురేగినది. ముష్టెత్తుకొనుటకై దాని భుజమున సంచి – ఎందుకో తెలియదుగాని, మీ భుజమున కూడ సంచి. చూచితిరా– మీరు దొరసాన్లు కావలెనని, చివరకు ముష్టివాండ్రకు దగ్గరగుచున్నారు.

తల్లులారా! మీలో చాలామంది వివాహమయినవారు కూడనున్నారు కదా! మరి పెద్దల ఆశీర్వాదములతో, పురోహితుల వేదమంత్రములతో, ముత్తయిదువుల అక్షతలతో మీ తల్లిదండ్రులు వేలు ఖర్చుచేసి కట్టించిన మంగళసూత్రములనేమి చేసినారు? అయ్యయ్యో! ఫ్యాషను కాదని బొట్టుపెట్టెలలో పారవేసినారు కాబోలు. మూసలలో కరగించినారు కాబోలు. (మా మాంగల్యము చల్లగా ఉండాలని ఫ్రిజ్‌లో పెట్టాం అని వెనుకనుండి ఓ మహిళ అరుపు). తల్లీ! భుజమున గాడిద బరువుగల దురభిమానసంచికలను (వ్యానిటీబ్యాగు కాబోలు అని సభలో నవ్వడులు) మోయగలరుగాని, మెడలో పావు తులమెత్తు మంగళసూత్రములను మోయలేరా? మన సంప్రదాయములను నిలిపికొన వలసిన నగత్యము మనకు లేదా!

నిక్షేపమువంటి చీరలను స్టీలు సామాన్లవాండ్రకిచ్చి ఇరుకు పంట్లాములకై పరుగు లిడుచున్నారా? మీకు తగిన "జంట" దొరకక మీ తల్లిదండ్రు లేడ్చుచుండ, చీరలకు తగిన మ్యాచింగులు దొరకలేదని మీరేడ్చుచున్నారా? మీలో కొందరికి పైటచెంగులు కూడా లేనట్లున్నవి. (అవి పడమటి గాలికి కొట్టుకుపోయిన వనజ గడసరి అమ్మాయి అరుపు) వాలుజడలు, ముచ్చట ముడులు మాయమయి, కత్తిరింపుజుట్టు లవతరించినవి. తల్లీ! ఈ జీవభర్తృవైధవ్యము మీ కెందులకు?

వహ్వా! బెల్‌బాటమ్‌లా! బొత్తాముల కోటులా! మినీస్కర్టులా! మిడ్డీలా! లోనెక్కులా! నడుముకు నాలుగు వేళ్ళ వెడల్పు పటకాలా! ఎత్తు మడమల బూట్సులా! లిప్‌స్టిక్‌లా! కత్తిరింపు జుట్టులా! మొగముపై బూడిదదొంతరలా! టిప్పుటాపు నడకలా! భుజములకు దురభిమాన సంచికలా! తల్లీ, మీరాంధ్రజాతి వనితలేనా! ఆహా! విదేశీ వస్త్రధారణా వ్యామోహము మిమ్ము ఆంధ్రజాతి నుండి ఎంత దూరముగా ఈడ్చివైచినది.

అయ్యయ్యో! దేశమున కెంత దౌర్భాగ్యస్థితి దాపురించినది? జాతి గౌరవమును నిలుపవలసినవారు, జాతిని ముందుకు నడుపవలసిన వారే ఇట్లు ఫ్యాషన్ల వ్యామోహములోపడి వెర్రితలలు వేయుచుండ ఇక దేశభవిష్యత్తు గతిఏమి? మీ బిడ్డల గతిఏమి?

అమ్మా! మీలో చాలామంది తల్లులు కదా! పిల్లలకు పాలిచ్చిన వక్షోజసౌందర్యము చెడిపోవునని మీలో చాలా మంది పిల్లలకు పాలు కుడుపుటలేదు. అయ్యయ్యో! వక్షోజ సౌందర్యమునకై వంశాంకురమును పాడుచేసుకొందురా తల్లీ! మీలో చాలా మంది చదువుకున్నవారు కదా! పసి పిల్లలకు తల్లిపాలకు మించిన పోషకాహారము వేరొకటి లేదని తెలియదా! తెలిసి తెలిసి గొంతు కోసుకొందురా! ఇది విజ్ఞతగలవారు చేయదగిన పనియేనా!

మీరు ఈ ఫ్యాషన్ల యెడచూపు శ్రద్ధలో సహస్రాంశమైన ఇంటిపనులలో చూపిన మీ యిల్లు స్వర్గసీమ అయ్యెడిది కదా!


అమ్మా! అటులని నేను ఫ్యాషన్లను వ్యతిరేకిని కాను. స్త్రీలు తప్పక అలంకరించు కొనవలసినదే! కాదనను! కాని అది అంద మినుమడింపచేయునట్లుండ వలెను. గౌర వమాపాదించునట్లుండవలెను. అంతియేగాని ఎబ్బెట్టుగా, తెచ్చి పెట్టుకొన్నట్లుగా ఉండరాదు. సంక్రాంతి గోవువలె అందముగా ఉండవలెనుగాని గంగిరెద్దువలె నేహ్యాభావము కలిగించరాదు.

తల్లీ! భారతదేశ ఔన్నత్యమును, సంస్కృతిని, సంప్రదాయమును పరిరక్షింపగలది స్త్రీ మాత్రమేనని గాంధీ మహాత్ముడు చెప్పలేదా! ఇప్పటికయినను ఈ విదేశీ వస్త్రధారణా వ్యామోహమును వీడుడు. అర్థములేని ఫ్యాషన్లకు పోయి మీ కాపురములను చెడగొట్టుకొనకుడు. మీ మగవారి నప్పులపాలు చేయకుడు. కనీసము వంట చేయునప్పుడైన నూలు చీరలను ధరింపుడు. చేనేత పని వారలను ప్రోత్సహింపుడు. మిమ్ములను మీరు అగ్ని ప్రమాదములనుండి రక్షించుకొనుడు. మీ బిడ్డలకు మీ పాలే పట్టుడు. వారి నారోగ్యముగ పెంచుడు. వారి నాదర్శపౌరులుగ తీర్చి దిద్దుడు. వీరపత్నులై, వీరమాతలై కలకాలము వర్ధిల్లుడు. భారతీయ మహిళల పూర్వ గౌరవమును నిల్పుడు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

మరో జంఘాలశాస్త్రి

అయలసోమయాజుల నాగేశ్వరరావు



# పుట్టిన దినము పండుగ

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! ఈ మధ్య నా మిత్రుడొకడు తన కుమారుని పుట్టినదినమునకు తన గృహమునకు రమ్మని ఆహ్వానించగా పోయితిని. ఇల్లంతయు రంగు రంగుల కాగితములతోనూ, విద్యుద్దీపములతోనూ, గాలి బుడగలతోనూ అలంకరింపబడినది. హాలులో ఒక పెద్ద బల్ల వేయబడినది. దానిపైన కుర్రవాని వయసును తెలియచేయుచు ఐదు కొవ్వొత్తులుంచబడినవి. ఆ ప్రక్కనొక చాకు ఉంచబడినది.

నా మిత్రుడు ఆదాలోనూ, హోదాలోనూ కూడా పెద్దవాడగుటచే చాలామంది మిత్రులు విచ్చేసినారు. కొంత మంది నవ నారీమణులు, తమ వేష ధారణమును విమర్శించితిననికాబోలు నన్ను చూడగానే మూతులు ముడుచుకొని, ముసి ముసి నగవులు చిలుకరించుచున్నారు. కొందరు నవనవోన్మేష వస్త్రాలంకరణ శోభితులయిన పురుషులు కావిరంగు పంచ, అదే రంగుచొక్కా, గోష్పాదమంత జుట్టున్న నన్ను జంతు ప్రదర్శనశాలలోని వింత జంతువును చూచినట్లు చూచి వారి కబుర్లలో వారు పడినారు. కొద్దిమంది మాత్రము నన్ను గుర్తించి, నమస్కరించి 'సాక్షి' సంఘమును గూర్చియు, సాక్షి ఆరోగ్యమును గూర్చియు అడిగి తెలిసికొనిరి.

మిత్రులందరు వచ్చిన తరువాత కార్యక్రమ మారంభమయినది. పుట్టిన రోజు కేకుపై వెలిగించబడిన క్రొవ్వొత్తి దీపముల నా బాలుడు ఊది మలిపివేసెను. తదనంతరము కేకును బాలుడు ప్రక్కనున్న కత్తితో ముక్కలు చేసెను. ఇంతలో ఒక కేక వినబడినది. అంత వరకునూ ఏదియో ఆలోచించుకొనుచున్న నేను ఆ కేకకు త్రుళ్ళిపడి, ఇంతలో ఏమయినదని గాభరా చెందితిని. కాని నాయనలారా! అక్కడ చేరిన స్త్రీ, పురుషులందరును "హ్యాపీ బర్త్‌డే టూ యూ" అని పాడుచుండిరి. ఆ శబ్దమున కదిరిపడిన ఆ కుర్రవాని ఏడుపు కూడా అందులో కలిసి పోయినది.

ఉపాహార సేవనానంతరము నా మిత్రుడు నన్ను తన మిత్రులకు పరిచయము చేసి ఏదేని నొక్క విషయమును గూర్చి నన్నుపన్యసించవలసినదిగా కోరెను. రోగి కోరినది, వైద్యుడిచ్చినదీ ఒకటే యైనట్లైనది. నేనిట్లుప్రసంగించితిని·

పుట్టిన దినమును పురస్కరించుకొని ప్రసంగించమని కోరితిరి కదా! దానిగురించియే ప్రసంగించెదను. నాయనలారా! ఇది పుట్టినదినపు వేడుకయా!

హరహరా! మహాదేవ! పరమశివా! నేను కలగాంచుట లేదు కదా! నేనున్నది లండను నగరము కాదుకదా! లేదు నాయనలారా! లేదు! నేనున్నది అచ్చమయిన ఆరుకోట్ల తెలుగు వారి రాజధాని. మరిదేమి విపరీతము? ఈ దీపము లార్పుటయేమి? ఈ రొట్టె ముక్కల కత్తిరింపులేమి? ఈ సామూహిక బృందగానములేమి? నాయనలారా! మనకు సంప్రదాయములు లేవా? ఆచార, వ్యవహారములు లేవా? మన జాతి అంత గొడ్డువోయినదా? అంత నిస్తేజమైనదా? అంత నిర్వీర్యమైనదా? మీ సూటు, బూటులనే కాక ఆచార వ్యవహారములను కూడా దిగుమతి చేసికొనుచున్నారా! అయ్యయ్యో! దేశమునకు స్వాతంత్ర్యము వచ్చి అరువది వత్సరములు గడచినదే!– ఏదీ? భావ స్వాతంత్ర్య మేదీ? రాజకీయ దాస్యమే తొలగినదిగాని, భావ దాస్యము పోలేదు కదా!

నాయనలారా! ఏదయిన శుభకార్యము జరుగునప్పుడు 'జ్యోతి'ని ప్రజ్వలించుట మన ఆచారము కదా! అంతియెగాని దీపముల నార్పుట సంప్రదాయమా? అంధకారము నాహ్వానించుట సంప్రదాయమా? కొంపలు కూల్చుట సంప్రదాయమా? ఇందులకై ఇంటిలో 'పీనుగ' పోయినట్లు మీరందరును గొల్లుమని ఆంగ్లములో కోరస్సులా! కేకులు ఫలహారములా!

సూర్యాస్తమయ పూర్వము కుమ్రవానికి హారతినిచ్చి, మంగళ గీతములు పాడి, స్త్రీలకు  పసుపు కుంకుమలను, పురుషులకు తాంబూలములను యిచ్చి సత్కరించెడి మన సంప్రదాయము చెడిపోయినదా!


ఇది చాలక, మన తెలుగులో పదములు కొరవడినట్లు మీ పిల్లల చేత ముద్దుగా 'మమ్మీ' 'డాడీ' అని పిలిపించుకొని మురిసిపోవుచున్నారా! మన భాషలో 'అమ్మ, నాన్న' పదము లుండగా మనకీ మమ్మీ, డాడీ పిలుపులెందులకు? 'అమ్మ' అంత కమ్మని మాట వేరేదయిన కలదా! 'మమ్మీ' అను పదమున కర్థము తెలియునా? 'స్తన్యము' నిచ్చి పిల్లలను పెంచు జంతు జాలమును జంతు శాస్త్రములో 'మేమల్సం'దురు. అందు నుండుద్భవించినదే ఈ మమ్మీ పదము. మీ పిల్లలచేత జంతువులుగా పిలిపించుకొని మురిసిపోవుచున్నారా!

నాయనలారా! ఇట్టి వెర్రివెర్రి పోకడలకు పోయి మన సత్సంప్రదాయములను నాశనము చేయకుడు. ఇప్పటికైనను ఈ భావ దాస్యమును వీడుడు. అది వీడినగాని ఈ జాతికి భవిష్యత్తు లేదని గ్రహింపుడు. మీ పిల్లల చేత 'అమ్మ' 'నాన్న' అని పిలిపించుకొనుడు. వారిని చక్కని, ఆదర్శవంతమైన పౌరులుగ తీర్చిదిద్దుడు. భారత జాతికి కీర్తి నార్జింపుడు. ఇది అదనుకాకపోయినను ఇంత సేపు ప్రసంగించినందులకు మన్నింపుడు – సెలవు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

*మరో జంఘాలశాస్త్రి*

*అయలసోమయాజుల నాగేశ్వరరావు*



# స్వాతంత్ర్య దినోత్సవము

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! మా వీధి చివరగల ఒక వయోజన విద్యాకేంద్రము వారు నన్ను స్వాతంత్ర్యదినోత్సవ సందర్భమున ప్రసంగించుమని కోరగా పోయి నేనిట్లు ప్రసంగించితిని:

నాయనలారా! మనకు స్వాతంత్ర్యమునకు కొదవేమి? మనకున్న స్వాతంత్ర్యము మరెవరికున్నది? మనకు ఒకరి నొకరు తిట్టుకొనుటకు స్వాతంత్ర్యము వచ్చినది. ఒకరినొకరు కొట్టుకొనుటకు స్వాతంత్ర్యము లభించినది. ఒకరినొకరు రక్కుకొనుటకు స్వాతంత్ర్యము వచ్చినది. త్రాగుబోతులకు త్రాగుటకు స్వాతంత్ర్యము వచ్చినది. వదరుబోతులకు వదరుటకు స్వాతంత్ర్యము వచ్చినది. తిరుగుబోతులకు తిరుగుటకు స్వాతంత్ర్యము వచ్చినది. బలమున్న వానికి రాజ్యమేలుటకు స్వాతంత్ర్యము వచ్చినది. అధికారమున్న వానికి దుర్వినియోగము చేయ స్వాతంత్ర్యము వచ్చినది. లంచగొండులకు నిర్భయముగ లంచములు తీసికొనుటకు స్వాతంత్ర్యము వచ్చినది. రాజకీయ నాయకులకు పార్టీలు మార్చుటకు స్వాతంత్ర్యము వచ్చినది. విద్యార్థులకు కాపీలు కొట్టుటకు స్వాతంత్ర్యము వచ్చినది. కవులు అయిదు చుక్కల ఆహారశాలలో చేరి, ఓ చుక్క వేసుకుని ఆకలి కవిత్వము వ్రాయుటకు స్వాతంత్ర్యము వచ్చినది. రోడ్డు పక్క రోమియోల కమ్మాయిల నల్లరి పెట్టుటకు స్వాతంత్ర్యము లభించినది. వ్యాపారస్థులకు ధరలు పెంచుటకు, బజారును నలుపు చేయుటకు స్వాతంత్ర్యము లభించినది. ఉద్యోగస్థులకు సమ్మెలు చేయుటకు స్వాతంత్ర్యము లభించినది. పార్టీల గొంతులు కోయుటకు కాలాంబర కవచధారులకు, రోగుల గొంతులు కోయుటకు శ్వేతాంబర కవచధారులకు స్వాతంత్ర్యము లభించినది. నిరుపేదలకు కడుపు మాడ్చుకొనుటకు స్వాతంత్ర్యము లభించినది. కన్నీరు కార్చుటకు స్వాతంత్ర్యము లభించినది. రోడ్డుపక్క కాలిబాటలపై కాపురములు చేయుటకు స్వాతంత్ర్యము లభించినది. భిక్షాటనము చేయుటకు స్వాతంత్ర్యము లభించినది. ఇంత కంటే నింకేమి కావలయును?

నాయనలారా! ఈనాడు దేశమెంత అధోగతి పాలైనది! రాజకీయ నాయకులెంత స్వార్థపరులైనారు! అధికారులెంత అవినీతిపరులైనారు! యువతరమెంత బాధ్యతా

రాహిత్యముతో వర్తిల్లుచున్నది! ప్రజలెంత నిస్సహాయులైనారు! జాతి యెంత నిర్వీర్యమయినది! దేశములో కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంతీయ వివక్షత లెంతగ ప్రబలినవి!

ఎస్.సి.లని, ఎస్.టి.లని, బి.సి.లని, ఓ.బి.సిలని, మైనారిటీలని, ఓసిలని కుల, మత, ప్రాతిపదికన సమాజమును విభజించి, రిజర్వేషన్లను కల్పించి, ఒక కులముపై వేరొక కులమునకు, ఒక వర్గముపై వేరొక వర్గమునకు, ఒక మతముపై వేరొక మతమునకు స్పర్థలు రేపి, భేదాభిప్రాయములను సృష్టించి, వారిలో వారు కొట్లాడుకొనుచుండ వినోదము చూచుచున్నారు.

షెడ్యూల్డు కులములలో కూడా అంతర్విభాగము చేసి, మాల, మాదిగల మధ్య వైషమ్యములు సృష్టించి, వారిలో వారు పోట్లాడుకొనుచుండ చూచి ఆనందించుచున్నారు. ఓటు బ్యాంకు రాజకీయములను నడుపుచున్నారు.

నాయనలారా! ఈ రిజర్వేషనులను కల్పించి ఇంతకాలమయినను, వారి శ్రేయస్సునకై మీ రిన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చించినను, ఏ వర్గమయిన అభివృద్ధి చెందినదా! సంతృప్తి చెందినదా! అభివృద్ధి చెందినందులకు ఏ ఒక్క కులమునైన వెనుకబడిన కులముల జాబితానుండి తొలగించిన సందర్భము కలదా? లేదు నాయకులారా! లేదు! మీదుమిక్కిలి అనేకానేక కులములు, వర్గములు తమను వెనుకబడిన వారుగా గుర్తించి, రిజర్వేషను కల్పించవలెనని కోరుచున్నవే! వినతి పత్రములను సమర్పించుచున్నవే! వీథినబడి ధర్నాలు నిర్వహించుచున్నవే! 'రహదారి దిగ్బంధము' గావించుచున్నవే! రైళ్ళనాపు చున్నవే! రైలు పట్టాల నూడబెరకుచున్నవే! విధ్వంసమును సృష్టించుచున్నవే! విలయతాండవము చేయుచున్నవే! ఇదీ మనము సాధించిన ప్రగతి!

'భరతజాతి' లో ఈనాడున్నన్ని కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంతీయ విభేదములు, విద్వేషములు ఇదివరలో నెన్నడును లేవు. విభజించి పాలించు మన్న ఆంగ్లేయుల సిద్ధాంతము నెంత చక్కగ నమలు చేసినారు! మిమ్ములనుచూచి వారు తలదించు కొనునట్లు చేసినారు. ఏడు శతాబ్దములలో విదేశీ పాలకులు చేయలేని ఈ మహత్కార్యమును మీరు ఆరు దశాబ్దములలో జయప్రదముగ చేయగలిగినారు. అందుకనియే కాబోలు నాంగ్లేయ మిత్రుడొకడు "ఇల్ప్ఐబిరీశి జళిశిలిరీ బిదీఖి గిళితి జళిశిల్ప్ఐబిరీశిలిరీ" అని వ్యంగ్యముగ పలికినాడు.

భారతజాతి నిట్లు సంధి సంధి విడగొట్టి. నిర్వీర్యము, నిస్తేజము, నిర్జీవము చేసి, ప్రతి చిన్న విషయమునకును ప్రభుత్వముపై ఆదారపడు అనాథలుగ మార్చినారు.

మేమిచ్చిన అధికారముతో, మేము పన్నుల రూపములో సందించిన ధనముతో, మీరు భోగలాలసులై, విలాసవంతమయిన జీవితములు గడుపుచున్నారు. బిచ్చగాడికి ఇంటిలో తినగా మిగిలిపోయిన పట్టెడు మెతుకులను పడవేసినట్లు, కుక్కకు ఓ బిస్కట్టు పారవైచినట్లు, మాకు చిన్న చిన్న రాయితీలను ప్రకటించి, దానకర్ణులవలె పోజులిచ్చుచున్నారు! ఫోటోలు దిగుచున్నారు.

అయ్యయ్యో! నాయనలారా! రాజకీయ స్వాతంత్ర్యమే సిద్ధించినదిగాని, ఏది? ఆర్థిక స్వాతంత్ర్యమెక్కడిది? విదేశీ దాస్యశృంఖలములను విడిపించుకొని అంతకంటే బలమైన స్వదేశీ స్వార్థ, సంకుచిత, కులరాజకీయ దాస్య శృంఖలములలో ఇరికిపోయి నాము కదా! ఏదీ! గాంధీజీ కలలుగన్న రామరాజ్యమేదీ! గ్రామ రాజ్యమేదీ? నెహ్రూజీ కలలు గన్న మరో ప్రపంచమేదీ? తిలక్ కలలుగన్న స్వరాజ్యమేదీ!


అయ్యయ్యో! ఇట్టి స్వాతంత్ర్యము కొరకేనా వేలాది ప్రజలు ప్రాణముల నర్పించినది. లక్షలాది ప్రజలు సత్యాగ్రహములు చేసినది. శ్రీకృష్ణజన్మస్థానములను సందర్శించినది. బాంబులు పేల్చినది. తుపాకులు కాల్చినది. తుపాకి గుళ్ళకు గుండెల నెదురొడ్డి నిలచినది? అదుగో చూడుడు. ఆ దేశభక్తుల కన్నులవెంట ఆనందబాష్పములకు బదులుగ అశ్రుధారలు కురియుచున్నవి. "ఇది మన భారతదేశమేనా?" అని వారిలో వారనుకొనుచున్న మాటలు మీ చెవి సోకుట లేదా? నాయనలారా! ఆర్థిక స్వాతంత్ర్యము లేని రాజకీయ స్వాతంత్ర్యము కరిమింగిన వెలగపండు, వెన్నెముకలేని శరీరము, ప్రాణములేని కట్టె.

ఒక వైపు కోట్ల రూపాయల వ్యయముతో ప్రణాళికలా! లక్షలకొలది టన్నుల ఆహారధాన్యపు నిల్వలా! బహుళమైన ఖనిజ సంపదలా! భారీ పరిశ్రమలా! జీవనదులా! సారవంతమైన భూములా! శ్రమించి సేద్యము చేసెడి ప్రజలా! మరోవైపున నిరుద్యోగమా! నిరక్షరాస్యతా! దారిద్ర్యమా! అంటరాని తనమా! ఆకలిచావులా!వరదలా! కరువులా! కాటకములా! క్యూలా! రేషనులా! నాయనలారా! మనము మన తరువాతి తరమున కందించునది ఈ రేషనుకార్డులనేనా! నాయనలారా! ఇప్పటికైనను మించిపోయినది లేదు. ఆర్థిక వైషమ్యముల రూపుమాపుడు. నిరుద్యోగమును, నిరక్షరాస్యతను నిర్మూలించుడు. మంచిని, మానవత్వమును పెంచుడు. ప్రజాస్వామ్యముపై ప్రజలకు నమ్మకము సడలకుండ ప్రవర్తింపుడు. అది లేనినాడు ఈ స్వాతంత్ర్య దినోత్సవము ఏటేటా పెట్టెడు శ్రద్ధలేని శ్రాద్ధమువలె నుండును. సెలవు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

.మరో జంఘాలశాస్త్రి

అయలసోమయాజుల నాగేశ్వరరావు



# ఆధునిక కవిత్వము

*అంతకుముందేమి ప్రసంగించెనో గాని నేను సభా భవనమును ప్రవేశించుసరికి జంఘాల శాస్త్రి యిట్లుపన్యసించుచుండెను:*

ఆహా! ఏమి! వారి కవిత్వము నారికేళపాకమా! అది సామాన్యుల కందుబాటులో లేదా! రాజాస్ధానములకే పరిమితమై ఉండెడిదా! అర్ధము కాని సమాసములతో, సంధులతో, కఠిన పదజాలముతో కూడుకొని యున్నదా! పాత చింతకాయ పచ్చడా! అర్ధములేని కవిత్వమా! వ్యర్ధ కవిత్వమా! నాయనా! ఆనాటి దేశ, కాల పాత్రముల కనువుగ వారికి తోచినదేదియో వారు వ్రాసినారు. అందులోని మంచిని నీవు గ్రహించవలదా! చెడును విసర్జించవలదా! అది మన శరీరతత్వములోనే యున్నది కదా! మరి నీవట్లేల చేయవు. ఆత్మస్తుతి, పరనిందతోనే కాలక్షేపము చేసిన నేమి ప్రయోజనము?

ఏమంటివి? నీ కవిత్వమును చదివిన వేరే ఏ కవిత్వమును చదువనవసరము లేదా! వేరుగ భాష నేర్వనవసరము లేదా! నీకా కవిత్వమెచటి నుండి వచ్చినది? భారత, భాగవతాది గ్రంధములను, మను చరిత్రాది కావ్యములను జీర్ణించుకొనియే కదా ఈ భాషాభిమానమును, భాషపై ఈ అధికారమును సంపాదించినది! ఏ ప్రయత్నమునూ లేక భాష నీకూరక పట్టువడినదా?

మరి మేము వానిని చదువ నవసరము లేదా? మేము వానిని చదివిన భాషపై నీ కంటే అభిమానమును పెంచుకొందుమను భయము కాబోలు! భాషపై నీ కంటె అధికారమును సంపాదింతుమని భీతి కాబోలు! నీకంటే చక్కని కవిత్వము వ్రాయుదుమని ఈర్ష్య కాబోలు! నిన్ను మించిపోవుదుమని స్వార్ధము కాబోలు!

కవి యనగ నెంతటి విశాల హృదయుడు కావలయును! ఎంతటి సూక్ష్మబుద్ధి కావలయును! ఎంతటి ద్రష్ట కావలయును! ఎంతటి సౌమ్యుడు కావలయును! ఎంతటి తపశ్శాలి కావలయును! ఎంతటి సద్గుణశీలి కావలయును! పంచభక్ష్య పరమాన్నములను నీ వారగించి, నీ మోచేతి నీరు మమ్ము త్రాగుమనుచున్నావా? నీవు మధుర పానీయము లను సేవించి, నీ ఎంగిలి గ్లాసులను చప్పరించి మమ్ములను తృప్తిపడుమనుచున్నావా? మృష్టాన్నభోజనము నీ వారగించి, పులివిస్తరాకులను మమ్ము నాకమనుచున్నావా? బంగారు పళ్ళెరములో నీవు భుజించి మట్టి మూకుటిలో మమ్ములను తినమనుచున్నావా! నాయనా! కవి పలుకవలసిన పలుకులేనా యివి?

మన పూర్వకవులందరును తమ పూర్వకవుల రచనలను చదివి, గుణగ్రహణము చేసి మరీ కావ్యరచనను చేపట్టలేదా! ఏమియునూ చదువకుండ నీవు వ్రాయునదేమి? చూచిరాత తప్ప-

ఇక ఆధునిక కవిత్వమును గూర్చి రవంత చెప్పెదను నాయనలారా! 1930లో ఆవిర్భవించిన ఆధునిక కవిత్వమును ఏబదేండ్లకే నూరేండ్లు నిండినవి కదా! రాసియే పెరిగినది గాని వాసియేదీ? ఏదీ! ఈనాడు ఆధునిక కవిత్వమున కాదరణయేదీ? చదువువాడేడీ? ప్రచురణ కర్త ఏడీ? తన కృతికి తానే ప్రచురణ కర్త. తానే విమర్శకుడు. తానే పాఠకుడు. తాను వ్రాసినది తప్ప వేరొకరు వ్రాసినది చదువడు. వేరొకరు చేసిన విమర్శను సహించడు. సలహాలను సూచనలను స్వీకరించడు. ఇది ఆధునిక కవి స్థితి. తెలుగుజాతి దుస్థితి.

అధునిక కవిత్వమునకు మీరు చేసినదేమున్నది? కవిత్వమును ఛందోబంధముల నుండి విడిపించి అంతకంటే బలమైన రాజకీయ సిద్ధాంతపు చట్రములో నిరికించినారు. ఇక వస్తు వైవిధ్యమునకు తావేదీ? కల్పనా చమత్కృతికి అవకాశమేదీ? శిల్ప విన్యాసమునకు సందేదీ? రచనారామణీయకతకు రహదారి ఏదీ? ఏదియును లేదు. చెప్పిన భావమునే మరల, మరల మార్చి చెప్పుటయే తప్ప వేరు లేదు. కేవలము 'నినాద కవిత్వము'గ చేసినారు.

"ఆ మోస్తరు రచనలకన్నా
క్షేమంకద మేనుఫెస్టో సిరిసిరి మువ్వా" అన్న తప్పు లేదనుకొందును.

నాయనలారా! కంకంటి పాపరాజు ఉత్తర రామాయణములోని పద్యమున కయిన, పదకోశము దగ్గరనిడుకొని అర్థము చేసికొనవచ్చును గాని ఆధునిక కవి "ఆకుల అప్పలరాజు" గారి ఆకలి కవిత్వము నర్థము చేసికోలేము కదా! 'పెద్దన్న' గారి కవిత్వమున గల సొగసులను ఏ విద్వాంసుడయిన వివరించగలగును గాని మన 'ఎద్దన్న' గారి కవిత్వమును కర్థము అతనికే తెలియదు కదా! శ్రీనాథుని 'సీసము' కొంతయిన కరుగునుగాని 'చీమశ్రీ' గారి స్టీలు (Steel) కవిత్వము అవగింజంతయిన కరుగదే!

వారి కవిత్వము నారికేళపాకమా! మరి మీ కవిత్వమేదో తెలియునా? "దయ్యపు కొబ్బరి కాయ పాకము." వారి కవిత్వమును కాస్తంత శ్రమ తీసుకొని వొలచిన తియ్యని నీరు, కమ్మని కండ లభించునుగాని మీ కవిత్వమును వొలచిన మిగులునవి కేవలము పై పీచు, లోని పెంకు మాత్రమే!

దేశమునకు సందేశమేది? జాతిని జాగృతము చేసెడి నినాదమేది? జనము నుత్రూతలూగించెడి పదబంధమేది? కదన రంగములో యవనాశ్వమువలె ముందుకురి కించగల లయవిన్యాసమేది? ఊపిరి పోసెడి జీవశక్తి యేదీ? కదిలించు ప్రాణమేదీ? వాడి యేదీ? వేడి యేదీ? ఏదియును లేదు. ఉత్తపేలపిండి కవిత్వము–నిర్జీవ కవిత్వము – చచ్చుకవిత్వము వాక్యమునకు సంధి, సంధి విరుగగొట్టి పేర్చుట కవిత్వమా! అంత్య ప్రాసలకై దేవులాడుట కవిత్వమా! అర్థములేకుండ వ్రాయుట కవిత్వమా? ఏమంటివి? మీరు చేసినవి ప్రయోగములా! వారు చేసినవి పదబంధ విన్యాసములా! నీ ప్రయోగములు ఆధునిక కవితా లతకు పూచిన పూలా! వారి ప్రయోగములు తెలుగు సాహితీ లతకు కాచిన కుక్కమూతి పిందెలా! నీవు చేయు ప్రయోగములు తెలుగు సాహిత్య క్షేత్రమునకు ఎరువులా! వారి ప్రయోగములు తెలుగు సాహిత్య క్షేత్రమున నిస్సారపుటిసుక దిబ్బలా! కవితా ప్రక్రియలో ప్రయోగములు చేయుట నీ యబ్బసొత్తా! వారికి తోచిన ప్రయోగములు వారు చేసినారు.

నాయనలారా! చదువరి కాని వాడెవడును వ్రాయలేడు. కవిత్వము వ్రాయవలెనన్న భాషపై అధికారమవసరము. భాషపై అధికారమును సంపాదించుటకై మన పూర్వకవులు వ్రాసిన పురాణేతిహాసములను, ప్రబంధములనే కాక ఇతర భాషలలోని ఉత్తమ సాహిత్యమును సహితము అధ్యయనము చేయుడు. భాషపై అభిమానమును, అధికారమును పెంచుకొనుడు. పాత క్రొత్తల భేదములను విస్మరించి సాహితీమ తల్లిని సేవింపుడు. తరువాత మీకిచ్చ వచ్చిన ప్రక్రియలో మీకిచ్చవచ్చిన అభిప్రాయములను స్వేచ్ఛగ వ్యక్తము చేయుడు. అంతియేగాని నాయనలారా! పునాదులు లేకయే భవంతులు నిర్మింపగలరా! నేల విడిచి సాము చేయగలరా! ఉట్టి కెగుర లేకుండ స్వర్గమున కెగుర గలరా! ఓనమాలు రానివాడు ఓంకారేశ్వర స్వామిపై దండకము వ్రాయగలడా! ఎ,బి,సి,డి,లు రానివాడు 'ఆన్థోనీ అండ్ క్లియోపాత్ర'ను చదువగలడా! మాటలురాని వాడు మహాప్రస్థానమును అర్థము చేసికొనగలడా! సైకిలు తొక్కుట రానివాడు సైకిలుపై 'ఫీట్సు' చేయగలడా! నీటిని చూచి భయపడువాడు ఈదగలడా! పులిని చూచి భయపడువాడు సర్కసులో రింగ్ మాస్టర్ కాగలడా! భాషపై అధికారములేని వాడు కవిత్వము వ్రాయగలడా! ప్రయోగములు చేయగలడా!

అందులకని ఉత్తమ భాషాధ్యయనమును చేయుడు. చక్కని భాషనలవరచు కొనుడు. 'తెలుగు భారతి'కి మరిన్ని మణిహారముల నందించి కీర్తిబడయుడు. తెలుగు జాతిని ధన్యము చేయుడు. మీరు ధన్యులు కండు.

ఇప్పటికే చాలా చెప్పితిని. ఈ విషయమును గూర్చి వేరెప్పుడయిన మరల ముచ్చటింతును సెలవు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

మరో జంఘాలశాస్త్రి

అయలసోమయాజుల నాగేశ్వరరావు



# తెలుగు రాజధానిలో తెలుగుతనం

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! ఈ మధ్య నేను కార్యార్థినై హైదరాబాదు పాత నగర ప్రాంతమునకు పోయితిని. శివ, శివా! ఏమని చెప్పను నాయనలారా! తెలుగు రాజధానిలోనే తెలుగునకెంత దుర్గతి పట్టినది! తెలుగు జాతి ఎంత దిగజారిపోయినది! రాష్ట్ర రాజధానిలోనే తెలుగుభాషగతి యిటులుండ ఇక చెప్పవలసిన దేమున్నది? భాషాప్రయుక్త రాష్ట్రము కావలెనని సత్యాగ్రహములు చేసిన ఆద్యులమే! అందుకై ప్రాణత్యాగములొనర్చిన వారమే! భాషా ప్రయుక్తరాష్ట్రమేర్పడి ఐదు దశాబ్దములు దాటినదే! తెలుగు నధికార భాషగా నమలు చేయుట కరడజను అధికార భాష కమిషన్లు వేలకొలది పుటల నివేదికలను తయారు చేసినవే! సమర్పించినవే! ఆ నివేదికలను పరిశీలించుటకు వేరొక సంఘము నియమింపబడినదే! ఇరుగు పొరుగు రాష్ట్రములు తమ మాతృభాషలో పాలనా యంత్రాంగమును నడపుచుండ, రాష్ట్రరాజధానిలోనే తెలుగు, అధికార భాషమాట యటుంచి అర్థమగు భాషగకూడ లేదే! ఇంకను నగరములోని 'తలవాకిటి బల్లలు'(name boards)పైశాచిక తెలుగులో వ్రాయబడి యున్నవి కదా! వ్రాయబడుచున్నవి కదా!

"ఇచ్చట జుత్తు అందముగా నరకబడును" అనియు, "ఇచ్చట స్త్రీలకు అలగు ఏర్పాటులు కలవు" అనియు, "ఇచ్చట బరఫ్ అమ్మబడును" అనియు, "ఇచ్చట అందమైన బట్టలు అమ్మబడును" కు బదులు "ఇచ్చట అందమైన బుట్టలు అమ్మబడును" అనియు, "ప్రభుత్వ సారాయి దుకాణము"నకు "ప్రభుత్వ సురాయి దుకాణము" అనియు, "స్త్రీ జనాభ్యుదయశాఖ"కు "ఇస్త్రీ జనాభ్యుదయ శాఖ" అనియు, "మోటారు డ్రైవింగ్ స్కూల్"నకు "మోటూరు డైవింగు ఇస్కులు" అనియు, "సప్లయింగ్ కంపెనీ"కి "సప్లంగ్ కమ్‌పెని" అనియు "స్వీట్ హవుస్"నకు "స్వెట్ హవుజ్" అనియు, 'టైలర్'కు 'టేలర్' అనియు, "ప్రసూతి గృహమున"కు "ప్రసూతి గ్రహ"మనియు, 'బ్యాంగిల్ స్టోర్' నకు 'బంగల్ ఇస్టోర్' అనియు, 'తారక రాము'నకు 'తురక రాము'దనియు, 'భాగ్యలక్ష్మి'కి 'బాగ్జలక్ష్మి'అనియు 'పెయింట్స్'కు 'పెంట' అనియు 'లాడ్జి'కి 'లాడ్జ' అనియు ఇటులెన్నని చెప్పవచ్చును నాయనలారా! కొన్ని చోట్ల వ్రాయబడిన తెలుగు నర్థము చేసికొనుట మహా కష్టమగును కదా! పైన ఆంగ్లములోనో,

క్రింద హిందీలోనో వ్రాయబడిన దానిని చూచి, తెలుగులో వ్రాయబడిన దానిని సమన్వయించుకొని చదువుకొనవలసినదే! ఆ అక్షరాలంకారులు అక్షరములను చెక్కుటలో కనబరచిన నేర్పు, కూర్చుటలో కనబరచిన మార్పు అనన్యసామాన్యము గదా!

గాసట బీసటగా నున్న తెలుగు భాషను సంస్కరించి, భారతాంధ్రీకరణమును చేపట్టితినని గొప్పలు చెప్పుకొన్న 'నన్నయ' నొకసారి ఈ భాషను చదువనిండు. ముచ్చెమటలు పోయవలసినదే! మూర్ఛ పోవలసినదే! తెలుగు రాజధానిలోని తెలుగు స్థితిని చూచి, రాజమహేంద్రవరమునకు పరిగెత్తి పోయి, గౌతమీ నదిలో దూకి, ఆత్మహత్య చేసికొనవలసినదే!

ఎవ్వరికిని అర్థము కానట్లు 'తలవ్రాతలు' వ్రాయుట తన సొంతమని విర్రవీగుచున్న చతుర్ముఖుడు 'జంట నగరాల అక్షర శిల్పులు' వ్రాసిన 'తల వాకిలి బల్ల' వ్రాతలముందు బలాదూరు కావలసినదే! నాలుగు ముఖముల నొకే పర్యాయము నేలకు దించి, తన ఓటమి నంగీకరించవలసినదే! ఎనిమిది కళ్ళలో నీళ్ళు తిరుగ, నాలుగు నోళ్ళతో బావురు మనవలసినదే!

సాక్షాత్తూ సరస్వతీ పతికే ఈ గతి కల్గిన, ఇక లిపి సంస్కర్తల సంగతి, భాషా సంస్కర్తల గతి చెప్పవలసినదేమున్నది? సూర్యునిముందు మిణుగురువలె, పండితుని ముందు పామరులవలె, న్యాయాధికారిముందు సామాన్యుని వలె వెలవెల పోవలసినదే! తల వంచుకోవలసినదే!

ఒకచో "ప్రభుత్వ జ్వర చికిత్సాలయము" అని బల్లపై వ్రాయబడినది. నాయనలారా! బెల్లమునకు చీమలు పట్టుట నేనెరుగుదును. ఇనుమునకు త్రుప్పుపట్టుట నేనెరుగుదును. దీపమునకు పురుగులు చేరుట నేనెరుగుదును. మంచమునకు నల్లులు పట్టుట నేనెరుగుదును. మంచి కవిత్వమునకు తలయూచుట నేనెరుగుదును. మంచి పాటకు తాళము వేయుట నేనెరుగుదును. కాని ప్రభుత్వమునకు జ్వరము వచ్చుట నేనెన్నడును వినలేదు. కనలేదు. అధికార మదోన్మత్త ప్రభుత్వమున కిట్టి జ్వరము వచ్చునని నా వైద్య మిత్రుడొకడు సెలవిచ్చి నాడు. నిజమే కాబోలు. ఇంకను, ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతుక ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వంటి వనేకములు కలవు.

అంతియే కాదు నాయనలారా! ఇప్పటికినీ జంటనగరములలోని పలు వ్యాపార సంస్థలు తమ 'తలవాకిటిబల్ల'లను ఆంగ్లములోనో, హిందీలోనో, ఉర్దూలోనో

వ్రాయించుచున్నవి కాని తెలుగులో మాత్రము వ్రాయించుట లేదు. మరి ఈ వ్యాపార సంస్థలకు ప్రాంతీయ భాషపై ఈ అలసత్వమెందులకు? అనాదరణమెందులకు?

అలసత్వము, అనాదరణము వారిది కాదు. మనది. పొరుగున ఉన్న తమిళ, కన్నడ రాష్ట్రములలో కేవలము సైను బోర్డులే కాదు నాయనలారా! వాణిజ్యపన్నులకు సంబంధించిన లావాదేవీలన్నియు ఆయా ప్రాంతీయభాషలలోనే జరుపవలెనను నిబంధన కలదు. మరి మన రాష్ట్రమున అట్లు లేదు.

ఇటీవలే ఒక అధికారి ఐదు దశాబ్దముల సుదీర్ఘ నిద్రనుండి మేల్కొని' ఈ విషయమును గ్రహించి, వ్యాపార సంస్థలన్నియు తమ తలవాకిటి బల్లలను తెలుగులో తప్పక వ్రాయించవలెనని 'ఆంగ్లము'లో ఒక తాఖీదును జారీచేసెను. ఇటులున్నది మన భాషాభిమానము. మన అధికారభాషాచరణము.

అయ్యయ్యో! పదునారు కోట్ల తెలుగువారి రాష్ట్ర రాజధానీ నగరమే! తెలుగు జాతీయతకు ముఖ్యకేంద్రమే! తెలుగు సంస్కృతికి ఆలవాలమయిన నగరమే! సందున కొక్క సాహిత్య సంస్థ వెలసిన నగరమే! అట్టి తెలుగు రాజధానిలోనా ఈ 'వీర పైశాచిక తెలుగు భాష'.? తెలుగు భాష పట్ల ఈ అనాదరణ ?ఇన్ని ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు తెలుగు భాషోన్నతికై కృషి సల్పుచున్న రాష్ట్రరాజధానిలోనా ఈ అనర్థభాష!

నాయనలారా! మీ సాహితీ సేవలో భాగముగ, ప్రభుత్వమువారి అధికార భాషాభివృద్ధిలో భాగముగ, తత్క్షణమే జంట నగరములలోని అక్షర శిల్పుల కందరకును కనీసము తెలుగులోనయిన తప్పులు లేకుండా వ్రాయను, చదువను నేర్పుడు. మీ కృషికి ధన్యత చేకూరును. తెలుగు జాతి గౌరవ మినుమడించును. తెలుగు భారతి సంతసించును. తెలుగు ప్రజలు సంతసింతురు. భాషాభిమానులు సంతసింతురు, నేనును సంతసింతును.

***ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః***



# నూతన పరీక్షా విధానము

*జంఘాలశాస్త్రి దినపత్రిక నొకదానిని చేత పుచ్చుకొని, సభా భవనమును తొందర తొందరగ ప్రవేశించి, వేదికనెక్కి ఇట్లు ఉపన్యసించెను:*

నాయనలారా! ఈ రోజు దినపత్రికను చదివితిరా! ఆహా! ఎంత గొప్ప వార్త! ఎంత మంచివార్త! ఎంత మహోన్నత నిర్ణయము! ఎంత చక్కని ఆశయము! ఎంత చైతన్యాత్మకమైన మార్పు! ఎంత విప్లవాత్మక విధానము! వహ్వా! ఇది వార్తయా నాయనలారా! కాదు విద్యార్థుల పాలిటి కల్పతరువు! విద్యార్థి కర్ణామృతము! రసగుళిక! తేనెజల్లు! పుష్పవృష్టి!

ప్రస్తుత విద్యా విధానములో విద్యార్థులకు పరీక్షలు లేనందున సోమరితనము హెచ్చినదట. సంవత్సరాంతమున విద్యార్థులకు పరీక్షలు నిర్వహించుట వలన, ఒకసారి కాపీ చేసి పరీక్ష లందుత్తీర్ణులగుచున్నారట. పై రెండనర్థములనూ తొలగించుటకై నూతన విద్యావిధానము ప్రవేశ పెట్టనున్నట్లు అమాత్యశేఖరులు శలవిచ్చినారు. అందులో ముఖ్యమయినది విద్యార్థులు పుస్తకములను చూచి పరీక్షలు వ్రాయు పద్ధతి.

నాయనలారా! ఇంతకంటే విద్యార్థులకు కావలసినదేమున్నది? చదువ నక్కరలేదు. పుస్తకములున్న చాలును. పట్టా దానంతటదియే వచ్చును.

ముందుగ విద్యార్థులకు పరీక్షల నెత్తి వేసినదీ ప్రభుత్వమే కదా! వారిని సోమరులను చేసినదీ ప్రభుత్వమేకదా! మరిప్పుడీమొసలి కన్నీరెందులకు? ఇక పుస్తకములు చూచి పరీక్షలు వ్రాయుట యందురా! ఇందులో వింత ఏమున్నది. నూతనత్వ మేమున్నది? అధికారికముగ ప్రకటించక పోయినను ప్రస్తుతము పరీక్ష లింతకంటే భిన్నముగ జరుగుచున్నవని మన అమాత్యుల వారి అభిప్రాయమా? నాయనలారా! ఇది మట్టుకు శ్రమతో కూడుకొనిన పని కాదా! ఎన్ని పుస్తకములను తిరుగవేయవలయును! ఎన్ని పుటలని శోధించవలయును! ఎన్ని పుటలని చూచి వ్రాయవలయును! విద్యార్థులకు పరీక్షా సమయములో పుటలను శోధించుటలోనే సమయ మధికముగ వ్యర్థమగును కదా! అందువలన విద్యార్థులకు పరీక్షా సమయమున అవసరమయిన పుటలను వెదకి పెట్టు భారమును పరీక్షా మందిరములోని ఉపాధ్యాయులకప్పగింపుడు. లేకున్నచో ఉన్న స్వల్ప వ్యవధిలో పుటలు వెదుకుట, పేజీలకొలది చూచి వ్రాయుట శ్రమతో కూడిన పని కదా!

ఆహా! విద్యావిధానములో, పాఠ్యప్రణాళికలలో, పాఠ్యపుస్తకములలో మీ రాజకీయ సిద్ధాంతముల కనువగు పాఠములను జొప్పించి, విద్యార్థులను మీ రాజకీయ సిద్ధాంతముల కనువుగ మలచుకొను యత్నములో విద్యావ్యవస్థను ఈవరకే భ్రష్టుపట్టించి నారు కదా! అది చాలక ఇప్పుడు పరీక్షావిధానములో మార్పా? ఈవరకే చేసిన మార్పులు చాలకనా ఈ వింత మార్పు. నాయనలారా! మీకు ప్రయోగము లొనర్చుటకు ఇంతకంటే వేరు రంగము లేదా! స్వాతంత్ర్యము వచ్చి ఆరు దశాబ్దములు దాటినను, విద్యా విధానము మాత్రము రెండు శతాబ్దముల వెనుక నున్నదే! ఆంగ్లేయులు వారి రాజ్యతంత్రమును నడుపుట కవసరమగు గుమాస్తాలను తయారు చేయుటకు ప్రవేశపెట్టిన బానిస విద్యా విధానమని కల్లుత్రాగిన కోతివలె కుప్పిగంతులు వేసిన మీరు, కారెనుబోతులవలె రంకెలు వేసిన మీరు, చేసిన దేమున్నది? మీ నూతన విద్యా విధానము గుమాస్తా లగుటకు కూడా నుపయోగపడకుండా నున్నది కదా!

దినమున కొక మార్పా! సంవత్సరమున కొక నూతన పాఠ్య ప్రణాళికా! మంత్రి మారినపుడెల్ల మార్పా! మంత్రివర్గము మారినపుడెల్ల మార్పా!అధికారపక్షము మారినప్పుడెల్ల మార్పా! ఇందులకై కమిషన్లా! ప్రోజక్టు రిపోర్టులా!

నాయనలారా! నిన్న నాటిన విత్తనము నీ దినమున వెలికితీసిన నేమి ప్రయోజనము? అశ్వత్థవృక్ష ప్రదక్షిణము చేసి కడుపు తడుముకొనిన నేమి లాభము? ఏ ప్రయోగమున కయిన కొంత సమయము నీయనక్కరలేదా! ఏ మార్పునయిన కొంతకాలమోరిమితో పరిశీలించనవసరము లేదా! పరిశోధింపనవసరము లేదా! ఫలితము చక్కగ నున్నది, లేనిది తులనాత్మకముగ విశ్లేషించి నిర్ణయింపనవసరము లేదా? ఏమియును లేకుండ దినముకొక్క మార్పును ప్రవేశపెట్టిన యెడల ఇక పలితములను పరిశీలించుటెట్లు? మంచి చెడులను తేల్చుటెట్లు?

నాయనలారా! విద్యా విధానమును రాజకీయములతో ముడివేయకుడు – దానిని విద్యావేత్తల కప్పగింపుడు. జాతీయ విద్యా విధానమును రూపొందించి, కాశ్మీరమునుండి, కన్యాకుమారి వరకు గల యావద్భారతదేశమందును అమలు చేయుడు. దేశ ఆర్థిక, సాంఘిక సామాజిక అవసరముల కనువగు విద్యావిధానమును మలచుడు. విద్యను మార్పు సాధించుట కనువగునాయుధముగ తీర్చిదిద్దుడు. అంతియే గాని మీ మిడిమిడి జ్ఞానముతో, అర్థములేని ప్రయోగములతో, ఆచరణాత్మకముకాని ఆశయములతో, అక్కరకురాని పాఠ్య ప్రణాళికలతో విద్యార్థుల గొంతులు కోయకుడు. భావి తరములను పాడు చేయకుడు. భారతదేశము నధోగతిపాలు చేయకుడు. సెలవు.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

మరో జంఘాలశాస్త్రి

అయలసోమయాజుల నాగేశ్వరరావు



# సంతాప సభలు

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! ఈ మధ్యనే పరమపదించిన ఒక మహాకవి సంస్మరణ సభ జరుగుచున్నదని విని, ఆ మహనీయునికి శ్రద్ధాంజలి ఘటించుటకై నేను ఆ సభకు పోయితిని.

అహా! ఏమి కోలాహలము? సభాస్థలి వివిధ వ్యక్తులచే క్రిక్కిరిసియున్నది. సభలోని జనము మండిపోవుచున్న ఎండలను గూర్చియో, రాబోవు మామిడి కాయలను గూర్చియో, బందరు మిరపకాయల శ్రేష్ఠతను గూర్చియో, మనుమరాలి సమర్తను గూర్చియో, మేనల్లుని చదువును గూర్చియో, పిల్లవాని ఉద్యోగమును గూర్చియో, కడదాని కల్యాణమును గూర్చియో, పట్టుచీరలను గూర్చియో, పోలిష్టర్ షర్టులను గూర్చియో, పన్నులను గూర్చియో, ప్రణాళికలను గూర్చియో, పెరుగుచున్న ధరలను గూర్చియో, తరుగుచున్న ఆదాయములను గూర్చియో, ఎవరికి తోచిన విషయములను గూర్చి వారు ముచ్చటించుకొనుచున్నారు.

కొందరు 'దినపత్రిక పఠన దీక్షాదక్షులు' ఆనాటి దిన పత్రికలో పైన గల పేరునుండి, చివరగల ప్రచురణకర్త వివరముల వరకు అక్షరమయిన పొల్లుపోకుండా చదువుచున్నారు. ధ్వని ప్రవర్ధక యంత్రమునుండి "బలే మంచిరోజు, పసందైన రోజు, వసంతాలు పూచే నేటిరోజు" అను చలన చిత్రగీతము శ్రావ్యముగ వినబడుచున్నది.

ఆనవాయితీ తప్పకుండా సమావేశ మర్ధగంట ఆలస్యముగ ఆరంభమయినది. సమావేశాధ్యక్షుడు లేచి నిలువబడి, ముసి ముసి నగవులతో సభాస్థలినంతను పరికించి, ధ్వని ప్రవర్ధక యంత్రమును చూచి పులకించి, దివంగతుడయిన ఆ మహాకవిని గూర్చియు, ఆయన రచనలను గూర్చియు, అనర్గళముగ అర్ధగంట ప్రసంగించి, ఆ కవిని గూర్చి తాను వ్రాసిన కవితను అంత్యప్రాసలు తప్పకుండా, శ్రావ్యముగ చదివి, సభికులచే శభాషనిపించుకొనెను.

అటు తరువాత, దివంగతుడైన ఆ మహాకవి చిత్ర పటము శ్రోతల హర్షధ్వానముల మధ్య పూల మాలాలంకృతము చేయబడినది. తదనంతరము వివిధ సాహితీ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, ఒకరి తరువాత ఒకరు విచ్చేసి, ఆ మహాకవి

కవిత్వమును గూర్చియు, తమ సంస్థ కార్యకలాపములను గూర్చియు, తమ భవిష్యత్ప్రణాళికలను గూర్చియు, ఏకరువుపెట్టి, గడగడ, గ్లాసుడు మంచి తీర్థమును సేవించి, వెనుక నుండి కరతాళధ్వనులు చేసిన తన సంస్థ సభ్యులకు కృతజ్ఞతాపూర్వకముగ ఓ చిరునవ్వును చిలుకరించి, శిరఃకంపనముతో పలుకరించి తమ తమ ఆసనములపై కూర్చుండి, ఇతర సాహిత్య సంస్థలు పనిచేయు తీరు తెన్నులను విమర్శించుచు గాబోలు, పక్కవారితో గుసగుసలాడుచున్నారు.

కవులు ఆ మహనీయుని గూర్చి కవిత్వమును వ్రాసి, చదివినదే మరొక మారు చదివి, బాగున్నదనగ మూడవ మారు చదివి, తమ కవిత్వమున కింత మంది శ్రోతలు లభించినందులకు అమందానంద కందళిత హృదయులై, ఆనంద సాగరములో తేలియాడుచు, అరుదుగా వచ్చిన అవకాశమును సద్వినియోగము చేసికొన యత్నించుచున్నారు.

ఇట్లు ఆ సభావేదిక యంతయు ఉపన్యాసకుల హుంకారములతో, కవుల అహంకారములతో, శ్రోతల కరతాళధ్వనులతో కళ, కళలాడిపోయినది. అది ఆ మహాకవి సాహిత్య వ్యక్తిత్వములపై జరిగిన గోష్ఠీ కార్యక్రమమో లేక సంతాపసభయో నాకింకను అవగతము కాలేదు.

అయ్యయ్యో! బొట బొట కన్నీరు కార్చవలసిన తరుణమే! గొంతు బొంగురుపోవ ఏడ్వవలసిన సమయమే! ఏడ్చి, ఏడ్చి, అలసి, సొలసిపోవలసిన సమయమే! నోటమాటరాక గొంతు పెగలక మౌనముగ రోదించవలసిన సమయమే! ఆ మహాకవి ఆత్మశాంతికి శ్రద్ధాంజలి ఘటించవలసివ సమయమే! అట్టి సమయములోనా ఈ ఉపన్యాసకుల అసందర్భ ప్రసంగములు; ఈ కవుల అనర్థ కవితా వ్యాసంగములు!

నాయనలారా! ఒక కాకి మరణించినచో, మిగిలిన కాకులన్నియు దాని దరిజేరి, కంటనీరిడుకొని 'కావు' మని విలపించునే గాని యిట్లు కవితలల్లి మిగిలిన కాకుల ప్రాణములు తీయుచున్నవా? ఒకవేళ, అట్టి కాకియే యున్నయెడల మిగిలిన కాకులన్నియును దానిని ముక్కుతో పొడిచి చంపకుండునా? మేధావియే! తెలివికలవాడే! లోకజ్ఞానమెరిగినవాడే! అట్టి కవి శబ్దవాచ్యుడు చేయదగిన పని యేనా యిది? పశు పక్ష్యాదులకు గల ఇంగితజ్ఞానములో సహస్రాంశమయిన లేని ఇట్టి కవులు పుట్టలోని చదలుకంటే నెక్కడ ఎక్కువ వారు?

ఇంతలో ఒక అభ్యుదయవాది కాబోలు, చర చరా వేదికనెక్కి, అధ్యక్షుని అనుమతితో, ఇట్లు ప్రసంగించెను. సోదరసోదరీమణులారా! ఈతడు వర్ధి బూర్జువా

కవి. తన పాత చింతకాయ పచ్చడి కవిత్వముతో, రచనలతో ఇతడు ఆంధ్రజాతిని రెండు శతాబ్దముల వెనుకకు నెట్టినాడు. అట్టి కవి మరణించినందుకు సంతోషమే కాని సంతాపము చెందనవసరము లేదు" అని ఇంకేమేమో ఉద్రేకముగా ప్రసంగించు చుండ ఆ సంస్థ అధ్యక్షుడతనిని వారించి, అర్థించి క్రిందికి పంపివేసెను.

అయ్యో! కవిసమ్రాట్టుగా పేరుగాంచి, 'జ్ఞానపీఠ' పురస్కారమునంది, శతాధిక గ్రంథ కర్తయై, దాదాపు ఒక అర్థశతాబ్దము తెలుగు సాహిత్యాకాశమున రాకాసుధాకరుని వలె ప్రకాశించి, ప్రాచీన అర్వాచీన సాహిత్యములకు పట్టుకొమ్మయై నిలిచిన ఆ సాహితీ మూర్తికా ఈ అవమానము?

నాయనలారా! ఎవరయిన రాజకీయనాయకుడు పోయిన, తమ రాజకీయ సిద్ధాంతములను ప్రక్కనపెట్టి, ఆతనికి శ్రద్ధాంజలి ఘటించెడి రాజకీయనాయకుల కున్నపాటి సంస్కారము కూడా లేని ఈ అభ్యుదయ వాది నేమనవచ్చును.

చివరగా, కరతాళధ్వనుల మధ్య, సంతాప తీర్మాన మామోదింపబడినది. ఇట్లు సంతాప సభ సంతాపకరముగ ముగిసినది. నాయనలారా! ఏ కవి అయినను మరణించు తరుణమున కోరుకొనున దొక్కటే! తన కవిత్వము పది కాలముల పాటు ప్రజల నాల్కలపై పదిలముగా నుండుట. అందుకు చేయవలసినదా మహనీయుని సాహిత్యాధ్యయనము గాని చచ్చు గీతములు, అసందర్భ ప్రలాపములు కావు. ఆ మహనీయుని సాహిత్యాధ్యయనము చేయుడు. అపుడే అతని ఆత్మకు నిజమయిన శాంతి లభించును అని అనుకొనుచు, మనసులోనే ఆ మహనీయునకంజలి ఘటించి గృహోన్ముఖుడనైతిని.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# ఎన్నికలు

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

ఆహా! ఏమా సంరంభము! ఏమా కోలాహలము! ఏమా కలకలము! ఏమా హడావుడి! ఏమా సందడి! ఏమా ఆర్భాటము! ఎచ్చట చూచినను రంగు రంగుల జండాల తోరణములే! ఎచ్చట చూచినను కరపత్రములే! ఎచ్చట చూచినను కథాకాలక్షేపములే! ఎచ్చట చూచినను ఉపన్యాస విన్యాసములే! ఏ గోడపై చూచినను నాయకుల చిరునవ్వుల చిలుకరింపులే! అభయ హస్తములే! ఏ నాయకుని నోట విన్నను శ్రేయోరాజ్యస్థాపనా ప్రతిజ్ఞలే! ఎవరిని పలుకరించినను సర్వస్వామ్యసిద్ధాంతాలాప కలాపములే! వెనుకబడిన వర్గములపై సానుభూతి వర్ష పరంపరలే! భూస్వామ్యమును బూడిద చేయుదుమని ప్రకటనలే! పెట్టుబడిదారీ వ్యవస్థను భూస్థాపితము చేయుదుమని బీరములే! ప్రతిపక్ష నాయకులపై నేరారోపణములే! వారు దేశమును కుదువ పెట్టెదరని బెదిరింపులే! ప్రజాస్వామ్యమునకు ముప్పని ఆదరింపులే! ప్రజాసేవా భాగ్యమును ప్రసాదింపుడని వినతులే! విజ్ఞాపనలే! "ఒకసారి గెలిపించిన మరల అయిదు సంవత్సరముల వరకు మీ జోలికి రామని" హామీలే! ఇట్లు యావద్భారతము ఎన్నికల జ్వరముతో కంపించిపోయినది.

ఆహా! భారతమాత ధన్యచరిత కదా! ఎంతమంది దేశభక్తులు! ఎంత మంది ప్రజాసేవాపరాయణులు! ఎంతమంది స్వార్థ త్యాగులు! ఎంత మంది అకళంక సౌశీల్యమూర్తులు! ఇట్టి వారలను గన్న భారతదేశము పుణ్యభూమి కాదా! "సొంత లాభం కొంత మానుకు, పొరుగువానికి తోడు పడవోయ్" అని మహాకవి అంటే కొంతేమి ఖర్మ, అంతా మానేసి ప్రజాసేవకి సిద్ధమయిన ఈ ప్రజాసేవాపరాయణులను గన్న భరతమాత పుణ్యమూర్తి కాదా! ఇట్టి మహనీయులు జన్మించినందులకు మనము గర్వించనక్కరలేదా!

అయ్యో! ఎన్నడును ఎండ కన్నెరుగని మహానుభావులు సహితము ఈ ఎన్నిక దినములలో, మండు టెండలలో, వేసవి గాడ్పులలో సహితము మంచునకు విరిసిన గులాబీలవలె చిరునవ్వులు చిలుకరించుచున్నారు. ప్రజాకోటిని పలుకరించుచున్నారు. ఎన్నడును పాదము నేలమోపని వారు పాదయాత్రలు చేయుచున్నారు. ప్రజాభీష్టమును గణుతించుచున్నారు. ఓట్లను గుణించుకొనుచున్నారు. ఎల్లప్పుడును గజదంత

సౌధములలో నివసించెడివారు పూరి గుడిసెలను సందర్శించుచున్నారు. పేదలను, అనాథులను పలుకరించుచున్నారు. వారి కష్టసుఖములను ఆలించుచున్నారు. ఓటు వేసిన కష్టములు తీర పాలింతుమని ప్రతిజ్ఞలు సేయుచున్నారు. "ప్రజాసేవార్థ మిదం శరీరం" అని ముతక ఖద్దరు ధోవతులతో, చొక్కాలతో, తలపై టోపీలతో విశ్వరూప సందర్శన భాగ్యము నొసగుచున్నారు.

ఈ ప్రజాసేవా భాగ్యమునొందు దీక్షలో కొన్ని లక్షలు ఖర్చగుట, కొన్ని గుడిసెలు నేలకూలుట, కొన్ని గృహములు దహనమగుట, కొన్ని అల్పప్రాణములు పోవుట, కొన్ని కాళ్ళు విరుగుట, కొన్ని కీళ్ళు వదులుట వంటి అల్ప విషయములు వారి దీక్షా దక్షత కడ్డు నిలువలేవు. ఆనకట్టలు కాలేవు.

ఎన్నికలు దగ్గరయిన కొలది ఈ సంరంభమధికమయినది. ఏ వీధి చివర చూచినను ఉపన్యాసములే! ఈ సంరంభమును చూడగోరి, విషయ సేకరణార్థినై నేనును ఉపన్యాసము వినుటకొక్క చోటికి పోయితిని. అంతకు ముందేమి ప్రసంగించెనోగాని నేను సభా ప్రవేశము చేయుసరికి, వేదికపయినున్న ఒక నాయకమ్మన్యుడిట్లు రంకె వేసెను. "వద్దు – వారి మాటలు మీరు నమ్మవద్దు. దేశ మధోగతి పాలగును. ప్రజాస్వామ్య మంతరించును. నేను పక్షముకొక్క రాజకీయ పక్షమును మార్చుచున్నానని నన్నన్యాయముగ నిందించుచున్నారు. ఏదీ? నేను మారినదెప్పుడు? రాజకీయ రంగము ప్రవేశించిన నాటినుండి నేటి వరకు నేనెన్నడయిన అధికార పక్షమును వీడితినా? అధికారమును వీడితినా? అదియును కాక పదవిలో నుండి ప్రజాసేవ చేయుట ముఖ్యముగాని పార్టీలదేమున్నది? ఎన్ని కష్టములు వచ్చినను లెక్క చేయక, ఏదియో ఉడుతాభక్తిగా ప్రజాసేవ చేయుచుండ వారు కిట్టక అట్లు ప్రచారము చేయుచున్నారు (ఉడుతా భక్తికాదు. పందికొక్కు భక్తి అని సభలోనుండి కేకలు). నేను ప్రజాసేవ చేయకుండ అడ్డంకులేర్పరచ ప్రయత్నించుచున్నారు. వారి మాటలు నమ్మకుడు. మరల మీ సేవా భాగ్యము నాకొసగుడు" అని దీనముగ వేడుకొనుచున్నాడు.

అయ్యయ్యో! త్రాగుటకు మంచి నీరు లేదా! మా పార్టీని గెలిపించిన, అమెరికా నుండి దిగుమతి చేసి మరీ సరఫరా చేయుదుమని ఒక నాయకుడభయ మొసగుచున్నాడు.

చక్కెర దొరకుటలేదా! మమ్మధికారములోనికి రానిండు. ప్రతి వ్యక్తికి నెలకు కిలో చక్కెర నుచితముగా సరఫరా చేయుదుమను నినాదము లేవదీసినదొక పక్షము.

బంగారము ధర పెరిగినదా! చింతింపకుడు. మంగళ సూత్రముల కవసరమగు బంగారమును నుచితముగా నిప్పించెదమని మరో పక్షము ప్రతిన చేసినది.

ఈసారి మరల వరద రానిండు. మిమ్ములను హెలికాప్టర్లలో సురక్షిత ప్రాంతములకు తరలించు ఏర్పాట్లు చేయుదుమని మరొక పక్షము వాగ్దానము చేసినది. ఏమది? పసిపిల్లలకు పాలు దొరకుట లేదా? మా పార్టీ అధికారములోనికి రానిండు. ఇంటికో గోవు నిప్పించు ఏర్పాట్లు చేయుదుమని వేరొక పక్షము విన్నవించినది.

ఏమి, బ్రాడ్‌గేజి రైలు మార్గమా? దానిదేమున్నది తప్పక చేయింతుము. అంతవరకు, ఇప్పుడున్న మీటరుగేజి ధూమ శకటములకే కొన్ని బ్రాడ్‌గేజీ బోగీలను తగిలించు ఏర్పాటు తక్షణమే చేయుదుమని మరొక పక్షము హామీ నిచ్చుచున్నది.

ప్రతి పేద కుటుంబమునకు నివసించుటకు ఒక గృహము, కుటుంబములోని ప్రతి వ్యక్తికీ నెలకు పదికిలోల బియ్యము, వంటగ్యాసు, కరెంటు, రంగుల బుల్లి తెరపెట్టె ఉచితముగా అందచేయుదుమని మరో పక్షము హామీనిచ్చినది.

వహ్వా! నాయనలారా! భక్తవశంకరుడు, భోళా శంకరుడు అని పేరుగన్న ఆ పరమ శివుడెప్పుడయిన ఇట్టి వరము లొసగినాడా? వానికి వరము లిచ్చి తన నెత్తికి తెచ్చుకొనుటయే తెలియునుగాని, మన రాజకీయ నాయకుల వలె ఎదుటివారి నెత్తిపై చేతులు పెట్టుట తెలియునా? ఆ ముక్కంటియే మన నాయకాగ్రేసరుల ముందు బలా దూరయినప్పుడు సామాన్యులమయిన మన సంగతి చెప్ప వశమా!

వారేమి సామాన్యులా! రూపమున వినాయకులు, సంపదకు లక్ష్మీ పతులు, వాక్చాతుర్యమున సరస్వతీ పుత్రులు, వరముల నొసగుటలో భోళా శంకరులు, అధికార ప్రీతిలో మహేంద్రులు, పరిపాలనలో ధీర లలిత నాయకులు, దేశ పురోభివృద్ధి పాలిటి శని గ్రహములు. ఇన్ని విలక్షణములు మూర్తీభవించిన మన నాయకులు...

అయ్యయ్యో! ఏమా కలకలము నాయనలారా! దగ్గరలోనే ఎక్కడనో కొంపలు కాలుచున్నట్లున్నవి. పదండి పోవుదము.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# విచిత్ర స్వప్నము

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! నిన్న జరిగిన యగ్ని ప్రమాదము నదుపు చేయుటలో సహకరించి ఆలస్యముగ యిల్లు చేరుకొని పండుకొంటిని. ఒక వింత స్వప్నము వచ్చినది. దానిని గూర్చి జ్ఞాపకమున్నంత వరకు చెప్పెదను. అదేదో ఒక మహా నగరము. దాని ప్రధాన వీధుల గుండా ఒకపెద్ద ఊరేగింపు సాగిపోవుచున్నది. దాదాపు ఒక మైలు పొడవున్న ఆ ఊరేగింపులో వేలాదిమంది ముతుక ఖద్దరు పంచెలతో, చొక్కాలతో, టోపీలతో, జరీకండువాలతో అందు పాల్గొనిరి. అయ్యయ్యో! ఎండ కన్నెరుగని మహానాయకులు, ప్రజాస్వామ్య ప్రభువులు ఇట్లు మండుటెండలో పాదచారులగుటకు కారణమేమయి ఉండును? ఎన్నికలు కూడా దరిదాపులలో లేవుకదా! అని నాలో నేననుకొనుచు వారు పట్టుకొన్న వివిధ శీర్షికా పతాకములను చూడగోరి ముందున కేగితిని. "మాకు పదవీభద్రత కలిగించాలి" అనియు, "అధిక వేతనములు కావాలి" అనియు, "అదనపు సౌకర్యములు కలుగచేయాలి" "ఫింఛను పెంచాలి" అనియు, "ఇల్లు కట్టుకోడానికి ఐదు వందల గజముల స్థలాన్ని ఉచితంగా ఇవ్వాలి" అనియు "పిల్లలపై చదువులకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలి" అనియు "నియోజకవర్గంలో తిరిగేందుకిచ్చే భత్యాన్ని పెంచాలి" అనియు "ధరల పెరుగుదల సూచిననుసరించి కరువు భత్యం ఇవ్వాలి" అనియు, "యూనిఫారంని, వాషింగ్ అలవెన్సుని ఇవ్వాలి" అనియు వివిధములయిన శీర్షికా పతాకములను చేతపుచ్చుకొని నడచుచు చివరికొక్క మైదానము చేరిరి. అచ్చటొక బహిరంగ సభ ఏర్పాటు చేయబడినది. పచ్చని ఆ మైదానము, తెల్లని టోపీలతో నిండి, కొంగలు చేరిన చింతచెట్టువలె శోభిల్లుచున్నదని మా వాణీ దాసకవి కవిత్వము చెప్పుటకు యోగ్యముగ నుండెను.

అంత సభాధ్యక్షుడు లేచి నిలువబడి యిట్లు ప్రసంగించెను; సోదరసోదరీ మణులారా! ఈనాటి మన చారిత్రాత్మకపు టూరేగింపునకు కారణము మీకు తెలియనిది కాదు. మనమెదుర్కొనుచున్న సమస్యలను సంఘటిత శక్తితో సానుకూల పరచుకొనుటకే నేడు మనమిచ్చట సమావేశమైతిమి. సామాన్యులందరును మనమిచ్చట ఇంద్రలోక సుఖముల ననుభవించుచున్నామనియు, భోగలాలసులమై వర్తిల్లుచున్నా మనియు,

ప్రజా సంక్షేమమును నిర్లక్ష్యము చేయుచున్నామనియు నిందించుచున్నారు. మన కష్టములు వారికెట్లు తెలియును.

మనమొక పదవి సంపాదించుటకెన్ని కష్టములు పడవలయునో, ఎందరి కాళ్ళు పట్టుకొనవలయునో, ఎందరి గొంతులు కోయవలయునో, ఎందరిని మోసగించ వలయునో, ఎందరి నోళ్ళు కొట్టవలయునో, ఎంత సొమ్ము ఖర్చు చేయవలయునో, ఎందరికి కాకాలు పట్టవలయునో, ఎందరి బాకాలూదవలయునో, ఎంత స్వాభిమాన మొదలుకొనవలయునో మీరెరుగనిది కాదు. పార్టీ టిక్కెట్టు సంపాదించినది మొదలు పదవినలంకరించువరకు మనము పడని పాట్లున్నవా! అవి పగవానికైన వద్దనిపించును కదా!

పోనిండు, ఇన్ని పాట్లు పడి, ఇంత గడ్డి కరచి, ఇంత సొమ్ము వెచ్చించి, ఇన్ని నిందలు మోసి, స్వాభిమానమును కుదువబెట్టి సంపాదించిన పదవి మట్టుకు శాశ్వతముగ నున్నదా! ఏదీ? పదవి స్వీకరించిన నాటినుండి అసమ్మతి వర్గము వారి ఆరోపణములు, ప్రతి పక్షములవారి ఆందోళనలు, అధిష్ఠాన వర్గము వారి తాఖీదులు, పత్రికల వారి వ్యాఖ్యానములు, టి.వి. ఛానళ్ళ వారి ఉపాఖ్యానములు, మన సంజాయిషీలు, వీటితోనే సరిపోవుచున్నది కదా! ఇట్లుండ ఇక ప్రజా సంక్షేమ మెక్కడ? మన పదవి క్షేమముగా నున్నప్పుడు కదా ప్రజా సంక్షేమము! వర్గ సమీకరణమునకే సమయము చాలక సతమతమగుచున్న ఈ తరుణములో త్రాగుటకు నీళ్ళు లేవనియో, తినుటకు తిండి లేదనియో, ఉండుటకు ఇళ్ళు లేవనియో, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినవనియో, పన్నులు పెంచినారనియో, పాఠశాలలలో విరాళములు స్వీకరించుచున్నారనియో, ఫీజులు పెంచినారనియో, విత్తనములు, ఎరువులులభించుట లేదనియో, వరికి మద్ధతు ధర పెంచమనియో, వరదల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారము నందించమనియో, ఎవరో ఒక స్త్రీకి మానభంగము జరిగినదనియో అలజడులా! ఆందోళనలా! ధర్నాలా ! రాస్తారొకోలా! బంద్‌లా! పనికిమాలిన పరిజనమును మనము వేలుపోసికొనగ లేనిది, నిత్యమును వాడుకొనవలసిన కడివెడు నీళ్ళను రూపాయి నిచ్చి కొనుక్కొనుటకు కొంపలు మునిగి పోయినట్లు అలజడులా! వీనికి బుద్ధున్నదా!

లక్షలు ఖర్చు చేసిన కాని పార్టీ టిక్కెట్టు లభించుట దుర్లభము కదా! అట్లు ఖర్చుచేసి పార్టీ టిక్కెట్టు సంపాదించినను, ఎన్నికలకు మరింత ఖర్చు చేయవలయును కదా! ఒక్క ఖర్చుతోనే సరిపోవునా! ఎన్ని పాదయాత్రలు చేయవలయును!

ఎన్నుపన్యాసము లీయవలయును! ఎన్ని వాగ్దానములు చేయవలయును! అంతేనా! ఓటర్ల తిట్లని కూడ దీవెనలుగ స్వీకరించి, చిరునవ్వులు చిందించుచు, ముకుళిత హస్తములతో పలుకరించవలయును. ఇన్ని అగచాట్లు పడినను గెలుతుమన్న నమ్మకమేది? ఎటులో గెలిచినను, మరల అయిదు సంవత్సరముల వరకు పదవిలో నుందుమన్న నమ్మకమేది? మధ్యంతరపు ఎన్నికలలో కేంద్రములో కొత్త పక్ష మధికారములోనికి వచ్చినదనియో, రాష్ట్రములో రాజకీయ ప్రతిష్టంభన మేర్పడినదనియో, శాసన సభలను రద్దు చేయుట జరుగుచునే యున్నది కదా! మరి మన పదవులకు భద్రత యేది?

సోదరులారా! మన ముద్యోగములు వేయించిన ప్రభుత్వోద్యోగులు సంవత్సరముకాగనే ధ్రువీకరించబడి సర్వహక్కులను అనుభవించుచుండ, వారికుద్యోగముల నిచ్చిన మనము; దినమొక గండముగా, ఎప్పుడుండుదుమో, ఎప్పుడూడుదుమోయను బెంగతో, ఏ పక్షముననున్న ఏమి వచ్చునో యన్న భయముతో, ఏ రాజకీయ పక్షమున చేరిన మన భవిష్యత్తు భద్రముగ నుండునా అను ఆలోచనలతో సతమతమగుచు, ఘడియకొక ముఠాలో, గంటకొక వర్గములో, పక్షమునకొక రాజకీయ పక్షములో చేరి నిత్య వేదనతో బ్రతుకు కొనసాగించుట లేదా!

చదువులుమాని, వ్యవసాయము మరచి, చివరకు మనము కట్టవలసిన పన్నులను సహితము కట్టుట మరచి ప్రజాసేవకే అంకితమయిన మన బ్రతుకులకు భద్రతయేది? దేశ సేవకే అర్పణమయిన మన పదవులకు భద్రత యేది? ఇన్ని ఇబ్బందులకోర్చి, ఇన్ని త్యాగములు చేసి, పదవీ బాధ్యతలను స్వీకరించి, తృణమో, పణమో తిని కాలక్షేమపు చేయుచుండ, మనమన్యాయముగ దేశమును కొల్లగొట్టుచున్నామనియు, దేశమును కుదువబెట్టుచున్నామనియు, నిందారోపణములా! వాటిని నిరూపించుటకై కమిషన్లా! ఎంక్వయిరీలా! సాక్ష్యములా! చట్టబండలా! ఛీ! ఛీ! (సిగ్గు, సిగ్గు అని సభలో అరుపులు).

సహ బాధితులారా! దీపముండగనే యిల్లు చక్క పెట్టుకోవలెనని ఆర్యోక్తి ఉన్నది కదా! పదవిలో నుండగనే పదవీ విరమణ తరువాతి కాలమున కవసరమగు వనరులను సమీకరించుకోనవసరము లేదా! ఇది నేరమా! వర్షాకాలము వచ్చుచున్నదనియు, పొడికట్టెలు దొరకవనియు, సంసారి వేసవిలోనే వర్షాకాలమున కవసరమగు కట్టెలను సమీకరించుకొనుట లేదా! అది నేరమా! అది నేరమయినపుడు మనదియును నేరమే! అతడు శిక్షార్హుడయిన, మనమును శిక్షార్హులమే!

సోదరులారా! ఇటీవలి కాలములో కొంతమంది విద్యావంతులయిన యువకులు రాజకీయ రంగములో ప్రవేశించుచున్నారు. ఇది ప్రమాదకరము. చదువుకున్నవారు ఏ ఉద్యోగమునయిన చేసికొని బ్రతుకవచ్చును. కాని చదువులు మాని, వ్యవసాయమును, వృత్తులను మరచి రాజకీయములనే వృత్తిగా నమ్ముకుని బ్రతుకుచున్న మన గతి ఏమి కావలయును? తక్షణమే మనమిట్టి దురన్యాయముల నెదిరించవలయును. రాజకీయ రంగమును నిరక్షరాస్యులయిన మనవంటి వారికి ప్రత్యేకించు శాసనము నొక దానిని తక్షణమే తేవలయును (కంకర, కంకర అని సభలో కేకలు).

ఒక సారి ఒక పదవికి ఒక వ్యక్తి ఎన్నికయినచో, కనీసమయిదు సంవత్సరముల వరకు అతడా పదవిలో కొనసాగవలయునని తీర్మానించవలయును.

పదవీ విరమణ తరువాత మన ఖర్చుల కవసరమగు మొత్తమును ప్రభుత్వమే అందచేయవలయును.

మనలో ఎవరయిన పదవిలో నుండగ పరమ పదించినచో ఆయన భార్యకుగాని, వారసునికిగాని ఆ పదవి నొసంగవలయును.

ఇట్లు తీర్మానములు జరుగుచుండ, మధ్యలోనుండి పెద్ద శబ్దము వినబడినది. అందరును అటువైపు మరలి చూచిరి. ఆ దట్టమయిన పొగ నడుమ ఒక పురుషాకృతి వెలసినది. లొడితెడు ముక్కుతో, తీక్షణమయిన కన్నులతో, మొలకు మూరెడు గావంచతో, ముక్కుపై జారిన కండ్ల జోడుతో, బోసి నోటితో, చేత నూతకఱ్ఱతో, కాళ్ళ కరిగిన చెప్పులతో నున్న ఆ మూర్తిని నేను గుర్తించితిని. కాని నాయనలారా! ఆ కన్నులలో ఇదివరకటి ప్రసన్నత లేదు. ఆ బోసినోట చిరునవ్వు లేదు – ఆ ముఖములో అలనాటి ఆ సౌమ్యత లేదు. దక్షయజ్ఞవాటి కాంతర్భాగమున శివజటాజూటము నుండుద్భవించిన వీరభద్రునివలె అతడు నాకగపడినాడు. అంతే! సభా కార్యక్రమము సద్దుమణిగినది. తీర్మాన సంరంభముల సందడి తగ్గినది. అచ్చటనున్న వారందరును ఆ మూర్తిని చూచిన తోడనే భయ విహ్వలులయి పారిపోదొడంగిరి. ఆ తొక్కిసలాటలో ఒకడు నాపై వచ్చిపడెను. నేను తుళ్ళిపడి లేచి చూడగా మంచము పై నుండి దొరలి క్రింద పడితిని.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# చలన చిత్రములలో ముద్దులు

*జంఘాలశాస్త్రి చేత వార్తా పత్రిక నొకదానినిదుకొని, సభాభవనమున ప్రవేశించి, చివాలున ఉపన్యాస పీఠము నధిరోహించి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! ఇది కంటిరా! మన అమాత్యశేఖరులు ప్రవచించిన ఈ సూక్తులను వింటిరా! ఆహా! అవి పలుకులా! కావు నాయనలారా! మహాభాష్యములు! మౌక్తికములు! పూలడోలలు! మకరందపునోలలు! ముద్దుపలుకులు! వసంతకాలపు కోకిలాగానములు! పూవిలుకానికి నూతన శరములు! చలన చిత్ర నిర్మాతల పాలిటి వరములు! శృంగార ప్రియులకు మృదంగ నాదములు.

శ్రీ కృష్ణ భగవానుని గీతోపదేశము ఈ అమాత్య పుంగవుని పలుకులముందు దిగదుడుపునకైన పనికిరాకుండ పోయినది కదా! శ్రీ శంకర భగవత్పాదుల భాష్యములు మన మంత్రి సత్తముని భాష్యములముందు విలువలేకుండ పోయినవి కదా! మహాత్ముని మహితోక్తులు ఈ సచివోత్తముని సూక్తులముందు వెల వెల పోయినవి కదా!

ఆ మహనీయుడేమి సెలవిచ్చెనో తెలియునా నాయనలారా! ఆ త్రిసూత్ర భాష్యములో మొదటిది చలన చిత్రములలో ముద్దులను ప్రవేశపెట్టుట, 'ముద్ద'నగ తనకు ముద్దనియు, అది మన నిత్య జీవితములో భాగమనియు, అట్టి వానిని చలన చిత్రములలో ప్రదర్శించుటలో తప్పేమియులేదనియు ముక్కు తిమ్మనార్యునివలె ముద్దు ముద్దుగా పలికి నాడీ మహానుభావుడు. ఆహా! పంచదార తీపిగ నుండునని చెప్పినట్లు చెప్పినాడు! వేపకాయ చేదుగ నుండునని చెప్పినట్లుచెప్పినాడు! తేట తెలుగులో, తేట గీతులలో, అందరికీ అర్థమగునట్లు పలికిన ప్రజాకవి వేమన్న ఈ ప్రజా నాయకుని సహజత్వమునకు తల వంచుకోవలసినదే కదా!

నాయనలారా! మన నిత్య జీవితములో మన మనేక కర్మల నాచరించుచున్నాము కదా! మరి అవన్నియును ప్రజా బాహుళ్య ప్రదర్శనమున కనువుగ నుండుననియే అమాత్య వృషభుని అభిప్రాయమా? అటులైన మరి కళకును, నిత్య జీవితమునకును భేదమేది? 'కళ' యొక్క ప్రత్యేకత యెక్కడ? నాయనలారా! మోటు విషయములను చెప్పునపుడు మోటు పదజాల ముపయోగింపక తప్పదుకదా! గీతోపదేశమున కనువగు పదజాలము కొక్కోక శాస్త్రోపన్యాసమునకు తగునా నాయనలారా! అందులకు నన్ను మన్నింపుడు. స్త్రీ పురుషులకు సంభోగము సహజ లక్షణము కదా! మరటులని మనము

విచక్షణను కోల్పోయి, పట్టపగలు నడి బజారులో సంభోగించుకొనుచున్నామా? రవంత గోప్యత, రవంత గుంభనము అవసరము లేదా? పడకటింటి రహస్యములను బజారుపాలు చేయుట కళయా!

కొంత వయస్సు, అనుభవముగల మనవంటివారిపై వీటి ప్రభావమంతగ నుండకపోవచ్చును. కాని యౌవనములోనున్న యువతీ యువకులలో ఇట్టి చేష్టలెంత యుద్రిక్తతలకు దారితీయునో ఊహించుటకే ఒడలు జలదరించుచున్నదికదా! చలన చిత్రముల పేరుతో ఈ చెడిపినది చాలక ఇంకను 'ముద్దులు' ప్రవేశపెట్టుటయా! ఇంతేనా! ఇంతటితో నూరకున్న నెంత బాగుండును. 'సెన్సారు' నిబంధనలను మరింత సులభతరము చేసి, నిర్మాతలే విచక్షణతో, స్వకీయ క్రమశిక్షణతో, కళాత్మక చిత్రములు తీయుట కవకాశ మిచ్చెదమని రెండవ భాష్యమును సెలవిచ్చినారు. వహ్వా! ఎంత చక్కని యోచన? మయసభా భవన ప్రవేశము చేసిన సుయోధనునకు ఉన్నవి లేనట్లుగను, లేనివి ఉన్నట్లుగను అగుపడినట్లు, మన మంత్రివరేణ్యునికి దేశములో జరుగుచున్న మానభంగములు జరుగనట్లును, లేని 'సెన్సారు' నిబంధనలు ఉన్నట్లును అగుపడుచున్నవి కదా! సెన్సారే ఉన్న యెడల ఇన్ని ఏ సర్టిఫికేటు చిత్రములు, ఇన్ని ద్వంద్వార్థ గీతములు, ఇన్ని తొంబది శాతపు నగ్న దృశ్యములు, ఇన్ని క్యాబరే నాట్యములు, ఇన్ని మానభంగ సన్నివేశములు, ఇన్ని పచ్చి శృంగార సన్నివేశములు ఎట్లు వచ్చుచున్నవి? మరి మన అమాత్యపుంగవునకీ కామెర్ల రోగమునకు, సంధి పాత ప్రేలాపనమునకు కారణమేమై ఉండనోపును?

సెన్సారున్నదని మంత్రివరేణ్యుడనుకొనుచున్నప్పుడే చిత్రముల స్థాయి యిటులున్న, ఇక సడలించిన సెన్సారు నిబంధనలతో చిత్రముల స్థాయి ఎటులుండునో ఊహించుటకే ఒడలు జలదరించుచున్నదే! ఇక చూచుట మన తరమా! నిర్మాతలకు వివేచనమా? విచక్షణమా? స్వకపోల కల్పిత క్రమశిక్షణయా? నాయనలారా! మానవునిలోని బలహీనతల నాధారముగ చేసికొని, చౌకబారు చిత్రములను నిర్మించి, డబ్బుగుంజి, పొట్టపోసుకొనుచున్న 'నిర్మాత' నుండి అంతటి ఔన్నత్యము నాశించుట మూర్ఖత్వము కాదా! వహ్వా! దొంగ చేతికి దాళము నొసగుటయా? పిల్లి మెడలో రుద్రాక్షలను వేయుటయా?

ఇక మూడవ భాష్యమేదో చెప్పనా! ఉత్తమ చిత్రముల నాదరించి, అనుత్తమ చిత్రముల ననాదరించి ప్రజలే 'సెన్సారు' చేయవలెనని కూడా ఈయన భాష్యించెను.

నాయనలారా! సమాజములోని ప్రజలందరును విద్యావంతులై, విజ్ఞానవంతులై ఇది మంచి, ఇది చెడు, ఇది చేయతగును, ఇది చేయతగదు అను విచక్షణా

జ్ఞానయుక్తులైనప్పుడు ఇది సాధ్యముగాని నిరక్షరాస్యులై, అజ్ఞానములో మ్రగ్గుచున్న మనకిది సాధ్యమా? అట్టి విచక్షణాజ్ఞానమే ప్రజలకున్న యెడల ఈ బుద్ధిమంతుడు మంత్రి పదవిని చేపట్టగలిగెడివాడా?

సమాజమును చైతన్యవంతము చేసి, అభ్యుదయ పథమున నడుపుటలో కవులకు, కళాకారులకు, మేధావులకు, సంఘసంస్కర్తలకు, సంఘ సేవా పరాయణు లకు, విద్యావేత్తలకు, రాజకీయ నాయకులకు ఒక గురుతరమైన బాధ్యత ఉన్నది. దేశ, కాల, పాత్రములను బట్టి ఈ సమాజమునకిది ఉచితము, ఇది అనుచితము అని ప్రజలకు తెలియజేసి, వారిని సన్మార్గములో నడిపింపవలసిన కర్తవ్యము కూడా నున్నది. నాయనలారా! ప్రజలందరును విద్యావంతులై, వివేకవంతులైన పాశ్చాత్య దేశములలోనే ఎన్ని 'నీలిరంగు చిత్రములు' తయారగుచున్నవో మనకు తెలియదా?

అదియును గాక, శ్రేయో రాజ్యమున ప్రభుత్వమునకు సమాజముపై బాధ్యత అధికముగ నుండును కదా! దేశ శ్రేయస్సును, సమాజములోని అధిక సంఖ్యాకుల శ్రేయస్సును దృష్టిలో నిడుకొని, ఈ దేశమున కిది తగదనియు, సమాజమున కిది తగదనియు చెప్పి, అట్టి అంశములపై ఆంక్షలు విధించి, శ్రేయోరాజ్య స్థాపన చేయుట అవసరము కదా!

మరటులైన ఈ సిద్ధాంతమునే వ్యభిచారమునకు, మద్యపానమునకు, జూదమునకు ఏల వర్తింపచేయరాదు? ప్రజలకు తమకేది కావలయునో, దాని నెట్లు సాధించుకొనవలయునో తెలిసిన మరుక్షణమున ఈ అమాత్య వృషభుడాస్థానములో ఉండలేడన్నది సత్య దూరము కాదు కదా! అదియును గాక ప్రభుత్వ జోక్యము లేకుండా ప్రజలే అన్ని కార్యములు నిర్వర్తింపగలిగినచో ఇక ఈ ప్రభుత్వమెందుకు? ఈ మంత్రులెందుకు? ఊకదంపు దుపన్యాసములనొసగుటకా! పునాదిరాళ్ళు వేయుటకా! రిబ్బను కత్తిరింపులకా! పదవులకై కీచులాటకా! ఇట్టి వానిని కాళ్ళు, చేతులు కట్టి బంగాళాఖాతములో పారవేయనక్కరలేదా? అని ఆవేశముగ పలుకుచు, చేతనున్న దిన పత్రికను ముక్కలు ముక్కలుగా చించి పారవైచి సభా భవనమును వీడి, చర చర వెడలిపోయెను.

***ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః***



# సాహిత్య జీవిత రజతోత్సవ సన్మాన కార్యక్రమము

**జం**ఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:

నాయనలారా! ఈ నడుమ నేను కార్యార్థినై నగరాంతరము వెడలి తిరిగి వచ్చు సరికి, సాక్షి సంఘాభిమాని యొకడు వ్రాసిన లేఖ సాక్షి సంఘ కార్యాలయములో పడి ఉన్నది. దానినిప్పుడు చదువుదును.

"జంఘాలునకు నమస్సులు. నేను మీవలె వసపిట్టవలె ఉపన్యసించలేను. కాని ఇటీవల నగరములో జరిగిన ఒక సాహిత్య సభా కార్యక్రమ వివరములను జరిగినవి జరిగినట్లే లేఖలో పొందుపరచుచున్నాను. ఇది సాక్షి సభావేదికనుండి వినిపించుట కర్తవ్యమో, చిత్తుకాగితపు బుట్ట కర్తవ్యమో నిర్ణయించు భారమును మీకే వదిలివేయు చున్నాను.

నగరమున నేదియో సాహిత్య సభ జరుగనున్నదని విని సమావేశ సమయమున కచ్చటికి  చేరుకొంటిని. నేను పోవువరకచ్చట నెవ్వరును లేక పోవుటచే సభా కార్యక్రమము రద్దయినదేమో ననుకొనుచు ఎందులకయిన మంచిదని, ఈ రోజు కార్యక్రమమేమని అచ్చటనున్న కార్యాలయములో విచారించితిని. ఆ కార్యాలయాధికారి మారయిన పలుకక ఆనాటి కార్యక్రమ వివరములు గల ఆహ్వాన పత్రమునొకదానిని నా కందచేసెను. నీతిబోధక రచయితల సంఘము అనగా 'నీరసం' సుప్రసిద్ధ నీతిబోధక రచయిత, కవి అయిన శ్రీ జంబుకేశ్వరరావుగారి సాహిత్య జీవిత రజతోత్సవ సందర్భముగ వారిని సన్మానించుచున్నదని తెలిసినది.

దేశమునకో, రాష్ట్రమునకో, లేక ఏదయిన సంస్థకో రజతోత్సవము కాని ఒక కవికి రజతోత్సవమేమా యని ఆశ్చర్యపోయితిని. ఆ కవిగారు కలముపట్టి పాతికేళ్ళయినందులకు సన్మానమట! వహ్వా! నాయనలారా! హలముపట్టి పాతికేళ్ళయి నందుల కేకర్షకు నైన సన్మానించినట్లు వినలేదు. గరిటపట్టి పాతికేళ్ళయినందులకు పాచకునికో, సుత్తి పట్టి పాతికేండ్లయినందులకు కార్మికునికో, కత్తి పట్టి పాతికేళ్ళయి నందుకు క్షురకునకో, చాకిరేవు పట్టి పాతిక సంవత్సరములు నిండినందులకు రజకునికో, సన్మానము చేసినట్లు వినలేదు. నన్నయ నుండి చిన్నయ దాక ఏ కవియైన యిట్లు సాహిత్య జీవిత రజతోత్సవము చేసికొనినట్లెరుగుదుమా! ఆహా? ఏమి వీని

గర్వము! కలముపట్టి పాతికేళ్ళయినందులకు సన్మానమా! పూలదండలా! దుశ్శాలువలా! గండపెండెరములా! బిరుదాంకితములా! నాయనలారా! కలముపట్టి ఈ పాతికేండ్లలో ఈతడు సాధించినదేమున్నది? కాగితపు కరువు-పాఠకులకు తలబరువు తప్ప! అని నాలో నేననుకొనుచుండగనే సభా ప్రాంగణమున పెద్ద కలకలము బయలు దేరినది. రక్షకభటుల సుషిరనాదములతోనూ, పాదకవచముల టక, టకలతోనూ సభాప్రాంగణమంతయు మారుమ్రోగినది. ఏమాయని చూడగా సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి, సన్మాన కార్యక్రమమును నిర్వహించవలసిన నాయకుడు వందిమాగధ బృందముతో, ఆస్థాన నట, విట, గాయక, విదూషకాది పరిజన పరివేష్టితుడై సభా భవనమున కేతెంచి, సర్కసులోని ఏనుగువలె వంగలేక వంగి, సభకు నమస్కరించి ముందువరుసలో ఆసీనుడయ్యెను.

అంతవరకునూ తన పతిదేవుని రాకకై భోజనమును మాని ఎదురు చూచు ఇల్లాలివలె ముఖ్య అతిథి రాకకై అన్ని పనులను మాని ఎదురు చూచిన కార్యకర్తలు అతని రాకతో కర్తవ్యోన్ముఖులై సభాకార్యక్రమ యేర్పాటులలో మునిగిరి. సుమారర్ధగంట తరువాత తెర తీయబడినది. వేదిక వెనుక భాగమున సాహిత్య సంస్థ నామధేయముగల బట్ట వ్రేలాడదీయబడినది. సభావేదిక కురుక్షేత్రనాటకములోని రాయబారపు రంగమువలె అసనములతో క్రిక్కిరిసిపోయినది.

అంత నా సంస్థ అధ్యక్షుడు నీరసముగ లేచి నిలువబడి యిట్లు ప్రసంగించెను:

సోదర సోదరీమణులారా! మా సాహిత్య సంస్థ 'నీతిబోధక రచయితల సంఘం' అంటే 'నీరసం' తరపున సుప్రసిద్ధ నీతిబోధక రచయిత, కవి అయిన శ్రీ జంబుకేశ్వర రావు గారి సాహిత్య జీవిత రజతోత్సవాన్ని నిర్వహించ నిశ్చయించినాము. ఇది మాకెంతో గర్వకారణము. ఈ మహదవకాశాన్ని మాకిచ్చిన శ్రీ జంబుకేశ్వరరావుగారికి మా ధన్యవాదములు... అని పలికి ఆసీనుడాయెను (అవకాశమిచ్చిన సంగతే చెప్పినావుకాని, అయిదు వేల రూపాయల సంగతి చెప్పవేమని వెనుక వరుసనుండి ఎవడో అరచినాడు). అటు తరువాత కవిగారి గుణగణములను కీర్తించుచూ, పంచరత్న పద్యములతో సన్మాన పత్రమును చదివి, దానిని శ్రీ జంబుకేశ్వ రరావుగారికి అందజేయుటం జరిగినది.

తరువాత వేదికపై కూర్చున్న వక్తలందరూ ఒకరి తరువాత ఒకరు లేచి శ్రీ జంబుకేశ్వరరావుగారి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని పొగిడారు. ముక్కోటి దేవుళ్ళలోని లోపాలను ఎత్తిచూపి అట్టి లోపములేవియు మన జంబుకేశ్వరరావులో లేవనియు,

ఆయన వ్యక్తిత్వమంత గొప్పదనియు చెప్పినారు. ఈ కవిగారి కవిత్వమును నన్నయ నుండి చిన్నయదాకా గల కవులందరి కవిత్వాలతోనూ పోల్చి వారందరికంటే ఇతనిదే ఉత్తమ కవిత్వమని నిర్ధారించినారు.

'ఇలాంటి కవి తెలుగు గడ్డ మీద పుట్టడం మన అదృష్టం' అని ఒకరంటే, 'మన మిత్రుడు జంబుకేశ్వరరావు జాతికే గర్వకారణం' అని మరొకరు నిక్కచ్చిగా తేల్చి చెప్పినారు. 'ఈ శకటాధిక గ్రంథకర్తను ఆంధ్రదేశము గుర్తించకపోవుట కడు శోచనీయమైన విషయ'మని ఒక ఉపన్యాసకుడు వాపోతే, 'శ్రీ జంబుకేశ్వరరావుని సన్మానించడం మనని మనం సన్మానించుకోవడమే' అని మరొకరుద్ఘాటించినారు. 'శ్రీ జంబుకేశ్వరరావుగారు మొదట్లో పత్రికలకి రాసిన ఉత్తరాల్లోనే ఉత్తరోత్తరా ఆయన మహాకవి కాగల లక్షణాలు తొంగిచూశాయి' అని ఒకరంటే, 'శ్రీ జంబుకేశ్వరరావు లేని ఆంధ్ర సాహిత్య చరిత్ర అసమగ్రం' అని మరో సాహిత్య చరిత్రకారుడు భాష్యించినాడు. 'ఇలాంటి కవి నభూతో న భవిష్యతి' అన్నారు. (ఆ మాట మాత్రం నిజం అని వెనుక వరుసలో కూర్చున్న వాడొకడు వ్యంగ్యంగా పలికినాడు).

తరువాత, ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాయకమ్మన్యుడు కవిగారిని దుశ్శాలువలతో సత్కరించి, ఆ సందర్భముగా ప్రచురంచిన సన్మాన సంచిక నావిష్కరించి, అర్హులైన కవులను, పండితులను సన్మానించుటకొక సంఘమును నియమించినామనియు, ఆ సంఘము ద్వారా అర్హులైన వారికి, సన్మాన కార్యక్రమముల నేర్పాటు చేసికొనుటకు పావులా వడ్డీకే ఆర్థిక సహాయము నందించగలమనియు, రాష్ట్రంలో వివిధ స్థాయిలలో జరుగుచున్న సన్మాన కార్యక్రమములను సమీకృతము చేసి, సుసంఘటితముగా నిర్వహించుటకు స్వయం ప్రతిపత్తిగల ఒక కార్పొరేషను నేర్పాటు చేయు యోచన కూడా ప్రభుత్వమున కున్నదని ప్రకటించి, హర్షధ్వానముల మధ్య ఆసీనుడయ్యెను.

అనంతరము 'నీరసం' కార్యదర్శి పేర్లు ప్రకటించగా నగరములోని వివిధ సాహిత్య సంస్థలు, వ్యక్తులు, అభిమానులు కవిగారిని పూలమాలలతో సత్కరించి, యథాశక్తి తమ గౌరవ ప్రపత్తులను చాటుకొనిరి. అంతవరకునూ పాత కాలపు పెండ్లి కుమార్తెవలె సిగ్గుపడుచు కూర్చున్న శ్రీ జంబుకేశ్వరరావు మెడలోని పూలమాలలను బల్లపై నుంచి, పంచనూ, చొక్కాను, గొంతును సవరించుకొని తనను సన్మానించినందులకు కృతజ్ఞతలనందించి, "ఇంతటి సన్మానమునకు నే నర్హుడను కానేమో" అని అతివినయముగా పలికినాడు ("అహా! ఎంతకాలానికి సత్యాన్ని గ్రహించావు నాయనా! ఈ జ్ఞానం ముందే ఉంటే మాకీ తలనొప్పి తగ్గేదికాదా!" అని వెనుకనుండి కేక).

'నీరసం' కార్యదర్శి వందన సమర్పణతో కార్యక్రమము ముగిసినది. నేను మెల్లగ వేదిక సమీపించి ఒక సన్మాన సంచికను సంపాదించితిని. అందు సన్మాన సంఘ అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గ సభ్యుల ఫోటోలతో పాటు సన్మానితుడు చిన్ననాడు గోచి విప్పుకొని ఉన్న ఫోటో మొదలుకొని, ఈనాటి వరకును గల వివిధ భంగిమలలోని ఫోటోలు క్రింద శీర్షికలు, వివరణలతో సహా కనిపించినవి. అంతేకాక సన్మానితుని గుణగణములను వర్ణించు కొన్ని వ్యాసములు, అనేకానేక వ్యాపార సందేశములు కూడా అందులో నున్నవి.

నాయనలారా! ఈ దినములలో సన్మాన కార్యక్రమము లేర్పాటు చేయుట లాభసాటి వ్యాపారమయినది. ఖర్చు, శ్రమ తక్కువ, పలుకుబడి, రాబడి ఎక్కువ. అందుకని సన్మాన కార్యక్రమములు నిర్వహించుటకు ప్రత్యేకించి కొన్ని సంస్థలు వెలసినవి. వీరు పనికట్టుకొని ఎవరి కెపుడు షష్టిపూర్తి జరుగును? ఎవని కెప్పుడేబది సంవత్సరములు నిండును? ఎవరికైన ఏదయిన 'అవార్డు' లభించినదా? పదవేదైనా దొరికినదా? విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశము సురక్షితముగ తిరిగివచ్చినాడా? వంటి వివరములను సేకరించి, వారిని కలుసుకొని, 'అమ్మమ్మ' ఎంతమాట! మీరు తప్పక ఒప్పుకోవలసిందే! మీరు ఊఁఅనండి చాలు! ఓ నాలుగు మంచి వ్యాపార ప్రకటన లిప్పించండి! మిగతాది మేం చూసుకుంటాం' అని మరీ మోమాటము పెట్టి సన్మాన కార్యక్రమముల నేర్పాటు చేయుచుందురు.

ఇందుకొరకు వీరు కొంతమంది వక్తలను ఉపాధికల్పనా పథకము క్రింద శిక్షణ నిచ్చి ఉంచుకొందురు. ఈ ఉపన్యాసకులు శ్రీనాథుడు, డు,ము,వు,లను చేర్చి శృంగార నైషధము ననువదించినట్లు, ఏ సన్మానసభకు వెళ్ళినను ఆనాటి సన్మానితుని పేరక్కడ చేర్చి మిగిలిన రికార్డంతయు మామూలుగా వినిపించుచుందురు. సన్మానములు చేసినను, సావనీర్లు వేసినను, బిరుద ప్రదానములు చేసినను, శిలా విగ్రహములను ఆవిష్కరించినను, అర్హులైన వారికి జరిగినప్పుడానందము కలుగును. లేనిచో 'కనకపు సింహాసనమున' అను సుమతి శతకకారుని పద్యం గుర్తుకు వచ్చుననుకొనుచు ఇంటి దారి పట్టితిని.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# క్రికెట్ ప్రత్యక్ష ప్రసారములు కామెంటరీలు

*జంఘాలశాస్త్రి ఇట్లు ప్రసంగించెను:*

నాయనలారా! ఈ మధ్య నేను కార్యార్థినై ఒక ప్రభుత్వ కార్యాలయమునకు పోయితిని. కార్యాలయములోని విభాగములన్నియు కళాహీనములై వెల వెల పోవుచున్నవి. విభాగములో ఎవ్వరును కానరారైరి. అందరును గుంపులు, గుంపులుగ చెట్ల నీడన చేరియుండిరి. 'సమ్మె' చేయుచున్నారేమోనని యనుమానము కలిగినది. కాని కార్మిక నాయకుల నినాదములు, రక్షక భటుల లాఠీ నాదములు వినబడకపోవుటచే సమ్మెకాదని నిశ్చయించుకొంటిని. ప్రతి గుంపులోను ఒక చిన్న 'శబ్ద తరంగ గ్రాహి' కలదు. వారందరును చెవులు రిక్కించుకొని అత్యంత శ్రద్ధాశక్తులతో ఏదియో వినుచున్నారు.

"అయ్యయ్యో! దేశమున కెట్టి యుపద్రవమును సంభవించలేదుకద! దేశ నాయకు లందరును క్షేమమే కద! మరొక ఉప్పెన తీరమును తాకలేదు కద!" అని నాలో నేననుకొనుచు, ఒక గుంపును సమీపించి ఏమి జరిగినదని ఆత్రముగా ప్రశ్నించితిని. అతడు వెంటనే "మూడు వికెట్ల నష్టమునకు మూడు వందల ముప్ఫై పరుగులని" గ్రుక్క త్రిప్పికొనకుండా పలికెను. అపుడు నా కవగతమయినది వారు వినుచున్నది క్రికెట్ ఆటపై ప్రత్యక్ష వ్యాఖ్యానమని.

అయ్యయ్యో! పెద్దలు లేదు – పిన్నలు లేదు – స్త్రీలు లేదు – పురుషులు లేదు – బాలురు లేదు – విద్యార్థులు లేదు – అధికారులు లేదు – అనుచరులు లేదు – కార్యాలయములు లేదు – కాళాశాలలు లేదు – ఇల్లులేదు – వాకిలి లేదు – చదువు లేదు – సంధ్య లేదు – నిద్రలేదు – ఆహారము లేదు – అందరికినీ ఒకటే ధ్యాస – అందరికిని ఒకటే ఆశ.

ఎన్నడు క్రికెట్ ఆటనయిన చూడనివారు, క్రికెట్ బంతి బరువయిన తెలియనివారు, ఎన్ని బంతులొక 'ఓవరో' తెలియనివారు, క్రికెట్‌నకెన్ని స్టంపులుండునో, ఆ స్టంపుల మధ్య దూరమెంతో తెలియని వారు, మేడిన్ ఓవర్ అనగా తెలియనివారు, 'ఫాలోఆన్'ను గూర్చి విననివారు, క్రికెట్ బ్యాటు నయిననెన్నడు చూడనివారు సహితము

శబ్దతరంగ గ్రాహిణులను చెవులకతికించుకొనుచున్నారు. వ్యాఖ్యానముల నాకర్ణించుచున్నారు. ఆనందించుచున్నారు. వికెట్టు పోయినపుడెల్ల విలవిల లాడుచున్నారు. విలపించుచున్నారు. 'రన్ను' చేసినపుడెల్ల 'రంకెలు' వేయుచున్నారు. బౌండరీ కొట్టినపుడెల్ల హద్దులు మీరి ప్రవర్తించుచున్నారు. 'సిక్సరు' కొట్టినపుడెల్ల 'బాక్సింగు'లు చేయుచున్నారు. ఇట్లా కార్యాలయ ప్రాంగణమంతయు క్రికెట్ వ్యాఖ్యాన శ్రవణ పిపాసువులతో కళకళలాడిపోయినది.

అయ్యయ్యో! ఏమిది? వీరికి కార్యాలయములలో పనులు లేవా? ఇంత కంటె దేశములో తెలిసికొనవలసిన విషయములు లేవా? వినదగిన యంశములు లేవా?

ఇక విద్యార్థుల సంగతి సరేసరి! తరగతుల నెగవేసి శబ్ద తరంగ గ్రాహిణులను చెవుల కతికించుకొని, అత్యంత శ్రద్ధాసక్తులతో వినుచున్నారు. ఎన్నడు తల్లిదండ్రుల మాటయైన చెవిన పెట్టనివారు, ఉపాధ్యాయుల ఉపన్యాసములను సహితము పెడచెవిన పెట్టెడి వారు, తమ కర్థము కాని భాషలో, తమకు తెలియని ఆట గురించి ఎంత శ్రద్ధగా వినుచున్నారు? ఈ శ్రద్ధలో సహస్రాంశమయిన కళాశాలోపన్యాసకుల ఉపన్యాసములను వినుటలో నుండిన నెంత బాగుండెడిది? నాయనలారా! సువర్ణమునకు సుగంధ మబ్బినట్లు ఇటీవలికాలములో ఈ ప్రత్యక్ష వ్యాఖ్యానమునకు తోడు ప్రత్యక్ష ప్రసారములు కూడ నారంభమయినవి. ముఖ్యముగ క్రీడలను ప్రసారము చేసెడి టి.వి. ఛానళ్ళు వచ్చిన తరువాత ఈ పిచ్చిముదిరి పాకమున పడినది. వారు తమ వ్యాపారాభివృద్ధికై ప్రపంచము నలుమూలల ఎచ్చట ఆట జరిగినను ప్రత్యక్ష ప్రసారము చేయనారంభించిరి. వ్యాపార ప్రకటనలతో కోట్లు గడించిరి. క్రికెట్ క్రమముగ క్రీడారంగము వీడి వాణిజ్యరంగమందు ప్రవేశించినది. కొన్ని వాణిజ్య వ్యాపార సంస్థలు తమ ప్రచారమునకై క్రికెట్ క్రీడను ప్రోత్సహించనారంభించినవి. తమ కంపెనీ పేర కప్పులు, ట్రాఫీలు ప్రారంభించి, క్రికెట్‌ను ఆడించి, దానిని ప్రత్యక్ష ప్రసారము చేయించి, ఆ ప్రత్యక్ష ప్రసారములలో తమ వ్యాపార ప్రకటనలను గుప్పించి, తమ వ్యాపారముల నభివృద్ధి పరచుకొను చున్నారు.

అయిదు రోజులు ఆటను ప్రత్యక్షప్రసారము చేసినయెడల, రోజుల తరబడి ప్రత్యక్షప్రసారములను చూచుటకు ప్రజలిష్టపడుటలేదని గ్రహించిన వీరు, ఆ ఆటను ఒక దినమునకు కుదించినారు. దినమంతయు పనిపాటలు మాని ప్రత్యక్ష ప్రసారమును వీక్షింప నిష్టపడుట లేదని గ్రహించిన వాణిజ్యశాస్త్ర నిష్ణాతులీ ఆటలను 'పవలు రేయి' ఆటగా తీర్చిదిద్దినారు. క్రీడాస్థలములను పగటిని తలదన్ను విద్యుద్దీప కాంతులతో అలంకరించినారు. ఆటలనాడించినారు. ప్రత్యక్ష ప్రసారములు

చేయించినారు. తమ వాణిజ్య ప్రకటనలను చొప్పించినారు. లక్షలు ఖర్చుచేసి కోట్లు గడించినారు. ఇట్లు ఈ ఒక దినపు ఆట వారి పాలిటి కామధేనువై సిరులు కురిపించినది.

నేటి తరమునకు దాదాపు ఎనిమిది గంటలు కుదురుగ కూర్చొని ఈ 'ఒక దినపు ఆట'ను చూచు ఓరిమి నశించినది. అది గమనించిన వాణిజ్య శాస్త్ర ధురంధరులు క్రొత్తగ 'టి. 20' మ్యాచ్‌లను ప్రారంభించినారు. దీనితో క్రికెట్ ఆట కార్పొరేట్ స్థాయి కెదిగిపోయినది. ఇదివరలో కేవలము తమ వాణిజ్య, వ్యాపారముల నభివృద్ధిచేసికొనుటకు క్రికెట్‌ను మాధ్యమముగ వాడుకొనిన వ్యాపార సంస్థలు, ఆ స్థాయి నుండి ఎదిగి, తామే అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన క్రికెట్ క్రీడాకారులను కొని, వారి చేత ఆటలాడించి, దానిని ప్రత్యక్షప్రసారము చేయించి, ప్రాయోజితులను సంపాదించి, వాణిజ్య ప్రకటనలను విరివిగా చేయించి, లాభార్జనము చేయ నారంభించినారు. అంతియే కాదు నాయనలారా! ప్రేక్షకుల నాకర్షించుటకో, లేక ఆటగాంధ్ర నుత్సాహ పరచుటకో తెలియదు గాని, కొందరు 'స్మితవదన' లనుకూడ నియోగించినారు. వారు అర్ధనగ్న శరీరములతో, అంగాంగ ప్రదర్శనములతో, ఆటగాండ్రు పరుగులు చేసినపుడెల్ల నాట్యము చేయుచు వీక్షకులకు కనువిందు చేసిరి. క్రికెట్ క్రీడా కారులు కూడా (కళాకారు లనవలయునేమో?) వాణిజ్య ప్రకటనలలో విరివిగా పాల్గొని, వారి వాణిజ్యాభివృద్ధికి యధోచితముగ కృషి చేయుచున్నారు. 'మోడలింగ్' చేసినందులకు తామునూ కోట్లు గడించుచున్నారు. దేశమందిట్లు క్రికెట్ క్రీడావ్యాపారము మూడు బంతులు – ఆరు సిక్సర్లుగ ప్రవర్ధిల్లుచున్నది.

నాయనలారా! పూర్వము రాజులు, జమీందారులు పందెముల కొరకు కోళ్లను గొట్టెలను పెంచి, పోషించి, వానితో కోడిపందెములు, గొట్టెపందెములు నిర్వహించి వినోదించుట మనము విన్నాము గదా! మరి ఆ కోడి పందెములు, గొట్టె పందెముల కంటే ఇవి ఎట్లు భిన్నములు? వానికి నిషేధమా! వీనికి ఆదరమా! వానికి శిక్షలా! వీనికి రక్షలా! వానికి జరిమానములా! వీనికి బహుమానములా! వానికి తిరస్కారములా! వీనికి పురస్కారములా!

వహవ్వా! ఏమని చెప్పను నాయనలారా! టి. 20 జరిగిన ఆ నలుబది దినములు ఎవరికిని కంటిపైన సరిగ కునుకైన లేదు. ఉద్యోగస్థులు కార్యాలయము లలో తమ తమ పనులను త్వరగ ముగించుకొని ఇళ్ళు చేరుకొనుచున్నారు. వ్యాపారస్థులు తమ దుకాణములను తొందరగ మూసి, గృహోన్ముఖులగుచున్నారు. గృహిణులు తమ 'వంట పని'ని త్వరగ పూర్తిచేసుకొనుచున్నారు. విద్యార్థులు తమ 'ఇంటిపని' ని తొందరగ

పూర్తి చేసుకొనుచున్నారు. స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు అను భేదములేక ఇంటిల్లిపాది క్రికెట్ క్రీడ వీక్షణాదక్షులై విరాజిల్లుచున్నారు. ఆట ప్రారంభము కాగనే తమ 'రంగుల బుల్లి తెర పెట్టెల'ముందు వ్రాలుచున్నారు. ఆదినుండి, అంతమువరకు వీక్షించుచున్నారు. ఇట్లు ఐ.పి.ఎల్. జరిగిన అ నలుబది దినములు దేశము క్రికెట్ క్రీడాజ్వరముతో వణికి పోయినది.

ఆహా! దేశమునకెన్ని పనిగంటలు నష్టమగుచున్నవి. ఎంత సొమ్ము వృథా యగుచున్నది!

స్వదేశీ ఆటయిన 'హాకీ' వంటి క్రీడలు మూలపడినవి. వాటిని ఆడువారును, ఆడించి ఆదరించువారును, చూచి ప్రోత్సహించువారును కరవైరి.

సెలవు వచ్చుసరికి వీధి కొక జట్టు. పేటకొక మ్యాచి కదా! బుర్రపై తెల్లబుట్టను పెట్టిన వాడెల్ల కిరికెటీరే! బ్యాటు పట్టిన వాడెల్ల తెండుల్కరే! బంతి విసరగలిగిన వాడెల్ల కుంబ్లేయే! రన్ను చేసిన వాడెల్ల గంగూలియే! స్టంపుల వెనుక నిలువబడిన వాడెల్ల ద్రావిడే!

నాయనలారా! ఈ రోజులలో స్త్రీలకు మ్యాచింగు లెంత ఫ్యాషనో, రాజకీయ నాయకులకు సోషలిజమెంత ఫ్యాషనో, కవులకు అకలి కవిత్వము వ్రాయుట ఎంత ఫ్యాషనో, విద్యార్థులకు బసు  ్సలపై రాళ్ళు రువ్వుటెంత ఫ్యాషనో క్రికెట్ కామెంటరీని వినుట, ప్రత్యక్ష ప్రసారములను వీక్షించుట కూడా నంతే ఫ్యాషనయినదని కార్యాలయములో పనికానందులకు విసుగు కొనుచు ఇంటి దారి పట్టితిని.

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*



# విద్యాలయములు - డొనేషన్లు

జంఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

నాయనలారా! నా మిత్రుడొకడు ఈ మధ్యకాలములో 'కిండర్ గార్టన్' స్కూలు నొక దానిని ప్రారంభింపనెంచి, ఆ యావిష్కరణ సభకు నన్నాహ్వానించినాడు. అవును నాయనలారా! మంత్రి పదవులకై 'ముఖ్యమంత్రి' చుట్టును ప్రదక్షిణములు చేయుటకే సమయము చాలక బాధపడు శాసనసభ్యులు, తమ మంత్రి పదవి పోకుండ యెట్లు కాపాడుకొనవలెనా అని ఎత్తులకు పై ఎత్తులు వేసి, విరోధులను చిత్తు చేయు యత్నములో మునిగి ఉన్న అమాత్య వృషభులు ఉన్న ఈ తరుణములో ఆవిష్కరణ సభకు నాకంటె వేరెవరు లభించగలరు.

"గొడ్ల చావడి" వలెనున్న ఒక పురాతన భవనము పాఠశాలకై తీసుకోబడినది. మొదటిసారి వెల్లమొగము చూచినట్లు దాని గోడలు తాకగనే చెప్పక చెప్పుచున్నవి.

మా మిత్రుడు ముఖ ద్వారము వద్ద పెద్ద బ్యానరు నొకదానిని కట్టించినాడు. దానిపై పాఠశాల పేరు, చిరునామా పెద్ద పెద్ద అక్షరములతో వ్రాయబడి యున్నది. ఆవిష్కరణ మహోత్సవమునకు అతని బంధుమిత్రులు దాదాపు రెండు వందల మంది వచ్చియుండిరి. ఉపాహారానంతరము నా మిత్రుడు నన్నుపన్యసించ వలసినదిగా కోరెను. నాయనలారా! రోగి కోరుకొన్న దానినే వైద్యుడొసగిన ఇక కావలసిన దేమున్నది? వెంటనే నిలువబడి ఉపన్యాసమునకు లంఘించితిని.

ఆహా! విద్యపట్ల ఎంత గౌరవము! విద్యార్థులపట్ల ఏమి అభిమానము! విద్యా విధానము పట్ల ఎంత ఆదరణ! అందుకనియే గాబోలు పేటకొక పాఠశాల వెలయు చున్నది. పార్లమెంటు మెంబరగుటకు అధికార పక్షపు టిక్కెట్టయిన సులభముగ సంపాదించవచ్చును గాని ప్రాథమిక పాఠశాలలో సీటును సంపాదించుట కష్టసాధ్య మగుచున్నది కదా! ఎం.బి.బి.ఎస్.నకు అవలీలగ సీటు సంపాదింప వచ్చును గాని ఎల్.కె.జీ.లో సీటును సంపాదించుట దుష్కరమగుచున్నది కదా! డొనేషన్లు! రికమెండేషన్లు! ఫీజులు! ఇంటర్వ్యూలు! బూట్లు! యూనిఫారములు! గొంతునకురి బిగించునట్లు పట్టుపలుపులు! (నెక్ టైలకు ఆంధ్రానువాదము కాబోలునని వెనుక వరుసలో నున్న ఓ వ్యక్తి సణుగుడు) మూర్ఛరోగము వానివలె మెడలో బిళ్ళలు!

బాక్సులు! బ్యాగులు! అందులో వారు మోయలేనన్ని పుస్తకములు! వారాకళింపు చేసుకోలేనంత పాఠ్యప్రణాళికలు! అర్థము, పర్థము లేని పరీక్షా విధానములు!

అయ్యయ్యో! ఆడుచు, పాడుచు, త్రుళ్ళుచు, కేరింతలిడుచు పాఠశాల కేగవలసిన ఈ తరుణములో మోయలేనన్ని పుస్తకములను భుజమున వేసికొని, అర్థముకాని పాఠ్యప్రణాళికను నెత్తిన వేసికొని, అవగతముకాని భాషలను వల్లెవేసికొని, అశాస్త్రీయమయిన నియమనిబంధనల నలవరచుకొని, ఈసురో మని పాఠశాల కేగుచున్న ఆ చిన్నారులను చూడుడు! అయ్యో! మీ హృదయము ద్రవించుట లేదా! మనసు ఆర్ద్రమగుటలేదా! కనులు చెమర్చుట లేదా! మీది పాషాణ హృదయమా!

నాయనలారా! వ్యాపార మొనర్చుటకీ చిన్నారులే దొరకినారా! వ్యాపార వస్తువుగ వారి భవిష్యత్తే లభించినదా! పీడించి పిప్పిచేయుట కీ విద్యార్థుల తల్లి దండ్రులే లభించినారా! ఆహా! దేశమున విద్యా వ్యాపారమెంత సజావుగా సాగుచున్నది! విద్య పేర ఎంతటి మోసము జరుగుచున్నది! ఎన్ని అక్రమములు చోటు చేసికొను చున్నవి! పాఠశాలలలో పాపమెంత పెరిగిపోవుచున్నది! పొట్టకూటికై ఉపాధ్యాయు లెంత నీచమునకు దిగజారుచున్నారు! నాయనలారా! జాతికి ప్రాణప్రదమయిన విద్య యంగడి సరుకయినది. 'చదువుకున్న' వారి కన్న చదువు 'కొన్న' వారే అధికముగ నున్నారు.

మిత్రమా! ఇట్టి తరుణములో నీవు ఒక పాఠశాలను స్థాపించుటకుద్యుక్తు డగుట నాకానందదాయకము. కాని నీ పాఠశాలకు మిగిలిన పాఠశాలల గాలిసోక నీకుము. ఉన్నత విద్యా ప్రమాణములతో – ఉత్తమోత్తమమయిన బోధనా పద్ధతులతో – బాలబాలికల నాకర్షించు ఆటపాటలతో – నైచ్యమునకు దిగజారని పరిపాలనా దక్షతతో – మొక్కవోని దీక్షతో – లాభార్జనా దృష్టిలేని నిస్వార్థతతో– విద్యా దానము చేయుచున్నామను భక్తితో – 'కన్నతల్లి' వంటి ఆదరాభిమానములతో – 'కన్నతండ్రి' వంటి క్రమశిక్షణతో – అత్యంత శ్రద్ధతో నీ పాఠశాలను నిర్వహింపుము. ధన్యచరితుడవు కమ్ము" అని పలికి నా ఉపన్యాసమును ముగించితిని.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# సమ్మెలు

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

నాయనలారా! ఇటీవల నగరములో ఉద్యోగుల, కార్మికుల సమావేశము కలదని విని, కార్మిక జన శ్రేయస్సే ధ్యేయముగా, సమ్మెలు జరుపుటే లక్ష్యముగాగల మన కార్మిక నాయకులు సందేశముల వినగోరి అచ్చటికిపోయితిని. సమావేశమారంభ మగు సమయమాసన్నమయినది కాని ఇంకను సభా ప్రాంగణమున కెవ్వరూ చేరలేదు. ఒక పదిమంది కార్యకర్తలు మాత్రము సమావేశపుటేర్పాటులు చేయు నిమిత్తమై కాబోలు వేదికవద్ద నిలువబడి ఏవియో పనులు పురమాయించు చున్నారు.

ఇంతలో దూరమునుండి కార్మికుల ఊరేగింపు ఉత్సవము కంటపడినది. పతాకములతో, వివిధ రకములయిన నినాదములు గల అట్టలను చేత ధరించిన కార్మిక నాయకులు ముందు నడచుచున్నారు. "ఇంక్విలాబ్ – జిందాబాద్", "దునియాకి మజ్దూర్ ఏక్ హై" "ప్రపంచ కార్మికుల ఐక్యత – వర్ధిల్లాలి" "కార్మిక వ్యతిరేక విధానాలు– నశించాలి" "కావాలి! కావాలి! కనీస వేతనం కావాలి!" వంటి నినాదములు మిన్ను ముట్టుచున్నవి. వరుస కిద్దరు చొప్పున, చీమల బారువలె, దాదాపు ఒక మైలు పొడవున్న ఈ యూరేగింపు ఉత్సవము పూర్తిగ సభాస్థలికి చేరుసరికి అర్ధగంట పట్టినది. ముఖ్యమయిన కార్మిక నాయకులు వేదిక నలంకరించిరి.

వారి ప్రసంగ సారాంశ మిట్లున్నది: "కార్మిక సోదరులారా! ఈ దేశమున సంపద అంతయు మనము చెమటోడ్చి కూడబెట్టినదే! కాని ఆ సంపద ఏ కొద్ది మంది గుత్త పెట్టుబడిదారుల చేతులలోనికో పోవుచున్నది. ధరలు ఆకాశమునంటు చున్నవి. ఈ ధరలనదుపు చేయుటలో ఈ ప్రభుత్వము విఫలమయినది. అందువలన మనము మన జీతభత్యముల పెంపునకై ఆందోళన చేయవలసిన సమయమాసన్న మయినది. ఈ రోజు లాంఛనప్రాయముగ జరిపిన ఒకరోజు సమ్మెను విజయ వంతము చేసి, దేశ ఆర్థిక వ్యవస్థను ఇరువది నాలుగు గంటల పాటు స్తంభింపచేసిన మీకు మా అభివందనములు. ఇది ప్రభుత్వమునకు, యాజమాన్యము వారికి ఒక హెచ్చరిక కావలెను. వారు మన కోర్కెలు నిర్ణీత గడువులోపల తీర్చితిరా సరి! లేకున్న నిరవధిక సమ్మెకు దిగవలయును. దేశ ఆర్థిక వ్యవస్థను స్తంభింప చేయవలయును. ఈ మహత్తర కార్యమునకు మీ అందరి సహాయ సహకారములు, అండదండలు ఎంతేని అవసరము".

అటు తరువాత "నేను ప్రసంగించ వచ్చునా?" అని సభాధ్యక్షుని కోరితిని. సభలో కలకలము రేగినది. సభాధ్యక్షుడు వేదికపైనున్న తన తోటి కార్మిక నాయకులను సంప్రదించి, నన్ను ప్రసంగించమని కోరెను. అంత నేనిట్లు ప్రసంగించితిని:

"కార్మిక సోదరులారా! ఇంతమంది కార్మికుల నొక్కచో చూచుట నా భాగ్యము. మీతో ప్రసంగించుట నా సౌభాగ్యము. కాని కొన్ని కఠినపు మాటలు పలుకవలసి వచ్చిన క్షమింపుడు. మీ హృదయములను విప్పి నేను చెప్పు విషయమును గూర్చి శ్రద్ధగా ఆలోచించుడు. తదుపరి మీ నిర్ణయము మీరు తీసికొనుడు.

నాయనలారా! మీ కింకను జీతభత్యముల పెంపుదలా! అయ్యయ్యో! మీ రిప్పటికే అనేకానేక ఇతర ఉద్యోగుల కంటె అధిక వేతనములు పొందుచున్నారు కదా! మీ కింకను అదనపు వేతనములా! అదనపు కరువు భత్యములా! దేశములోని జనాభాలో నూటికి నలుబది యైదు మంది పేదరికములో మ్రగ్గుచున్నారని లెక్కలు చెప్పుచున్నవి కదా! మరి వారిసంగతి మీరేనాడయినా ఆలోచించితిరా!

అంతే కాదు. దేశములో డెబ్బది రెండు శాతము ప్రజలు వ్యవసాయ కార్మికులుగ జీవించుచున్నారు కదా! వారిని గూర్చి మీరేనాడయిన ఆలోచించితిరా! వారికి మీ వలె నిర్ణీత పనివేళలేవీ? సూర్యోదయము మొదలుకొని సూర్యాస్త మయము వరకూ పనిచేయవలసినదే! వారికి కనీస వేతన చట్టములేవి? ఉన్నను వాని నమలు చేయునాథుడేడి? వారికి మీవలె ఇ.ఎస్.ఐ. సదుపాయములేవి? ఇన్సూరెన్సు పథకములేవి? పిల్లల చదువుసంధ్యలకై సదుపాయములేవి? గృహవసతు లేవి? పని ప్రదేశమునకు చేర్చు వాహనములేవి? యూనిఫారములేవి? అలవెన్సులేవీ? బోనసులేవీ? వారిని గూర్చి మీరేనాడయిన పట్టించుకొనిరా?

ఇంకను అధిక వేతనములు కావలెనని అరచుచున్నారా! సమ్మెలు చేయుదు మని బెదిరించుచున్నారా! ప్రజాజీవితమును స్తంభింపచేయుదుమని బెదిరించు చున్నారా! దేశ ఆర్థిక వ్యవస్థకు మీరు చేయు చెడుగును గూర్చి ఏనాడయినా ఆలోచించితిరా? దేశ ప్రజలకు కలుగు అసౌకర్యమును గూర్చి మీరెన్నడయిన యోచించితిరా?

నాయనలారా! వారు 'గంజి' లోనికి ఉప్పులేదని ఏడ్చుచుండ మీరు పాలలోనికి పంచదార లేదని ఏడ్చుచున్నారా? వారు కట్టుకొనుటకు గుడ్డ కొరకై ఏడ్చుచుండ మీరు టెరివూల్ పంట్లములకై ఏడ్చుచున్నారా? తినుటకు తిండి లేక వారేడ్చుచుండ 'నెల్లాలు మొలకొలకులు' కావలెనని మీరేడ్చుచున్నారా? కూరగాయలు కొనలేక

వారేడ్చుచుండ కొన్న కూరగాయలు వాడిపోకుండ నిలువ యుంచుటకు 'ఫ్రిజ్' ఇంటిలో లేదని మీరేడ్చుచున్నారా? వండుకొనుటకు పాత్రలే లేక వారేడ్చుచుండ ఇంటిలో 'మైక్రోవేవ్ ఓవెన్' లేదని మీరేడ్చుచున్నారా? భుజించుటకు తిండి లేదని వారేడ్చుచుండ డైనింగ్ టేబిల్ లేదని మీరేడ్చుచున్నారా? పడుకొనుటకు చాపయిన లేదని వారేడ్చుచుండ డెకోలామ్ వేసిన డబుల్ కాట్ లేదని మీరేడ్చుచున్నారా? దానిపైకి 'ఫోమ్ బెడ్' లేదని మరింత బిగ్గరగా ఏడ్చుచున్నారా? నాయనలారా! ఏడుపందరిదీ సమానమే! కాని శ్రుతిలోనే మార్పు.

నాయనలారా! అధిక వేతనము లెవరికవసరములేదు? ఇచ్చు వాడుండిన పుచ్చుకొనువారికేమి కొదువ? ఉన్న దానితో తృప్తిపడుట నేర్చుకొనుడు! సమాజ శ్రేయస్సును దృష్టిలో నిడుకొనుడు! బాధ్యతాయుతముగా ప్రవర్తిల్లుడు! దేశమును రాజకీయ దాస్యమునుండి విడిపించుటకు మనముందు తరములు శ్రమించినవి. ఆర్థికస్వాతంత్ర్యము సిద్ధించుటకు మన తరము త్యాగము చేసిన, మన తరువాతి తరములవారు నిజమయిన రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యముల ననుభవింపగలరు. అందులకు కృషి చేయుడు. అంతియే కాని ఇట్లు చీటికీ, మాటికీ సమ్మెలతో దేశ ఆర్థిక వ్యవస్థకు చెడు చేయకుడు. బాధ్యతాయుతముగ ప్రవర్తిల్లుడు.

నాయనలారా! ఇటులన్నందుకు నన్ను కార్మిక సంఘ వ్యతిరేకిగా తలపకుడు. కార్మికులకు సంఘము లవసరమే! ఆ సంఘటిత శక్తితో వారు తమ న్యాయమైన కోర్కెలను సాధించుటకై ఉద్యమించుటకూడ అవసరమే! కాని మన ఉద్యమములు దేశ శ్రేయస్సును, సమాజశ్రేయస్సును దృష్టిలో నిడుకొని నడుప వలయును. పని గంటలు నష్టము కాకుండా, ఉత్పత్తి కుంటుపడకుండ, దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించ కుండ నుండు రీతిలో సాగవలెను. జపాను దేశములో వలె అధిక గంటలు పనిచేసి, అధికోత్పత్తి చేసి మన నిరసనను అభివ్యక్తము చేయవచ్చును. తేనెటీగ పూలనుండి మకరందము గ్రహించినట్లుండవలయును. ఇప్పటికే చాలా చెప్పితిని. సెలవ్" అని వేదిక దిగి వచ్చితిని.

నా వెనుకనుండి "క్యాపిటలిస్టు" "భూర్జువా", "సి.ఐ ఎ. ఏజంట్', 'ఏరోగంట్ ఫెలో'' వంటి మాటలు వినబడినవి. నేను సభా స్థలి వీడి పోయితిని.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# ఏ.జి. ఆఫీసు ప్రసంగము

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

నాయనలారా! ఇటీవల ఏ.జి. ఆఫీసులో నున్న 'రంజని' సంస్థవారు నన్నాహ్వానించి ఏదయిన విషయమును గూర్చి ప్రసంగించమని కోరిరి. అపుడు నేనిట్లుపన్య సించితిని.

నాయనలారా! మీ 'రంజని' సభకు నన్నాహ్వానించి నందులకు చాలా సంతోషముగ నున్నది. ఏదయిన ఒక విషయమును గూర్చి ప్రసంగించమని కోరి యున్నారు కదా! మీ గురించియే ప్రసంగించెదను.

మహాగణకుల కార్యాలయములందు పనిచేయు మీరేమి సామాన్యులా! రాజ్యాంగ నిబద్ధ నియమ బద్ధులు. ప్రజాస్వామ్యపు మూలస్తంభములలో నాల్గవ స్థానమున నెన్నదగినవారు. ప్రజాధన దుర్వ్యయము నొక కంట కనిపెట్టి, ప్రజలకు తెలియచేయు జాగరూకులు. ప్రభుత్వ ధన దుర్వ్యయము నోపని ప్రజాసేవా పరాయణులు. ప్రజాధనము పాలిట ధర్మకర్తలు.

మిత్రులారా! నే నొక దినమున ఒక మిత్రుని 'పింఛను' విషయమై మీ కార్యాలయమును సందర్శించితిని. సమయము మధ్యాహ్నము గం. 3.00లు అగుచున్నది. మెల్లగా లోనికి ప్రవేశించి, ఒక పెద్దహాలు వంటి ప్రదేశమును పరికించి ఆశ్చర్యపోతిని. అచ్చట బిల్లులు, రికార్డులు పెద్ద మేటగ వేయబడి విభాగమునకు విభాగమునకు మధ్య గోడవలె ఉపయోగపడుచున్నవి. "అయ్యయ్యో! నేను పొరపాటున పురావస్తుశాఖ వారి కా ర్యాలయమున ప్రవేశించలేదు గద" అనుకొనుచు మరియొక మారు పరికించి చూచితిని. లేదు నాయనలారా! లేదు! అది నిశ్చయముగ మహాగణకుల వారి కార్యాలయమే! ఆ కట్టల నడుమ తామరాకుపై నీటి బొట్టువలె, బురదనీటిలో వికసించిన పద్మమువలె, ఒక మహనీయుడు కూర్చొని, కన్నులు మూసికొని, ఏదియో దీర్ఘముగ నాలోచించుచున్నాడు. విభాగములోని మిగిలిన ఆసనములన్నియు ఖాళీగనే యున్నవి. పింఛను విభాగాన్వేషణార్థినై మెల్లగా అతనిని సమీపించి 'పింఛను విభాగమెక్కడ కలదని, వినమ్రముగా నడిగితిని. అతడు తృళ్ళిపడి నిదురలేచి, కనులు తెరచి, నిద్రాభంగము కావించినందులకు గాబోలు, తీక్షణముగ నా వైపుచూచుచు "ఇది లంచవరని తెలియదా! ఇపుడెవ్వరునూ ఉండరు. మూడు గంటలయిన తరువాత

వచ్చి క్రిందనున్న విచారణా కేంద్రములో అడుగు" మని చెప్పి మరల నిద్రావస్థలోనికి జారెను. ఆ వరకే మూడు గంటలయినదని ఆ కుంభకర్ణుని కేమి తెలియును?

ఈ కార్యాలయమున లంచవరనగ 12-00 గం॥ల నుండి 3-00 గం ల వరకు కాబోలు ననుకొనుచు మెల్లగా బయటికి వచ్చితిని. ఇంతలో వేపచెట్టు క్రింద నుండి మైకులో "సివిల్ అకౌంట్స్ అండ్ ఆడిట్ అసోసియేషన్-జిందాబాద్". "ఆలిండియా ఆడిట్ అసోషియేషన్- జిందాబాద్". "బ్యూరాక్రసీ-డౌన్ డౌన్" "దునియా కీ మజ్దూర్-ఏక్ హై" వంటి కొన్ని నినాదములు వినబడినవి. "ఇదేదో కార్మిక సంఘ సమావేశము కాబోలు! మనకేల!" ననుకొని మరికొంత దూరముపోయి నిలువ బడితిని.

నాకు నాలుగు గజముల దూరములో పదిమంది గల ఓ గుంపులో ఇరువురు కోడి పుంజులవలె ఎగురుచున్నారు. ఆబోతులవలె రంకెలు వేయుచున్నారు. వస్తాదుల వలె చొక్కా చేతులెగ బెట్టుచున్నారు. విషయ సంగ్రహనార్థినై నేను ఆ గుంపులో ప్రవేశించితిని. వారి ప్రసంగముల వలన వారిరువురును ఇద్దరు ప్రఖ్యాత సినీ నటుల భక్తులనియు, ప్రాసంగికవశమున ఆవేశములు పెరిగి, చర్చలు తీవ్రధోరణిలో సాగుచున్నవనియు గ్రహించి, అచటి నుండి వేరొక చోటికి పోయితిని.

అచ్చట కొంతమంది చేరి సోనియాగాంధీని గూర్చియు, యు.పి.ఎ. ప్రభుత్వమును గూర్చియు, అమెరికాతో జరిగిన అణుఒప్పందమును గూర్చియు, ధరల పెరుగుదలను గూర్చియు, రానున్న ఎన్నికలను గూర్చియు, పిచ్చాపాటీగా మాట్లాడుకొనుచున్నారు.

" రాజకీయముల జోలి మనకేల?" అనుకొనుచు వేరొక చోటికి చేరితిని. అచ్చట గుంటూరు మిరపకాయల శ్రేష్ఠతను గూర్చియు, ఆవకాయలను గూర్చియు, అప్పడాలను గూర్చియు, పెరుగుతున్న ఎండలను గూర్చియు, తరుగుచున్న వానలను గూర్చియు, తెరువబోవు స్కూళ్ళను గూర్చియు, స్కూళ్ళలో సీట్లకై పడవలసిన పాట్లను గూర్చియు లోకాభిరామాయణమును ముచ్చటించుకొను చున్నారు.

"ఇది మనకేల?" అనుకొనుచు వేరొక గుంపును చేరితిని. వారు రాబోవు ఎస్.ఎ.ఎస్. పరీక్షలను గూర్చియు, ప్రమోషన్లను గూర్చియు, డి.ఎ. పెంపుదలను గూర్చియు, బోనసును గూర్చియు జ్యోతిషములు చెప్పుచున్నారు.

మరొక గుంపులోనికి పోయితిని. వారు అశ్వమేధయజ్ఞ దీక్షాదక్షులై రానున్న ఆదివారమునాటి పందెపు గుఱ్ఱములను గూర్చియు, జాక్‌పాట్‌ను గూర్చియు తీవ్రముగ చర్చించుకొనుచున్నారు. రేసు గైడ్లను మననము చేయుచున్నారు.

వీరిగోల మనకేల? కాస్త చెట్టుక్రింద సేదదీర్చుకొందమని తలచి దట్టముగా నున్న చెట్ల నీడన చేరితిని. నాయనలారా! అచ్చట కొందరు మహిళామణులు కూర్చొని ఊలుతో స్వెట్టర్లు, ప్లాస్టిక్ వైర్లతో బుట్టలు, పూసలతో బ్యాగులు అల్లుకొనుచున్నారు. జాకెట్లను, పిల్లల లంగాలను కుట్టుచున్నారు. "ఆహా! మహాగణకుల వారి కార్యాలయ ప్రాంగణములో కుటీర పరిశ్రమ లెట్లభివృద్ధి చెందుచున్నవి! ఇది నిజముగ దేశమునకు శుభసూచకము కదా!" అని నాలో నేననుకొనుచుంటిని. కాని నాయనలారా! అంతలో ఓ మహిళారత్నము లేచి తన సామాన్లను సర్దుకొని ప్రక్కనున్న తన స్నేహితురాలితో "వెళ్ళివస్తానే! మూడు గంటలు దాటినది! ఇంకా ఆలస్యం చేస్తే మా ఎస్.ఓ. రంకెలు వేస్తాడు" అంటూ వెళ్ళిపోయినది. అప్పుడు తెలిసినది వారందరును మహాగణకుని కార్యాలయములో పనిచేయుచున్న మహిళలేనని!

"అయ్యయ్యో! ఏమిది? ఒక్కరికయిన పనియందాసక్తి లేదు - పని చేయవలెనను శ్రద్ధలేదు- పని చేయగల నేర్పులేదు- పని నేర్చుకోగల ఓర్పులేదు- ఏదియో విధముగ కాలక్షేపము చేయుట తప్ప వేరు యోచనలేదు" అని నాలో నేననుకొనుచు పింఛను విభాగమువైపు త్వర త్వరగా పోయితిని. కాని అచ్చట లోనికి ప్రవేశము లేదని ద్వారపాలకుడు కురుక్షేత్ర రణరంగములో సైంధవునివలె నడ్డుపడినాడు. "ఏమి చేయవలయునా?" అని నేనాలోచించుచున్నంతలో ఓ అత్తరుసాహెబు అత్తరు సీసాల ఘుమఘుమలతో, అగరు బత్తీల ఘుమఘుమలతో అచటికి వచ్చి, ద్వారపాలకుని వందనము స్వీకరించి, ముసి ముసి నగవులతో లోనికేగెను. "అయ్యయ్యో! కార్యార్థియై వచ్చిన జంఘాలశాస్త్రి అత్తరులమ్ముకొను 'షేక్ అత్తర్ సాహెబ్' పాటి విలువ చేయలేదా? కార్యార్థియై వచ్చిన 'జంఘాలశాస్త్రి'కి తిరస్కారమా? వ్యాపారార్థియై వచ్చిన అత్తరు సాహెబునకు సత్కారమా? పని ఉన్నవానికి పర్మిషన్‌లా? పనిలేనివారికి అడ్మిషన్లా?" అని నాలో నేననుకొనుచు క్రిందికివచ్చి అనుమతి పత్రము తీసికొని పింఛను విభాగములో అడుగిడితిని.

నేను మెల్లగ విభాగములో ప్రవేశించి, విభాగాధికారిని వినమ్రముగ విషయ మడిగితిని. అతడు నా వైపు చూచి, పెదవి విరిచి, ఆ పనిని చూచెడు పరీక్షకుడు (ఆడిటరునకు ఆంధ్రాను వాదము కాబోలు నని సభలో గుసగుసలు) కార్యాలయము నకు నిన్న వచ్చెననియు, నేడు రాలేదనియు, రేపు వచ్చునో లేదో తాను చెప్పలే ననియు, ఆతడు వచ్చినగాని ఆ కేసుకు సంబంధించిన వివరములను తానేమియు చెప్పజాలననియు, వీలు చూచుకొని మరికొన్ని రోజుల తరువాత వచ్చి విచారించ మనియు, పలికి తన పనిలో నిమగ్నుడయ్యెను.

నాయనలారా! మీ కార్యాలయమునందు నాటకకర్తలు, నటులు, కథకులు, కవులు, నవలాకారులు, సాహిత్యాభిలాషులు, క్రీడాకారులు, కార్యకర్తలు, సంఘసేవా పరాయణులు, రాజకీయ విశ్లేషకులు, వ్యాపారస్థులు, వీరు వారు అననేల? అన్ని రంగములలో ప్రావీణ్యము కలవారున్నారు. కాని లేనిది ఒక్కరే! చిత్తశుద్ధితో పనిచేయు వారు పనిని నేర్చుకొందమని యుబలాటము కలవారు – మహాగణకుల వారి కార్యాలయములో పింఛను ఇచ్చువారే కాదు– పింఛను తీసుకొనుచున్నవారు కూడా చాలామంది యున్నారని నాకీనాడే తెలిసినది.

ఇంక చేయునది లేక ఇంటి ముఖము పట్టగా, అక్కడే పనిచేయుచున్న ఓ సాహిత్యాభిమాని నన్ను గాంచి, గుర్తించి, నమస్కరించి, కుశల ప్రశ్నలతో సమాదరించి, నే వచ్చిన కార్యము తెలిసికొని, వివరములు వ్రాసికొని, ఆ కార్యమును తానే స్వయముగ చూచి వివరములనంద చేయుదుననియు, శ్రమకలిగించి నందులకు వేరు విధముగా తలపవద్దనియు చెప్పి సాగనంపెను. "బ్రతుకుజీవుడా!" యని ఇంటిదారి పట్టితిని. సెలవ్.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# పిచ్చాసుపత్రి - వింత స్వప్నము

జంఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

నాయనలారా! మన 'సాక్షి' సంఘ సభ్యులలో ఒకడైన 'వాణీదాస కవి'కి కవితా వ్యాసంగపు పిచ్చి ముదిరి పాకాన పడినందున అతనిని 'ఎఱ్ఱగడ్డ'లోని పిచ్చాసుపత్రిలో నుంచినారని విని, నేనతనిని చూడగోరి, ఒక దినము అచటికి పోయితిని. ప్రవేశద్వారము వద్దనున్న 'దండధారి' నన్ను ఎగాదిగ చూచి, సాధారణముగ రోగులను వారి బంధువులు బలవంతముగ ఆసుపత్రికి 'అంబులెన్స్'లో తీసుకొని వచ్చుచుండ, ఈతడేమి ఆసుపత్రిలో చేరుటకు స్వయముగ పాదచారియై వచ్చుచున్నాడని సందేహించి కాబోలు, ఏమి కావలెనని అడిగెను. నేను 'వాణీదాసు'ని గూర్చి చెప్పి, అతనిని చూచుటకు వచ్చితినని తెలిపితిని.

అతడిది 'సందర్శన సమయము' కాదనియు, సాయంత్రము నాలుగు గంటలు దాటిన తరువాత రమ్మనియు వచ్చీరాని తెలుగులో తెలిపి, ముఖద్వారము వద్ద అతని కొరకై నిర్మింపబడిన చిన్నగదిలో దూరి, లాఠీని ప్రక్కన పెట్టి, తంబాకు సేవనములో నిమగ్నుడయ్యెను. నేను "అయ్యయ్యో! సందర్శకుల సమయము తెలిసికొనకుండ వచ్చితినే! ఇపుడేమి చేయవలయు"నని చింతించుచు, యోచనలో పడితిని. ఇంతలో ఓ నలుగురు వ్యక్తులు చేతిలో తినుబండారములు, ఫలములు మొదలయిన వస్తువులు గల ప్లాస్టిక్ బుట్టలతో అచటికి వచ్చిరి. వారిని చూడగనే ఆ దండధారి లేచి, వినయముగ నమస్కరించి, వారందించిన అయిదు రూపాయల బిళ్ళను స్వీకరించి, గేటు తెరచి సాదరముగ వారిని లోనికంపెను. అది గమనించిన నేను కూడ 'ప్రవేశ రుసుము' చెల్లించి లోనికేగితిని. కొందరు మానసిక రోగులు అచ్చటచ్చట చెట్ల క్రింద గుంపులుగ చేరియున్నారు. కొందరొంటరిగా చెట్టు క్రింద కూర్చొని తమలో తాము ఏదియో గొణుగుకొనుచున్నారు. నవ్వుకొనుచున్నారు. పండ్లికిలించుచున్నారు. అంతలోనే రోదించుచున్నారు. కొందరు మహిళలు జుట్టు విరబూసికొని, ఒకరి కొకరు 'పేల'ను చూచుకొనుచున్నారు. కొందరు వెకిలి చేష్టలు చేయుచున్నారు. కొందరు విరగబడి నవ్వుచున్నారు. కొందరు, తమ బంధువులతో గాబోలు, ఉద్వేగముగ మాటలాడుచున్నారు. ఒక పడుచుపిల్ల తనకు 'ఇంజక్షను' వలదని పెద్దగా అరచుచు పరుగులెత్తుచున్నది. ఆమె వెనుక 'ఇంజక్షను సిరంజి'ని చేత పట్టుకొని ఓ'నర్సమ్మ'

ఆమెను వెంబడించుచున్నది. కొంతమంది పెద్ద వయస్కులు కూడా బాలలతో కలిసి 'చుక్‌బుక్ రైలు' ఆటాడుకొనుచున్నారు. కొందరు పోట్లాడుకొనుచున్నారు. కోపగించుకొనుచున్నారు. కేకలు వేయుచున్నారు. అంతలోనే మరల కలిసిపోవుచున్నారు. ఇట్లా ప్రాంగణమంతయు వింతవింత కేకలతో, వింతవింత చేష్టలతో, నవ్వులతో, ఏడ్పులతో, పెడబొబ్బలతో, కేరింతలతో, ఊరింతలతో, ఇకిలింతలతో, సకిలింతలతో, మారుమ్రోగుచున్నది.

నేను నెమ్మదిగ లోనికిపోయి, మా వాణీదాసు యొక్క ఆచూకీ తెలియగోరి, అక్కడ గల అధికారిని విచారించితిని. అతడు, వేళకాని వేళ వచ్చినందులకు కాబోలు, కొరకొర నన్ను చూచి, తనలో తానేదో సణుగుకొనుచు, విసిగికొనుచు, రుస రుసలాడుచు, బుసబుసలాడుచు, ఏదియో 'రిజిష్టరు'ను పలుమార్లు పరికించి, దూరముగ చెట్టు క్రింద ఒంటరిగ కూర్చొనిన ఓ వ్యక్తిని చూపి అతడే వాణీదాసుడని తెలిపెను. అపుడు నేనతనిని సమీపించితిని. అవును నాయనలారా! తన కవిత్వముతో కలవరపెట్టెడి, కలకలము సృష్టించెడి మా వాణీదాసుడు, పెరిగిన గడ్డముతో, నెరసిన జుట్టుతో, ముడతలు పడిన ముఖముతో, మూసిన కన్నులతో, ఆ చెట్టు క్రింద మౌని వలె కూర్చుని ఉన్నాడు. నేనాతనిని సమీపించి " వాణీదాసకవీ ఎట్లుంటిరి? క్షేమమే కదా!" అని పలుకరించితిని. కవి శబ్దము వినగనే పులకరించి, కన్నులు తెరచి, నన్ను గుర్తించి, పలుకరించి, మా వాణీదాసు డిట్లు పలికెను:

వచ్చితివా జంఘాలశాస్త్రీ! నీ వెప్పుడయిన ఇచ్చటికి వచ్చి చేరెదవని నేను ముందే గ్రహించితిని! నీకుపన్యాసముల పిచ్చి! మన కాలాచార్యునికి పొడుము పిచ్చి! మన 'బొట్టయ్య శ్రేష్ఠి'కి ధనము పిచ్చి! మన 'సాక్షి'కి సంఘ సంస్కరణల పిచ్చి! అసలీ ప్రపంచములో పిచ్చి లేని వారెవరయ్యా! అందరికినీ ఏదో ఒక పిచ్చి! కొందరికి సినిమాల పిచ్చి! కొందరికి నాటకాలపిచ్చి! కొందరికి అధికారపు పిచ్చి! కొందరికి ధనము పిచ్చి! కొందరికి జూదము పిచ్చి! కొందరికి త్రాగుడు పిచ్చి! కొందరికి పొలతి పిచ్చి! కొందరికి రాజకీయముల పిచ్చి! కొందరికి కవిత్వపు పిచ్చి! కొందరికి సంఘసేవ పిచ్చి! కొందరికి తిండిపిచ్చి! కొందరికి సిగరెట్టు పిచ్చి! కొందరికి ఫ్యాషన్ పిచ్చి! కొందరాడువారికి నగలపిచ్చి! చీరలపిచ్చి! కొందరి కాటలపిచ్చి! కొందరికి టి.వి. పిచ్చి! కొందరికి షేర్ మార్కెట్ పిచ్చి! కొందరికి మతపిచ్చి! కొందరికి మదపిచ్చి! కొందరికి భక్తి పిచ్చి! కొందరికి సంగీతము పిచ్చి! కొందరికి కీర్తి కాంక్షా కండూతి! ఇట్లీ ప్రపంచమంతయు పిచ్చి వారిమయము. అట్టి పిచ్చి ప్రపంచముతో సంబంధము లేకుండ, వారికి దూరముగ మేమిచ్చట ప్రశాంతముగ గడుపుచుండ, ఓర్వలేక చీటికి

మాటికి మా ప్రాంగణమునకు వచ్చి మా ప్రశాంతతకు భంగము కలిగించు చున్నారు. మాకు పిచ్చెక్కునట్లు ప్రవర్తించుచున్నారు" అని ఇంకేమో పలుకబోయెను. కాని ఇంతలో కొందరాసుపత్రి అధికారులు "భోజనవేళయైనది. ఇంకలోనికి పొండ"ని ఆ మానసిక రోగులనందరనూ లోనికి పంపివైచి, మమ్ము బయటకు పంపిరి. మా వాణీదాసునకై నేను తెచ్చిన ఫలములనాతని కందచేసి నేను కూడ నిష్క్రమించితిని.

ఇల్లు చేరి, భోజనము ముగించి, కాసేపు నడుము వాల్చితిని. ఇంతలో ఓ వింత స్వప్నము వచ్చినది. ఆ స్వప్నములో నేనొక పిచ్చాసుపత్రిలో నుంటిని. నా చుట్టూ అనేకమంది పిచ్చివారు చేరి నన్ను తమ వింత వింత చేష్టలతో, అరపులతో, కేరింతలతో, ఇకిలింతలతో, సకిలింతలతో వారిలో నొకనిగ చేసికొనిరి. అదేదో సమావేశము వలెనున్నది. ఇంతలో ముతక ఖద్దరు పంచతో, చొక్కాతో, నెత్తిపై ఖద్దరు టోపితో, ఓ పూర్వ రాజకీయ నాయకుడు కాబోలు, వేదిక నెక్కి ఇట్లు పన్యసించెను:

సోదర సోదరీమణులారా! ఈ సమావేశమునకు నన్నధ్యక్షునిగ ఎన్నుకొని, నన్ను గౌరవించినందులకు మీ అందరకు నా హృదయ పూర్వక ధన్యవాదములు. మనము పిచ్చి వారమని మన బంధువులు మనలనిచ్చట చేర్పించినారు. మనకు పిచ్చా? లేదు సోదరులారా! లేదు? మనలను పిచ్చివారన్న వారికి పిచ్చి!

సత్యవాదియై, అనృతమాడక, సత్యవాక్య పరిపాలనకై రాజ్యము వీడి భార్యాబిడ్డలను తెగనమ్మి, చివరికి కాటికాపరియైన సత్యహరిశ్చంద్రుని పిచ్చివాడని ఈ లోకమనలేదా? పితృవాక్పరిపాలనకై రాజ్యము వీడి అడవులకేగి, కష్టముల పాలయిన శ్రీరామచంద్రమూర్తిని పిచ్చివాడని ఈ లోకమనలేదా? ఆడిన మాట తప్పక, మూడడుగుల నేలను వామనునికి దానమొసంగి, రెండడుగులతో భూమ్యా కాశములు కొలిచిన ఆ శ్రీమన్మహావిష్ణువును, మూడవ అడుగు తన తలపై నిడమని కోరి, సుతలాలయమున కణగద్రొక్కబడిన బలిచక్రవర్తిని మూఢుడనలేదా? భూమి గుండ్రముగ నున్నదని తొలిసారిగ ప్రతిపాదించిన సుప్రసిద్ధశాస్త్రవేత్త 'గెలీలియో' ను పిచ్చివాడని లోకమనలేదా? అతనిని గేలి చేయలేదా? ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గ్రీకు వేదాంత వేత్త 'సోక్రటిసు' ను పిచ్చివాని కింద ఆనాటి సమాజము జమకట్టలేదా? అతని నిడుముల పాలు చేయలేదా? అహింసను ప్రబోధించి, ఈ ప్రపంచ వాసులందరూ ఆ దేవుని బిడ్డలని ప్రతిపాదించి, ప్రచారము చేసిన 'ఏసుక్రీస్తు'ను పిచ్చివాడని ఆనాటి రోమను సామ్రాజ్య ప్రభువులు పలుకలేదా? అతనిని సజీవముగ శిలువ వేయలేదా? అంతెందుకు నాయనలారా! నిన్నటికి నిన్న, సత్యాహింసలను ప్రబోధించి, మతసామరస్యమును ప్రవచించి, హిందూ, ముస్లింలను సోదరులుగ

మెలుగవలెనని పలికిన మన మహాత్మాగాంధీ గతి ఏమయినది? అతనినో మతోన్మాది పొట్టన పెట్టుకొనలేదా? వారందరూ పిచ్చివారయిన మనమూ పిచ్చివారమే! (హే! వినుడు! వినుడు! అని సభలో కేకలు).

ఈ రోజులలో ధర్మము, సత్యము, నీతి, న్యాయము, అహింస, పితృవాక్పరి పాలనము వంటి పదములు అసభ్యపదజాలములైనవి. వాటిని గూర్చి మాట్లాడువారు పిచ్చివారైనారు. మనసులో నొకటుంచుకొని, మాటలలో వేరొకటి మాట్లాడుట మనవశమూ! అట్లు మాట్లాడ గలిగిన మనమిచ్చటికి వచ్చి యుండెడి వారమా? నాయనలారా! లేదు. అట్టి కపటములు వారికే చెల్లును. పరమశత్రువు ఎదురు పడినను, చిరునవ్వు చిలుకరించి, "హలో! హౌ ఆర్ యు! గ్లాడ్ టు మీట్ యు" అని పలుకరించి, కరచాలనము మనము చేయగలమా? మనసులో విషము నిడుకొని తేనెలొలుకునట్లు పలుకగలమా? పగలు శ్రీరంగనీతులు చెప్పుచూ రాత్రులందు వేశ్యావాటికలందు చరింపగలమా? ముద్దిడుకొనుచు ముక్కొడ దీయగలమా? కౌగిలించుకొనుచూ కత్తిపోటు పొడవగలమా? దినము నందవినీతిని గూర్చి ఉపన్యాసములు చేసి, రాత్రులందు నల్లధనపు సంచులను లెక్కించగలమా? పగలు మద్యపాన నిషేధమునకై ఉద్యమించి, అలసి, రాత్రులందు ఆ అలసట తీరుటకై ఓ రెండు పెగ్గులు బిగించగలమా? లేదు నాయనలారా! లేదు! ఆ కల్లా కపటములు, ఆ విషపు నవ్వులు, ఆ తేనె పలుకులు, ఆద్వంద్వ ప్రమాణములు మనకు తెలియవు. అందులకే మనమీ పయోముఖ విషకుంభముల నుండి, తేనె పూసిన కత్తులనుండి. మేకవన్నెపులుల నుండి దూరముగ నున్నాము.

నాయనలారా! మనమందరము ఈ సమాజముచే బాధింపబడిన వారమే కదా! మనలో అత్తల ఆరళ్ళకుగురయి, ఎవరికినీ ఏమియు చెప్పుకొనలేక, మానసిక వేదనలో చివరకిచ్చట చేరిన కోడండ్రెందరు లేరు? వరకట్నము తేలేదనియో, తెచ్చిన కట్నము చాలదనియో, అలుక కట్నముగ యిచ్చెదమన్న స్కూటరు నీయ లేదనియో, భర్తలు, అత్తమామలు పెట్టెడి చిత్రహింసలకు గురయి, మానసిక సమతుల్యతను కోల్పోయి చివర కిచ్చట చేరిన భార్యలెందరు లేరు? ఆడపిల్లలను కన్నందుల కలసు చేసి, గర్భస్థమున నున్న ఆడశిశువును చంపుటకు వ్యతిరేకించి నందులకు చిత్రహింసననుభవించి, మానసిక రోగులై చివరికిచ్చట చేరిన తల్లులెందరు లేరు? కోడళ్ళ అరళ్ళకు తట్టుకొనలేక, మానసిక వేనదకు గురయి చివరికిచ్చట చేరిన అత్తలెందరు లేరు? తల్లిదండ్రుల ప్రేమకు, ఆదరణకు నోచుకొనక, మానసిక నిర్వేదముతో ఇచటికి చేరిన బిడ్డలెందరు లేరు? తమ బిడ్డలు నీతి నియమములు

పీడి, అక్రమార్జనమునకు పాల్పడి, విలాసవంతమయిన జీవితములు గడపుచుండ, వారిని సక్రమ మార్గమున మళ్ళించలేక, పరిస్థితులతో రాజీ పడలేక, కుమిలి, కృశించి, చివరికిచ్చుటికి చేరిన తల్లిదండ్రులెందరు లేరు? కట్టుకున్న భార్య పరపురుష వ్యామోహమునపడి లేచిపోగా, సిగ్గుతో, అవమానముతో, అనాదరణముతో, మానసిక సమతుల్యతను కోల్పోయి చివరికిచ్చుట చేరిన భర్తలెందరు లేరు? భూత, ప్రేత, పిశాచములను నమ్మి, తమకు కలిగిన పతికష్టనష్టములకు, అవియే కారణమని యెంచి, బాబాలు, మాంత్రికులు, జ్యోతిష్కుల చుట్టు తిరుగుచూ, పూజలు చేయించుచు, 'తాయెత్తులు' కట్టించుకొనుచు, ఫలితములేక మనోవేదనకు గురై, చివరికిచ్చుట చేరిన అభాగ్యులెందరు లేరు? ఇట్లు మనమందరము ఈ సమాజములోని ఏదో ఒక వర్గముచే పీడింపబడిన వారమే కదా! అన్యాయములకు బలయిపోయిన వారమే కదా!

వారు చేసిన నేరములకు శిక్షను మన మనుభవించుచున్నాము. వారి పాపములకు పరిహారము మనము చెల్లించుచున్నాము. వారికర్మలకు ప్రాయశ్చిత్తము మనము చేయుచున్నాము. సోదరసోదరీమణులారా! ఇట్లెక్కడయిన కలదా? (లేదు! లేదు! ఇది సిగ్గుచేటు అని సభలో కేకలు) అట్టి మనపై చిన్న చూపా? ఏహ్యాభావమా? అనాదరణమా? అలసత్వమా? అని నింకనేమో ప్రసంగించుచుండెను.

ఇంతలో జంఘాలశాస్త్రీ! జంఘాలశాస్త్రీ! అని గట్టిగా అరచుచు నా మిత్రు డొకడు తలుపు కొట్టినాడు. ఆ శబ్దమునకు నిద్రాభంగమయినది. స్వప్నమర్ధాంత రముగ ముగిసినది.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# పర్యావరణ పరిరక్షణము

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

సోదరులారా! ఇటీవల మా దగ్గరలోగల ఓ పాఠశాల విద్యార్థులు పర్యావరణ దినోత్సవ సందర్భముగా నన్ను తమ పాఠశాలకాహ్వానించి, మాట్లాడమని కోరిరి. ఎవరైన ఉపన్యాసము చేయమని కోరుట, నేనంగీకరింపక పోవుటయునా! కోరినదే తడవుగా అంగీకరించితిని.

నిర్దేశించిన సమయము కంటె ముందుగనే పాఠశాల అవరణమును చేరితిని. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అతని సహోపాధ్యాయులు నాకు పుష్పగుచ్ఛముతో స్వాగతము పలికిరి. ప్రధానోపాధ్యాయుడు తాను 'సాక్షి' సంఘాభిమానిననియు, ప్రతివారము నేనిచ్చు ఉపన్యాసములను క్రమము తప్పక చదివెదననియు నాతో పలికి, తన కార్యాలయములో కూర్చుండబెట్టి, ఆనాటి తెలుగు దిన పత్రికను నాకందించి కార్యక్రమపుటేర్పాటులలో నిమగ్నమయ్యెను. దాదాపు అర్ధగంట తరువాత పాఠశాల ప్రాంగణములో, ఆ వరకే తీయబడిన గోతులలో 'వృక్షారోపణము' తో కార్యక్రమ మారంభమయినది. అటు తరువాత ప్రక్కనే ఏర్పాటు చేయబడిన 'షామియానా'లో ఉపన్యాస కార్యక్రమమేర్పాటు చేయబడినది. ప్రధానోపాధ్యాయుని పరిచయ వాక్యము లనంతరము నేనిట్లు ప్రసంగించితిని.

విద్యార్థినీవిద్యార్థులారా! నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవమనియు, ఆ విషయముపై ప్రసంగింపుడనియు నన్ను కోరియున్నారు. నాయనలారా! ఈ ప్రపంచ మాతృ దినోత్సవములు, పితృ దినోత్సవములు, మహిళా దినోత్సవములు, పర్యావరణ దినోత్సవములు, ఉపాధ్యాయ దినోత్సవములు వంటివి జరుపుకొనుట మన సంప్రదాయము కాదు. తల్లిదండ్రులను, గురువులను, మహిళలను గౌరవించుట, పూజించుట, పర్యావరణమును పరిరక్షించుట వంటి కార్యములు మనకు నిత్యాచరణీయములు. తల్లిదండ్రులు, గురువులు మనకు ప్రాతఃస్మరణీయులు. 'మాతృదేవోభవ', 'పితృదేవోభవ', 'ఆచార్యదేవోభవ' అని ముందు తల్లిదండ్రులను, గురువులను ప్రార్థించి, 'అతిథిదేవోభవ' అని అతిథులనాదరించి, 'ప్రకృతిదేవోభవ' అని ప్రకృతి నారాధించి, అటుతరువాతనే ఇష్టదేవతార్చనము. ఇది మన భారతీయ సంప్రదాయము.

వృద్ధ తల్లిదండ్రులను భారమని తలచి, వారిని వృద్ధాశ్రమములలో దిగవిడచి, సంవత్సరమున కొకసారి మాతృదినోత్సవమునాడో, పితృదినోత్సవమునాడో వారిని దర్శించి, పుష్పగుచ్ఛములతో శుభాకాంక్షల నందించి, నూతన వస్త్రములతో వారిని సత్కరించి, విందుభోజనములతో వారికి 'సజీవపిండ ప్రదాన' మాచరించి, తద్దినములు పెట్టెడి ఈ సంప్రదాయము పాశ్చాత్యులది కాని మనది కాదు. ఏదియో మాటల సందర్భమున అటుల ప్రస్తావించితిని కాని, ఆ విషయమును గూర్చి వేరెప్పుడైన ముచ్చటించెదను. ఇక విషయమునకు వచ్చెదను. నాకు పర్యావరణ విషయ పరిజ్ఞాన మంతగా లేదు. జంఘాలశాస్త్రీ! నీవేమి పర్యావరణ పరిరక్షణ విశేషజ్ఞుండవా! ప్రకృతి శాస్త్ర ప్రవీణుండవా! వృక్షశాస్త్ర ధురీణుండవా! నీకు తెలియని విషయమును గూర్చి ఉపన్యసించుటకు నీ వేల అంగీకరించితివని మీరడుగ వచ్చును. తెలిసికొనుటకై అంగీకరించితిని. నాకే కాదు నాయనలారా! మనపూర్వుల కెవరికినీ ఈ పరిజ్ఞానము లేదు. ఏమనగా, వారు ప్రకృతిలో పుట్టి, ప్రకృతిలో పెరిగి, ప్రకృతిలోనే తనువు చాలించిరి. ఇప్పటివలె అప్పుడు ఆకాశహర్మ్యములు లేవు. అపార్టుమెంట్లులు లేవు. సిమెంటు, కాంక్రీటు భవంతులు లేవు. ఉన్నవి కేవలము ప్రకృతి అందించిన మట్టితో, వెదురుతో, రెల్లు గడ్డితో నిర్మింపబడిన పూరిండ్లు; అవియును తమ అవసరములకు సరిపడినంత.

ఇక ఆహార విషయమునకు వచ్చిన, ప్రకృతిలో లభించెడు ఫలములు, కూరగాయలు, కందమూలములు, తేనె వారి ఆహారము. తమ కుటుంబ అవసరములకు, తమ గురుకులములోని శిష్యగణపోషణకు అవసరమయిన మేరకు మాత్రమే వ్యవసాయము చేసెడివారు. ఆహార ధాన్యములను పండించెడి వారు. పశుసంరక్షణము కూడా నంతే! తమ అవసరముల మేరకు పశు సంరక్షణము చేసి, దూడలకు ధర్మబద్ధముగా రావలసిన 'పాలు' దూడలకిచ్చి, తమ 'పాలు' తాము తీసికొనెడి వారు. 'పాలు' అనగ భాగము అని అర్థము. దగ్గరలోనున్న నదిలోనో, కాసారములోనో, స్నానాది కృత్యముల నాచరించి, తమ అవసరములకు తగిన నీటిని తెచ్చుకొనెడివారు. ఎచ్చటికయిన వెళ్ళవలసి వచ్చిన, ఎంత దూరమయినను పాదచారులై సంచరించెడివారు. చెట్ల క్రింద తపమాచరించెడివారు. శిష్యులకు విద్యాబోధనము కూడ వృక్షచ్ఛాయలలో, ప్రకృతి ఒడిలో జరిగెడిది. అనారోగ్యమయిన యెడల ప్రకృతిలో దొరకు వనమూలికలతో, ఆకు పసరులతో వైద్యము చేసెడివారు. వనములో లభించిన ఎండుటాకులను, కట్టెపుల్లలను వంట చెరుకుగా నుపయోగించెడివారు. ఇట్లు వారు ప్రకృతితో సహజీవనము సాగించిరి. సహజ సంపదలయిన నదీనదములను, ఇతర జలాశయములను, వనములను,

పర్వతములను, పచ్చికబయళ్ళను పరిరక్షించిరి. పంచభూతములను దేవతలుగ నారాధించిరి. ప్రకృతిని పూజించిరి. ప్రకృతి రక్షణము, పర్యావరణ పరిరక్షణమూ వారి జీవన విధానములో నున్నవి. అందువలన వారావిషయమును గూర్చి ప్రత్యేకముగ నేర్చుకొను ఆవశ్యకత రాలేదు.

కాలక్రమమున తమను క్రూరమృగముల బారినుండి, దొంగలబారినుండి రక్షించుకొనుటకు సమాజములుగ నేర్పడి గ్రామములను నిర్మించుకొనిరి. అట్టి కొన్ని గ్రామములు పట్టణములుగ, పట్టణములు మహానగరములుగ అవతరించి నవి. పెరిగిన జనాభావసరములకు వనవిచ్ఛేదనముచేసి, వ్యవసాయ భూములుగ మార్చినారు. చెట్లను కొట్టి ఆ'కలప'నింటి నిర్మాణమునకు వినియోగించినారు. కొండలనుకొట్టి రాళ్ళతో భవంతులు నిర్మించినారు. గనులు త్రవ్వి, ఖనిజ సంపదను వెలికితీసి, ఉక్కు, సిమెంటు వంటి ఉత్పాదనలతో ఆకాశ హర్మ్యములను నిర్మించి నారు. రాజస్థానీ చలువరాతి బండలతోనూ, కడప నల్లశానపురాతి బండలతోనూ, 'ఇటాలియన్ మార్బుల్' తోనూ ఇండ్ల నలంకరించినారు. దేశమునొక 'కాంక్రీట్ జంగిల్' గా మార్చినారు.

తత్ఫలితముగ, వనములు నశించినవి. కొండలు, గుట్టలు కరిగిపోయినవి. జలాశయములింకిపోయినవి. భూగర్భ జలము లడుగంటినవి. నెలకు మూడు వానలు కురిసెడి ఈ పుణ్యభూమిలో, మూడు నెలలకొక వానయిన కురియుటలేదు. బంగాళాఖాతములోనో, అరేబియా సముద్రములోనో అల్పపీడన మేర్పడినప్పుడే వర్షము. అదియును అతివృష్టి లేదా అనావృష్టి. కొందరి పంటలెండి చచ్చుచున్నవి. కొందరి పంటలు నీటమునిగి చచ్చుచున్నవి. కొందరెండి చచ్చుచున్నారు. కొందరుబ్బి చచ్చుచున్నారు. మిగిలి ఉన్న కొద్ది పాటి జలసంపద అంతఃరాష్ట్ర జలవివాదములలో చిక్కుకొని ఉప్పు సముద్రము పాలగుచున్నది. 'సస్యశ్యామల'గా పేరు గాంచిన ఈ దేశము 'రక్త పింగళ నేత్ర' అయినది. అనావృష్టితో ప్రజలల్లల్లాడుచున్నారు. కరువు రక్కసి కోరలలో విలవిలలాడుచున్నారు. ఆకలితో మలమల మాడుచున్నారు. త్రాగుటకు గ్రుక్కెడు మంచినీళ్ళు లేక గ్రుడ్లు తేలవేయుచున్నారు. రైతుసోదరులు ఆత్మహత్యల కొడిగట్టుచున్నారు.

మరొకవైపు అతివృష్టితో దేశములోని కొంతభాగము అతలాకుతలమయినది. పంటలు నీటమునిగినవి. ఇండ్లు కూలినవి. రహదారులు, రైలు మార్గములు జలమయమయినవి. జనజీవన మస్తవ్యస్తమైనది. వరదనీటిలో సమస్తమునూ

కోల్పోయి, ప్రాణముల నరచేత పట్టుకొని, చెట్టుకొమ్మలపైన, ఇంటి కప్పులపైన చేరిన జనులు తినుటకు తిండి, త్రాగునీరు లేక అగచాట్లు పడుచున్నారు. సహాయమునకై అర్థించుచున్నారు. ఇది ఈనాటి దుస్థితి. 'అప్ప ఎండి చచ్చినది. బావ ఉబ్బి చచ్చినాడు' అన్న సామెతగ నున్నదీ నాటి దేశ స్థితి.

ఇంకను అంతంత మాత్రముగా నున్న వృక్ష సంపదను భవన నిర్మాణముల పేర, పరిశ్రమల స్థాపన పేర, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేర, నూతన రహదారుల నిర్మాణము పేర, ఉన్న రహదారుల విస్తరణ పేర నరికి వేయుచున్నారు. పెరిగిన జనాభావసరముల కనుగుణ్యముగా జనాబాహుళ్య ప్రయాణ సాధనముల నభివృద్ధి పరచుటలో దేశము విఫలమయినది. తత్కారణముగా దేశములో మోటారు వాహనముల సంఖ్య పెరిగినది. అట్టి వాహనముల ద్వారా వెలువడు ధూమముతో వాయుప్రదూషణ మధికమయినది. ఇక అభివృద్ధి కొరకు మనము స్థాపించిన పెద్ద పెద్ద పరిశ్రమలు ధూమమును యథేచ్ఛగా గాలిలోనికి విడుచుచున్నవి. వాతావరణమును కలుషితము చేయుచున్నవి. అంతరిక్షములోగల 'ఓజోన్' తెరను భగ్నము చేసి, సూర్యుని నుండి వెలువడు అత్యంత ప్రమాదకరమయిన నీలలోహిత కిరణముల కాంతి ప్రభావమునకు మనల గురిచేయుచున్నవి. భూగోళ వాతావరణమునందు ఎండ తీవ్రతను, వేడిని పెంచుచున్నవి. పారిశ్రామిక వ్యర్థ పదార్థములను పరిశుద్ధము చేయకుండ, అటులే సమీపములోని నదులలోనికి, జలాశయములలోనికి విడుచు చున్నవి. నీటిని కలుషితము చేయుచున్నవి. అమూల్యమయిన జలసంపదను, జలచర సంపదనూ నాశనము చేయుచున్నవి.

ఇక మనము బజారునకు పోయి పట్టుచీరనుండి పచ్చి మిరపకాయల వరకు ఏవయిన వస్తువులను కొన్నప్పుడు దుకాణదారుడు మన కందించు 'పాలిథిన్' సంచులు మన పాలిటి శాపములు. కొన్నివేల ఏండ్లకయిన అవి మట్టిలో కలియక భూమిని, భూగర్భ జలసంపదను నాశనము చేయును.

ఇట్లు మనము కొంత నిరక్షరాస్యతతో, కొంత నిర్లక్ష్యముతో, కొంత నిర్లిప్తతతో, కొంత నిర్వేదముతో, కొంత అజ్ఞానముతో, కొంత అశ్రద్ధతో, అనాలోచితముగ మన జీవనాధారములయిన భూ, జల, వాయు సంపదలను కలుషితము చేయుచున్నాము. కలుషితము చేయుటకు సహాయపడుచున్నాము. ప్రభుత్వము కూడా అధికారములు లేని, అధికారులు లేని, అంగబలములేని, అర్థబలములేని, ఆదర్శములేని, ఆదరణలేని, ఆలోచనలేని, ఆచరణలేని, ఆర్తిలేని, ఆకాంక్షలేని 'పర్యావరణ పరిరక్షణ సమితి'

నొక దానిని స్థాపించి తన బాధ్యత తీరినదని చేతులు దులుపుకొనిన. అది కోరలు తీసిన సర్పము వలె కాటువేయలేక కేవలము బుస కొట్టుచున్నది.

నాయనలారా! భోపాల్ విష వాయు దుర్ఘటన నప్పుడే మరచిపోయినారా! కొన్ని వేల మంది మనసోదరులు, సోదరీమణులు, తల్లులు, తండ్రులు, కొడుకులు, కోడండ్రు, మనుమలు, మనుమరాండ్రు, అర్ధరాత్రి జరిగిన దుర్ఘటనలో, దిక్కుతోచక, దారి తెలియక, ఏమి జరుగుచున్నదో తెలియక, భయవిహ్వలులై, ప్రాణముల నరచేత పట్టుకొని, తల్లనక, పిల్లనక, కొడుకనక, కోడలనక, భర్తనక, భార్యనక, ఎవరికి వారై పరుగులు తీసి, చెట్టునకొకర్రై, పుట్టకొకర్రై, ప్రాణములు విడిచిన సంగతి అప్పుడే కనుమరుగయినదా! ఆ దుర్ఘటనలో బ్రతికి బట్ట కట్టిన వారు కూడ అంగవైకల్యముతో, ఆర్జనచేయు శక్తిలేక, అన్నము పెట్టు నాథుడులేక, ఆదుకొను నాయకుడు లేక, అనాథలవలె "ఎందుకు బ్రతికించితివి భగవంతుడా! చచ్చిన నెంత బాగుండెడిది!" అని తలచుచు, జీవచ్ఛవములవలె బ్రతుకుచు, మందుల కొరకు ఆసుపత్రుల చుట్టును, నష్టపరిహారము కొరకధికారుల చుట్టును ఉపగ్రహముల వలె తిరుగుట మీ కగపడుటలేదా?

నాయనలారా! వారెంత త్యాగమూర్తులు! వారు కన్ను మూసి, మన కళ్ళు తెరిపించినారు. వారు ప్రాణ త్యాగము చేసి మనలకు ప్రాణాపాయ సూచనల నందించినారు. వారు యముని మహిషపు లోహగంటల శబ్దము నాలకించి, మనకు ప్రమాద ఘంటికలను మ్రోగించినారు. వారు జీవన్ముక్తులై మనకు కర్తవ్యోపదేశము గావించినారు. వారు విగత జీవులై మనకు 'జీవన గీతోపదేశము' చేసినారు. వారు జీవన్మృతులై మనలను కర్తవ్యోన్ముఖులను చేసినారు. కాని మనమేమి చేయు చున్నాము. వారిని మరచినాము. వారి త్యాగ నిరతిని గంగపాలు చేసినాము. వారందించిన సందేశమును బూడిదపాలు చేసినాము. మన భవిష్యత్తు నంధకారము పాలు చేసినాము.

విద్యార్థినీ విద్యార్థులారా! మాదేమున్నది? కాటికి కాళ్ళు చాపుకొని, దినములను గణించుచున్నాము. ఈ దేశము మీది. ఈ దేశభవిష్యత్తు మీది. మీరీ దేశమునకు 'వెన్నెముక' వంటివారు. భావిపౌరులు మీరు. భావినేతలు మీరు. భావి అధికారులు మీరు. భవిష్య విధాతలు మీరు  ఈ దేశ భవిష్యత్తు మీపై ఆధారపడి యున్నది. మీ భవిష్యత్తు పర్యావరణ పరిరక్షణముపై ఆధారపడి యున్నది. అందులకై పర్యావరణ పరిరక్షణమును మీ జీవన విధానములో అలవరచుకొనుడు.

- జలములేనిదే జీవము లేదు. అందులకై నీటిని పొదుపుగ వాడుట నలవాటుగ చేసికొనుడు.

- అనవసరముగ చెట్లను కొట్టకుడు.
- మీ ఇండ్లలో, బదులలో విరివిగ మొక్కలు నాటి, వాటిని పెంచి, పోషించి, వృక్షసంపద నభివృద్ధి చేయుడు.
- మీ ఇండ్లలోనూ, మీరు నివసించు ప్రాంతములోనూ, ఇంకుడు గుంతలను, చిన్న చిన్న వాగులపై 'చెక్ డామ్' లను నిర్మించి భూగర్భ జలసంపదను పెంపు చేయుడు.
- హానికరమయిన 'పాలిథీన్' సంచులకు స్వస్తి పలికి, సహజమయిన గుడ్డ సంచులనో, జవుళిసంచులనో వాడుడు. సంచి చేత పుచ్చుకొని బజారునకు పోవు మన పాత అలవాటును పునరుద్ధరించుడు.
- పాఠశాలకేగుటకు మోటారు వాహనములకు బదులుగ సైకిళ్ళను వాడుడు.
- భవిష్యత్తులో మీరు నేతలయిన, పర్యావరణ పరిరక్షణమునకై తగిన శాసనములు చేసి, వాటిని చక్కగ నమలు చేయుడు.
- భావిలో మీరధికారులైన, పర్యావరణ కాలుష్య నిరోధమునకై తగు చర్యలు చేపట్టుడు.
- స్వచ్ఛమయిన వాతావరణములో, పరిశుభ్రమయిన గాలిని పీల్చుచు, నీటిని త్రాగుచు, ఆరోగ్య ప్రదమయిన, ఆనంద దాయకమైన జీవనమును గడుపుడు. మీ భవిష్యత్తును బాగు చేసికొనుడు. దేశము నుద్ధరింపుడు. దీర్ఘాయుష్మాన్ భవ".

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# వీధి దేవతలు

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

నాయనలారా! మన సాక్షి సంఘాభిమాని యొక్కడీ లేఖ వ్రాసినాడు. విషయ వైవిధ్యమును దృష్టిలో నిడుకొని ఈ లేఖను చదువుచున్నాను. ఆలకింపుడు.

సాక్షికి,

నరసింహశాస్త్రి నమస్కరించి వ్రాయునది. నేను మీ 'సాక్షి' సంఘాభిమానులలో ఒకడను. ప్రతివారమును 'సాక్షి' ఉపన్యాసములు చదివి, ఆనందించు వేలాది పాఠకులలో నేనొకడను. నాకు జంఘాలశాస్త్రి వలె వాక్చాతుర్యము లేదు. మీ వాణీదాస కవివలె కవితా పటిమలేదు. కాలాచార్యునివలె వైష్ణవమత సంప్రదాయములపై అవగాహన లేదు. మీ వలె సర్వవిషయ పరిగ్రహణ జ్ఞానము లేదు. ఏమియు లేనివాడివి లేనట్టు పడియుండక మరి ఈ ఉత్తరము ఎందులకని మీరడుగ వచ్చును. రాష్ట్రములో, ముఖ్యముగా రాష్ట్రరాజధానిలో వీధి వీధినా వెలసిన వీధిదేవతలను గూర్చి నా మనసులో మెదిలిన భావములను, నాకు వచ్చిన భాషలో మీ ముందుంచు టకు ప్రయత్నము చేయుచున్నాను. నాకు మన జంఘాలశాస్త్రి వలె శబ్దచాతుర్యము గాని, అర్థగాంభీర్యము కాని లేవు. ఈ ఉత్తరమును సాంతము చదివిన తరువాత ఇది మీ సాక్షి సంఘసమావేశములలో పఠనయోగ్యమో లేక చిత్తు కాగితముల బుట్టకు యోగ్యమో మీరే నిర్ణయించుకొనుడు.

ఈ సృష్ట్యాది యందు ప్రథమముగ ప్రణవనాదముద్భవించినదనియు, అటు పిమ్మట ఆది దంపతులు, త్రిమూర్తులు, చతుర్వేదములు, పంచభూతములు, షడ్రుతువులు, సప్తమహర్షులు, అష్టదిక్పాలకులు, నవగ్రహములు, దశావతారములు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, చతుర్దశ భువనములు, అష్టాదశ పురాణములు వెలసినవనియు పండితులు చెప్పుదురు. అటులే బ్రహ్మ సత్యలోకమున, శ్రీమహావిష్ణువు వైకుంఠమున, పరమశివుడు కైలాసమున వసించినట్లు మన పురాణములు తెలుపుచున్నవి. ఆది పరాశక్తి అష్టాదశ పీఠములందును, మహాదేవుడు ద్వాదశ జ్యోతిర్లింగములందును ప్రతిష్ఠితమైనట్లు కూడా తెలియుచున్నది.

కాలక్రమమున దేవతలు జనావాసములకు దూరముగ కొండలపైన, కోనలలోన వెలసినట్లు, అటు తరువాత తమ భక్తులది గమనించి, అచ్చట ఆలయములు

నిర్మించి, పూజార్చనాది విధి విధానములను, ధూప, దీప, నైవేద్యము లను ఏర్పాటు చేసినట్లాయా స్థలపురాణములు చెప్పుచున్నవి. ఏడుకొండల పైన వెంకన్న, సింహాద్రి కొండపై అప్పన్న, యాదగిరి గుట్టపై శ్రీ లక్ష్మీనృసింహస్వామి, రత్నాచలముపై శ్రీసత్యనారాయణ స్వామి, ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ, శ్రీశైలముపై భ్రమరాంబికా సహిత మల్లిఖార్జునస్వామి, శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీకూర్మములో శ్రీకూర్మనాథస్వామి, అరసవల్లిలో శ్రీసూర్యనారాయణస్వామి, భద్రాచలముపై సీతాలక్ష్మణ సహిత శ్రీరామచంద్రస్వామి, శబరిగిరిపై అయ్యప్పస్వామి, ఉడిపిలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి మున్నగు దేవీ, దేవతలు ఇట్లు వెలిసినట్లు ఆయా స్థలపురాణముల వలన మనకు తెలియుచున్నది.

అటు తరువాత రాజులు తమ కీర్తి ప్రతిష్ఠల నినుమడింప చేయుటకై జనావాసములందు దేవాలయములు నిర్మించి, అందులో శిలాఫలకములపై శాసనములు వ్రాయించి, జయస్తంభములను వేయించి, సత్రములను కట్టించి, మండపములు నిర్మించి, జలాశయములను త్రవ్వించి, దానధర్మములు నిర్వహించి శాశ్వత కీర్తులైనారు. దక్షిణాపథమున వెలసిన అనేకానేక దేవాలయములిట్లు రాజులచే నిర్మింపబడి, శిల్ప సౌందర్య సంపద కాలవాలములై అలరారుచున్నవి. ఇట్లు దేవాలయములు ప్రజలలో దైవభక్తిని ప్రేరేపించి, పాప చింతనను కలుగజేసి ప్రజలను సన్మార్గములో నడిపించుటలో చక్కని పాత్రపోషించినవి.

అటు తరువాత గ్రామగ్రామమున, ఆ గ్రామ ప్రజల బాగోగులు చూచుటకై గ్రామ దేవతలు వెలసిరి. నా మిత్రుడొకడు వీరిని 'లోకల్ గార్డియన్స్' గా అభివర్ణించి నాడు. వారు ఆ గ్రామ ప్రజల పూజల నందుకొనుచు, నైవేద్యముల నందుచు, ముడుపులను స్వీకరించుచు, మ్రొక్కులను తీర్చుచు, ప్రతి యేటా పండుగలు జరిపించుకొనుచు, పూనకములు పూనుచు, బలులను స్వీకరించుచు, తమ గ్రామ ప్రజలను చల్లగ చూచుచున్నారు ఈ గ్రామదేవతలలో అధికాధికము స్త్రీ రూపమున నున్న శక్తి స్వరూపిణులే! అల్లూరిలోనున్న పోలేరమ్మ, అనకాపల్లిలోనున్న నూకాలమ్మ, విజయనగరములో నున్న పైడితల్లెమ్మ, రాయగడాలోని మజ్జి గౌరమ్మ, మద్దివలసలో నున్న దుర్గమ్మ వంటివారు ఈ కోవకు చెందినవారే! ఇక్కడికి వచ్చుసరికి ప్రజలలో భక్తిభావము సన్నగిల్లినది. భయము పెరిగినది. ఈ పెరిగిన భయము అనేకానేక మూఢాచారములకు మూలమయినది. మ్రొక్కులు తీర్చకున్న, ముడుపులు చెల్లించకున్న, సన్మార్గములో నడవకున్న ఆ తల్లి బాధించి, వేధించుచున్న భయము ప్రజలను ఆమెపట్ల భక్తిభావముతో మెలగునట్లు చేసినది స్త్రీ శక్తి, భగవద్భక్తి కంటే అధికతర మయినదని ఋజువు చేసినది.

మరిప్పుడు భక్తిశ్రద్ధలు అడుగంటినవి. భయము కూడా సన్నగిల్లినది. సందు సందునా, వీధి వీధినా, పేట పేటనా, ప్రతి రహదారి ప్రక్కన దేవతలు వెలయు చున్నారు. వెలయుచున్నారనుట కంటె వెలయింపచేయుచున్నారనుట సమంజ సముగ నుండునేమో? నల్లపోచమ్మ, కట్టమైసమ్మ, రేణుక ఎల్లమ్మ, పీనుగుల మల్లన్న, తలుపులమ్మ తల్లి, పెద్దమ్మతల్లి, బల్కమ్మతల్లి, నీలమ్మతల్లి, ముత్యాలమ్మ తల్లి, మహంకాళి, అభయాంజనేయస్వామి, సిద్ధి వినాయకుడు, సిరిడిసాయిబాబా, ఇట్లు ఒకరా! ఇద్దరా! ఆరుకోట్ల మంది ఆంధ్రులకు తోడుగ ముక్కోటి దేవతలు ఆంధ్రప్రదేశమున వెలసిరి. ముఖ్యముగ రాజధాని నగరమైన హైదరాబాదు నగరమునకు ఈ దేవతల తాకిడి ఎక్కువయినది. కోస్తా, రాయలసీమ ప్రాంతములనుండి హైదరాబాద్ నగరమునకు ఉద్యోగములకై తరలివచ్చిన తెలుగువారి వలె, ఈ దేవతలు కూడ హైదరాబాద్ నగరమునకు తరలివచ్చినారు. వీధి వీధినా, పేటపేటనా వెలసినారు. భూకబ్జాదారులకు, భూబకాసురులకు, బ్రోకర్లకు వీరు ఆరాధ్య దైవములు. ఇలవేల్పులు. ఈ భూబకాసురులు ఎక్కడనయిన అనువయిన ఖాళీస్థలములున్నచో, రాత్రికి రాత్రి ఓ ఇష్టదేవతా విగ్రహమును ప్రతిష్ఠించి, ఆ దేవత అచ్చట వెలసినట్లు నాలుగు రోజులు ప్రచారముచేసి, పూజా పునస్కారములు, ధూప, దీప, నైవేద్యముల నేర్పాటుచేయుదురు. అట తరువాత ఆ చుట్టు ప్రక్కల గల ప్రజలనుండి చందాలు వసూలు చేసి, విరాళములు స్వీకరించి, ఓ చిన్నగుడిని కట్టింతురు, అంతే! ఆ తరువాత ఆ స్థలములో ముందువైపు ఓ చిన్న వ్యాపార సముదాయము, వెనుక భాగమున గృహ సముదాయమును వెలయింప చేయుదురు. అనంతరము తన చేతి క్రింద పనిచేయు ఓ నలుగురితో 'ఆలయ కమిటీ'నొక దానిని ఏర్పాటు చేసి, అటు ఆలయములో వచ్చిన ఆదాయమును, ఇటు వాణిజ్య, గృహ సముదాయమునుండి వచ్చు ఆదాయమును స్వాహా చేయుదురు.

ఇక ప్రధాన రహదారులలో నయిన, రోడ్లను వెడల్పు చేయు కార్యక్రమములో తమ ఇండ్లో, దుకాణములో పోవునను శంక కలిగినచో, వెంటనే ఆ రోడ్డు ప్రక్కన ఓ చిన్న విగ్రహము ప్రతిష్ఠించి ఆలయమును నిర్మింతురు. దానితో ఆ దేవతా మాహాత్మ్యమున ఆ రోడ్డును వెడల్పు చేయు కార్యక్రమమంతటితో నిలిచిపోవును. పాపమీ దేవతలు ధూప, దీప, నైవేద్యములకయిన నోచుకొనక, రోడ్డు ప్రక్కన దుమ్ము, ధూళి, పట్టి యుందురు. రోడ్డుపై నడచు మోటారు వాహనముల నుండి వెలువడిన ధూమమే వారికి ధూపము. దుమ్ము, ధూళియే వారికి చందన లేపనము రోడ్డు

ప్రక్కన అరటిపండ్లు కొని, తిని, అక్కడ పారవైచిన తొక్కలే వారికి నిత్య నైవేద్యములు. ఇట్లా దేవతలు ఇరుకు దేవాలయములలో ఇడుములు పడుచు, ఆ వీధివారి నందరిని రక్షించుచున్నారు. అందుకనియే వీరిని నేను 'వీధి దేవతలు'గా అభివర్ణించుచున్నాను.

ఒక్క మన హిందువులే కాదు. ఈ విషయమున మన ముస్లిం, క్రిష్టియన్ సోదరులు కూడా మనతోనున్నారు. రోడ్డు ప్రక్క చిన్న చిన్న దర్గాలను, శిలువలను వెలువరింపచేసి, యథాశక్తి తమ తమ ఆస్తులను కాపాడుకొనుచున్నారు. సర్వమత సామరస్యమన్న నిదియే కాబోలు!

మనలో కొందరభ్యుదయ వాదులు దైవములేదనియు, అదంతయు వట్టి బూటకమనియు, మతమొక మత్తుమందనియు వాదింతురు కదా! అలనాడు శ్రీమద్భాగవతములో గజేంద్రుని రక్షించుటకై సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడు "సిరికింజెప్పడు, శంఖ చక్ర యుగమున్ జేదోయి సంధింపడు.... గజప్రాణావ నోత్సాహియై" అని పోతనగారు చెప్పినట్లు, ఆర్తత్రాణ పరాయణులైన ఇంతమంది దేవుళ్ళు దిగివచ్చి, రోడ్ల ప్రక్కన, వీధిమలుపులలో, ఇరుకు సందులలో, మురికి పేటలలో, రోడ్లుకూడళ్ళలో వెలసి, ధూప, దీప, నైవేద్యములకయిన నోచుకొనక, దుమ్ము, ధూళిలో తాము పొర్లుచు, ఇరుకు దేవాలయములలో ఇడుములు పడుచు కూడ రోడ్డు విస్తరణ కార్యక్రమముల నాపి తమ భక్తుల ఆస్తిపాస్తులను కాపాడుట లేదా! దైవమున్నాడనుటకు ఇది నిదర్శనము కాదా!

'సాక్షి' సంఘసభ్యులారా! 'సాక్షి' సంఘాభిమానులారా! నేను నాస్తికుడను కాను. దేవాలయ నిర్మాణమునకు వ్యతిరేకినంతకంటె కాను. దైవారాధన, అందుకు ఆలవాలమయిన ఆలయములు మనకు అవసరమే! కాని ఇట్లు తమ స్వార్థమునకై, భూకబ్జాలు చేయుటకు, కబ్జాచేసిన ఆస్తులను నిలబెట్టుకొనుటకు, చిల్లర దేవుళ్ళను సృష్టించి, ప్రతిష్ఠించి, చిన్న చిన్న దేవాలయములు నిర్మించుటకు మాత్రమే నేను వ్యతిరేకిని. ఈనాడు రాష్ట్రములో అనేకానేక దేవాలయములు సరయిన ఆదాయము, ఆదరణ, పోషణ లేక జీర్ణావస్థలోనున్నవి. అనేకానేక చారిత్రక దేవాలయములు సిథిలావస్థలో నున్నవి. అనేకానేక దేవాలయములు నిత్యపూజార్చనాది కార్యక్రమముల కును, ధూప, దీప, నైవేద్యములకును కూడా నోచుకొనక పాడుబడి యున్నవి. ఆలయములోని దేవీ, దేవతామూర్తులతోపాటు, వారిని నమ్ముకొని బ్రతుకుచున్న అర్చకులు కూడా అన్న ప్రసాదము లేక అలమటించుచున్నారు. భక్తిఉన్నయెడల అట్టి దేవాలయములను పునరుద్ధరించి పుణ్యము కట్టుకొనుడు. శక్తియున్నయెడల

అనువయిన స్థలమును కొని, అందమయిన దేవళములను నిర్మింపుడు. అటు దైవానుగ్రహమును, ఇటు ప్రజాదరణమును పొందుడు. అంతియే కాని ఇట్లు మీ స్వార్థమునకై వీధి దేవతలను ప్రతిష్ఠించి మన హిందూ మతమును, దేవతలను అవమానము పాలు చేయకుడు.

ఇట్లు

భవదీయుడు

సింహాద్రి వీర వేంకట అప్పల నరసింహశాస్త్రి

నాయనలారా! ఈ సుదీర్ఘ లేఖను చదువుటలోనే ఈనాటి సమావేశ సమయ మయిపోయినది. మరల వచ్చేవారము ఏదైన విషయమును గూర్చి ప్రసంగింతును. సెలవ్.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# శాసనసభ సమావేశములు

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

నాయనలారా! ఇటీవల నేను మన శాసనసభసమావేశములను తిలకించగోరి, ఒక తెలిసిన మిత్రునిద్వారా 'ప్రవేశపత్రము' సంపాదించి, సమావేశ సమయమున కర్ధగంట పూర్వమే శాసనసభా భవనమును చేరితిని. జంఘాలశాస్త్రీ! నీ కీ శాసనసభా సమావేశములకు పోవలసిన అగత్యమేమి వచ్చినదని మీరు ప్రశ్నింపవచ్చును. ఏమియును లేదు సోదరులారా! కేవలము విషయ సంగ్రహణార్థినై పోయితిని. ప్రజాస్వామ్యమున కాలవాలములై, ధర్మపాలనమునకు నిలయములై, ప్రజలగుండె చప్పుళ్ళను ప్రతిధ్వనింపచేసి, ప్రజావాణిని వినిపింపచేసి, ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అద్దము పట్టి, వారి కష్టనష్టములకు, కడగండ్లకు సానుభూతి నందించి, ప్రజాశ్రేయస్సే లక్ష్యముగా పని చేయవలసిన శాసనసభల పనితీరు గమనించుటకై పోయితిని.

ప్రధానద్వారము వద్ద గల రక్షక భటుడు నన్నాపాదమస్తకము పరికించి, నా వేషభాషలను చూచి కాబోలు, నవ్వుకొనుచు, నా వద్దనున్న సందర్శకుల ప్రవేశ పత్రమును అటూ నిటూ రెండు మార్లు త్రిప్పి, పరికించి, పరీక్షించి, తనవద్దనున్న ఓ పుస్తకములో వివరములను వ్రాసికొని, నా సంతకము తీసికొని, 'లోహ సోధక యంత్రము'తో నన్ను పరీక్షించి, అంతటితో సంతృప్తిపడక, నా శరీరమంతయును తడిమి, నా వద్ద ఎటువంటి ఆయుధములు లేవని నిర్ధారించి, నన్ను లోనికి పంపెను. నా వద్ద అంత్యంత బలశాలి అయిన 'వాక్క'ను ఆయుధము కలదని వానికెట్లు తెలియును. "ఆహా! ప్రజాప్రతినిధులకు ప్రజలనిన ఎందులకింత భయము?" అని నాలో నేననుకొనుచు లోనికి ప్రవేశించితిని. రక్షక భటుల సుషిర నాదములతో, పాదకవచముల టక్ టక్‌లతో, లాఠీల టిక్కుటిక్కులతో ఆ ప్రదేశమంతయు మారు మ్రోగుచున్నది. రక్షక భటాధికారులు 'మంత్రులు' వచ్చినపుడెల్ల గౌరవ పురస్సరముగా, తమ రెండు కాళ్ళు జోడించి, ఛాతిని విస్తరించి, చంకలోని లాఠీని ఎడమ చేతితో పట్టుకొని, కుడిచేతితో, 'సెల్యూట్' చేయుచున్నారు. కారు తలుపులను తెరచి నాయకులను సాదరముగ నాహ్వానించుచున్నారు.

శాసనసభా ప్రాంగణమంతయు ముతక ఖద్దరు పంచెలతో, చొక్కాలతో, టోపీలతో, అత్తా కోడలంచు జరీ కండువాలతో, పసుపురంగు చొక్కాలతో, చీరలతో, అదే రంగు కండువాలతో, గులాబీ రంగు చొక్కాలతో, కండువాలతో, ఎరుపు రంగు

చొక్కాలతో, అదే రంగు కండువాలతో, కాషాయ వర్ణ చొక్కాలతో, కండువాలతో, షేర్వాణీలతో, తలపై రూమీ టోపీలతో, ఆకుపచ్చరంగు కండువాలతో, రంగుల హరివిల్లువలె శోభిల్లుచున్నదని మా వాణీదాసకవి కవిత్వము చెప్పుటకు యోగ్యమై యున్నది.

వారు చెట్ల క్రింద గుంపులుగచేరి రానున్న ఎన్నికలను గూర్చియు, తమ రాజకీయ భవితవ్యమును గూర్చియు, పెరుగుచున్న ధరలను గూర్చియు, సరిపడని జీతభత్యముల గూర్చియు, జరుగనున్న మంత్రివర్గ విస్తరణ గూర్చియు, అందులో తమకు స్థానము దక్కుటకు గల అవకాశమును గూర్చియు పిచ్చాపాటీ మాట్లాడు కొనుచున్నారు.

ఒక చెట్టు క్రింద గుంపులో ఇరువురు సభ్యులు ఏదియో విషయమును గూర్చి ఉచ్చస్వరమున మాట్లాడుకొనుచున్నారు. కోడిపుంజుల వలె ఎగిరెగిరి పడుచున్నారు. కోడె ఆబోతులవలె రంకెలు వేయుచున్నారు. కారెనుబోతులవలె కాళ్ళు దువ్వుచున్నారు. గుంపులో మిగిలిన మిత్రులు వారిని వారింప యత్నము చేయుచున్నారు. విషయ సంగ్రహణార్థినై కాస్త సమీపముగ పోయి నిలబడితిని. "వర్గీకరణము జరుగ వలసినదే! లేనియెడల మీ కులమువారు మా కులము వారిని పూర్తిగ అణగద్రొక్కుచున్నారు. ఈ కులాధిపత్యము ఇకపై చెల్లదు, లేని యెడల పుచ్చులు నేల రాలవలసినదే" అని ఒకడనుచున్నాడు. "మేమేమియు గాజులు తొడిగించుకొనలేదు. వర్గీకరణ యెట్లు జరుగునో మేమును చూతుము. వర్గీకరణము జరిగిన, రాష్ట్రము నగ్నిగుండముగ మార్చెద" మని మరొకడు చొక్కాచేతులను పైకెగబెట్టుచున్నాడు. ఇదేదో 'ఎస్.సి' వర్గీకరణ వివాదము కాబోలు ననుకొనుచు వేరొక వంక వెళ్ళితిని.

అచ్చట కొందరు మహిళా శాసనసభ్యురాండ్రొక చెట్టు క్రింద చేరి రాజకీయముల కతీతముగా పట్టుచీరెలను గూర్చియు, నగలను గూర్చియు, పెరుగుతున్న బంగారపు ధరను గూర్చియు, అత్తగార్లను గూర్చియు, ఆడుబిడ్డలను గూర్చియు, తమ పిల్లల అమెరికా చదువులను గూర్చియు, వారి పెండ్లిండ్లను గూర్చియు, ఒకరిమాట మరొకరు వినకుండ, అందరును ఒకేసారి మాట్లాడుకొనుచున్నారు.

శాసనసభా సమావేశమునకు సమయ మగుటచే నేను నెమ్మదిగ బోయి 'సందర్శకుల గ్యాలరీ'ని చేరి ఒకచోట కూర్చుంటిని. ఇంతలో సమావేశ ఆరంభ సూచకముగా గంట మ్రోగినది. సభ్యులందరును, బడిగంట విని తమ తమ తరగతి గదులు చేరిన విద్యార్థులవలె, బిలబిలమని లోనికి వచ్చి తమ ఆసనములు స్వీకరించిరి. ఇంతలో సభాధ్యక్షుడు సభాప్రవేశముచేసి, సభకు నమస్కరించి, తన ఆసనముపై

కూర్చుండెను. సభ్యులు కూడా గౌరవ సూచకముగా లేచి నిలబడి, సభాధ్యక్షుడు తన ఆసనము స్వీకరించిన తరువాత, వారును ఆశీనులైరి. అధ్యక్షుడు ఆనాటి కార్యక్రమములో ప్రథమముగా ప్రశ్నోత్తరము లుండునని ప్రకటించి కార్యక్రమము నారంభించెను. అంతే నాయనలారా! అంతవరకునూ ప్రశాంతముగా నున్న సభ ఉన్నట్టుండి ఉద్వేగముగ మారినది. గందరగోళము చెలరేగినది. ప్రతి ప్రతిపక్షపార్టీ సభ్యులు కూడా తామిచ్చిన 'వాయిదా తీర్మానము'పై వెంటనే చర్చ జరుగవలెనని పట్టుబట్టిరి. సభాధ్యక్షుని వేదికను చుట్టుముట్టిరి.

సభాధ్యక్షుడు తానా వాయిదా తీర్మానముల నన్నింటిని తిరస్కరించితి ననియు, ఆయా విషయములపై సభలో వేరెప్పుడైన చర్చ కనుమతింతుననియు, సభాకార్యక్రమములు సజావుగా సాగుటకు సహకరించుడనియు చేసిన విజ్ఞప్తులు గాలిలో కలిసిపోయినవి. ఒక రాజకీయ పక్షము సభాధ్యక్షుని ప్రవర్తనా తీరునకు నిరసనగా శాసనసభ నుండి బయటకు నడచినది. వేరొక ప్రతిపక్షము వివిధ నినాదములు గల అట్టలతో సభాధ్యక్షుని వేదికముందు కూర్చుని 'ధర్నా' నిర్వహించినది. వేరొక రాజకీయ పక్షము పెరుగుచున్న కూరగాయల ధరలకు నిరసనగా మెడలో కూరగాయల దండలను ధరించినది. శాసన సభా ప్రాంగణమున కూరగాయల దుకాణము తెరచినది. మరో ప్రతిపక్షము వర్షములు లేక పంటలెండిపోవుచున్నవని తెలుపుటకై ఎండిన వరిచేను మోపునొక దానిని తలపై నిడుకొని ప్రదర్శన చేసినది. ప్రత్యేక రాష్ట్ర సాధనకై వేరొక ప్రతిపక్షము శాసనసభలో నిరసన ప్రదర్శన చేసినది. సభాధ్యక్షుని చుట్టుముట్టినది. సభాధ్యక్షుని ఆజ్ఞమేరకు 'శాసనసభా ముష్కరులు' వారిని బలవంతముగ బయటకు మోసుకొని పోయిరి. ఇట్లాశాసన సభా మందిరమంతయు ఆదివారమునాటి చేపల బజారును తలపించి నది. శాసనసభా సమావేశ మర్ధగంటసేపు వాయిదా పడినది.

అర్ధగంట దాటిన తరువాత సమావేశము తిరిగి యారంభమయినది. 'ఆదాయ వ్యయపద్దుల'పై చర్చ ఆరంభమయినది. ఇక సమావేశము సజావుగా సాగునని నేనూహించితిని. కాని అంతలోనే ప్రభుత్వ, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటమాట పెరిగినది. వస్తాదులవలె జబ్బలు చరుచుకొనుచున్నారు. మల్లులవలె తొడలు కొట్టుకొనుచున్నారు. మహంకాళిజాతరలో పోతురాజులవలె వీరంగములు వేయుచున్నారు. 'త్వంశుంఠ' అంటే 'త్వంశుంఠ' అని ఒకరినొకరు నిందించుకొను చున్నారు. అప్రజాస్వామిక భాషలో ఒకరినొకరు దూషించుకొనుచున్నారు. మా పరిపాలనా కాలములోనే రాష్ట్రమభివృద్ధి చెందినదంటే మా పరిపాలన కాలములోనే అభివృద్ధి చెందినదని కాకుల లెక్కలను వినిపించి నమ్మబలుకుచున్నారు. నీ వెంత?

అంటే నీవెంత? అని సవాళ్ళు, ప్రతిసవాళ్ళతో శాసనసభా భవనము దద్దరిల్లినది. ఆవేశకావేశములు పెరిగినవి. చొక్కా చేతులు పైకెగసినవి. కండువాలు నేలరాలినవి. చెప్పులు చేతుల నలంకరించినవి. మైకులు గాలిలో ఎగిరినవి. బాహాబాహిగా జరిగిన ముష్టి యుద్ధములో ఒకరిద్దరికి గాయములైనవి. ఒకరిద్దరి కళ్ళజోళ్ళు విరిగినవి. కొందరి చొక్కాలు చినిగినవి. కొందరి చొక్కాల బొత్తాములూడినవి. కొందరి చెప్పులు తెగినవి. కొందరి పంచెల వెనుక పింజలూడినవి. కొందరు మహిళా శాసనసభ్యుల పవిటలు జారినవి. చీరకుచ్చిళ్ళూడినవి. ఇట్లా శాసనసభా ప్రాంగణమంతయు కురుక్షేత్ర రణరంగమును తలపింపచేసినది. ఎవరో విసిరిన చెప్పు గురి తప్పి సభాధ్యక్షుని వేదికపైబడినది. పరిస్థితి విషమించినదని గ్రహించిన సభాధ్యక్షుడు సమావేశమును మరుసటి దినమునకు వాయిదా వేసి సభాప్రాంగణము నుండి నిష్క్రమించెను.

అయ్యయ్యో! నాయనలారా! ఇది ప్రజాస్వామ్యమేనా? వీరందరూ మన ప్రతినిధులేనా? ప్రజాస్వామ్యమెంత భ్రష్టుపట్టినది? ప్రజాప్రతినిధులెంత దిగజారి నారు? వీధి రౌడీలవలె పోట్లాడుకొనుచున్నారు. మల్లులవలె తొడలు చరచుకొను చున్నారు. కారెనుబోతుల వలె రంకెలు వేయుచున్నారు. కుక్కలవలె కాట్లాడుకొను చున్నారు. అయ్యయ్యో! ప్రజాస్వామ్యమునకు మూలస్తంభమే! ప్రజాసమస్యలను చర్చించు ప్రధాన వేదికయే! ప్రజాభిప్రాయమున కద్దము పట్టి, ప్రజావాణిని స్వేచ్ఛగా వినిపించు మందిరమే! అట్టి శాసనసభా సమావేశముల నిట్లు నిర్వీర్యము చేసి, పనికిమాలిన చర్చలతో, ఆవేశకావేశములతో, సవాళ్ళు ప్రతిసవాళ్ళతో, నింద ప్రతినిందలతో, ఆరోపణ ప్రత్యారోపణములతో సమయమును వృథాచేయుచున్నారు. నాయనలారా! కోట్లు ఖర్చుచేసి ఎన్నికలను నిర్వహించి మిమ్ములను మా ప్రతినిధు లుగ ఎన్నుకొని, మీకు జీతభత్యములు, వసతులు కల్పించి, మా అభిప్రాయములను నిర్భీతిగా, నిర్ద్వందముగా వినిపించి, ప్రజాపాలనము చేయుడని మిమ్ములను పంపగా, ఇదా మీరు చేయు నిర్వాకము?

అయ్యయ్యో! మేము పస్తులుండి మీకు పంచభక్ష్య పరమాన్నభోజనముల నేర్పాటు చేసినామే! మేము మట్టిమూకుటిలో తినుచు మీకు బంగారపు పళ్ళెరములలో విందులనేర్పాటు చేసినామే! మేము పూరిగుడిసెలలో నుండి మీకు దంతభవంతుల నేర్పాటు చేసినామే! మేము కాలినడకన పోవుచు మీ ప్రయాణముల 'కింఫాలా' కార్ల నేర్పాటు చేసినామే! మేము చిరిగిన వస్త్రములు ధరించుచు మీకు చలువచేయడిన పంచెలను, చొక్కాలను, జరీ కండువాలనూ అందించినామే! మేము రెండవ తరగతిలో నిలబడి ప్రయాణము చేయుచు, మీకు వాతానుకూల మొదటి తరగతి ప్రయాణ సౌకర్యము కలిగించినామే! మా పంటలకవసరమగు విద్యుత్తు నాదాచేసి, మీ భవంతులు దేదీప్యమానముగా వెలుగుట కవసరమగు విద్యుత్తు నందించుచున్నామే!

అనారోగ్యము కలిగిన, మేము ప్రభుత్వ ఆసుపత్రులలో మ్రగ్గుచు, వారందించిన రంగు నీళ్ళను మ్రింగుచు, మీకు కార్పొరేట్ ఆసుపత్రుల లోనూ, విదేశములలోనూ చికిత్సకై ఏర్పాటు చేసినామే! మా పిల్లలను ఉపాధ్యాయులయిన సరిగలేని, భవంతులయిన లేని ప్రభుత్వ పాఠశాలలలో చదివించుచు, మీ పిల్లలను ఆంగ్లమాధ్యమ పబ్లిక్ స్కూళ్ళలోనూ, కార్పొరేట్ విద్యా సంస్థలలోనూ చదివించు నేర్పాట్లు గావించినామే! వాయు విమానమును ఎన్నడు దగ్గర నుండయిన చూడని మేము, మీ మంత్రివర్గ సభ్యులకు ప్రత్యేక విమానములు, హెలికాప్టర్ల నేర్పాటు చేసినామే! ఇన్ని ఏర్పాట్లు చేసిన దెందులకు? మీరు ప్రశాంత చిత్తులై, నిర్మలమనస్కులై, నిర్భీతిగ, నిష్పక్షపాతముగ, ధర్మసమ్మతముగ, న్యాయబద్ధముగ, ప్రజాదరణముగ ప్రజాపాలనము చేయుదు రనియే కదా! మా బాగోగులు చూచెదరనియే కదా! మా కష్టనష్టములను ప్రభుత్వ దృష్టికి తెచ్చి, వాటిని నివృత్తి చేయు నుపాయముల నన్వేషింతురనియే కదా! శాసన సభలలో మా వాణిని వినిపింతురనియే కదా! మమ్ములనుద్ధరింతురనియే కదా!

శాసనసభా సమావేశముల నిర్వహణ మత్యంత ఖర్చుతో కూడిన వ్యవహారము కదా! గంటకు కొన్ని లక్షల రూపాయల వ్యయమగును కదా! మరి అట్టి విలువైన శాసనసభా సమయమును, ప్రజాధనమును ఇట్లు పనికిమాలిని చర్చలతో, సిద్ధాంత రాద్ధాంతములతో, వ్యక్తిగత దూషణలతో, ఆత్మస్తుతులతో, పరనిందలతో వృథా చేయుట మీకు న్యాయమా? వ్యక్తిగత దూషణలకు, నిందారోపణములకు, సవాళ్ళకు, ప్రతిసవాళ్ళకు, ప్రతిదినము మీ పార్టీ కార్యాలయములలో మీరేర్పాటు చేయు పత్రికా విలేఖరుల సమావేశములు, 'మీట్ ది ప్రెస్' కార్యక్రమములుండనే ఉన్నవి కదా!

నాయనలారా! ఇప్పటికయినను తెలివికలిగి ప్రవర్తిల్లుడు. శాసనసభా సమావేశములలో ఆవేశకావేశములకు లోనుగాక 'సమ ఆవేశము'తో చరింపుడు. ప్రజల సమస్యలపై దృష్టి సారింపుడు. ప్రజల బాగోగులు చూడుడు! వారి కష్ట నష్టములను ప్రభుత్వ దృష్టికి తెచ్చి వాటిని నివృత్తి చేయు మార్గముల నన్వేషింపుడు. శాసనసభలో మీ స్వంత వాణినికాక, ప్రజావాణిని వినిపింపుడు. ఋజువర్తనులై, కర్తవ్యోన్ముఖులై ప్రవర్తిల్లుడు. ప్రజలు మిమ్ములను ప్రతి క్షణము గమనించు చున్నారని గుర్తెరిగి ప్రవర్తిల్లుడు. మరల 'ఓటు'న కై మావద్దకు రావలెననియు, మేమడుగు ప్రశ్నలకు బదులీయవలెననియు గుర్తెరిగి ప్రవర్తిల్లుడు. లేకున్న ప్రజాస్వామ్య మపహాస్యము పాలగును. ప్రజాస్వామ్యముపై ప్రజల విశ్వాసము సన్నగిల్లును. ప్రజలను తిరుగ ఉద్యమబాట పట్టించును. అట్టి పరిణామములకు పూర్తి బాధ్యత మీదే యగును. తస్మాత్ జాగ్రత్త!

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*

*మరో జంఘాలశాస్త్రి*

అయలసోమయాజుల నాగేశ్వరరావు



# మను ధర్మశాస్త్రము

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

సోదరసోదరీమణులారా! నగరములో ఇటీవల జరిగిన ఓ సమావేశమును గూర్చి ఈ రోజు ముచ్చటించెదను. నగరములో నేదో పని యున్నదని చకాచకా నడచిపోవుచుంటిని. ఇంతలో ప్రక్కన ఉన్న భవంతి నుండి మైకులో ఏదియో సమావేశమును గూర్చిన ప్రకటన వినబడినది. తక్షణమే నేను, చెత్తకుండీ చూచిన మునిసిపాలిటీ ఎద్దువలె, కల్లుపాకను చూచిన తాగుబోతువలె, జూదగృహమును చూచిన జూదరివలె, వేశ్యావాటిక చూచిన విటునివలె, కాఫీ క్లబ్బును చూచిన కాఫీ ప్రియునివలె, ఆగిపోయి విషయ సంగ్రహణార్థినై నెమ్మదిగ ఆ భవన ప్రాంగణమున ప్రవేశించితిని. అదేదో చాలా పురాతన భవనము. 'వెల్ల'కు నోచుకొని కనీసము రెండు దశాబ్దములయిన అయి ఉండునని ఆ వెల వెలబోవు గోడలు తెలుపుచున్నవి. ప్రాంగణము విశాలముగ నున్నను, సభాస్థలి మాత్రము చిన్నగనే యున్నది. అంతరిక్షమున గల పంఖాలు, అక్కడక్కడ తూట్లుపడిన 'కృత్రిమ పైకప్పు', విరిగిన కుర్చీలు, ఊడిన కుషన్లు, పగిలిన కిటికీ అద్దములు, విరిగిన తలుపులు ఆ భవంతి గతవైభవమును చాటుచున్నవి. సమావేశ సమయ మాసన్నమయినను, సమావేశ మింకను ప్రారంభము కాలేదు. అక్కడనున్న కార్యాలయములో నున్న వ్యక్తిని 'కార్యక్రమమేమి?' యని అడిగితిని. అతడు మారు పలుకక, నా చేతిలో ఓ కాగితము నుంచి, తన పనిలో నిమగ్నమయ్యెను. అదేదో 'మనుధర్మశాస్త్ర విరోధసమితి' అను ఓ అభ్యుదయ సంఘ ఆధ్వర్యమున ఉపన్యాస కార్యక్రమము, తదనంతరము 'పుస్తక దహనము' జరుగుననియు, అందరూ ఆ కార్యక్రమమునకు విచ్చేసి జయప్రదము చేయవలెననియు ఆ కరపత్రమున నున్నది.

అయ్యయ్యో! ఇదేమి నాయనలారా! పుస్తకావిష్కరణ సభలను గూర్చివింటిమి. అనేకానేక సభలను కంటిమి సువర్ణమునకు సుగంధమబ్బినట్లు, పుస్తకావిష్కరణమునకు తోడు అంకితమును కూడా జోడించి, కృతికర్త, కృతిభర్త పరస్పర సన్మానములతో, స్తుతులతో కార్యక్రమము లను నిర్వహించుట మనమెరుగుదుము. అటులనే ఏదయిన ఉత్తమ గ్రంథముపై సమీక్షా సమావేశములు నిర్వహించుట కూడా మనకు తెలియును.

సమీక్షకుడు ఆ గ్రంథము నా మూలాగ్రముగ పఠించి, అందలి కథను, ఆ గ్రంథకర్త రచనాశైలిని, శిల్పమును, ఆ గ్రంథ ప్రాశస్త్యమును వివరించు ఉపన్యాసములు చేయుటకద్దు. కాని 'ఈ గ్రంథ దహన కార్యక్రమము'ను గూర్చి ఇంతకుముందు వినియుండలేదు. ఇదియు నొక అభ్యుదయ ప్రక్రియ కాబోలునని నాలో నేననుకొనుచుండగనే సమావేశమారంభమయినది. వేదిక వెనుక భాగమున సంస్థ నామధేయము ఎరుపురంగు బట్టపై తెల్లని అక్షరములలో వ్రాయబడియున్నది. సమావేశకర్త పిలుపు మేరకు, ముగ్గురుపన్యాసకులు ఒకరి తరువాత ఒకరుగా వేదిక నలంకరించిరి. సభాస్థలిలో వెలుతురంతంత మాత్రముగ కలదు. ప్రేక్షకులు కూడా అటులే యున్నారు. శ్రోతలు కూర్చున్న కుర్చీలకంటె, ఖాళీ కుర్చీలే అధికముగ నున్నవి. ఆ ఉపన్యాసకులను ఆ సంస్థ అధ్యక్షుడు సంప్రదాయమునకు భిన్నముగ, ఒక వినూత్న రీతిలో, పూలదండలకు బదులుగ కూరగాయల దండలనో, చెప్పుల దండలనో మెడలో వేసి సత్కరించును గాబోలునని నాలో నేననుకొంటిని. కాని అతడు వారలను పుష్పగుచ్ఛముల నందించి సాదరముగ స్వాగతము పలికెను.

అనంతరము సభాధ్యక్షుడు ముఖ్యఅతిథులను సభకు పరిచయము చేసి సభా కార్యక్రమము నారంభించెను. వక్తలందరునూ ఒకరి తరువాత మరొకరు లేచి; ప్రస్తుతము కేంద్రములో అధికారములోనున్న పార్టీ – దేశ మీ నాడు ఎదుర్కొను సర్వ సమస్యలకూ గతములో ఈ దేశమును పాలించిన ప్రతిపక్ష పార్టీ సిద్ధాంతములే కారణమని పలికినట్లు, ఇప్పటి మన రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర సర్వ బుగ్మతలకు, నాలుగు సంవత్సరముల క్రిత మీరాష్ట్రమును పాలించిన ముఖ్యమంత్రియే కారణమని నమ్మబలికినట్లు, దేశములో పేట్రేగుచున్న ఉగ్రవాదమునకు విదేశీహస్తమే కారణమని కేంద్ర గృహశాఖామాత్యుడు పలికినట్లు, పెరుగుచున్న ఇంధన ధరలకు, అంతర్జాతీయ మార్కెట్టులో పెరుగుచున్న ముడిచమురు ధరలే కారణమని కేంద్ర పెట్రోలియం శాఖా మాత్యుడు సెలవిచ్చినట్లు, పెరుగుచున్న ద్రవ్యోల్బణమునకు అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలే కారణమని కేంద్ర ఆర్థిక శాఖామాత్యుడు ప్రవచించినట్లు, ప్రపంచ ఆహార కొరతకు భారత్, చైనా దేశములలోని మధ్యతరగతి మానవుడే కారణమని అమెరికా అధ్యక్షుడు ఆక్రోశించినట్లు, ప్రస్తుత సమాజములోని సర్వ బుగ్మతలకు 'మనుధర్మశాస్త్ర'మే కారణమనియు, అదియున్నంతకాల మీ దేశమున ఈ వర్ణవ్యవస్థ, అగ్రకులాధిపత్యము, కులవివక్షత, అంటరానితనము వంటి బుగ్మతలు రూపుమాయవనియు, అందులకు దానిని తగులబెట్టుటే ఏకైక మార్గమనియు నొక్కి వక్కాణించిరి. అటు తరువాత 'మనుధర్మశాస్త్రము' ను వారు వేదికపై తగులబెట్ట

యత్నము చేయుచుంటిరి. ఇంతలో నేను చివాలున లేచి, వేదికను సమీపించి, సభాధ్యక్షునితో నేనును నాలుగు మాటలు మాట్లాడెదనని అనుమతి కోరి, అధ్యక్షుని అనుమతితో ఇట్లు ప్రసంగించితిని:

హరహరా! మహాదేవా! నాయనలారా! ఇది భారతదేశమేనా? మీరు భారతీయులేనా? నేనింత వరకు విన్నది నిజమేనా? కలకాదు కదా! కాదు నాయనలారా! నిజముగ వింటిని! మనసు డిల్లపడగ, కనులు చెమ్మగిల్లగ, శరీరము రిత్తపోవగ వింటిని! మన ఉపన్యాస శిఖామణి ఏమని సెలవిచ్చినారు? ఈ సమాజములోని సర్వబుగ్మతలకు కారణము మనుధర్మశాస్త్రమనియా? దానిని తగులబెట్టినగాని ఈ సమాజము బాగుపడదనియా? బృహస్పతీ ఎన్నడో కొన్నివేల ఏండ్ల క్రితము, ఆనాటి సమాజమున కనువుగ, ప్రజలు పెడద్రోవ పట్టక ధర్మమార్గమున నడిపించు టకై వర్ణాశ్రమ ధర్మముల నేర్పాటుచేసి, ఇది ధర్మమనియు, ఇది అధర్మమనియు, ఇది సత్యమనియు, ఇది అసత్యమనియు, ఇది నీతి అనియు, ఇది అవినీతి అనియు, ఇది న్యాయమనియు, ఇది అన్యాయమనియు, ఇది సత్ప్రవర్తనమనియు, ఇది దుష్ప్రవర్తనమనియు, ఇది సదాచారమనియు, ఇది దురాచారమనియు వివరించి, విచక్షణాజ్ఞానము కలిగించి ప్రజలను సత్ప్రవర్తనులుగ నుండునట్లు చేసిన, 'మనుధర్మశాస్త్రము', మానవాళి ఏరకముగ మెలగవలయునో ప్రపంచమునకు తొలిసారిగ తెలియచేసిన 'మనుధర్మశాస్త్రము', ఆ కోవకు చెందిన గ్రంథములలో ఆద్యము, పూజ్యము అయిన 'మనుధర్మశాస్త్రము, నీకు పనికిమాలిన గ్రంధమయినదా? మనలో 'మనుధర్మశాస్త్రము'ను సమగ్రముగ, సొంతముగ చదివిన వారెందరు? చదివి అర్ధముచేసికొనిన వారెందరు? అది మౌఖికముగ మన పూర్వులు మన కందించిన వారసత్వ సంపద. అది మనరక్తములో రక్తమై, చర్మములో చర్మమై, మాంసములో మాంసమై, హృదయ స్పందనయై, ఊపిరిలో ఊపిరియై ఈ దేశమున 'క్యారు' మన్నది మొదలు 'హరీ' అన్నంత వరకు మన జీవితములను అనుక్షణము ప్రభావితము చేసి నడిపించెడి దివ్యశక్తి.

'చాతుర్వర్ణ్యం మయా సృష్టం, గుణకర్మ విభాగశః' అని భగవంతుడు భగవద్గీతలో స్వయముగ చెప్పినాడు కదా! మరి ఈ 'పంచమ వర్ణ' సృష్టికర్త ఎవరు? మనము కాదా? అటులనే దేశములోని ఈ వందలాది కులములకు, ఉపకులములకు సృష్టికర్తలము మనము కాదా? మరి ఈ వ్యవస్థను మనము సృష్టించుకొని అందులకై వేరొకరిని నిందించుట న్యాయమా? అడవి పందులు చేను మేసిన ఊరుపందుల చెవులు కోయుట ధర్మమా? నాయనలారా! అదియును కాక 'మనుధర్మశాస్త్రము'లో తెలుపబడిన వర్ణవ్యవస్థకూ,

నేటి 'కుల' వ్యవస్థకూ చాలా అంతరమున్నది. వర్ణాశ్రమవ్యవస్థ 'మను' సంప్రదాయము, కులవ్యవస్థ 'మన' సంప్రదాయము. కుల వ్యవస్థ మన సృష్టి దానిని మన స్వార్థము కొరకు పెంచి పోషించుచున్నాము. కులముల నాధారముగ చేసికొని రాజకీయ పక్షముల నేర్పాటు చేసికొనుచున్నాము. ఓట్లు వేయుచున్నాము. రాజకీయములు నడుపు చున్నాము. కుల సంఘముల నేర్పాటు చేసికొనుచున్నాము. మా కులము వెనకబడినదంటే మాకులము వెనుకబడినదని, వెనుకబాటు తనమునకై పోటీపడు చున్నాము. రిజర్వేషన్లకై ఆరాటపడుచున్నాము. ఒక కులములోనే గల ఉపకులముల వర్గీకరణమునకై నిరాహారదీక్షలు చేయుచున్నాము. నిరసన వ్రతములు పూనుచున్నాము. కొన్ని అగ్రకులముల వారు కూడ తమలో ఆర్థికముగ వెనుకబడిన వర్గమునకు రిజర్వేషన్ల కల్పనకై ఆందోళనలను చేయుచున్నారు. రిజర్వేషన్లకై అఱ్ఱులు చాచుచున్నారు. ఇట్లు ఎవరు వెనుకబడినారో, ఎవరు ముందుబడినారో, ఎవరి వెనుక ఎవరు బడినారో, ఎవరి ముందెవరు బడినారో తెలియని స్థితిలో భూమి చుట్టూ పరిభ్రమించు చంద్రునివలె, సూర్యునిచుట్టూ పరిభ్రమించి భూగోళమువలె, అమెరికా దేశము చుట్టూ పరిభ్రమించెడి ప్రపంచదేశములవలె, ధనము చుట్టూ పరిశ్రమించెడు విశ్వమువలె, మనము రిజర్వేషన్లకై ప్రభుత్వము చుట్టూ పరిభ్రమించెడి ఉపగ్రహముల మైనాము.

సోదరులారా! సందర్భోచితమయిన ఓ చిన్న కథను చెప్పెదను వినుడు. పూర్వము 'టర్కీ' దేశమందు ఒక ప్రభువుండెను. అతడు పరమ ఛాందసవాది. అతడొకనాడు రాజగ్రంథాలయమును సందర్శించి అచటి గ్రంథాలయాధికారిని అచటగల గ్రంథములను గూర్చి ప్రశ్నించెను. అతడా రాజునకు అచటగల వివిధ మత, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక, భాషా, వైజ్ఞానిక విషయములపై గల పలుగ్రంథములను చూపి పరిచయము చేసెను. అంతనా ప్రభువు ఆ గ్రంథాలయము లోని ఓ పుస్తకమును తీసి, "ఇందులో 'ఖురాన్'లో చెప్పబడిన విషయములున్నవా?" అని ప్రశ్నించెను. అంత నాఅధికారి ఆ పుస్తకమును పరికించి 'లేవు' అని బదులు పల్కెను. అంత నాప్రభువు ఖురాన్‌లో లేని విషయములు గల గ్రంథమేదియు నుండరాదు. హాటిని తగుల బెట్టింపుడని ఆజ్ఞాపించినాడు. అటులనే వేరొక గ్రంథము తీసి "ఇందులో ఖురాన్‌లో చెప్పబడిన విషయములున్నవా?" అని ప్రశ్నించెను. దానికా అధికారి తడబడుచు 'ఉన్నవ'ని సమాధానమిచ్చెను. ఖురాన్‌లో ఉండగ, అందులో నున్న విషయములను చెప్పుటకు వేరొక గ్రంథమేల? దీనిని కూడా తగుల బెట్టింపుడని ఆదేశించి, అట్టి పుస్తకముల నన్నింటినీ తన వేడినీళ్ళ పొయ్యిలో వేసి కాల్చి ఆ

వేడినీటితో అతడు స్నానమాచరించినాడు. ఇట్లు చివరికా గ్రంథాలయమున ఒక్క 'ఖురాన్' మాత్రమే మిగిలినది.

నాయనలారా! అరచేతి నడ్డుపెట్టి సూర్యకాంతి నాపగలరా! మనుధర్మ శాస్త్రమును తగుల బెట్టి 'మను' సంప్రదాయముల నాపగలరా? అదియునుగాక ఇట్లెవరికి గిట్టని పుస్తకములను వారు తగులబెట్టుట కారంభించిన, ఈ దేశములోని అపార గ్రంథ సంపద నాశనమైపోదా? విలువయిన సాహిత్యము అంతరించిపోదా? వేదవాఙ్మయము బూడిదైపోదా? నా గ్రంథాలయమున 'కాళిదాసు' ప్రక్కన 'కారల్ మార్క్స్'కు స్థానమున్నదే! 'మహాభారతము' ప్రక్కన 'మహాప్రస్థానము'నకు స్థానమున్నదే! 'శ్రీమద్భాగవతము' ప్రక్కన 'శివపురాణము'న్నదే! 'భగవద్గీత' చెంత 'బైబిలు'కు చోటున్నదే! 'విశ్వనాథ' ప్రక్కన 'శ్రీశ్రీ'కి స్థానము కలదే! 'రామాయణ కల్పవృక్షము' ప్రక్కన 'రామాయణ విషవృక్షము'నకు చోటు కలదే! మరి అట్టి సంయమనమును మీరేల పాటించరు? అట్టి సమతాభావమును మీరేల అలవరచుకొనరు?

కొన వెఱ్ఱులకుపోయి అమూల్యమయిన గ్రంథములు తగుల బెట్టకుడు. విలువయిన గ్రంథములను బూడిదపాలు చేయకుడు. మీ చేతులు కాల్చుకొనకుడు. ప్రతి గ్రంథమునందును మంచి చెడులుండుట సహజము కదా! మంచిని స్వీకరింపుడు. చెడును విసర్జింపుడు! రావణుడు లేని రామాయణము రక్తికట్టునా? కర్ణుడులేని భారతముండునా? కంసుడులేని భాగవతమూ! ఇప్పటికయినను ఈ ఒంటికంటి చూపును, ఈ రంగుటద్దముల వీక్షణమును, ఈ'ఎఱుపు కామెర్ల' బుగ్మతను వీడుడు. భారతీయ సమాజము తెలుపు రంగువంటిది. అందు ఇంద్రధనుస్సులోని సప్త వర్ణములు నిబిడీకృతమయి ఉన్నవను సత్యమును గ్రహించి ప్రవర్తిలుడు. ఇట్లు మమ్మవమాన పరచి, మా మనోభావములు దెబ్బ తీయకుడు. ఇప్పటికే చాల చెప్పితిని. సెలవ్ – అని వేదిక దిగితిని. వెనుక నుండి 'ఏరో గెంట్ ఫెలో' 'కంట్రీబ్రూట్' 'బూర్జువా', 'ఇల్లిటరేట్ రాస్కెల్' వంటి మాటలు వినబడినవి. వేదికపైన గల వక్తలు తమలో తాము ఏదో మాట్లాడుకొనిరి. సంస్థ అధ్యక్షునితో కూడా మాట్లాడిరి. చివరకు 'గ్రంథాహుతి' కార్యక్రమము రద్దయినది. సమావేశమంతటితో ముగిసినది. నేను నెమ్మదిగా ఇంటి దారిపట్టితిని.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# మాతృ (మృత) భాష

*అంతకు ముందేమి ప్రసంగించెనో కాని, నేను సభా భవనము ప్రవేశించు సరికి, జంఘాలశాస్త్రి ఇట్లుద్వేగముగ ప్రసంగించుచుండెను:*

అయ్యో! మీరు దీనిని వినలేదా? వినినను పట్టించుకొనలేదా? మరి విన్న మీ కన్నులేల చెమర్చకున్నవి? గొంతేల గద్గదము కాకనున్నది? శరీరమేల కంపింప కున్నది? మనసేల కలత చెందకుండనున్నది? మాటేల తడబడకున్నది? రక్తమేల పొంగకున్నది? హృదయమేల ద్రవింపకున్నది? బుద్ధియేల వివశతనొందకున్నది? దేశ స్వాతంత్ర్య సముపార్జనకై మహాత్మునితో కలిసి, సత్యాహింసలతో పోరాడిన జాతియే! కందుకూరి, గురజాడ వంటి సంఘ సంస్కర్తలను కన్న జాతియే! నన్నయ్య, తిక్కన, పోతన, శ్రీనాధుడు వంటి మహాకవులను కన్నజాతియే! ఈ దేశమునకు జాతీయ జెండాను సమకూర్చిన జాతియే! దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి రాజకీయ ధురంధరులను కన్నజాతియే! అల్లూరి సీతారామరాజు వంటి విప్లవవీరులను కన్నమాతయే! రాజరాజ నరేంద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు, కాకతి గణపతిదేవుడు వంటి ఉత్తమవంశ సంజాతు లయిన పాలకులను కన్న జాతియే! రాణీ మల్లమ దేవి, రాణీ రుద్రమదేవి, మాంచాల వంటి వీరవనితలను కన్నజాతియే! స్వాతంత్ర్య సముపార్జనానంతరము ప్రప్రథమముగ భాషాప్రయుక్త రాష్ట్రమున కుద్యమించిన జాతియే! అందులకై ప్రాణత్యాగము చేసిన జాతియే! గిడుగు రామ్మూర్తి పంతులుగారి వంటి భాషా సంస్కరణోద్యమ కారులను కన్న జాతియే! అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్యవంటి వాగ్గేయకారులను అందించిన జాతియే! అట్టి తేజోవంతమయిన, వీర్యవంతమయిన, మహోత్కృష్ఠ మయిన తెలుగుజాతి ఎంత నిస్తేజమయిపోయినది? ఎంత నిర్వీర్యమయి పోయినది? ఎంతబలహీనమయిపోయినది? ఎంత బాధ్యతా రాహిత్యయై ప్రవర్తిల్లు చున్నది. ఎంతటి సంస్కార విహీనమై వర్తిల్లుచున్నది. ఎంత నిర్లిప్తమయిపోయినది.

'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' గా గుర్తింపు పొంది, 'దేశభాషలందు తెలుగులెస్స' అని శ్రీకృష్ణదేవరాయలంతటి వానిచే కొనియాడబడి, శంకరంబాడి సుందరాచార్యు లందించిన అందమయిన 'మల్లెపూదండ'ను ధరించి, దాదాపు రెండువేల యేండ్ల చరిత్ర కలిగి, నన్నయ నుండి నారాయణరెడ్డి వరకు వేలాది కవులచే కావ్య

పరిమళములను వెలయింపచేసి, దేశములో హిందీ తరువాత రెండవ స్థానములో నుండి, ప్రపంచవ్యాప్తముగ పదహారు కోట్ల మంది తెలుగువారికి మాతృభాషయై, ఏబదియారక్షరముల సమాహారమై వెలుగొంది, తేనె లొలికెడి మన తెలుగు భాష రానున్న ముప్పది సంవత్సరములలో 'మృతభాష' కానున్నదని 'యునెస్కో' వారి మృత్యుఘంటికలు మీ చెవిసోకలేదా? మరి విని విననట్లు, చూచి చూడనట్లు, ఎరిగి ఎరుగనట్లు, ఈ నిర్లక్ష్యభావమేమి? ఈ అనాసక్తత ఏమి? ఈ నిస్సహాయత ఏమి? ఈ అలసత్వమేమి? ఈ అంటరానితనమేమి?

ఈ జాతి గౌరవమును కాపాడవలసిన ప్రభుత్వము, మనభాషను పరిరక్షింప వలసిన మన రాష్ట్ర ప్రభుత్వము, నిమ్మకు నీరెత్తి నట్లు మెదలక యున్నది. సారా కాంట్రాక్టుల వేలములో తీరిక లేక యున్నది. ప్రభుత్వభూముల వేలములో మగ్నమైయున్నది. ప్రభుత్వము నియమించిన 'అధికార భాషాసంఘము' తన కార్యక్రమమును 'రిపోర్టు'లను తయారుచేసి ప్రభుత్వమున కందించుటకే పరిమితము చేసినది. తెలుగు భాష, సాహితీ, సంస్కృతులను, కళలను పరిపోషించుటకై వెలసిన 'పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం' తన విద్యార్థులకు 'డిగ్రీ'లను ప్రదానము చేసి చేతులు దులుపుకొనుచున్నది. రాష్ట్ర వ్యాప్తముగా గల వేలాది సాహితీ, సాంస్కృతిక సంస్థలు స్వీయ కవితా పఠనములతో, స్వీయగ్రంధావిష్కరణములతో, ఎడనెడ సన్మాన కార్యక్రమములతో గుడుగుడు గుంజములాడుచున్నవి.

ఇక రాష్ట్రప్రజలా! ఈనాడున్న దౌర్భాగ్యస్థితిలో మున్నెన్నడులేరు! విదేశీ వేష, భాష, సంస్కృతులకు బానిసలైనారు! కడుపులో 'బిడ్డ' పడగనే కాన్వెంటు స్కూలులో సీటు రిజిస్ట్రేషనుకై పరుగులిడుచున్నారు. అమ్మా, నాన్నా యని పిలిపించుకొనుటకు బదులుగ, తమ బిడ్డలచేత 'మమ్మీ' 'డాడీ' అని పిలిపించుకొని మురిసిపోవుచున్నారు. 'చేతవెన్నముద్ద, చెంగల్వపూదండ' అనియో, 'తారంగం తారంగం, తాండవకృష్ణ తారంగం' అనియో, 'చందమామ రావె! జాబిల్లిరావె!' అనియో ముద్దుముద్దుగా వారిచే తేనెలొలుకు తెలుగు పద్యములను, పాటలను పలికించుటకు బదులుగ 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్! హౌ ఐ వండర్ వాట్ యు ఆర్' అనియో, 'బా! బా! బ్లాక్ షీప్, హేవ్వ్య ఎనీ వూల్! యస్సార్, యస్సార్, త్రీ బ్యాగ్స్‌ఫుల్' అనియో, 'జానీ! జానీ! వాట్ పాపా, ఈటింగ్ షుగర్, నో పాపా' అనియో చెప్పించి, విని ముసిముసి నవ్వులు నవ్వుకొనుచున్నారు. మురిసిపోవుచున్నారు. వారిని వేలకు వేలు ఫీజులు కట్టి, డొనేషన్ల నందజేసి ఆంగ్లేయ మాధ్యమ పాఠశాలలో చేర్పించుచున్నారు. బస్తాడు పుస్తకముల బరువు మోయలేక వారేడ్చుచుండ, తలకుమించిన ఫీజుల భారమును మోయలేక

వీరేడ్చుచున్నారు. తలకుమించిన పార్యప్రణాళికలతో వారు సతమత మగుచుండ, వారికిచ్చిన 'ఇంటిపని' చేయలేక వీరు సతమతమగుచున్నారు. అశాస్త్రీయమయిన పరీక్షా విధానముతో వారిబ్బందిపడుచుండ, వారికిచ్చిన 'ప్రోజక్టు వర్కు' చేయలేక వీరిబ్బందిపడుచున్నారు. ఆరవ తరగతి నుండి ఐ.ఐ.టి. కోచింగులకై 'రామయ్యా ఇనిస్టిట్యూట్' లోనో, 'కృష్ణమూర్తి ఇన్‌స్టిట్యూట్'లోనో చేర్పించుచున్నారు. పిల్లవాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరయి, అమెరికావెళ్ళి డాలర్లను సంపాదించి, మమ్ములను సుఖపెట్టునని మురిసిపోవుచున్నారు. ఈ ఆంగ్ల భాషావ్యామోహములో మీరు వారిని మన భాషా, సాహిత్య, సంస్కృతులనుండి దూరము చేయుచున్నారమను సంగతిని మరచుచున్నారు.

అయ్యయ్యో! నాయనలారా! ఆంధ్రులకెంత ప్రీతి పాత్రమయినను, 'అన్న ప్రాశనము' నాడు ఆవకాయను పిల్లలకు పెట్టెదమా? గోంగూర పచ్చడితో గోరుముద్దలు తినిపింతుమా? చంటి పిల్లవానికి మాతృస్తన్యమునకు మించిన బలవర్ధకాహారము వేరొకటి కలదా? అటులనే మాతృభాషకు మించిన మాధ్యమము కలదా? మాతృభాషలో అర్థమయినంత తేలికగా విషయము పరభాషలో అర్థమగునా? అందునా, ముఖ్యముగ పదవ తరగతి వరకూగల విద్యార్థులకు 'భాషా పరిజ్ఞానము' కంటె అధికముగ 'విషయ పరిజ్ఞాన'మవసరము కదా! మరట్టి విషయ పరిజ్ఞానమును పెంపొందించుటకు మాతృభాషా మాధ్యమమునకు మించిన సాధనమేమున్నది? మనమందరము కనీసము పదవ తరగతి వరకయిన మాతృభాషా మాధ్యమమున చదివినవారమే కదా! మనమేమి చెడిపోయితిమా? ఉన్నతవిద్యల నాంగ్లములో నభ్యసించలేదా? వృత్తి ఉద్యోగములు చేయలేదా? వాటిలో రాణించలేదా?

ఇట్లు అటు ప్రభుత్వముచే, ఇటు ప్రజలచే తిరస్కరించబడిన భాష 'మృతభాష' కాక మరేమగును. కర్ణుని వధకు బ్రాహ్మణకోపము, పరశురాముని శాపము, ఇంద్రుడి మోసము, కుంతీదేవి వరము, భీష్ముడు చేసిన అగౌరవము, శల్యుని అనుచిత సంభాషణము, శ్రీకృష్ణుని సంకల్పము, అర్జునుని బాణము కారణమయినట్లు మన 'మాతృభాష' 'మృతభాష'గా మారుటకు మన మందరము ఏదో ఒక విధముగా బాధ్యులమే! మన పొరుగున నున్న తమిళ సోదరులను చూడుడు. తమిళము ప్రాచీన భాషగా గుర్తింపు పొందినది. ఆ రాష్ట్రములో పరిపాలనంతయు ఆ ప్రాంతీయ భాషలో జరుగుచున్నది. ఇరుగుననున్న బెంగాలీ, గుజరాతీ సోదరులను చూడుడు. వారు తమ తమ భాషలను పరిపాలనా యోగ్యముగ తీర్చిదిద్దుకొని, ఆయా ప్రాంతీయ భాషలలో పరిపాలనము చేయుచున్నారు. తమ మాతృభాషను పరిరక్షించుకొను

చున్నారు. ఇద్దరు తమిళ సోదరులు కలిసిన, వారు తమ మాతృభాషలో సంభాషించు కొందురు. అదే ఇద్దరు తెలుగువారు కలుసుకొన్న, వారాంగ్లములో సంభాషించు కొందురు. ఇది నాయనలారా! మన మాతృభాషాభి మానము.

వెయ్యేళ్ళపైబడిన సాహిత్య చరిత్ర కలిగిన భాషయే! నన్నయచే ఆవిష్కరింప బడి, చిన్నయచే పరిష్కరింపబడి వెలుగొందిన భాషయే! భారత, భాగవత, రామాయణాది ఇతిహాసములు వెలసిన భాషయే! అష్టాదశపురాణములు, అనేకానేక ప్రబంధములు, పద్యనాటకములు, గద్యనాటకములు, నాటికలు, నవలలు, నవలికలు, కధలు, కధానికలు, శతకములు, కవితలు, విమర్శక గ్రంథములు, వ్యాససంపుటములు, అవధానములు, ఇట్లు అనేకానేక ప్రక్రియలతో ప్రవర్ధిల్లిన భాషయే! ప్రజలను చైతన్యవంతము చేసిన భాషయే! జాతిని జాగృతము చేసిన భాషయే! అట్టి మన మాతృభాష, 'మృతభాష' కానున్నదని తెలిసి కూడా స్పందించని ఈ జాతి 'మృతజాతి' అనుట కేమయిన సందేహమా?

"ఎప్పుడో ముప్పది ఏళ్ళనాడు ఈ భాషకి ముప్పు వచ్చునని ఇప్పటి నుంచెందుల కయ్యా చింత?" అని సభలోనుండి ఒకని కేక. ఆహా! నాయనా! నీవు పండిత పుత్రుడివలె నున్నావు. రోగలక్షణములు కనిపించిన వెంటనే మందు వేయనక్కరలేదా? నదిలో దూకిన వెంటనే ఈత కొట్టనవసరములేదా? అగ్ని రగిలిన వెంటనే ఆర్పనవసరము లేదా? విమానమునుండి దూకిన వెంటనే 'పేరాచ్యూట్'ను తెరవనవసరము లేదా? ప్రమాదము జరుగకముందే కారుకు బ్రేకు వేయనవసరము లేదా? పిల్లవాడు చెడిపోకముందే వానినదుపులో పెట్టనవసరము లేదా? నాయనలారా! పిల్లవానికి జ్వరము వచ్చిన వెంటనే వైద్యుని సంప్రదించి మందులు వాడుదుము కదా! భార్యకు జబ్బు చేసిన నాసుపత్రిలో చేర్పించి వైద్యము చేయింతుము కదా! మరి మన 'మాతృభాషా మూర్తి' ఇట్లుమంచముపట్టి, సంకట స్థితిలో నుండ, జ్యోతిష్కుడింకను ముప్పదేండ్ల ఆయువున్నదని పలికినాడనియు, ఆమె కేమియు ఢోకాలేదనియు, ఊరకుందుమా? లేక వెంటనే చికిత్స ప్రారంభింతుమా?

సోదర సోదరీమణులారా! నేనాంగ్ల భాషావ్యతిరేకిని కాను. ఆంగ్లము చదువు కొనవలసినదే! కాని అందులకు మాతృభాషను పరిత్యజింపనవసరము లేదు. మీ పిల్లల నాంగ్లమాధ్యమములో పెద్ద పెద్ద చదువులు చదివింపుడు. మంచి మంచి ఉద్యోగములు చేయింపుడు. కాని కనీసము రెండవ భాషగానయిన 'తెలుగు'ను ప్రోత్సహించుడు.

- భాష బ్రతికెడిది కవుల గ్రంథములలో కాదు సోదరులారా! ప్రజల నాల్కలపై. అందుకని మీ ఇంటిలో మీ పిల్లలతో మాట్లాడునపుడు వీలయినంత వరకు తెలుగులో మాట్లాడుడు.
- మీ పిల్లలచే 'మమ్మీ', 'డాడీ'లకు బదులుగా 'అమ్మ', 'నాన్న' అని పిలిపించుకొనుడు.
- కనీసము వారమున కొకమారయిన తెలుగు దినపత్రికనో, వారపత్రికనో తెప్పించుకొని చదువుడు. మీ పిల్లలచే చదివింపుడు.
- మీ పిల్లలతోను, బంధువులతోను ఉత్తర ప్రత్యుత్తరములు జరుపవలసి వచ్చిన యెడల అట్టి ఉత్తర ప్రత్యుత్తరములను తెలుగులోనే జరుపుడు.
- వారికి 'వేమన శతకము', సుమతీశతకము, 'భర్తృహరి సుభాషితములు' వంటి గ్రంథములనుండి కొన్ని పద్యములయిన కంఠస్థము చేయింపుడు.
- ఐదేండ్లలోపు చిన్న పిల్లలకు తెలుగు పద్యములు, పాటలు, తిథి, వార, నక్షత్రముల పేర్లు నేర్పించుడు. వారికి భారత, భాగవత, రామాయణాది కథలు చెప్పుడు. ఒక విషయము గుర్తుంచుకొనుడు. మీ బిడ్డలెట్లుండవలెనని మీరనుకొను చున్నారో, మీరు కూడా అట్లే ఉండవలయును. ఏలయనగా తల్లిదండ్రుల ప్రభావము పిల్లలపై అధికముగ నుండును.
- వివాహాది శుభకార్యములలో బహుమతులుగ మంచి తెలుగు పుస్తకముల నందజేయుడు.
- రోజులో కనీసమొక అర్ధగంటయిన మీకు నచ్చిన, మిమ్ములను ప్రభావితము చేసిన తెలుగు పుస్తకములను చదువుడు.

మన భాషను, మన సాహిత్యమును, మన సంస్కృతీ సంప్రదాయములను, మన జాతిని పరిరక్షించుకొనుడు. మన పూర్వులు మనకందించిన వారసత్వ సంపదను మన తరువాతి తరములవారికందించు గురుతర బాధ్యత మనపై నున్నది. వారందించిన ఈ అమూల్య సంపదను, భావితరముల కందచేయుటకు మాతృభాషా పరిరక్షణమెంతయిన ఆవశ్యకము. లేని యెడల మన భవిష్యత్తరముల వారు కర్తవ్యతా విముఖులమని మనలను నిందింతురు. తస్మాత్ జాగ్రత్త!

***ఓం శాంతిశ్శాంతి శ్శాంతిః.***



# ప్రభుత్వరంగ సంస్థలు

సోదరసోదరీమణులారా! నేడు జంఘాలశాస్త్రి తాను జలుబు, జ్వరము, గొంతునొప్పిచే బాధపడుచున్నాననియు, ఆ కారణముగ తాను సమావేశమునకు రాలేకపోవుచున్నాననియు, ఉపశమనము కలిగిన యెడల తదుపరి వారము సమావేశమునకు తప్పక వచ్చి ఉపన్యసింతుననియు, కలిగిన అసౌకర్యమునకు మన్నింపుడనియు నాకు లేఖ వ్రాసి పంపినాడు. ఈ దినమున ఉపన్యాసమేదియును లేదనుకొనుచుండ, సాక్షి సంఘాభిమాని యొకడు వ్రాసిన ఈ లేఖ అందినది. విషయ వైవిధ్యమును దృష్టిలో నిడుకొని చదువుచున్నాను. వినుడు:

'సాక్షి'కి,

కుక్కుటేశ్వరరావు నమస్కరించి వ్రాయునది. అయ్యా! మీ 'సాక్షి' సంఘాభిమానులలో నేనొకడను. వారము వారము వచ్చు మీ 'సాక్షి' ఉపన్యాసములను చదివి ఆనందించు వేలాది పాఠకులలో నేనొకడను. నేను వృత్తిరీత్యా ఒక ఛార్టర్డ్ అకౌంటెంట్‌ను (దీనిని తెలుగులో ఏమని వ్రాయవలయునో నాకు తెలియదు). ఛార్టర్డ్ అకౌంటెంటు వయిన ప్రజలకు దొంగ లెక్కలు వ్రాయుట, పన్నుల ఎగవేత మార్గములపై అధ్యయనము చేయుట వంటి పనులు చేయక మా 'సాక్షి' సంఘముతో నీకేమి పని? అని మీరడుగవచ్చును. నేను అనేకానేక ప్రభుత్వరంగ సంస్థలను 'ఆడిట్' చేసితిని. అందులో నేను చూచిన వింతలను మీ దృష్టికి తెచ్చుటకై ఈ లేఖను వ్రాయుచుంటిని. నాకు తెలుగు భాషపై అభిమానమే కాని అభినివేశము లేదు. భాషా పరిజ్ఞానము తక్కువ. ఆలోచనలు పరుగెత్తును గాని కలము కదలదు. మీ జంఘాలశాస్త్రి వలె సుదీర్ఘ సమాసములతో, అంత్యప్రాసలతో, శరాఘాతము వంటి పదబంధములతో, గ్రుక్కతిప్పుకొనకుండ, అనర్గళముగ ఉపన్యాసము చేయు సామర్థ్యము కలవాడను కాను. కాని ఎల్లప్పుడును 'జంఘాలశాస్త్రి' మట్టుకు ఎట్లుపన్యసించ గలడు? అణువు నుండి అణు ఒప్పందము వరకు, ఆవకాయనుండి అంతరిక్షము వరకు, పల్లెనుండి, 'ప్రపంచీకరణము' వరకు, ధనమునుండి ద్రవ్యోల్బణము వరకు, వాణిజ్యమునుండి 'వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్' వరకు, వ్యవసాయమునుండి ప్రపంచ ఆహార భద్రతవరకు, కాశ్మీరు సమస్యనుండి 'ఐక్యరాజ్య సమితి' వరకు, 'నక్సలిజం' నుండి 'అంతర్జాతీయ

టెర్రరిజం' వరకు అనేకానేక సామాజిక విషయములపై విశ్లేషణ చేయవలసి యున్నది. వివరింపవలసి యున్నది. ప్రజలను వివేకవంతులను చేయ వలసి యున్నది. ఇంతటి వైవిధ్యముగల విషయములను వివరించుటకు మనకొక్క 'జంఘాలశాస్త్రి' చాలడు. అందుకని, అట్టి నూతన సామాజిక సమస్యలను గూర్చి ఉపన్యసించుటకు మీ 'సాక్షి సంఘము'నకు మీరు ఆయా రంగములలోని నిష్ణాతులను పిలిపించి, ఉపన్యాసముల నేర్పాటు చేసిన బాగుండును.

ఉపోద్ఘాతముతోనే పుణ్యకాలము గడిచిపోవునట్లున్నదని మీరనుకొన వలదు. నా మదిలో మెదిలిన భావములను మీముందుంచుచున్నాను. తదుపరి నిర్ణయము మీది. ఇక అసలు విషయమునకు వత్తును. మిత్రులారా! భారతదేశమున వింతలలో వింత, ప్రపంచములోని ఎనిమిదవ వింత ఈ ప్రభుత్వరంగ సంస్థలు. ఇవి నరసింహావతారములు. అర్ధనారీశ్వరతత్వములు. అధిక పెట్టుబడి అవసరమగు భారీ పరిశ్రమలు, కీలకమయిన రక్షణ ఉత్పత్తి రంగములు, ప్రజోపయోగకరమైన విద్యుత్తు, ఇంధనము, ఉక్కు సిమెంటు వంటి ఉత్పాదక రంగములు; విమానాశ్రయములు, నౌకాశ్రయములు, నౌకానిర్మాణకేంద్రములు, జాతీయ రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనా రంగములు కొద్దిమంది ప్రైవేటు వ్యక్తుల యాజమాన్యములో నుండుట దేశహితము కాదని యోచించి, మన ప్రథమ ప్రధాని, 'నవభారత నిర్మాణ శిల్పి' అయిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారు ఈ ప్రభుత్వరంగ సంస్థల వ్యవస్థకు శ్రీకారము చుట్టిరి.

ఆశయ ముత్తమమైనదే! ఆరంభముకూడా ఆర్భాటముగనే జరిగినది. కాని ఆచరణలోనే అలసత్వము, అనాసక్తత, అవినీతి, అసమర్ధత, నజవాబుదారీ, అపార దర్శకత చోటు చేసుకొని, 'అయ్యవార్లను చేయంగ తా కోతియయ్యె' అన్న చందాన 'పరుగెత్తు గుఱ్ఱము'లను చేయబోవగ, అవి తిని కూర్చొను 'ఐరావతములు' అయినవి. ప్రభుత్వము వేలకోట్ల రూపాయలు వెచ్చించి స్థాపించిన ఈ సంస్థలు, లాభముల మాటటుంచి, నష్టముల ఊబిలో కూరుకొనిపోయినవి. ప్రభుత్వరంగములోని నిబద్ధత, అనుశాసనము, ప్రైవేటు రంగము యొక్క సమర్ధత, జాగరూకత కలసి ఒక చక్కని నూతన వ్యవస్థ ఆవిర్భవించగలదని ఆశించిన ఆశలన్నియు అడియాస లైనవి. ప్రభుత్వరంగ అసమర్ధత, ప్రైవేటు రంగ క్రమశిక్షణారాహిత్యము కలసి రాకాసి బిడ్డకు జన్మనిచ్చినవి. అదియే మన 'పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్'.

ఈ సందర్భముగా నాకొక చిన్న కథ గుర్తుకు వచ్చుచున్నది. 'జార్జి బెర్నార్డ్ షా' సుప్రసిద్ధ ఆంగ్ల నవలాకారుడు. ఆయన సృజించిన నవలలెంత అందముగా

నుండునో, ఆయన అంత అందవికారముగా నుండునట. ఒకరోజు ఒక అందమైన 'యువతి' అతనిని కలిసి, అతని మీద తనకుగల ప్రేమను వ్యక్తము చేసి, అనునయముగా 'మీ తెలివితేటలతోటి, నా అందముతోటి మనకొక బిడ్డపుట్టిన చాలా గొప్పగా ఉండుననియు, అందులకని తనను వివాహముచేసుకోమనియు కోరినది. అందులకాయన "గ్రహచారము తప్పి నా అందముతో, నీ తెలివితేటలతో ఓ బిడ్డ పుట్టిన చాలా భయంకరముగా ఉండును. అందుకని ఈ పెళ్ళి ప్రస్తావన మరల తేవద్ద"ని ఆమెకు వినయముగా చెప్పినాడట. అటులనున్నదీ వ్యవహారము.

'పబ్లిక్ సెక్టార్' ఆదిలో కొంత మెరుగుగానే ఉండెడిది. 1969లో 'బ్యాంకుల జాతీయకరణ' కొంత సత్ఫలితములనిచ్చినది. అంతవరకు కేవలము పట్టణములకే పరిమితమయిన బ్యాంకింగ్ వ్యవస్థ దేశము నలుమూలలా వ్యాపించి, సామాన్యుని కందుబాటులోనికొచ్చినది. అంతవరకూ పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు, వాణిజ్య వేత్తలకు మాత్రమే అప్పులిచ్చెడి బ్యాంకులు సామాన్యులకు, రైతులకు సైతము ఋణములనందించ నారంభించినవి. అటులే 'ఇన్సూరెన్సు' వ్యాపారము, బొగ్గు గనుల జాతీయ కరణము కూడ కొంతమేరకు సత్ఫలితములనిచ్చినవి. కాని రాను రాను మూలసిద్ధాంతములకు తిలోదకములిచ్చి, ప్రతిరంగములోనూ తలదూర్చడంతో పరిస్థితి అధ్వాన్నముగా తయారయినది.

1970వ సంవత్సరం తరువాత దేశములో చోటు చేసుకొన్న రాజకీయ పరిణామములు, పబ్లిక్ సెక్టార్' పై తీవ్ర ప్రభావమును చూపినవి. భారత జాతీయ కాంగ్రెస్ ముక్కలవడంతో, అప్పుడు కేంద్రములో అధికారములో ఉన్న శ్రీమతి ఇందిరాగాంధి ప్రభుత్వము 'మైనారిటీ'లో పడినది. మన 'లెఫ్ట్' సోదరులు, ఇప్పటిలాగానే, ఆ మైనారిటీ ప్రభుత్వమునకు బయటనుండి మద్దతు నందించి, శ్రీమతి ఇందిరాగాంధి ప్రభుత్వమును ఆదుకున్నారు. కాని ప్రభుత్వము అందులకు మూల్యము చెల్లించవలసి వచ్చినది. 'కామ్రేడ్ల' ఒత్తిడిమేరకు దేశంలోని మూతపడిన పారిశ్రామిక సంస్థలను ప్రభుత్వము తీసికొని వాటినన్నింటినీ 'పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్'గా చేయవలసి వచ్చినది. ఇదే అదనని భావించిన కొందరు పారిశ్రామిక వేత్తలు లాభసాటిగా లేని తమ పారిశ్రామిక సంస్థలను, అధిక పెట్టుబడి పెట్టినగాని ఇకపై నడవవని నిర్ధారించిన పారిశ్రామిక సంస్థలను, 'లాకౌట్'లు ప్రకటించి, సమ్మెలు చేయించి, ప్రభుత్వము తీసుకునేలా చేసి, ఆ పనికి మాలిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వాని కప్పగించి, తమకందిన నష్టపరిహారమునందుకొని చల్లగా జారుకున్నారు. ఇలా మన 'కామ్రేడ్'లు అటు సమ్మెలు చేసి పరిశ్రమలు మూయించి, ఇటు

ప్రభుత్వమును ఒత్తిడిచేసి, అలా మూయించిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వము తీసుకొనునట్లు చేసి, ప్రభుత్వరంగ సంస్థల సంఖ్యను పెంచినారు. అటుల ప్రభుత్వ రంగ సంస్థల 'రాశి' పెరిగినది కాని 'వాసి' పెరగలేదు. ఇట్లు ఒట్టిపోయిన గొడ్లను, పాలు తాగి పారవేసిన పాలడబ్బాలను, వద్దనుకుని పారవేసిన వస్త్రాలను, పండు తిని పారవేసిన అరటి తొక్కలను, 'రసము' త్రాగి పారవేసిన పళ్ళరసపు సీసాలను, తేనెను త్రాగి వదిలేసిన తేనె తుట్టెలను, ఇలా పనికి మాలిన వస్తువులన్నింటినీ, ఆస్తులని భ్రమించి మనము భద్రపరిచినాము. 'ప్రభుత్వరంగం' అనే పడవ, ఇటువంటి అనవసరపు వస్తువుల బరువుతో మునిగే స్థితికివచ్చినది.

'సిక్ ఇండస్ట్రీస్'ని జాతీయము చేయుటయనిన పేషెంటుని హాస్పిటల్‌లో చేర్పించుటవంటిది. రోగిని కేవలము హాస్పిటల్‌లో చేర్పించిన సరిపోవునా? రుగ్మత ఏమియో, దానికిగల కారణములేమియో కనుక్కొని సరియైన వైద్యము చేయించ వలెను. అవసరమయిన పక్షమున ఆపరేషను చేయించవలెను. రోగికి కొత్త రక్తము నెక్కించవలెను. రోగము నయమయిన తదుపరి బలవర్ధకమయిన ఆహారము నీయవలెను. అప్పుడే కదా రోగి బ్రతికిబట్టకట్టునది. తనకాళ్ళపై తాను నిలబడ గలుగునది. మరి ఇన్ని 'సిక్ ఇండస్ట్రీస్'ను జాతీయము చేసిన ఈ ప్రభుత్వము చేసిన దేమున్నది? వాటి రుగ్మతలకు గల కారణములను కనుగొని, అట్టి పరిశ్రమల పునరుద్ధరణ కవసరమగు ప్రణాళికలను తయారుచేసి, తగినంత ధనమును పెట్టుబడిగ పెట్టి పునరుజ్జీవింపచేసినదా? లేదు. కొన్ని సందర్భములలో 'ప్రణాళిక'లు తయారు చేసినను అమలు మాత్రమరకొరగా జరిగినది. ఫలితముగా కొత్తగా పెట్టిన పెట్టుబడి కూడ బూడిదలో పోసిన పన్నీరయినది. అడవిని కాచిన వెన్నెలయినది. ఒకని వివాహములో పురోహితుడా నూతన దంపతులకు 'అరుంధతి' నక్షత్రమును చూపెనట. అంత నాపెండ్లికుమార్తె "అరుంధతి నక్షత్రము కనబడలేదు కాని అరవై వేలరూపాయల అప్పు మాత్రము కనబడుచున్న" దని పలికినదట. అట్లయినది వీటి పరిస్థితి. పెట్టుబడి పెట్టిన ఫలితము కానరాలేదు కాని భారత ప్రభుత్వమునకు తీర్చుట కప్పు మాత్రము మిగిలినది.

ఇక యాజమాన్య విషయమునకు వచ్చిన; ప్రభుత్వమునకు కళ్ళు, చెవులు, కాళ్ళు, చేతులు, మెదడు, గుండె, ఊపిరి అన్నియు ఐ.ఎ.ఎస్. అధికారులే! వారి సలహా లేనిదే అంగుళమయిన కదలలేని 'వింతజీవి' ఈ ప్రభుత్వము. వారు కూడా తమ ప్రాబల్యమును పెంచుకొనుటకు 'పబ్లిక్ సెక్టార్'ను యథోచితముగ వాడుకొనిరి. 'పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రం' అన్నట్లుగా అది ఉత్పత్తి రంగమయినా, వాణిజ్య

రంగమయినా, సేవారంగమయినా, పేపరు మొదలుకొని పెట్రోలు వరకు అన్నింటా వారే నిర్ణయాధి కారులు.

ఇక కీలకమయిన ఉన్నత పదవులు అనగా, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ వంటి పదవుల నియామకమునకు అర్హత రాజకీయ పలుకుబడి లేదా సంబంధిత 'మినిస్ట్రీ'లోని ఐ.ఎ.ఎస్. అధికారుల ప్రాపు. అవున్న తగిన విద్యార్హతలు, అనుభవము లేకపోయినను ఫరవాలేదు. పదవి మిమ్మలను వరించును. ఈ పద్ధతి 'పబ్లిక్ సెక్టార్'లో సమర్థతకు, అనుభవమునకు తిలోదకములిచ్చి, రాజకీయములకు, ఆశ్రిత పక్షపాతమునకు తావిచ్చినది. 'పబ్లిక్ సెక్టార్'లోనే పని చేయుచున్న నా మిత్రుడొకడు ఇట్టి అధికారులను గూర్చి ఓ కథ చెప్పినాడు. పూర్వము శ్రీరాముల వారు సీతాలక్ష్మణ సమేతముగా అడవులకు బయలుదేరి వెళ్ళినపుడు, అనేకానేక ప్రజలు కూడా ఆయన వెంట వెళ్ళినారట. శ్రీరాముడు గంగాతీరము చేరినాక, తన వెనుక వస్తున్న జనుల నుద్దేశించి "నరులారా! నారీమణులారా! ఇంక నేను ఈ నది దాటవలసి యున్నది. ఇంతవరకూ నన్ననుసరించి నా వెంట వచ్చినందులకు ధన్యవాదములు. ఇక మీరు అయోధ్యకు మరలిపొండు" అని పలికినాడట. వారందరు ఆ శ్రీరాముని ఆజ్ఞమేరకు అయోధ్యకు తరలిపోయినారట. రావణ సంహారము జరిగినది. వనవాస కాలము ముగిసినది. శ్రీరామచంద్రుడు తిరిగి అయోధ్యకు బయలుదేరినాడు. తిరిగి ఆ గంగానదీ తీరము వచ్చుసరికి, కొందరయోధ్య వాసులు ఇంకను అక్కడే ఉండుట గమనించి, ఆశ్చర్యపోయి, వారిని "మీరింకను అయోధ్యకు తిరిగిపోలేదా?" అని ప్రశ్నించినాడట. అందుకు వారు "మీరు నర, నారీమణులకు మాత్రమే అయోధ్యకు తిరిగిపొమ్మని ఆనతిచ్చినారు. కాని మాకేమియు ఆజ్ఞనీయలేదు. అందువలన మేము పదునాలుగు వత్సరములు మీకై ఎదురుచూచుచు, ఇచ్చటనే ఉన్నామ"ని తెలియజేసినారట. అంత శ్రీరాముడు వారి భక్తికి, సంతసించి "కలియుగమున వెలయు ప్రభుత్వ రంగ సంస్థలకు మీరధిపతులై సుఖింతురు గాక" అని వరమిచ్చి, వారిని తోడ్కొని అయోధ్యకు తరలిపోయెనట. ఇట్లు వారా శ్రీరామచంద్ర వరప్రసాదితులమని, ఆయన ఆశీః బలముతో ఆ పదవులలో నున్నారనియు నా మిత్రుని ఉవాచ.

ఇక మిగిలిన అధికారులు, వర్కర్ల నియామకముల విషయమునకు వచ్చిన, 'పబ్లిక్ సెక్టార్'లో రిక్రూట్‌మెంట్ చేయుటకు, వారికి తగిన శిక్షణ నిచ్చుటకు అన్నింటికీ కలిసి యు.పి.ఎస్.సి. వంటి 'కామన్ రిక్రూట్ మెంట్' వ్యవస్థలేదు. ఏ సంస్థ కా సంస్థ తన అవసరముల మేరకు 'రిక్రూట్ మెంట్' చేసుకొనును. దీనివలన బంధుప్రీతి,

ఆశ్రిత పక్షపాతము, ప్రాంతీయ వివక్షతలు వంటివి చోటుచేసుకొన్నవి. కొత్త 'ఛైర్మన్లు', 'మేనిజింగ్ డైరెక్టర్లు' వచ్చినప్పుడల్లా తన వారిని కొందరిని కీలక పదవులలో నియమించుకొనుటతో, అధికమయిన 'మాన్ పవర్' ఆయా కంపెనీలకు భారముగా పరిణమించిది. సంస్థను ఆర్థికముగా బలోపేతము చేయుదురను తలంపుతో పంపిన అధికారులు సంస్థను ఇటుల శారీరకముగా బలోపేతము చేసినారు.

సోదరసోదరీమణులారా! ఈ పబ్లిక్‌రంగ సంస్థల 'ఫండింగ్' వ్యవస్థ వింతలలో వింత. మనమందరము పిల్లలను కనుచున్నాము. వారిని పెంచి, పెద్దచేసి, విద్యాబుద్ధుల గరపి, వివాహములు చేసి, ఉద్యోగములలో చేర్పించి, వారు వారి కాళ్ళపై నిలబడు వరకు వారిని మనము పోషించుచున్నాము కదా! వారి నాదుకొను చున్నాము కదా! అంతియే కాని వారు పుట్టినప్పుడు పురిటికయిన ఆసుపత్రి ఖర్చుల నుండి, పాలసీసాలకు, పాలడబ్బాలకు, పాలపీకలకు, అనారోగ్యము కలిగిన యెడల డాక్టరు ఫీజులకు, మందులకు, బట్టలకు, పుస్తకములకు, స్కూలు, మరియు కాలేజి ఫీజులకు, అన్నపానాదులకు అయిన ఖర్చును అణాపైసలతో సహా లెక్కవేసి, వారుద్యోగములో చేరిన వెంటనే వారికి లెక్కనప్పగించి, వడ్డీతో సహా ఋణమును తీర్చమనుచున్నామా? లేదు కదా! అట్లయిన వారు జీవితాంతము తీర్చినను మన ఋణము తీరునా? కాని భారత ప్రభుత్వము మాత్రము తాను స్థాపించిన ప్రభుత్వరంగ పరిశ్రమలకు, శంకుస్థాపనము చేసినది మొదలు, ఉత్పత్తి నారంభించు వరకు తాను పెట్టుబడి పెట్టిన మొత్తములో కొంత భాగమును మాత్రము తన వాటా పెట్టుబడిగ పరిగణించి, మిగిలిన మొత్తమును ఆ సంస్థకు తానిచ్చిన ఋణముగా పరిగణించి, ఉత్పత్తి ఆరంభమయిన మరు నాటినుండి ఋణమును తీర్చమని 'కాబూలీ' వానివలె వేధించును. ఇట్ల అప్పులలో పుట్టిన ఆ బిడ్డ అప్పులలోనే మరణించు ననుటకేమైన సందేహమా?

ఇక విధానపరమయిన నిర్ణయములను గూర్చి కూడ కొంత చెప్పవలసి యున్నది. ఏ పరిశ్రమ నెక్కడ స్థాపించవలెనో, ఎంత ఉత్పత్తి స్థాయి కలిగియుండ వలెనో, సాంకేతిక పరిజ్ఞానము నే దేశమునుండి తీసికొనవలెనో, అవసరమగు యంత్ర పరికరముల నే సంస్థనుండి కొనుగోలు చేయవలయునో మున్నగు విధాన పరమయిన నిర్ణయముల నన్నింటిని ప్రభుత్వము చేయును. పబ్లిక్‌రంగ సంస్థల కందు ప్రమేయము లేదు. వారు 'పంజాబు'లో మంగలిషాపులు తెరువమన్న వీరు తెరువలసినదే! వారు రాజస్థాన్‌లో 'మినరల్ వాటర్ ప్లాంట్'ను స్థాపించమన్న వీరు స్థాపించ వలసినదే! వారు అండమాన్‌లో 'రైలుకోచ్ ఫ్యాక్టరీ' పెట్టమన్న వీరు పెట్టవలసినదే! వారు కాశ్మీర్‌లో 'ఐస్‌ఫ్యాక్టరీ' తెరువమన్న

వీరు తెరువవలసినదే! వారు హైదరాబాదులో 'నౌకా నిర్మాణ కేంద్రము' నేర్పాటు చేయమన్న వీరేర్పాటు చేయవలసినదే! విధానపరమయిన నిర్ణయములే కాక దైనందిన పరిపాలనా పరమైన, వాణిజ్యపరమయిన నిర్ణయాధి కారములు కూడ ఏ కొద్దిమంది ఉన్నతాధికారులకో పరిమితమై యుండి, సమయోచిత నిర్ణయములు తీసికొనలేక అనేక ప్రభుత్వ రంగసంస్థలు నష్టపోవుచున్నవి.

ప్రభుత్వము స్థాపించిన అనేకానేక పబ్లిక్‌రంగ సంస్థలు పారిశ్రామికముగ వెనుకబడిన ప్రాంతములలో, పారిశ్రామికాభివృద్ధి, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి కల్పన మున్నగు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సామాజిక విషయములను దృష్టిలో నిడుకొని స్థాపించినవే! ప్రభుత్వమున కట్టి దృష్టి యుండవలసినదే! కాదనను! కాని అట్టి సంస్థలు వాణిజ్య పరముగ లాభముల నార్జించుట లేదని నిందించుట అధర్మము కదా! సోదరులారా! కుర్రవాని నింటరులో సి.ఇ.సి (కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్)లో జాయిను చేసి ఇంజనీరు కాలేదని నిందించుట న్యాయమా? హెచ్.ఇ.పి. (హిస్టరీ, ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)లో జాయిను చేసి డాక్టరు కాలేదని ఆక్రోశించుట ధర్మమా?

1990 దశకములో శ్రీ పి.వి. నరసింహారావు గారి ఆధ్వర్యమున నేర్పడిన ప్రభుత్వము 'లిబరలైజేషన్' పేరిట కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించుట జరిగినది. అటుతరువాత శ్రీ అటల్ బిహారి వాజ్‌పాయి నేతృత్వములోని ఎన్.డి.ఎ. ప్రభుత్వము కూడా అదే పంథాలో నడిచి, నష్టాల ఊబిలో కూరుకొనిపోయిన కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించుట జరిగినది. మునుగుటకు సిద్ధముగానున్న ప్రభుత్వరంగ పడవనుండి అనవసరమయిన కొంత భారమును తొలగించుట జరిగినది. కొన్ని కీలకమయిన, ఆర్థికముగ బలపడిన ప్రభుత్వరంగ సంస్థలను 'నవరత్నము' లనియు, 'మినీరత్నము'లనియు గుర్తించి, అట్టివానికి కొంతమేరకు విధాన పరమయిన నిర్ణయాధికార స్వేచ్ఛ నిచ్చుట జరిగింది. కాని ఇంకను చేయవలసిన దెంతయో నున్నది.

- లాభసాటిగా లేని, కీలక రంగములకు చెందని ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించుడు.
- ప్రభుత్వరంగ సంస్థలలో ప్రభుత్వ పెట్టుబడిని 51%నకు పరిమితము చేసి, మిగిలిన 49% వాటాను 'పబ్లిక్ ఇష్యూ' ద్వారా దేశ ప్రజలకమ్మి, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యమును ప్రోత్సహించి, ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతము చేయుడు.

- అట్లిమ్మగావచ్చిన డబ్బును కీలకరంగములయిన రక్షణ ఉత్పత్తి, ఇంధనము, విద్యుదుత్పాదన, స్టీలు, సిమెంటు, మౌలిక వసతుల కల్పనవంటి రంగములలో వెచ్చించి, దేశపురోభివృద్ధికి తోడ్పడుడు.
- పబ్లిక్‌రంగ యాజమాన్యమునకు మరిన్ని అధికారములు కల్పించి, జవాబు దారీ తనమును పెంచుడు.

ఇంకను వ్రాయవలసిన విషయము లనేకములున్నను, సమయాభావముచే ఇంతటితో ముగించుచున్నాను. అవకాశమగునెడల మరెప్పుడయిన ఈ విషయమును గూర్చి మరో లేఖలో తెలియచేయగలను. నేను ముందుగనే చెప్పితిని, నాకు తెలుగు భాషయం దభిమానమే కాని అభినివేశము లేదని. అందుకని కొన్నిచోట్ల సరయిన తెలుగు పదములు తెలియక ఆంగ్ల పదములు ప్రయోగించితిని. కొన్నికోట్ల అలవాటున గ్రాంధికమునకు బదులుగ వ్యావహారికము నుపయోగించితిని. విజ్ఞులు దీనిని మన్నింతురు గాక!

భవదీయుడు

కుక్కుటేశ్వరరావు

గమనిక : నాయనలారా! ఇవి కుక్కుటేశ్వరరావుగారు వ్యక్తము చేసిన వారి స్వంత అభిప్రాయములు. వీటిని మా 'సాక్షి సంఘ' అభిప్రాయములుగ పరిగణింప నవసరము లేదు. 'సాక్షి సంఘ' సభ్యులు మాత్రమే కాక, వివిధ విషయములలో నిష్ణాతులైన వ్యక్తులను కూడా పిలిచి 'సాక్షిసంఘము'లో ఉపన్యాసము లిప్పించుడని శ్రీ కుక్కుటేశ్వర రావుగారిచ్చిన సూచన మంచిదే! ఆ విషయమై మా 'సాక్షి సంఘము' లో చర్చించి, త్వరలో ఒక నిర్ణయము తీసికొనగలము. అంతవరకును, మిత్రులెవరైన నూతన సామాజిక విషయములను గూర్చి లేఖలు వ్రాసిన, వాటిని మా సాక్షిసంఘ సమావేశములలో చదివి వినిపింపగలము. ఇప్పటికే కాలాతీతమయినది. ఇక సెలవు.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః*



# తెలుగు టి.వి. కార్యక్రమములు

జంఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

సోదర సోదరీమణులారా! గత వారము అనారోగ్య కారణముగ సమావేశము నకు రాలేకపోతిని. మన్నింపుడు. ఇపుడు ఆరోగ్యము కాస్త కుదుట పడినను ఇంకను కాస్త నీరసముగనే యున్నది. అయినను ఈ ఉపన్యాస వ్యాసంగమొక వ్యసనమై, కళాశాలోపన్యాసకులవలె, కనీసము రోజునకొక గంటయిన ఉపన్యసించకున్న తోచుటలేదు. అందుకని యే ఉపన్యసించుట కుద్యమించితిని. ఓపికున్నంత వర కుపన్యసింతును.

అనారోగ్య కారణముగ మంచముపై పడి యుండుటచే కాలక్షేపమునకై 'టి.వి. పెట్టితిని. అదేదో తెలుగు న్యూస్ ఛానల్ నాయనలారా! ఎవరిదో వివాహకార్యక్రమముపై ప్రత్యక్ష ప్రసారము కొనసాగుచున్నది. జాతీయ పండగయిన స్వాతంత్ర్య దినోత్సవమున దేశప్రధాని త్రివర్ణపతాకము నెగురవేసి, ఎఱ్ఱకోట బురుజుల నుండి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించిన కార్యక్రమమును ప్రత్యక్షప్రసారము చేయుట మనమెరుగుదుము. అటులే, దేశ గణతంత్ర దినమునాడు భారత రాష్ట్రపతి ఎఱ్ఱకోట బురుజుపై త్రివర్ణ పతాకము నావిష్కరించి, త్రివిధ దళాధిపతుల వందనము స్వీకరించి, సైనిక కవాతును, మన రక్షణ సామర్థ్యమును ప్రదర్శించు వివిధ ఆయుధ శకటములను, దేశప్రగతిని ప్రతిబింబించు వివిధ రాష్ట్రముల ప్రగతి రథములను, భిన్నత్వములో ఏకత్వమును ప్రదర్శించు వివిధ సాంస్కృతిక, కళాప్రదర్శనములను వీక్షించు కార్యక్రమమును ప్రత్యక్ష ప్రసారము చేయుట మనకు తెలియును. అటులే ప్రపంచ క్రీడోత్సవమయిన 'ఒలింపిక్' క్రీడల ప్రారంభ, ముగింపు ఉత్సవములను, ఆసియా క్రీడోత్సవములను, జాతీయ క్రీడోత్సవములను ప్రత్యక్ష ప్రసారము చేయుట మనమెరుగుదుము. 'వింబుల్‌డన్ టెన్నిస్' ఆటలను, 'ఏసియాకప్', 'వరల్డ్ కప్', 'ఫుట్‌బాల్', 'హాకీ' వంటి ఆటల ప్రత్యక్షప్రసారములను మనము చూచుచున్నాము. ఇక 'క్రికెట్' కు వచ్చిన, అన్ని జాతీయ, అంతర్జాతీయ ఆటలను ప్రత్యక్ష ప్రసారము చేయ మనము చూచుచున్నాము. లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభల కార్యకలాపము లను ప్రత్యక్ష ప్రసారము చేయుట మనము చూచుచున్నాము. మొన్నటికి మొన్న లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'విశ్వాస ప్రకటన తీర్మానము'ను నెగ్గించుకొనుటకై, 'ఓట్ల' కొరకు 'నోట్ల'ను

పంచు 'ప్రజాస్వామ్య ప్రహసనము'ను ప్రత్యక్షముగ తిలకించితిమి కదా! కాని ఒక వివాహము నిట్లు ప్రత్యక్ష ప్రసారము చేయుట మన మిదివరలో నెన్నడును కనలేదు. వినలేదు. ఇదొక వింత ప్రక్రియ. మగ పెండ్లివారు బస్సు దిగి పెండ్లి మంటపము చేరినది మొదలు, వివాహానంతరము తిరిగి నూతన వధూ వరులతో గృహప్రవేశమునకై తరలు వరకు జరిగిన ప్రతి చిన్న సంఘటన విపులముగా ప్రసారము చేయబడినది. 'ప్రత్యక్షప్రసారకులు' తమ టి.వి. కెమెరాలతో శోభనము గదిలో కూడా ప్రవేశింతురేమోనని నేను భయపడితిని. కాని ప్రత్యక్ష ప్రసారమంతటితో ముగిసినది.

అటులే ఇటీవల ఓ సినీ ప్రముఖుని కుమార్తె, తన తల్లిదండ్రులకు తెలియ కుండ, వారి మనోభీష్టమునకు వ్యతిరేకముగ, రహస్యముగ తను ప్రేమించిన వానిని వివాహమాడినది. తల్లిదండ్రులనుండి దాచినది కాని టి.వి. ఛానళ్ళ నుండి దాచగలదా? తల్లిదండ్రుల కనులు కప్పినది కాని టి.వి. ఛానల్ వారి కెమేరా కన్నులను కప్పగలదా? మరేమున్నది. ఆ వివాహమును టి.వి. ఛానళ్ళు ప్రత్యక్ష ప్రసారము చేసినవి. అంతటితో ఆగిన నెంతబాగుండును. టి.వి. కెమేరాలతో ఆ పిల్ల తల్లిదండ్రుల ఇంటికి చేరి; తమకుమార్తె వివాహము, తమ కన్నుల పండువుగ తమ చేతుల మీదుగ జరుగవలసిన వివాహము, తమ కిష్టమయిన వరునితో జరిపించవలసిన వివాహము, తమకు తెలియకుండ, ఎక్కడో గుడిలో జరుగుచున్నదని తెలిసి, ద్రమాన్పడి, దుఃఖముతో, వేదనతో, బాధతో నున్న ఆ తల్లిదండ్రులను, బంధువులను ప్రశ్నలతో వేధించి, వారి వేదనలను ప్రత్యక్షప్రసారము చేసి ఆనందించినవి.

ఇక ఇటీవల దేశములో అమెరికాదేశముతో కుదుర్చుకొన్న అణువొప్పందము విషయమున చోటు చేసుకున్న రాజకీయ పరిణామములు వీరికి చేతినిండ పని కల్పించినవి, వీరి ఊహలకు రెక్కలనిచ్చినవి. దినములోని ఇరువది నాలుగు గంటలు 'పార్లమెంటు'లోని అధికార, ప్రతిపక్ష బలాబలముల అంచనాలతో అంకెల గారడిచేసిరి. దేశ ప్రధానికంటె, యు.పి.ఏ. ఛైర్ పర్సన్ కంటె వీరికి ఉద్వేగము, ఉత్కంఠ అధికమయినది.

ఇటీవల ఒక తెలుగు చలనచిత్ర ప్రముఖ నటుడు రాజకీయరంగ ప్రవేశము చేయనున్నాడనియు, రాజకీయ పక్షమునొక దానిని స్థాపించనున్నాడనియు వినవచ్చి నది. అంతే! నూతన రాజకీయ పక్షమును గూర్చి ఊహాగానములు మొదలయినవి. ఆ పార్టీ పేరేమయి ఉండునో, 'జండా' ఏమిటో?, 'ఎజండా' ఏమిటో?, ఎన్నికలలో ఎన్ని సీట్లు సంపాదించు అవకాశమున్నదో, ఏయే రాజకీయ పక్షములతో ఎన్నికల పొత్తు పెట్టుకొననున్నదో?, ఊహించి, కల్పించి, కథలల్లి తమ ఛానళ్ళలో ప్రసారము చేయుచున్నారు. పార్టీ పెట్టవలసిన నాయకులు కిమ్మనకుండ నున్నారు. ప్రజలు కూడా

ఏమి జరుగునో చూతమని వేచి చూచుచున్నారు. కాని ఈ టి.వి. ఛానళ్ళవారు మాత్ర మాసులోకండెలవలె తెగ తిరుగుచు, అభిప్రాయ సేకరణలు చేయుచు, సర్వేలను నిర్వహించుచు, ఊహాగానములు చేయుచు ఎంతైన 'హంగామా' చేయుచున్నారు. "ఆలులేదు, చూలులేదు, కొడుకు పేరు సోమలింగం" అన్న సామెతగ నున్నది వీరి హడావుడి.

అటులనే ఒక సినీనటునికి తాను మొదటి భార్యననియు, తానుండగనే, తన నుండి 'విడాకులు' పొందకుండగనే, అతడు మరొక వివాహము చేసికొని నాడనియు, తన కన్యాయము చేసినాడనియు, ఒక మహిళ ఒక కుటుంబ న్యాయస్థానములో వేసిన 'కేసు' టి.వి. ఛానళ్ళలో కలకలము సృష్టించినది. వీరికి కావలసినంత పని కల్పించినది. సంబంధిత కుటుంబముల కంటె వీరెక్కువ వేదన పడినారు. మథనపడినారు. వారు గైరుహాజరయినను, వీరుమట్టుకు వాయిదా తప్పకుండ కోర్టుకు హాజరగుచున్నారు. వాదప్రతివాదములను వినుచున్నారు. మనకు వినిపించుచున్నారు. న్యాయస్థానము అనుమతి నీయలేదు కాని, ఇచ్చిన యెడల అచ్చటి నుండి ప్రత్యక్షప్రసారమే చేసియుండెడివారు.

ఇక ఈ చానళ్ళ పనితీరును గూర్చి రవంత చెప్పెదను. వీరు తమ ఛానళ్ళను సజావుగా నడపుటకై ఎప్పుడేదయిన దుర్ఘటన జరుగునా? ఏదయిన విమాన ప్రమాదమో, రైలు ప్రమాదమో, బస్సు ప్రమాదమో జరుగునా? ఏ దేశనాయకుడైన మరణించునా? ఏ ప్రభుత్వమైన కూలునా? ఏ ఛాందస మతసంస్థలయిన మతకల్లోలములు సృష్టించునా? ఏ తీవ్రవాద సంస్థ అయిన బాంబులను పేల్చునా? అని చకోర పక్షులవలె ఎదురు చూచెదరు. సంఘటన జరిగినదని తెలిసిన వెంటనే తమ టి.వి. కెమేరాలతో ఘటనాస్థలము చేరి, అసలే పుట్టెడు దుఃఖములో నున్న వారిని 'ఏమి జరిగినది?' 'ఎటుల జరిగినది?' 'ఎందులకు జరిగినది?' వంటి చచ్చు ప్రశ్నలతో వేధించి, వారిని మరింత ఏడ్పించి, ఏడ్చుచున్నవారి నేడ్చుచున్నట్లే ప్రత్యక్ష ప్రసారము చేయుదురు. కొన్ని కొన్ని సమయములలో సంఘటన జరిగినదని వినగనే, ఆ వార్తను ముందుగ ప్రసారము చేయవలయునను ఉత్కంఠతో, ఘటనాస్థమునైన సందర్శించకుండగనే, జరిగిన నష్టమునైన పూర్తిగ అంచనావేయ కుండగనే, గోరంతలను కొండంతలుగ చిత్రీకరించి, వీక్షకులను భయవిహ్వాలులను చేయుదురు.

వీరు వార్తలను ప్రసారము మాత్రమే చేయరు. నాయనలారా! సృష్టింతురు కూడా! రాష్ట్రములో కొందరు వృద్ధనేతలు, కొందరు రాజకీయ నిరుద్యోగులు, కొందరు వివాదాస్పద నాయకులు, కొందరసమ్మతి వాదులు, కొందరు మాజీమంత్రులు, కొందరు బహిష్కృత నేతలు ఉన్నారు. వీరు తమ ఉనికిని కాపాడుకొనుటకై

అప్పుడప్పుడు వార్తలలోనికెక్కవలెనని ఉబలాటపడుచుందురు. ఏ వార్తలూ లేనప్పుడీ ఛానళ్ళవారు అట్టి ఒక నాయకుని వద్దకు పోయి, 'ఇంటర్వ్యూ' పేర కొన్ని వివాదాస్పద అంశములను గూర్చి అతనిని ప్రశ్నించి, ఆతడిచ్చిన సమాధానములను రికార్డుచేసి ప్రజల కందింతురు. ఈ నాయకులు కూడా వారేమి మాట్లాడుచున్నారో? ఎందులకు మాట్లాడుచున్నారో? తెలియని ఉన్మాద స్థితిలో, టి.వి. కెమెరాను చూడగనే మైమరచి, మైకుదొరకి నందులకు పులకించిపోయి, టి.వి.లో కనబడినందులకు పొంగిపోయి, అవాకులు, చవాకులు మాట్లాడెదరు. వాటిని వినిపించి, ప్రతిపక్షము నుండి, అధికార పక్షమునుండి ప్రతిక్రియలను రికార్డుచేసి, ఆ వార్తలతో వీరొక వారము కాలక్షేపము చేసెదరు. అసలు వార్త తక్కువ. ఆర్భాటమెక్కువ. కొన్ని సమయములలో ఉన్న వార్తలను యథాతధముగ తెలుపక, వాటికి చిలువలు, పలువలు కలిపించి, కథలల్లి, తమకనుకూలమయిన రాజకీయ రంగు పులిమి అవసరమునకు మించి ప్రసారము చేసి ప్రచారము చేయుదురు.

ఇక వీరి భాషను గూర్చి రవంత చెప్పెదను. ఆ భాషను తెలుగన వీలులేదు. ఏమనగా అందు తెలుగు పదములకంటె ఆంగ్లపదము లధికముగా నుండును. కాన దీనిని 'టెంగ్లిష్' అని నా మిత్రుడొకడు నామకరణము చేసినాడు. "గుడ్ మార్నింగ్, న్యూస్ ఎట్ ఎయిట్‌కు స్వాగతం. ముందుగా హెడ్ లైన్స్, హెడ్ లైన్స్ స్పాన్సర్డ్ బై "ఇలా ప్రారంభమయిన వారి తెలుగు వార్తా ప్రసారం, "హేవ్ ఎ నైస్ డే! బై!" అంటూ ముగుస్తుంది. వీటిని తెలుగు వార్తలనగ మనము నమ్మగలమా? నిజముగ తెలుగు మాత్రమే వచ్చినవాడు వీరి 'టెంగ్లిష్' వార్తలనర్థము చేసికొనగలడా? తెలుగు భాషలో వలసిన పదము లేనప్పుడో, తెలుగు పదము కంటె ఆంగ్లపదము వాడిన విషయము సూటిగ చెప్పుటకు వీలగునని భావించినపుడో, అక్కడక్కడ అన్యదేశ్యములను వాడుట కద్దు. కాని ఇట్లు తెలుగు భాషను సంకరము చేసి, తెలుగు వార్తల పేరిట 'టెంగ్లిష్' వార్తలను ప్రసారము చేయుట తెలుగు భాషకే అవమానము కదా!

భాష విషయమున కేవలమీ న్యూస్ ఛానళ్ళే కాదు నాయనలారా! మిగిలిన తెలుగు టి.వి. ఛానళ్ళు కూడా నిట్లే ఉన్నవి. "హాయ్ వ్యూయర్స్" "మీ రెక్కడి నుండి కాల్చేస్తున్నారు?" "ఓ! ఐసీ!" "ఎక్స్యువల్లీ ఐ లైక్ ఎండ్ ఎంజాయ్ తెలుగు మ్యూజిక్" "థేంక్యూ వెరీమచ్ ఫర్ కాలింగ్ అజ్" "ఐ ఏమ్ వెరీ వెరీ హ్యాపీ" 'వుయ్ విల్ టేక్ ఏ స్మాల్ బ్రేక్', 'వెల్కం బ్యాక్ టు ది ప్రోగ్రామ్' ఇలా, కార్యక్రమ సంచాలకులు తెలుగుకంటే ఆంగ్లపదాలనే ఎక్కువగా వాడటము మనము వినుచునే ఉన్నాము. నాయనలారా! 'భాష' ఇట్లున్న ఇక వేషమందులకు భిన్నముగానుండునా? అర్ధనగ్న శరీరములతో,

అంగాంగ ప్రదర్శనములతో వీరు పాశ్చాత్యులను తలపించుచున్నారు. ఇట్లు నేతిబీరకాయలో నేయివలె, తెలుగు టి.వి. ఛానళ్ళలో తెలుగుతనము మృగ్యము.

ప్రజల మనోవికాసమునకని, విజ్ఞానమునకని, వినోదమునకని వెలసిన మిగిలిన తెలుగు టి.వి. ఛానళ్ళు కూడ అంతంత మాత్రముగనే యున్నవి. తెలుగు చలనచిత్ర రంగము చుట్టూ ఉపగ్రహములవలె పరిభ్రమించుచున్నవి. ఇదివరలో వచ్చిన చలన చిత్రములను ప్రసారము చేయుట, రానున్న చలన చిత్రములపై వ్యాపార ప్రకటనలు, వ్యాఖ్యానములు, ఉపాఖ్యానములవంటి ప్రసార కార్యక్రమములతో వీరు గుడుగుడుగుంజము లాడుచున్నారు. ఇక 'ధారావాహిక'లను గూర్చి ఎంత తక్కువ మాట్లాడిన అంత మంచిది. అవి కాలప్రవాహము వలె అనంతరములు. ఎప్పుడు మొదలయినదో తెలియదు. ఎప్పుడంతమగునో అంతకన్న తెలియదు. మనకే కాదు నాయనలారా! ఆ ధారావాహిక రచయితకు తెలియదు. ఆ ఛానళ్ళ యాజమాన్యమునకు కూడా తెలియదు. అట్లా ధారావాహికలు, ముందు మూడు నిమిషముల 'టైటిల్‌సాంగ్'తో, ఐదు నిమిషముల జరిగిన కథతో, మధ్య మధ్యలో పదునైదు నిమిషముల వ్యాపార ప్రకటనలతో, చివర రెండు నిమిషముల చరమ గీతముతో, నటీనట, సాంకేతిక, సంగీత, గాయక, రచన, నిర్మాణ, దర్శకత్వ వివరములతో సజావుగా సాగిపోవుచున్నది. నా మిత్రుడొకడు తన పుత్ర రత్నమును గూర్చి మాట్లాడుచు, "వీడు మూడు నిమిషాలలో చెప్పాల్సిన విషయానికి, ముప్పై నిమిషాలు తీసుకుంటాడు. ఎందుకు పనికి వస్తాడో ఏమో?" అన్నాడు కాస్త దిగులుగా. "వీడు తెలుగు టి.వి. సీరియల్స్‌కి కథ, మాటలు వ్రాయటానికి పనికి వస్తాడు" అన్నాడు మరో మిత్రుడు కాస్త సరదాగా! అందరం పగలబడి నవ్వుకున్నాం. అలా ఉంటుంది ఈ ధారావాహికల కథాకథనం. కథలు కూడ అత్తా-కోడళ్ళు, వదిన-మరదళ్ళు, తోడికోడళ్ళు, భార్య-ప్రియురాళ్ళు, సవతి-యారళ్ళు ఇలా రెండు మూడు స్త్రీ పాత్రల చుట్టూ తిరుగు తుంటాయి. ఇక కథారచయితలు కూడ ఒక స్త్రీని ఉన్నతముగా, ఆదర్శవంతముగా చూపించు ప్రయత్నములలో వందమంది 'స్త్రీ'లను కపటముగా, నీచముగా, దుర్మార్గముగా ప్రతినాయకులుగా చిత్రీకరించి 'స్త్రీవాదులమై పోయినందుకు పొంగిపోవుచున్నారు. ఈ ధారావాహికలలో సత్యము, ధర్మము, అహింస, ఋజువర్తనము, న్యాయవర్తనములను ప్రబోధించుటకు బదులు అసత్యము, అధర్మము, హింస, కపటము, అన్యాయము అధికముగ చోటుచేసికొనుచున్నవి.

'మహిళ'లకు చీరలపైన, నగలపైనగల మోజును ఆసరాగా తీసికొని, ప్రాయోజితులను వెదకి, వారికై ప్రత్యేక కార్యక్రమముల నేర్పాటు చేసి, చీరలు, బంగారు నాణెములు బహుమతులుగ నిచ్చి వారిని సంతృప్తిపరచుచున్నారు.

ఇక మీ 'నేరపరిశోధక' కార్యక్రమములకు వచ్చిన, జరిగిన నేరములకంటె దానిని సమర్పించు వ్యాఖ్యాతలు భయంకరముగ నుండి ఒడలు జలదరింప చేయుచున్నారు.

పిల్లల మనోవికాసమునకు, యువతీ యువకుల వ్యక్తిత్వ వికాసమునకు, విజ్ఞానాభివృద్ధికి దోహదము చేసి, వారిని ముందుకు నడిపించుటకకుపకరించెడి కార్యక్రమములు లేవు. అరకొరగా ఒకటి రెండు కార్యక్రమములున్నను అవి అంత ప్రభావశాలిగ లేవు. ఇక సంగీత, సాహిత్య, నాట్యాది కళాదులకు వచ్చిన, వారి దృష్టిలో సంగీతమనగ 'సినీ సంగీతము', సాహిత్యమనగ 'సినీ సాహిత్యము', నాట్యమనగ చలన చిత్రములలో నాయికా నాయకులు వందమంది నాట్య కత్తెలనడుమ, నాట్యకారుల నడుమ, వారి అడుగులో అడుగువేయుచు చేసిన పదవిన్యాసము, వేసిన కుప్పిగంతులు. 'సినిమా'లలోనే నేడట్టి నాట్యము చూడలేక ఏడ్చుచుండ, వాటి అరగిపోయిన కార్బను కాపీలను, నాట్యము పేర వివిధ ఛానళ్ళు ప్రదర్శించి సంతృప్తి పడుచున్నవి. 'గీతము' సరిగ వినబడనంత తీవ్ర శబ్దజాలముతో వినిపించెడి సంగీతమునకు ప్రజాదరణ తగ్గినది. డ్రమ్ములు, డబ్బాలు, డొక్కులు, పళ్ళెములు విసరివైచినట్లున్న సంగీతముతో విసిగిన వీక్షకులు కమ్మని సంగీతము, చక్కటి సాహిత్యముతో అలరారు పాత సినిమా పాటలవైపు మొగ్గుచూపుచున్నారు. దానితో, ఉన్నట్టుండి పాత సినిమా పాటలకు గిరాకీ పెరిగినది. ఇది గమనించిన టి.వి. ఛానళ్ళవారు, నూతన గాయనీ గాయకులను ప్రోత్సహించు నెపమున, ఆ పాత పాటలను మరోమారు వీక్షకులకు వినిపించి, వారిని సంతోషపరచి, తాము సంతోష పడుచున్నారు.

ఇదివరలో ఇన్ని టి.వి. ఛానళ్ళు లేనప్పుడు కేవలము 'దూరదర్శన్' మాత్రమే యుండెడిది. అపుడు దానిని 'దుర్దర్శన్' అని హేళన చేయుచుండెడి వారు. కాని నేడా 'సప్తగిరి' ప్రసారము చేయు కార్యక్రమములలో కొన్ని నిజముగ విజ్ఞానోపేతముగ, వినోద భరితముగనుండి ప్రేక్షకుల నలరించుచున్నవి.

నాయనలారా! ఛానళ్ళ సంఖ్య పెరిగినదే కాని అవి ప్రసారము చేయు కార్యక్రమముల స్థాయి అంతంత మాత్రముగనే యున్నది. ఈ ఛానళ్ళు వచ్చిన కొత్తలోవలె, ప్రసారము చేసిన ప్రతికార్యక్రమమును ఎగబడి చూచెడి ప్రేక్షకుల సంఖ్య ఈనాడు తగ్గినది. 'కొత్తొక వింత- పాతొక రోత' అన్న సామెతగ, కొత్తలో నున్న 'వ్యూయర్‌షిప్' ఇప్పుడు లేదు. ఛానళ్ళ సంఖ్య పెరిగిన కొలది ఇది తరుగుచున్నది.

దానిని పునరుద్ధరించుకొనుటకు, ముందుగ మీరు మీ ప్రసార నియమములను కొంత మార్చుకోవలసి యున్నది.

- మీరు వార్తలు ప్రసారము చేసిన యెడల నిజాయితీగా, నిష్పక్షపాతముగా, జరిగిన విషయమును యథాతథముగ, ముక్తాయింపులు లేకుండా ప్రసారము చేయుడు.
- మీ కార్యక్రమములలో విద్యార్థులకు, యువజనులకు ఉపయోగపడు విజ్ఞాన, మనోవికాస, వ్యక్తిత్వ వికాసములకు సంబంధించిన మంచి కార్యక్రమములను ప్రవేశపెట్టుడు.
- పితాపురము చాంతాడంత పొడుగు ధారావాహికలను మూడు నెలలకో, ఆరు నెలలకో కుదించుడు.
- తెలుగు సాహిత్యములోని చక్కని కథలను, నవలలను ఆధారముగ చేసికొని చక్కని ధారావాహికలను నిర్మించి ప్రసారము చేయుడు.
- చక్కని సంగీత, సాహిత్య, నృత్యకళాకార్యక్రమములను ప్రవేశపెట్టి మన భాషా, సాహితీ, సంప్రదాయములను పునరుజ్జీవింపచేయుడు.
- మీ కార్యక్రమ ప్రస్తుతకర్తలకు, వ్యాఖ్యాతలకు చక్కని తెలుగు నేర్పుడు. వారి వేషభాషలలో పదహారణాల తెలుగుతనముట్టిపడునట్లు చూడుడు.
- పిల్లలకు బొమ్మలతో భారత, భాగవత, రామాయణాది ఇతిహాస గాథలను ప్రసారము చేసి వారికి మన ప్రాచీన ఇతిహాసములను పరిచయము చేయుడు.
- నేను ప్రసార రంగ నిష్ణాతుడను కాను. నిష్ణాతుడవు కాని పక్షమున మరి విమర్శ ఎందులకని మీరడుగ వచ్చును. వంటను రుచి చూచి, బాగున్న దనియో, బాగులేదనియో చెప్పుటకు పాకశాసనుడే యవసరము లేదు. రుచి ఎరిగిన ఎవడైనను చెప్పవచ్చును. మీరు ప్రసారము చేయు కార్యక్రమముల లోని లోటుపాట్లను వెలికితీసి మీ ముందుంచితిని. వాటిని సవరించుకొని, మంచి కార్యక్రమములను రూపొందించి, ప్రసారము చేయుట మీ పని. ప్రజలకు విజ్ఞాన భరితమయిన, వినోద భరితమయిన, మనోవికాస భరిత మయిన కార్యక్రమములను రూపుదిద్ది ప్రసారము చేయుడు. ఇప్పటికే చాలా చెప్పితిని. ఇక సెలవ్.

***ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః***



# జాతీయ విద్యా విధానము

*జంఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:*

జంఘాల శాస్త్రి ఆనాటి తెలుగు దినపత్రిక నొక దానిని చేతపుచ్చుకొని విసవిసా సభాభవనమున ప్రవేశించి వేదికనెక్కి ఉద్వేగముతో ఇట్లుపన్యసించెను:

సభాసదులారా! ఈనాటి దినపత్రికలో వచ్చిన వార్తను చదివితిరా? అహా! మన ముఖ్యమంత్రిగారు ముక్కుతిమ్మనవలె ముద్దు ముద్దుగా పలికినారు! ఆయ నేమని నారో తెలియునా? ఈ విద్యా సంవత్సరమునుండి రాష్ట్రములోని 6500 ప్రభుత్వ పాఠశాలలలో ఆరవ తరగతినుండి ఆంగ్లమాధ్యమములో, సి.బి.ఎస్.ఇ. సిలబసు ననుసరించి బోధన జరుగుననియు, కాలక్రమమున ఈ ప్రణాళికను అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరింపచేయుదుమనియు సెలవిచ్చినారు. అయ్యయ్యో! విద్యకు సంబంధించిన విషయమే! విద్యార్థులకు సంబంధించిన విషయమే! ఆ చిన్నారుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమే! వారి మనోభావములకు సంబంధించిన విషయమే! మరి అట్టి సున్నితమయిన, నాజూకయిన విషయమును విద్యావేత్తలతో నయిన చర్చించకుండ, ఉపాధ్యాయ సంఘములనయిన సంప్రదించకుండ, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మనోభావములనైన తెలిసికొనకుండ, ఇంతటి మహత్తర విషయముపై ఇట్లేకపక్షముగ, నిరంకుశముగ నిర్ణయము తీసికొనుట, వెంటనే అమలుకై ఆజ్ఞలు జారీచేయుట సమంజసమా? విద్యా విషయమున ఈ వరకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములచే నియమింపబడిన అనేకానేక 'కమిషన్లు' ప్రభుత్వములకు తమ రిపోర్టుల నందించినవి కదా! కనీసము పదవ తరగతి వరకైన మాతృభాషా మాధ్యమమున విద్య గరపుట ఉచితమనియు, మాతృభాషలో అర్థము చేసికొనినంత తొందరగ విషయమును పరభాషలో అర్థము చేసికొనుట కష్టతర మనియు, 'సెకండరీ' విద్యవరకు 'భాషాపరిజ్ఞానము' కంటె 'విషయపరిజ్ఞాన' మధికముగ అవసరమనియు, అన్ని 'రిపోర్టులు' ఘోషించుచున్నవి కదా! ఈ విషయమున విద్యావేత్త లందరొక్కటే అభిప్రాయమున నున్నారు కదా! మరి ఇందరి అభిప్రాయమును కాదని ఈ పట్టుదల యేల?

మన పాఠశాలలో, ఆంగ్ల బోధనయే మాతృభాషా మాధ్యమములో జరుగుచుండ, ఇక మిగిలిన పాఠ్యాంశములను ఆంగ్లములో బోధించుటెట్లు? CAT క్యాట్ అనగా 'పిల్లి' అన్న పిల్లలకు తొందరగా అర్థమగునా లేక an animal with four legs which

looks ike a mini t ger and catches mouse అని చెప్పిన తొందరగా అర్థమగునా? అటులే DOG డాగ్ అనగా 'కుక్క' అని చెప్పిన తొందరగా అర్థమగునా లేక an animal w th four egs which guards our homes అని చెప్పిన తొందరగ అర్థమగునా? ఇట్లెన్నయిన ఉదాహరణలు చెప్పవచ్చును. అందుకనియే మన పాఠశాలలలో ఆంగ్లభాషను కూడా విద్యార్థులకందరకు అర్థమగునట్లు తెలుగులో అర్థము వివరించి బోధించుచున్నారే! ఇట్లు 'ఆంగ్లభాష' నే మాతృభాషా మాధ్యమమున బోధించిన; ఇక భౌతికశాస్త్రము, రసాయనశాస్త్రము, వృక్షశాస్త్రము, జంతుశాస్త్రము వంటివాటిని ఆంగ్లములో బోధించుటెట్లు? పక్షుల పేర్లు, జంతువుల పేర్లు తెలుగులో చెప్పకుండ ఆంగ్లమున జంతుశాస్త్రము బోధింపగలమా? చెట్ల పేర్లను, మొక్కల పేర్లను తెలుగులో చెప్పకుండ ఆంగ్లమున వృక్షశాస్త్రమును బోధించగలమా? నాయనలారా! 'జంజిబర్ అఫిసినాసిల్' అనిన పిల్లవానికి తొందరగా అర్థమగునా లేక 'అల్లం' అనిన తొందరగా అర్థమగునా?, 'నైటిస్ వినిఫెరా' అనిన అర్థమగునా లేక 'ద్రాక్ష' యన్న తొందరగ అర్థమగునా? 'ప్యూనికాగ్రనేటమ్' అనిన అర్థమగునా లేక 'దానిమ్మ' యనిన అర్థమగునా;, 'కర్క్యూమలాంగ' అనిన అర్థమగునా లేక 'పసుపు' అనిన అర్థమగునా?, 'అమార్ఫోఫాలస్' అనిన అర్థమగునా లేక 'కంద' అనిన అర్థమగునా?' సోనాలమ్ ట్యూబరోసమ్' అనిన అర్థమగునా లేక 'బంగాళదుంప' అనిన అర్థమగునా?

ఇక జంతుశాస్త్రమునకు వచ్చిన 'పాంథీరాలియో' అన్న అర్థమగునా లేక 'సింహ'మన్న తొందరగా అర్థమగునా?, 'పాంథీరాటైగ్రస్' అనిన అర్థమగునా లేక 'పులి' అన్న అర్థమగునా?, పాంధీరాపారస్ అనిన అర్థమగునా లేక 'చిరుత పులి' అనిన అర్థమగునా?, 'ఎలిఫోస్ మాక్సిమస్ ఇండికస్' అనిన అర్థమగునా లేక 'ఏనుగ'నిన తొందరగా అర్థమగునా?,

'సోడియం క్లోరైడ్' అనిన ఉప్పునియు, సోడియం బైకార్బోనేట్ అనిన 'వంటసోడా' అనియు, 'సల్ఫర్' అనిన 'గంధక'మనియు చెప్ప కుండ ఆంగ్లములో రసాయన శాస్త్రమును బోధింపగలమా? రంగుల 'హరివిల్లు' పేరెత్తకుండ VIBGYOR ను గూర్చి చెప్పగలమా? ఒకవేళ మనము చెప్పినను అవి వారి తలకెక్కునా? 'పిల్లి' అనగా తెలియని వానికి 'పిల్లి' అనగా 'బిడాలము' 'మార్జాలము' అని చెప్పిన తెలియునా? అదియును ఆంగ్లభాషా పరిజ్ఞానము సరిగలేని పదినుండి పదిహేను సంవత్సరముల పిల్లలకు! అసాధ్యము నాయనలారా!

ఇక ప్రభుత్వ పాఠశాలలను గూర్చి రవంత ముచ్చటించెదను. పెద్ద పెద్ద పట్టణములలోన, మహానగరములలోను సంపన్న వర్గమువారు, మధ్యతరగతి వారు

ఈ వరకే తమ పిల్లలను ఆంగ్లమాధ్యమ ప్రైవేటు పాఠశాలలలోనూ, కార్పొరేట్ పాఠశాలలలోనూ, పబ్లిక్ స్కూళ్లలోనూ చదివించుచునే యున్నారు. ఈ పెద్ద పెద్ద పట్టణములలో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణే కరువయినది. ఇక మీరు చెప్పిన ఈ పాఠశాలలన్నియు చిన్న చిన్న పట్టణములలో, గ్రామములలో ఉన్నవియే కదా! అయ్యయ్యో! పాఠశాలలకు భవనములేవి? పశువుల కొట్టముల వంటి పూరిపాకలలో, విద్యార్థులు కూర్చొన బెంచీలు లేక, వ్రాయబల్లలు లేక, ఉపాధ్యాయులకు కూర్చొన కుర్చీలు లేక, వ్రాయ నల్లబల్లలు లేక, వర్షములకు తడిసి, ఎండలకెండి ఆరుబయట చెట్లకింద క్లాసులు నడుపుచున్నారే! అనేకానేక పాఠశాలలలో కరెంటు కనెక్షనయిన లేదు! కనెక్షనున్న కరెంటు లేదు! మంచినీళ్ళవసతి లేదు! మరుగుదొడ్డి లేదు! మూత్రశాలలేదు! వంటశాల లేదు! భోజనశాల అసలే లేదు! 'సర్వశిక్షాభియాన్' 'సర్వ భక్షాభియాన్' గా మారినది. ఖర్చులు కాగితములపై కనబడుచున్నవి కాని నేలపై భవంతులు కనబడుటలేదు. పాఠశాలలలో పాఠములు చెప్పుటకుపాధ్యాయులు లేక 'విద్యా వాలంటీర్లను' నియోగించి పాఠశాలలను నడుపుచున్నారే? పొట్టచీరిన అక్షరము లేని కూలివానికి 'రాష్ట్రీయ గ్రామీణ ఉపాధి కల్పనా పథకము' క్రింద రోజునకెనభై రూపాయలు చెల్లించుచుండ, డిగ్రీని సంపాదించి, కొన్ని సందర్భములలో 'బి.ఎడ్' కూడ చేసిన యువకులకు నెలకు కేవలము పదిహేనువందల రూపాయల జీతము నిచ్చుచున్నారే? ఉపాధ్యాయ వృత్తిపై మీకిట్టి చిన్నచూపు తగదు. అది ఒక మహోన్నతమైన వృత్తి. తాను తగులబడుచు ఇతర వేలాది దీపములను వెలిగించెడి క్రొవ్వొత్తి వంటిదీ ఉపాధ్యాయ వృత్తి. మనదేశ స్వాతంత్ర్య పోరాట సమయములోనూ, స్వాతంత్ర్యానంతరము ఈ దేశపు రూపు రేఖలను తీర్చిదిద్దుటలోనూ డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ఉత్తమ ఉపాధ్యాయు లత్యంత కీలక పాత్ర పోషించిరి. కాని ప్రభుత్వము యొక్క అలసత్వమున ఈనాడదొక పనికిమాలిన వృత్తయినది. ఒకప్పుడు సమాజములోని అత్యున్నత విద్యా ప్రమాణములు గల వ్యక్తులు ఉపాధ్యాయవృత్తి నెన్నుకొనెడివారు. కాని ఈ నాడట్టివారు ఇంజనీరింగ్, ఎం.సి.ఏ., ఎం.బి.ఏ. వంటి కోర్సులను చేసి కంప్యూటర్ల ముందు చతికిలబడుచున్నారు. అదే లోకముగ బ్రతుకుచున్నారు. 'బ్రతుకలేక బడిపంతుల'న్న సామెతగ ఇక వేరు గత్యంతరము లేనివారు ఉపాధ్యాయ వృత్తికి దిగబడుచున్నారు. అంతంత మాత్రముగ నున్న జీతభత్యములతో బ్రతుకు వెళ్ళదీయుచున్నారు. అట్టి నిరాశా నిస్పృహలతో క్రుంగినవారు, భావితరముల నెట్లుద్దీపితము చేయగలరు? పాఠశాలలో పాఠములు చెప్పుట కుపాధ్యాయులే లేనప్పుడిక మాధ్యమ మాంగ్లమయిన నేమి? ఆంధ్రమయిన నేమి?

ఇక విద్యార్థులా పల్లెటూరి వాతావరణములో పుట్టి, పెరిగి, తల్లిదండ్రుల ప్రోద్బలముననో, ఉపాధ్యాయుల ప్రోత్సాహముననో, మధ్యాహ్న భోజనపథక పుణ్యముననో, పాఠశాలకువచ్చి నాలుగు ముక్కలు నేర్చుకొనుట కుత్సహించుచుండ, వారికి వలయు విద్యను, వారికర్థమగు భాషలో వారికందించక, మధ్యన ఈ ఆంగ్ల మాధ్యమము గొడవ యెందులకు? ఆంగ్ల భాషా మాధ్యమమున చదివిన వారందరునూ ఉన్నత విద్యల నభ్యసించు చున్నారని మన ముఖ్యమంత్రిగారి భావమా? ఉన్నతోద్యోగములలోనున్నారని వారి తలంపా? ఉన్నత పదవుల నలంకరించినారని వారి యోచనయా? లేదు నాయనలారా! లేదు! అది వట్టికల్ల! ఉపాధ్యాయుడు చెప్పునదర్థము కాక, పరీక్షలో ఏమి వ్రాయ వలయునో తెలియక, పదవతరగతిలోనే ఫెయిలయి, చిన్న చిన్న ఉద్యోగములలో, వ్యాపారములలో స్థిరపడిన ఆంగ్లమాధ్యమ విద్యార్థుల ననేకులను నే నెరుగుదును. అటులనే నిన్నటి తరము వారందరును 'ఎస్.ఎస్.ఎల్.సి.' వరకు తెలుగు మాధ్యమమున చదివి, అటు తరువాతనే ఆంగ్లమాధ్యమమున పై చదువులు చదివినవారే కదా! వారు పెద్ద పెద్ద చదువులు చదువలేదా? మంచి ఉద్యోగములలో స్థిరపడలేదా? ఉన్నత పదవుల నలంకరింపలేదా? నాకు తెలిసి మన ముఖ్యమంత్రిగారు కూడ అటుల చదివిన వారే కదా? మరి ఆరవతరగతినుండి ఆంగ్ల భాషామాధ్యమ బోధనకై ఈ పట్టుదల యెందులకు? మాధ్యమ మాంగ్లమా, ఆంధ్రమా అని కాదు నాయనలారా! విద్యార్థి విషయమెంత అర్థము చేసికొనినాడు? ఎంత యాకళింపుచేసికొనినాడు? ఎంత విషయ విజ్ఞానమును సముపార్జించినాడు? అనునది ప్రధానము. కాని ఏ భాషలో నేర్చుకొనినాడనునది ప్రధానము కాదు.

మీరందరు నాపై కోపగించుకొనినను, ఈ 'విదేశీ భాషామాధ్యమమును' గూర్చి రెండు మాటలు చెప్పవలసి యున్నది. ప్రపంచములో ఏ దేశమందును ఇట్టి విదేశీ భాషా వ్యామోహము లేదు. అవసరమయిన మేరకు అందరును 'ఆంగ్లము'ను చదువుకొందురు కాని, ఒక 'విదేశీ భాషా మాధ్యమము'న విద్యను గరపుట లేదు. ప్రపంచములో అభివృద్ధి చెందిన దేశములుగ పేరుగాంచిన రష్యా, చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, కొరియా మున్నగు దేశములన్నింటిలోనూ వారి వారి భాషా మాధ్యమమున విద్యాబోధనము జరుగుచున్నది. అంతేకాదు, అతి చిన్న దేశమయిన 'ఇజ్రాయిల్'లో విద్యాబోధన మంతయు అత్యంత ప్రాచీనమయిన 'హీబ్రూ' భాషలో జరుగుచున్నది. అరబ్ దేశములలో విద్యాబోధనము 'అరబ్బీ'యందు జరుగుచున్నది. అంతెందుకు? నైజాము పరిపాలనా కాలములో మన 'తెలంగాణ' ప్రాంతమున 'ఉర్దూ' భాష మాధ్యమముగా బోధన జరుగుచుండెడిది. కాళోజీ, డా॥దాశరథి, డా। ఇరివెంటి

కృష్ణమూర్తి, డా॥ సి. నారాయణరెడ్డి వంటి ప్రముఖ తెలుగు కవులందరును తమ విద్యాభ్యాసమును 'ఉర్దూ' మాధ్యమమున కొనసాగించినవారే! ప్రపంచమున ఇట్టి విదేశీ భాషావ్యామోహము, విదేశీ భాషాదాస్యము, స్వభాషా విముఖత గల జాతి ఏదయిన నున్న అది మన 'భారతజాతి' యే నాయనలారా! ఆ కీర్తి మనదియే! బ్రిటిషువారి మూడువందల ఏండ్ల పరిపాలన మనలను మన భాష, సంస్కృతి, సంప్రదాయముల నుండి మూడువేలేండ్ల దూరముగ ఈడ్చివైచినది.

ఈ ఆంగ్లమాధ్యమమున చదువుట వలననే మనవారీనాడు అమెరికా, ఆస్ట్రేలియా వంటి విదేశములకు పోయి, ఉద్యోగములను సంపాదించి, డాలర్లను స్వదేశమునకు పంపుచున్నారనియు, దేశాభివృద్ధికి వారివంతు సహకారము నందించు చున్నారనియు, కొందరి వాదము. అది కొంతవరకు నిజమయినను, తాత్కాలికము. ఈ దేశమందు ప్రథమముగ అభివృద్ధి చెందవలసినది వ్యవసాయరంగము. ఆ తరువాత అభివృద్ధి చెందలసినది పారిశ్రామిక రంగము. అటు తరువాతిదే సేవారంగము. కాని మనము మొదటి రెంటినీ అలక్ష్యము చేసి 'సేవారంగము' నభివృద్ధి చేయుచున్నాము. నేలవిడిచి సాము చేయుచున్నాము. క్రిందపడు ప్రమాదము నిత్యము పొంచి యున్నది. ఇప్పటికే ఐ.టి. రంగము ఇదివరకటి తన ప్రాధాన్యమును కోల్పోయినది. ఆ రంగమునందునూ 'రిట్రెంచిమెంట్లూ', 'లే ఆఫ్'లు మొదలయినవి. అది 'సబ్బుబుడగ' వలె పేలిపోవు తరుణమత్యంత దూరముగ లేదు.

ఇక 'సిలబస్' విషయమునకు వచ్చిన, రాత్రికి రాత్రి సిలబసును మార్చి, సి.బి.ఎస్.ఇ. సిలబసును, అదియును ఆంగ్లేయ మాధ్యమమున బోధించుడనిన, ఉపాధ్యాయులకు మాత్రము సాధ్యమా? ఇన్ని సంవత్సరములుగ ఒక పాఠ్య ప్రణాళికను, ఒక మాధ్యమములో బోధించుట కలవాటు పడిన ఉపాధ్యాయులు కొత్త మాధ్యమములో, కొత్త సిలబసును బోధించుట కష్టతరము కదా! వారికి కనీస మవసరమగు శిక్షణనయిన నీయకుండ, ఇట్లు రాజకీయ నాయకుడు పార్టీ ఫిరాయించినట్లు, రాత్రికి రాత్రి 'సిలబస్'ను ఫిరాయించిన వారేమి చేయగలరు? వారు 'సి.బి.ఎస్.ఇ. సిలబసు'లో పాఠములు నేర్చుకొందురా? పిల్లలకు నేర్పుదురా?

అమాత్యశేఖరా! ఇప్పటికయినను విద్యా విషయమున నీ ప్రయోగములు చేయుటమానుడు. విద్యా విషయమున రాజకీయములకు తావియ్యకుడు. ఇప్పటికే విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయములు, ఎన్.సి.ఇ.ఆర్.టి. వంటి విద్యాసంబంధిత సంస్థలు రాజకీయ రంగుల నలముకొని, భ్రష్టుపట్టినవి. విద్యా విషయములను విద్యావేత్తలకు, విశేషజ్ఞులకు వదలివేయుడు.

ఇంత పెద్ద దేశములో, 'కాశ్మీరు' నుండి 'కన్యాకుమారి' వరకు, 'పూరి' నుండి 'ద్వారక' వరకు గల విశాల దేశములో, ఎవరయిన తమ ఇచ్చవచ్చినచోట, ఇచ్చవచ్చిన విద్య నభ్యసించి, ఉద్యోగ వ్యాపారములలో స్థిరపడగల స్వాతంత్ర్య మున్న ఈ దేశములో ఒక 'జాతీయ్ఞ విద్యావిధాన'ము యొక్క అవసరమెంతయిన ఉన్నది.

– రాష్ట్ర విద్యా ప్రణాళిక ననుసరించి పదవ తరగతి వరకూ మాతృభాషా మాధ్యమమున బోధనము, 'త్రిభాషా' సూత్రముననుసరించి మాతృభాష కదనముగ ఆంగ్లము, హిందీ భాషల అధ్యయనము జరుగవలెను.

'ఇంటర్‌మీడియేట్' నుండి ఉన్నత విద్య దేశమందంతటను ఒకే విధమయిన 'జాతీయ పాఠ్యప్రణాళిక'తో విద్యార్థుల ఎంపిక మేరకు 'హిందీ' లేదా 'ఆంగ్ల' మాధ్య మమున జరుగవలెను. అట్టి జాతీయ విద్యావిధానము జాతిని పటిష్టము చేసి, 'జాతీయ సమైక్యత'కు 'పూలబాట' వేయగలదు. ఇప్పటికే చాలా చెప్పితిని. కాలాతీత మయినట్లున్నది. మన్నింపగలరు. సెలవ్.

*ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.*



# జాతీయ సమైక్యత

**జం**ఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను:

సోదరసోదరీమణులారా! ఇట్టిదేదేశమందయిన కలదా? లేదు! ఆ దౌర్భాగ్యము మనదే! అయ్యో! వారేమి విదేశస్తులు కారే! పైవారు కారే! మన భారత దేశమున పుట్టినవారే! భారతీయులే! ఈ విశాల దేశములో ఏ ప్రాంతమందైనను నివసించుట కర్హులే! ఉద్యోగ వ్యాపారములు చేసికొనుటకు యోగ్యులే! మరి యట్టి భారతదేశ పౌరులను, భరతమాత బిడ్డలను, కేవలము వారు మరొక రాష్ట్రమునకు చెందినవారని, తమ రాష్ట్రేతర భాషను మాట్లాడువారని, వారిపై కక్షకట్టి, వివక్షత చూపి, పక్షపాతబుద్ధితో, వారి నిడుముల పాలు చేసి, వారినిక్కట్లకు గురిచేసి, వారి ఉద్యోగ వ్యాపారములను దెబ్బతీసి, వారిని 'ముంబయి' నగరమును వీడిపొమ్మనుట సమంజసమా? అట్టి ఉద్యమమును చేపట్టి, తమ రాజకీయ లబ్ధికై ప్రాంతీయాభిమానములను రెచ్చగొట్టి, పెంచి పోషించుచున్న అట్టి సంకుచిత భావజాలములుగల ప్రాంతీయ రాజకీయ పక్షములపై చర్య తీసికొననవసరము లేదా? దేశ ప్రజలను ఈ ప్రాంతీయ తత్వశక్తులనుండి కాపాడవలసిన అగత్యము లేదా? ఈ పెరుగుచున్న 'భూమిపుత్ర' వాదమును ఖండింపనవసరము లేదా? మరి ఈ ప్రభుత్వమేల మిన్నక యున్నది? ఏల నిమ్మకు నీరెత్తినట్లున్నది? ఏల చలింపకున్నది? ఏల చర్య తీసికొనకున్నది? అయ్యో! వారి హాహాకారములు మీ చెవి సోకుటలేదా? వారి ఆర్తి మీ కగపడుట లేదా? వారి వేదన మీ హృదయమును ద్రవింపచేయుట లేదా? ఎన్నో ఏండ్ల క్రితమే ఈ మహానగరమునకు వచ్చి స్థిరపడి, ఉద్యోగ వ్యాపారములు సాగించుచు, ఆ నగర ప్రగతిలో భాగస్వాములై, తమ చెమటతో, రక్తమాంసములతో ఆ నగరాభివృద్ధికి తోడ్పడిన వారి నిప్పుడా నగరము వీడిపొమ్మనుట న్యాయమా? పొమ్మనిన వారెచ్చటికి పోగలరు? ఏమి చేయగలరు?

కేవలమొక్క 'మహారాష్ట్రము'నందే కాదు నాయనలారా! ఇట్టి ప్రాంతీయ తత్వము క్రమముగ దేశమందంతటను ప్రాకుచున్నది. 'అస్సాం' రాష్ట్రంలోని 'ఉల్ఫా' ఉగ్రవాదులు రాష్ట్రేతరులను 'అస్సాం' రాష్ట్రమును వీడిపొమ్మని ఆజ్ఞలు జారీ చేసినారు. హిందీ భాష మాట్లాడు వారిపై విరుచుకుపడి, అమాయకులైన ప్రజలను పొట్టన పెట్టికొనిరి.

పొట్టకూటికై పొరుగు రాష్ట్రమునకు పోయి, శ్రమైకజీవులై, పొట్టపోషించుకొనుచున్న అమాయకులనేకులను బలిగొనిరి. అటులే అస్సాంలోని కోక్రజార్ జిల్లాలోని 'బోడో ఉగ్రవాదులు' పొరుగు రాష్ట్రమయిన పశ్చిమ బెంగాలు నుండి వలసి వచ్చి, కూలి, నాలి చేసి పొట్టపోసుకొనుచున్న 'బెంగాలీ'లపై విరుచుక పడి, విలయతాండవము చేసి, అనేకమంది 'బెంగాలీ'లను సజీవ దహనము చేసిరి. ఇక 'జమ్ము - కాశ్మీర్'లో అనాదిగా కాశ్మీర్‌లో నివసిస్తున్న కాశ్మీరీ పండిత కుటుంబములు ఇస్లామిక్ తీవ్రవాద శక్తుల ఆగడములకు, దౌర్జన్యములకు బలయి, తమ స్వంత రాష్ట్రమును, ఆస్తిపాస్తులను వీడి, కాందిశీకులవలె 'ఢిల్లీ' లోనూ, ఇతర ప్రాంతములలోనూ తలదాచుకొను దురవస్థ కలిగినది. మన పొరుగున ఉన్న 'ఒరిస్సా' రాష్ట్రములో నివసించు తెలుగు వారనేక పర్యాయము లిట్టివివక్షతకు లోనుకావలసి వచ్చినది. అంతవరకెందులకు నాయనలారా! మనరాష్ట్రములోనే ఒక ప్రాంతమువారు, వేరొక ప్రాంతమునుండి వచ్చిన వారిని వెనుకకు పొమ్మనుచున్నారు. మా గాలిని మీరు పీల్చరాదనుచున్నారు. మా నీరు మీరు త్రాగరాదనుచున్నారు. మా భూములలో మీరు నివసించరాదనుచున్నారు. మా ఉద్యోగములను మీరు చేయరాదనుచున్నారు. ఇది వింతలలో వింత కాదా?

స్వాతంత్ర్య సమర సమయమున వెల్లివిరిసిన జాతీయ భావము, స్వాతంత్ర్యానంతరము కూడా కొంతకాలము నిలిచినది. స్వాతంత్ర్యము వచ్చిన తొలి రోజులలో నిర్మించిన 'భాక్రానంగల్', 'హీరాకుడ్', 'నాగార్జునసాగరము', 'శ్రీశైలము', 'శ్రీరామ్‌సాగర్' వంటి అనేకానేక ప్రాజెక్టుల నిర్మాణ పనులెంత సజావుగ సాగినవి! ఏ ఒక్కనికిని తమ గ్రామములు ఆ 'ప్రాజెక్టు'లో మునిగిపోవునను చింత లేదు. తమ భూములు ముంపునకు గురవునని విచారము లేదు! తాము నిర్వాసితులమగుచున్నామన్న బాధయే లేదు! తమ భూములను ప్రభుత్వము తీసుకొనుచున్నదని రోదనలేదు! ప్రభుత్వమిచ్చిన నష్టపరిహారము సరిపోదని వేదనలేదు! అధిక నష్టపరిహారమునకై న్యాయస్థానములలో వ్యాజ్యములు లేవు! నిరసనలు లేవు! నిరాహారదీక్షలు లేవు! పర్యావరణ పరిరక్షణ సమితులులేవు! పర్యావరణమునకు నష్టము కలుగుచున్నదని ఆందోళనలు లేవు! అందరును ఈ 'నవభారత దేవాలయము'ల నిర్మాణమును హృదయపూర్వకముగ స్వాగతించిరి. నిర్మాణమునకు తమవంతు సహాయ, సహకారములను ప్రభుత్వమున కందించిరి. ప్రభుత్వమిచ్చిన నష్టపరిహారమును పరమానందముగ స్వీకరించిరి. దేశమభివృద్ధి చెందుచున్నదని సంతసించిరి. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చా" నని దేశాభివృద్ధి యజ్ఞంలో తమ వంతుగా ఒక 'సమిధ'ను వేసి సంతసించినారు. అటులే 'భిలాయి', 'రూర్కెలా',

'దుర్గాపూర్' ఉక్కుకర్మాగారముల నిర్మాణమునకు, 'బిహెచ్.ఇ.ఎల్', 'హెచ్.ఎ.ఎల్.', 'హెచ్.ఎం.టి', 'హిందుస్తాన్ షిప్‌యార్డు' వంటి పబ్లిక్ రంగ సంస్థల నిర్మాణమునకు, ప్రజలు ప్రాంతీయ విభేదములు మరచి, ప్రభుత్వముతో సహకరించిరి. అట్టి వాని నిర్మాణమును స్వాగతించిరి.

కాని, రానురాను ప్రజలలో స్వార్థపరత్వము పెరిగినది. జాతీయతాభావము అడుగంటి నది. రాష్ట్రముల మధ్య సరిహద్దు భూవివాదములు, అంతఃరాష్ట్రీయ జలవివాదములు తలెత్తినవి. 'తాము చెడిపోయినను ఫరవాలేదు కాని పొరుగువాడు బాగుపడకూడ' దన్న సిద్ధాంతముతో, రాష్ట్రప్రభుత్వములు వాదులాడుకొని, అమూల్యమైన జలసంపద నుప్పుసముద్రము పాలు చేయుచున్నవి. నదీ పరీవాహక ఎగువ రాష్ట్రములు అక్రమముగ డ్యాములు నిర్మించి, నీటిని నిలువచేసి, నీటిని క్రిందికి రానీయకుండా దిగువ రాష్ట్రముల నెండగట్టుచున్నవి. వర్షము లధికముగ పడినయెడల, గేట్లను ఎత్తివేసి నీటిని క్రిందికి వదలిపెట్టి, దిగువ రాష్ట్రములలో వరదలకు కారణమగుచున్నవి. ఇట్లు నదీపరీవాహక దిగువ రాష్ట్రములు ఇటు కరువులకు, అటు వరదలకు ఆలవాలములై అలమటించుచున్నవి. అయినను పట్టించుకొను నాధుడు లేడు. తగవుతీర్చగల నాయకుడు లేడు. ఇక కొద్దో గొప్పో వచ్చిన నీటిని కూడా సద్వినియోగము చేసికొనలేకున్నాము. ఒక రాష్ట్రములోనే ఒక ప్రాంతము వారు మరొక ప్రాంతము వారిని నీటి దొంగలని, తమ ప్రాంతమునకు రావలసిన వాటా నీటిని దోచుకొనుచున్నారనియు నిందించుచున్నారు. ఇట్లు ప్రాంతీయ తత్వము రాష్ట్రము నుండి ప్రాంతమునకు ప్రాకినది. ప్రాంతము నుండి జిల్లాలకు, జిల్లాలనుండి మండలములకు, మండలముల నుండి గ్రామములకు ప్రాకు సమయమెంతో దూరము లేదు. అప్పుడు మనము మన ప్రక్క గ్రామునకు పోయినను, వారి గాలిని మనము పీల్చుచున్నామనియు, వారి నీటిని మనము త్రాగుచున్నామనియు, వారి ఆహారమును మనము తినుచున్నామనియు నిందించు ప్రమాదము కలదు. అందులకై మనము పొరుగూరికి పోయినప్పుడు కూడా మనవెంట ఆక్సిజన్ సిలిండర్, ఆక్సిజన్ మాస్క్, మినరల్ వాటర్ బాటిల్, లంచి బాక్స్ వగైరాలను తీసికొని పోవలసిన అగత్యమేర్పడవచ్చును.

తనకు దేశ 'రాష్ట్రపతి' పదవిని కట్టపెట్టలేదనియో, ఏదేని రాష్ట్రమునకు 'గవర్నరు'గ నియమించలేదనియో, మంత్రి పదవి లభించలేదనియో, ప్రత్యేక రాష్ట్రము వచ్చిన ముఖ్యమంత్రి పదవి లభించుననియో, ఇటు లెవరికి వారు తమ స్వార్థమునకై ప్రత్యేక రాష్ట్రములకై ఉద్యమములు చేపట్టుదురు. తమ ఆశయ సిద్ధికై రాజకీయ

పక్షముల నేర్పాటు చేయుదురు. ఎన్నికలలో పోటీచేయుదురు. కేంద్ర ప్రభుత్వముపై రాజకీయ వొత్తిడిపెంచి ప్రత్యేక రాష్ట్రములు సాధింతురు. ఫలితముగా, ఆదిలో పదహారు రాష్ట్రములున్న దేశమున నీనాడు ఇరువది ఎనిమిది రాష్ట్రములైనవి. 'రాశి' పెరిగినదే గాని 'వాసి' పెరుగలేదు. విడివడిన రాష్ట్రము, విడగొట్టబడిన రాష్ట్రము రెండును బలహీనపడినవి. అంతః రాష్ట్ర సరిహద్దు వివాదములు, అంతఃరాష్ట్ర జలవివాదములు, ఆస్తుల పంపకములపై వివాదములు, రాజధానికై వివాదములు, హైకోర్టు బెంచికై వివాదములు, ఇట్లొక వివాదమును తీర్చుటకై చేసిన నిర్ణయము, వందల వివాదములకు తావిచ్చినది. "పెండ్లికి చేసిన పిండివంటలు పేరంటాండ్రు రుచిచూచుటకే సరిపోయిన" వను సామెతగ, చిన్న రాష్ట్రములలో వచ్చు ఆదాయము సాధారణ పరిపాలనకే సరిపోయిన, ఇక అభవృద్ధి పథకములకు మిగిలిన దేమున్నది? ఫలితముగ అభివృద్ధి కుంటుపడినది.

పంజాబు, హర్యానా రాష్ట్రముల రాజధాని వివాదమింతవరకు తేలలేదు. రెండు రాష్ట్రములును 'చండీఘడ్'ను తమ రాజధానిగా చేసికొని పరిపాలన సాగించుచున్నవి. 'అస్సాం' రాష్ట్రమునకు 'గువాహాటి' సమీపమున గల 'దిస్‌పూర్'ను రాజధానిగా నిర్ణయించి నను, ఇప్పటికిని 'అస్సాం' ప్రభుత్వము తాత్కాలికముగ నిర్మించిన షెడ్లలోనూ, 'గువాహాటి'లోని అద్దె భవనములలోనూ తమ కార్యాలయముల నేర్పాటు చేసికొని పరిపాలన సాగించుచున్నది. ఇక మిగిలిన పూర్వోత్తర రాజ్యముల సంగతి సరేసరి. రోడ్లు లేవు. విద్యుత్తు లేదు. రవాణా సౌకర్యములసలే లేవు. సహజమయిన జలసంపద పుష్కలముగనున్నను, రాష్ట్రముల మధ్య కీచులాటలో, సరయిన ప్రణాళికలు లేక జలవిద్యుచ్ఛక్తి నుత్పత్తి చేయు సామర్థ్యమును పెంపొందించు కొనలేదు. 'మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు'గా అసలే అంతంత మాత్రముగా ఉన్న ఆర్థిక స్థితి, శాంతి భద్రతల పరిస్థితి, 'ఉల్ఫా', 'నాగా', 'కుకి', 'బోడో", కర్బి' వంటి వేర్పాటువాద, ఉగ్రవాద, ప్రాంతీయ వాదశక్తుల తాకిడికి మరింత క్షీణించింది. అలా వేర్పాటువాద, ఉగ్రవాద, ప్రాంతీయవాద శక్తులు ఆ చిన్న రాష్ట్రముల నడుమును విరచినాయి. సరయిన రక్షణ లేని దేశ సరిహద్దులను దాటి బర్మానుండి, బంగ్లాదేశ్ నుండి వచ్చిన కాందిశీకులు పూర్వోత్తర రాష్ట్రములలో వృత్తి, ఉద్యోగములలో స్థిరపడుటతో దేశ ఆంతరంగిక భద్రతకే ముప్పు ఏర్పడినది.

'భారత్, చైనా'ల మధ్య 'కుషన్'లా ఉన్న టిబెట్‌ను చైనా ఆక్రమించు కొనటంతో, ఇప్పుడు చైనా భారత్‌కు పొరుగు రాజ్యమయినది. భారత్‌కు చైనా ముప్పు సరిహద్దులలో పొంచి ఉన్నది. టిబెట్‌ను చైనా ఆక్రమించినప్పుడు అప్పటి భారత ప్రధాని,

విదేశాంగమంత్రి కూడా అయిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, 'టిబెట్' నుండి భారత్‌కు పారిపోయి వచ్చిన 'దలైలామా'కు; ఇతర శరణార్థులకు ఆశ్రయము కల్పించినారే కాని, చైనా టిబెట్‌ను ఆక్రమించుటను వ్యతిరేకించ లేదు. అలా కిమ్మన కుండా ఊరుకున్నందులకు భారతదేశం మూల్యాన్ని 1966లో చైనాతో జరిగిన యుద్ధములో చెల్లించవలసి వచ్చినది.

ఇక కొత్తగా ఏర్పడిన 'చత్తీస్‌ఘడ్' 'ఝార్ఖండ్', 'ఉత్తరాంచల్' రాష్ట్రముల పరిస్థితి మరీ దారుణముగా నున్నది. బలహీనమయిన ప్రభుత్వములు ఉగ్రవాదమునకు ఊపునిచ్చినవి. 'నక్సలైట్లు' 'చత్తిస్‌ఘడ్', 'ఝార్ఖండ్' రాష్ట్రాలలోని ప్రభుత్వాలకు పెనుసవాలుగా మారినారు. ఈ రాష్ట్రాలలో వారు తమ ఆయుధములతో యథేచ్ఛగా తిరుగుచూ, ఆయా ప్రభుత్వములను బాహాటముగా సవాలు చేయుచున్నారు. వారినెదుర్కొను శక్తి లేక ఆయా రాష్ట్రప్రభుత్వములు చతికిలబడిపోయినవి. కేంద్ర ప్రభుత్వము కూడ సమావేశముల నేర్పాటు చేయుట, సలహాలనందించుటకు మినహా వేరేమియు చేయలేకపోయినది. శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత రాష్ట్రప్రభుత్వములదే నని చెప్పి చేతులు దులుపుకొనుచున్నది. సరే నాయనలారా! ఇన్ని రాష్ట్రములను ముక్కలు కొట్టి ఇచ్చినను, ఇప్పటికయిన సంతృప్తి యున్నదా! లేదు నాయనలారా! లేదు. ఇప్పటికే ప్రత్యేక 'తెలంగాణ'మునకై మన రాష్ట్రమున ఉద్యమమారంభ మయినది. 'ఆంధ్ర', 'రాయలసీమ', 'తెలంగాణ' మని మూడు రాష్ట్రములు చేయమని కొందరు, ఉత్తరకోస్తా జిల్లాలను వేరు రాష్ట్రముగ చేయమని కొందరు, హైదరాబాదు నగరమును కేంద్రపాలిత ప్రాంతముగ ప్రకటించమని కొందరు, ఇట్లీ రాష్ట్రమును 'కుక్కలుచింపిన విస్తరి' చేయుటకై రాజకీయనాయకులు ఎవరికి అనువైన రీతిలో వారు మాటలాడుచున్నారు. అటులే, 'విదర్భ', 'గోర్ఖాల్యాండ్', వింధ్య ప్రదేశ్, 'మధ్యభారత్', 'బుందేల్ ఖండ్', 'బోడోల్యాండ్', 'పశ్చిమ ఉత్తర ప్రదేశ్', 'మరత్‌వాడ'... ఇటుల నూతనముగ కోరుచున్న ప్రత్యేక రాష్ట్రములసంఖ్య ఇరవై దాటినది. కోరికలను నిగ్రహించి అదుపు చేయగలము గాని తీర్చి అదుపు చేయగలమా?

1947వ సంవత్సరములో దేశమునకు స్వాతంత్ర్యము, మతము ప్రాతిపదికగా దేశవిభజన జరిగి, అంతవరకునూ సోదరులవలె కలిసి మెలిసి జీవించి, బ్రిటిష్ ప్రభువులను 'బహదూర్‌షా జఫర్' నాయకత్వములో, ప్రధమ స్వాతంత్ర్య సంగ్రామమున కలిసికట్టుగా ఎదిరించిన హిందూ, ముస్లిం ఐక్యతను దెబ్బతీసినది. ఫలితముగా దేశవిభజనానంతరము 'హిందూ-ముస్లిం' వర్గముల మధ్య కొట్లాటలు చోటుచేసి కొనినవి. 1948లో కాశ్మీర్ భారత్‌లో విలీనమగుటను జీర్ణించుకొనలేని 'పాకిస్తాన్'

ప్రభుత్వం కాశ్మీరుపై దాడి చేసి 'ఆజాద్ కాశ్మీర్'పేర కొంత భూభాగమును ఆక్రమించు కొన్నది. ఆ కాశ్మీరు సమస్య నేటికినీ 'రావణాసురుని కాష్ఠము'వలె రగులుచునే యున్నది. అటు తరువాత 'పాకిస్తాన్' భారత్‌పై మూడుసార్లు దండెత్తినది. దండెత్తిన ప్రతిసారీ భారత్ చేతిలో చావు దెబ్బతిన్నది. 1971లో జరిగిన యుద్ధములో 'బంగ్లాదేశ్' విముక్తితో, పాకిస్తాన్ బలహీన పడినదనియు, కొత్తగా ఆవిర్భవించిన 'బంగ్లాదేశ్' మనకు మిత్రదేశముగా నుండుననియు ఆశించిన ఆశలు అడియాస లయినవి. 'షేక్ ముజిబూర్ రహమాన్' హత్యతో, ఆ శకము ముగిసినది. 'బంగ్లాదేశ్' మరల పాకిస్తాన్ అడుగుజాడలలో నడుచుచు, భారత్ వ్యతిరేక కార్యక్రమముల 'కడ్డా'గా మారినది. పై సంఘటనలన్నియు 'భారత్–పాక్', 'భారత్–బంగ్లాదేశ్' సంబంధములను దానితోపాటు హిందూ–ముస్లిం సంబంధములను దెబ్బతీసినవి. 1980 దశాబ్దములోని 'బాబరీమస్‌జిద్–రామజన్మభూమి' వివాదము, తదనంతరము 'బాబరీమస్‌జిద్' కూల్చివేత, తాత్కాలిక మందిర నిర్మాణము, 'రామ్ లాలా' విగ్రహ ప్రతిష్ఠ వంటి హిందూమత తత్వశక్తుల చర్యలు, ముస్లిం యువతను ఉగ్రవాదంవైపు నడిపించినవి. ఇట్లారంభమయిన ముస్లిం మతశక్తుల ఉగ్రవాదము 'పాకిస్తాన్' ఐ.ఎస్.ఐ. అండదండలతో క్రమముగా బలపడి, దేశమంతటనూ వ్యాపించి, ఈనాడు దేశానికి పెను ముప్పుగా పరిణమించినది.

అట్లా ఇటు ప్రాంతీయతత్వము, నక్సలిజం మరియు ఇస్లామిక్ మతశక్తుల ఉగ్రవాదము కలసి ముప్పేట దాడిచేసి దేశమునుక్కిరిబిక్కిరి చేయుచున్నవి. భారత జాతీయ సమైక్యతకు 'పెనుసవాలు'గా పరిణమించినవి. ఈ సవాళ్ళను మనము సమైక్యముగా ఎదుర్కొని, పోరాడకపోయిన, ఈ జాతిమనుగడ, ఈ దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకముగా మారును. అందులకని, ఇప్పటికైననూ ఈ జాతి, మత, కుల, ప్రాంతీయ తత్వములను ప్రోత్సహించెడి రాజకీయ పక్షములపై కఠిన చర్యలు తీసికొనవలసిన సమయమాసన్నమయినది.

- ఇక 'నక్సలిజం'కు వచ్చిన, నక్సలైట్లు ఆదిలో కొంత సిద్ధాంత పరమయిన పోరాటము జరిపిననూ, రాను రాను వారు 'మార్క్సిస్టు' సిద్ధాంతములకు తిలోదకము లిచ్చి, బలవంతపు వసూళ్ళతో వచ్చిన డబ్బుతో విలాసవంత మయిన జీవితములు గడుపుటకలవాటు పడినారు. తమ ఉనికిని కాపాడు కొనుటకై, అప్పుడప్పుడు తెగబడి ఘాతుకముల కొడిగట్టుచున్నారు. పోలీసులను తమ లక్ష్యముగా చేసికొని, విచక్షణారహితముగ వారిని చంపు చున్నారు. అందులకని 'నక్సలైట్' ప్రభావిత రాష్ట్రములన్నియు కలిసి, వారి

నెదుర్కొని, కలిసికట్టుగా వ్యవహరించి, నక్సలిజమును రూపు మాపుటకు చర్యలు చేపట్టవలసి ఉన్నది.

✧ ఇంత పెద్ద దేశములో, ఉగ్రవాదము నదుపు చేయుటకు సరయిన ఓ చట్టముగాని, సరయిన ఓ అర్ధ సైనిక దళముగాని లేకపోవుట శోచనీయము. కేంద్ర గూఢచార సంస్థలందించు సమాచారము నధ్యయనము చేసి, అంతః రాష్ట్రీయ, అంతర్జాతీయ ఉగ్రవాద మూలాలను కనిపెట్టుట, వారి కార్యకలాపములపై నిఘా ఉంచి అదుపు చేయుటకు, అమెరికా దేశములోని ఎఫ్.బి.ఐ. తరహాలో ఒక బలమయిన కేంద్ర నిఘా వ్యవస్థ, అట్టి కేసులను త్వరితగతిని విచారించుటకు ప్రత్యేక కోర్టులు, అట్టివారిపై కఠినచర్యలు తీసుకొనుటకు ఒక బలమైన చట్టము, ఉగ్రవాదుల నెదుర్కొనుటకై ప్రత్యేక శిక్షణ పొందిన ఒక అర్ధ సైనిక దళము ఉండవలసిన అవసరము ఎంతయిన కలదు.

✧ ఏదియో నా బుద్ధికి తోచిన సలహాల నందించితిని. ఎటులచేయవలయునో, ఏమి చేయవలయునో నిర్ణయించుట ప్రభుత్వముల పని. వానినమలు చేయుట విజ్ఞులయిన అధికారుల పని.

✧ విశాల భావములకు నిలయమై, వేలయేండ్ల చరిత్ర కలిగిన భారత జాతిని, ఈ విశాల భారతమాతను ఇట్టి సంకుచితమయిన జాతి, కుల, మత, ప్రాంతీయ తత్త్వము నుండి రక్షింపుడు.

✧ 'అహింసాపరమోధర్మః' అని నమ్మిన ఈ దేశమున హింసకు తావు లేదు. అందుకని నక్సలైట్ల, టెర్రరిష్టుల హింసాకాండ నుండి ఈ దేశమును కాపాడుడు.

✧ భారతజాతిని, భారతదేశమును, మన జాతీయ సమైక్యతను కాపాడుడు. ఇప్పటికే చాలా చెప్పితిని సెలవ్.

***ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః***



# 'మరో జంఘాలశాస్త్రి'ని గురించి...

మహాకవి పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి 'సాక్షి'లోని 'జంఘాలశాస్త్రి' చిరపరిచితుడే. రచయిత అయలసోమయాజుల నాగేశ్వరరావు ఈ 'జంఘాలశాస్త్రి'ని తన చెప్పుచేతలలో పెట్టుకొని 'పానుగంటి హృదయము గంటి' అని అన్నట్లు వ్రాశారు. హైదరాబాద్ తెలుగు గురించి చెబుతూ రచయిత "నన్నయ నొకసారి ఆ భాషను చదువనిండు! ముచ్చెమటలు పోయవలసినదే? మూర్ఛపోవలసినదే? తెలుగు రాజధానిలో తెలుగు స్థితిని చూచి, రాజమహేంద్రవరము వరకు పరిగెత్తిపోయి, గౌతమీనదిలో దూకి ఆత్మహత్య చేసికొనవలసినదే" అన్నారు.

– దేవరాజు రవి

*పుస్తక ప్రపంచం. 'ఈనాడు' దినపత్రిక*

స్వర్గీయ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారి 'సాక్షి' ఉపన్యాసాలను ఎరగని సాహిత్యాభిమానులు ఉండరు. పంతులుగారి 'సాక్షి' వ్యాసాలు రచయితకు బాగా నచ్చినవి. వాటి ప్రభావంవల్ల ఆ ధోరణిలోనే వ్యాసాలు వ్రాయాలనే సంకల్పం కలిగింది. సాక్షి వ్యాసాలలో 'జంఘాలశాస్త్రి' ముఖ్యుడు కాబట్టి, ఈ రచయిత కూడా అతనిచేతనే ఉపన్యాసాలిప్పించి ఈ 'మరో జంఘాలశాస్త్రి'ని రచించారు. సాక్షిలోవలెనే ఇందులో కూడా వివిధ విషయాలు విమర్శించబడ్డాయి. రచన ఆ ధోరణిలోనే నడిచింది. సాక్షి సంపుటాలు ఇప్పుడు అందుబాటులో లేవు. అందువల్ల పంతులుగారి రచన ఏవిధంగా ఉన్నదీ చాలామందికి తెలియపోవచ్చును. ఈ వ్యాసాలు అదేధోరణిలో ఉండడం వల్ల వీటిని చదివి సాక్షి రచనాపద్ధతిని గ్రహించ వచ్చును.

పానుగంటివారి 'జంఘాలశాస్త్రి' నిర్మొగమాటంగా తాను చెప్పవలసిన దానిని ఢంకామీద దెబ్బకొట్టినట్లు గట్టిగా చెప్తాడు. 'అయలసోమయాజుల' వారి 'శాస్త్రి' కూడా ఆ పెద్ద 'జంఘాలశాస్త్రి' అడుగుజాడల్లోనే నడిచాడు. ఇందులోని వ్యాసాలు 'పానుగంటి' వారి వ్యాసాలకంటె చిన్నవైనందున ఇప్పటి శాస్త్రి 'చిన్న జంఘాలశాస్త్రి' అనుకోవడంలో తప్పేమీ లేదనుకుంటాను. రచన చిన్నదే అయినా విషయం మాత్రం పెద్దదే అని చెప్పవలసి ఉన్నది.

పంతులుగారి హాస్యధోరణి ఈ పుస్తకంలో కూడా కానవస్తున్నది. రచన రమణీయంగాను, ఆకృతి ఆకర్షణీయంగాను ఉన్నది. పానుగంటివారు 'జంఘాలశాస్త్రి' భౌతికాకృతిని మనకు అందజేయలేదు. కాని రచనను బట్టి శాస్త్రి ఊహా చిత్రాన్ని చిత్రించి మనకు అందచేసిన చిత్రకారుడు 'సుధామ' అభినందనీయులు. ఆ చిత్రంతో కూడా అందంగా దీనిని ముద్రించి, ప్రకటించి 'సాక్షి'ని మనకు తలుపునకు తెప్పిస్తున్న 'యువభారతి'నీ, రచయిత నాగేశ్వరరావుగారినీ మనం అభినందించవలసి ఉంది.

**–గ్రంథ విమర్శకులు.**

*భారతి, ఏప్రిల్ 1982.*

ఐదారు దశాబ్దాల క్రితం పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు వ్రాసిన 'సాక్షి' ఉపన్యాసాల గురించి తెలియని తెలుగు పాఠకులుండరని చెప్పడం అతిశయోక్తి కాదు. 'సాక్షి' ఉపన్యాసాలు తెలుగు సాహితీ జగత్తును ప్రభావితం చేశాయి. 'సాక్షి' ఉపన్యాసాలు ఆనాటి సాంఘిక దుస్థితిని చక్కగా వెల్లడించడమే కాక దుస్థితికి కారణాలైన చర్యలను ఖండించడం జరిగింది. ఈ 'మరో జంఘాలశాస్త్రి' ఉపన్యాసాలు నేటి సమాజంలో పెచ్చు పెరుగుతున్న అన్యాయాలనూ, అక్రమాలను, ఎత్తి చూపుతున్నాయి.

రచయిత శ్రీ నాగేశ్వరరావు సాక్షి సంపుటాలను పలుసార్లు పఠించి ఆ ఒరవడిలో వీటిని రచించారు. ఇందులోని వ్యాసాలు చాలా వరకు వ్యంగ్య భంగిమలో, హాస్య ధోరణిలో నడచినవి. ఈనాటి సామాజిక స్థితిగతులను చక్కగా వెల్లడిస్తున్నవి.

**–వేముగంటి**

*'స్రవంతి' మాసపత్రిక.*

పానుగంటివారి 'సాక్షి' వ్యాసాలు తెలుగు సాహితీ లోకానికి సుపరిచితం. ఆ ఆరు సంపుటాలలో తటస్థపడే 'జంఘాలశాస్త్రి' వాగ్ధాటికి, బహుముఖ ప్రజ్ఞావిశేషానికీ, అఖిలలోక విషయ సంగ్రహణ శక్తికీ ముగ్ధుడు కాని తెలుగువాడు నభూతో న భవిష్యతి.

సాక్షి వ్యాసాలు చదివి, సారాన్ని వొంటబట్టించుకొని, నేటి సమాజంలో ఉన్న 'కుళ్ళు'ను ప్రక్షాళనం చేయటానికి పూనుకున్న అపర 'పానుగంటి' ఈ 'అయల సోమయాజులు'. భాషలో, భావంలో, రచనా ధోరణిలో ముమ్మూర్తులా లక్ష్మీనరసింహా రావు గారి ప్రతిభను పుణికిపుచ్చుకున్నట్లనిపిస్తుంది, నాగేశ్వరరావుగారి శైలి. వీరు 'యువభారతి' కార్యదర్శి. మంచి సాహిత్య విలువలను సమాజంలోని వ్యక్తులకు అందించాలనే తహతహ కల కార్యదీక్షాపరులు అందుకే వారు నేటి సంఘాన్ని ఎక్స్‌రే కళ్ళతో పరిశీలించి..... మరో జంఘాలశాస్త్రిని మనకందించారు.

ఈ పన్నెండూ ద్వాదశమూర్తులు. ఒక్కొక్కటి ఒక్కొక్కమణిపూసలా ప్రకాశించి, ప్రత్యేకతను సంతరించుకున్న వ్యాసపీఠం.

'పానుగంటి' వారి కంటినీ, గంటినీ అందిపుచ్చుకున్న అయలసోమయాజుల వారు ధన్యులు.... ఇటువంటి 'స్ట్రాంగ్‌డోస్' ఈనాటి సమాజానికి అవసరం. కాబట్టి మిగిలిన వ్యాసాలు కూడా ప్రచురించి నాగేశ్వరరావు గారు పుణ్యం కట్టుకుంటారని ఆశిస్తాను.

ఈ చిన్నిపొత్తం ప్రతివారి గదినీ, మదినీ అలంకరించేది, అని నా అభిప్రాయం.

-శ్రీ శివలెంక ప్రకాశరావు

*ఆంధ్రపత్రిక, గ్రంథసమీక్ష. 1-3-1983.*

పానుగంటివారి 'సాక్షి' ఉపన్యాసాల ఒరవడిలో వ్రాసిన పేరడీల సంకలనాలే ఈ రెండు పుస్తకాలు. గత కొన్నేళ్ళుగా 'సాక్షి' వ్యాస సంపుటాలలో నిద్రపోతున్న జంఘాల శాస్త్రిని నిదురలేపి, జంటనగరాలలో త్రిప్పిన ఘనత శ్రీ నాగేశ్వరరావుకే దక్కింది.

ఆహ్వానింపబడో, కల్పించుకొనో, సభాధ్యక్షుని అనుమతితోనో, గడగడ ఉపన్యాసమిస్తూ పసిబిడ్డ లాంటి జంఘాలశాస్త్రి మళ్ళీ ఒకసారి మనకనుల ముందు నిలుస్తాడు. జంటనగరాలలో ఈతడు దాదాపు అన్ని రకాల సభలకూ విషయ సంగ్రహణార్థియై హాజరయి, సభానిర్వాహకులను, చర్చనీయాంశాలనూ, యథాశక్తి చెరిగి పారవేస్తాడు.

ఇలా సర్వాంతర్యామియై గోష్పాదమంత పిలకముడితో, కావి రంగుపంచె, అదే చొక్కాతో ప్రసన్న గంభీర వదనుడై శూలాల్లాంటి వ్యంగ్య విమర్శలు చేస్తూ, అందరి మన్ననలనూ అందుకుంటాడు ఈ 'మరో జంఘాలశాస్త్రి. ముఖచిత్రం ముచ్చటగా ఉంది. రచయిత, వారిని ప్రోత్సహించిన 'యువభారతి' వారు మీదు మిక్కిలి అభినందనీయులు.

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
ACC No 99946
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500032.

## JANGHALA SASTRY - BACK WITH A BANG

Janghala Sastry is Back. Not many of the present generation know him but time was when Janghalu, as he was affectionately called, was present on every occasion every where. During the closing year's of the last century and the early years of this century characters like Barister Parvatisam, Girisam, Perigadu, Subbisetty, Srihari, Singaraju Lingaraju, Janghala Sastry, Kantam, Yenki and several others were created by authors and playwrights. Each has lived a life beyond the span of a normal mortal s life.

Janghala Sastry was Panuganti Lakshm narasimha Rao s creation in his 'Sakshi' and he was there comment'ng on every conceivable subject and occasion, exhorting the peop e about mora s, about temperance, about the greatness of our trad tions.

But Janghalu was not killboy. He only crit cized what was bad in or aping, the West at a time we d'd it fervently and without discrimination.

In essence, if Girisam, was the beau ideal of the youth of those times, Janghalu was the conscience - keeper.

Janghalu has an equa ly appropr'ate p ace in the present day society as a speed-breaker to the crashing values both moral and ethical. Now Nageswara Rao has brought him ot of the she f of the time and put him before the public.

Janghalu now pours his vitriol on city buses, film stars, horse races and so on. There are many more subjects crying for his wrathful attention.

This tiny book, one can hope only a beginn'ng and more w'sdom will flow from Janghalu's unceasing mouth

And also hopefully, he w'll adopt the language of the present day instead of going into raptures in early twentieth century speech.

..Book Review
**THE HINDU**


*With Best Compliments from:*

*The Wellwishers & Stockists of*

**HINDUSTAN PAPER CORPORATION LTD**

**KOLKATA**

## With Best Compliments from:




# The future is not "paperless"
# The future is "paper-enriched."

HPC is proving that both are essential for the 21st century Knowledge Economy. The role of Paper has not diminished or weakened even after the information technology revolution has transformed our world. HPC as a top notch Paper & Newsprint producer in South Asia is proving its compatibility by enhancing the Knowledge base of the nation with top quality cultural varieties of paper - Writing Paper, Printing Paper, Newsprint. Doing it with sophisticated technologies, innovative techniques, resource conservation, contribution to the society and the environment and with dedicated professionally equipped human resources.

**HINDUSTAN PAPER CORPORATION LTD**
(a Government of India Enterprise)
**Corporate Headquarters · 75C Park Street, Kolkata - 700 016**
**Telephone Nos 91-33-2229-6901-2 Fax No 91-33-2249-7335**
**website : www hindpaper.in**

हिन्दुस्तान पेपर

o Cachar Paper Mill o Nagaon Paper Mill o Hindustan Newsprint Ltd.
o Nagaland Pulp & Paper Co.Ltd o Jagdishpur Paper Mills Ltd.

## MARO JANGHALA SASTRY

*An anthology of essays by:*

**Ayalasomayajula Nageswara Rao**



| | | |
|---|---|---|
| పుట్టిన తేది | : | 21-09-1947 |
| జన్మస్థలం | : | మద్దివలస గ్రామం, వంగర మండలం<br>శ్రీకాకుళం జిల్లా |
| తల్లిదండ్రులు | : | కీ.శే. వెంకు సోదెమ్మ<br>కీ.శే. బలరామ కృష్ణమూర్తి |
| చదువు | : | బి.ఎస్సీ., బి.యిడి., ఎస్.ఎ.ఎస్. |
| ఉద్యోగం | : | 1972 నుండి 1982 వరకు అకౌంటెంట్ జనరల్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వారి కార్యాలయంలో 'ఆడిటర్'గా; 1982 నుండి 2005 దాకా హిందుస్తాన్ పేపర్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో వివిధ స్థాయిల్లో పనిచేసి సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్)గా పదవీ విరమణ. |
| రచనా వ్యాసంగం | : | 'వేడి వెలుగులు', 'నెలవంక', 'వెన్నెల సెలయేరు' కవితా సంకలనాల్లో కవితలు ప్రచురితాలు.<br>'మరో జంఘాలశాస్త్రి' పేరిట రెండు పుస్తకాలు యువభారతి ద్వారా ప్రచురితమై ప్రజాదరణ పొందాయి. |
| సాహిత్యసేవ | : | 1972 నుండి 'యువభారతి', సాహితీ సాంస్కృతిక సంస్థలో సభ్యునిగా, 1977 నుండి 1984 వరకు ఆ సంస్థకు కార్యదర్శిగా ఉంటూ ఉడుతాభక్తిగా సాహితీ సేవ నందించారు. |
| స్వచ్ఛంద సేవ | : | 'సేవాభారతి' పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్, యువభారతి ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు 'కోశాధికారి'గా ఉన్నారు. |